www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

ఈఈ, సీఈలపై అభియోగాల నమోదు



మేడిగడ్డ కుంగుబాటుపై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు 3

బ్యారేజీ నిర్మాణం పూర్తి కాకున్నా.. అయినట్లుగా సర్టిఫికెట్ ఇచ్చిన ఈఈ తిరుపతిరావు, సీఈ రమణారెడ్డి

దీనిపై సర్కారును ప్రశ్నించిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్

ఇద్దరిపై అభియోగాలు నమోదు చేసిన సర్కారు

10 రోజుల్లోగా లిఖితపూర్వక వివరణ ఇవ్వాలని ఆదేశం

శనివారం | 4-1-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 | సంచిక (Issue) : 277 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతఋతువు, పుష్యమాసం, శుక్లపక్షం; తిథి: పంచమి రా. 10.01 తదుపరి షష్ఠి; నక్షత్రం: శతభిష రా. 9.23 తదుపరి పూర్వాభాద్ర; వర్జ్యం: తె.3.29-5.01; దుర్ముహూర్తం: ఉ.6.50-8.18; అమృతఘడియలు: మ.2.28-4.00; రాహుకాలం: ఉ.9.00-10.30; సూర్యోదయం: 6.50; సూర్యాస్తమయం: 5.50 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

విచారణకు వేళాయె!



ఈ నెల ఆరో తేదీ ఉదయం పది గంటలకు హాజరుకండి

ఫార్ములా-ఈ కారు రేసు కేసులో కేటీఆర్‌కు ఏసీబీ నోటీసు

7న రావాలంటూ అర్వింద్ కుమార్, బీఎల్ఎన్ రెడ్డిలకు కూడా..

ఒప్పందాలు, చాటింగ్, ఈ-మెయిల్స్ ఆధారంగా విచారణ

ఇప్పటికే కేటీఆర్‌ను ఏడో తేదీన విచారణకు రావాలన్న ఈడీ

న్యాయవాదులతో కేటీఆర్ బృందం సుదీర్ఘ చర్చలు

క్వాష్ పిటిషన్‌పై ఉత్కంఠ

హైదరాబాద్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఫార్ములా-ఈ కారు రేసు కేసులో నిందితుల విచారణకు అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) సన్నద్ధమైంది. ఈ కేసులో ఏ1గా ఉన్న బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్‌కు శుక్రవారం నోటీసు జారీ చేసింది. ఈనెల ఆరో తేదీ ఉదయం పది గంటలకు విచారణకు రావాలని పేర్కొంది. ఇదే కేసులో సహ నిందితులైన ఐఏఎస్ అధికారి అర్వింద్ కుమార్, హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజనీర్ బీఎల్ఎన్ రెడ్డిలకు కూడా నోటీసులు జారీ చేసింది. వారిని ఏడో తేదీన విచారణకు రావాలని సదరు నోటీసుల్లో పేర్కొంది. ఫార్ములా-ఈ కారు రేసు వ్యవహారమంతా కేటీఆర్ చెప్పినట్లే జరిగిందంటూ పురపాలక శాఖ ప్రత్యేక కార్యదర్శి దానకిషోర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గత నెల 19వ తేదీన కేటీఆర్, అర్వింద్ కుమార్, బీఎల్ఎన్ రెడ్డిపై ఏసీబీ కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. వీరందరిపై అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 13 (1), (ఏ) రెడ్ విత్ 13 (2), సెక్షన్ 409, 120 బి ప్రకారం అభియోగాలు నమోదు చేశారు. ఆ తర్వాత.. ఫార్ములా-ఈ కారు రేసు వ్యవహారంలో అసలేం జరిగిందన్న

మిగతా 12వ పేజీలో...

ప్రమాణపత్రాలు ఎందుకు?

రైతులపై కేసులు పెట్టేందుకేనా.. 12

భరోసా కోసం రైతులు అడుక్కోవాలా?

అన్నదాతలకు రూ. 26,500 కోట్లు ఎగ్గొట్టారు

ఎంతమందికి రుణమాఫీ చేశారో గ్రామాల్లో ప్రభుత్వమే ప్రమాణపత్రాలివ్వాలి: కేటీఆర్

పరిహారం.. ఉదారం!

రైతులకు వీలైనంత ఎక్కువ మొత్తం అందాలి.. ఈ విషయంలో కలెక్టర్లు చొరవ చూపాలి



ఆర్ఆర్ఆర్, జాతీయ రహదారులపై సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీతక్క

ఆర్ఆర్ఆర్ భూసేకరణ త్వరగా పూర్తి చేయాలి

దీని కోసం ప్రజా ప్రతినిధులు, రైతులతో చర్చించండి

దక్షిణ భాగం అలైన్‌మెంట్ చేయించండి

అటవీ, పర్యావరణ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక అధికారులు

అండర్‌పాస్‌ల నిర్మాణానికి ముందే జాగ్రత్తలు తీసుకోండి

మూడేళ్లలో 'హ్యామ్' విధానంలో రోడ్లు పూర్తి కావాలి: రేవంత్

హైదరాబాద్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ప్రాంతీయ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్) ఉత్తర భాగానికి సంబంధించిన భూ సేకరణను త్వరగా పూర్తి చేయాలని, రైతులకు పరిహారం నిర్ణయించే విషయంలో ఉదారంగా వ్యవహరించాలని అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఆర్బిట్రేటర్లుగా ఉన్న జిల్లా కలెక్టర్లు వీలైనంత ఎక్కువ మొత్తంలో రైతులకు పరిహారం అందేలా చూడాలని నిర్దేశించారు. ఆర్ఆర్ఆర్, జాతీయ రహదారుల భూ సేకరణ, పరిహారం, హ్యామ్ (హైబ్రిడ్ యాన్యుటీ మోడల్) విధానంలో రహదారుల నిర్మాణం, రేడియల్ రోడ్ల నిర్మాణాలపై సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డి శుక్రవారం సాయంత్రం సమీక్ష నిర్వహించారు. "భూసేకరణ సమయంలో స్థానిక ప్రజా ప్రతినిధులతోనూ చర్చించండి. తరచూ రైతులతో సమావేశమై.. ఆయా రహదారుల నిర్మాణాలతో కలిగే ప్రయోజనాలను వివరించండి. తద్వారా భూ సేకరణను వేగవంతం చేయవచ్చు" అని ముఖ్యమంత్రి సూచించారు. ఆర్ఆర్ఆర్ (దక్షిణ)కు ఎన్‌హెచ్ఏఐ సూత్రప్రాయ ఆమోదం తెలిపినందున.. హెచ్ఎండీఏతో అలైన్‌మెంట్ చేయించాలని

మిగతా 13వ పేజీలో...

హైదరాబాద్‌కు మల్లన్న సాగర్ నీళ్లు

20 టీఎంసీల తరలింపునకు జల మండలి ఆమోదం

గ్రేటర్ హైదరాబాద్‌లో గోదావరి ఫేజ్-2 ప్రాజెక్టుకు ఓకే

మంజీరా పాత లైను స్థానంలో కొత్త పైప్‌లైన్ నిర్మించండి

కేంద్రం నుంచి నిధులు తెచ్చుకునేలా డీపీఆర్: సీఎం

రాష్ట్ర ఏర్పాటు తర్వాత తొలిసారి జలమండలి బోర్డు భేటీ

గ్రామీణ రోడ్లకు రూ.వెయ్యి కోట్లు.. నెల నెలా విడుదల

అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలు 13

నేడు రాష్ట్ర క్యాబినెట్ సమావేశం

రైతు భరోసా అమలుపైనే ప్రధానంగా చర్చ!

రేషన్ కార్డుల జారీ, రైతు కూలీలకు 12వేల సాయంపై కీలక నిర్ణయం తీసుకొనే అవకాశం



కొత్త ఇంధన విధానం ముసాయిదాపై సదస్సులో డిప్యూటీ సీఎం భట్టి

ఇతర రాష్ట్రాల్లో తెలంగాణ విద్యుత్ ప్లాంట్లు

హిమాచల్ ప్రదేశ్‌లో జలవిద్యుత్తు, రాజస్థాన్‌లో సోలార్

ఆయా రాష్ట్రాలతో కలిసి ఏర్పాటు చేసే యోచన

2030 నాటికి అదనంగా 20 వేల మెగావాట్ల గ్రీన్ ఎనర్జీ లక్ష్యం

కొత్త ఇంధన విధానంపై మంత్రివర్గంలో చర్చించాక నిర్ణయం

కరెంట్ చార్జీలు పెంచం.. హరిత హైడ్రోజన్ హబ్‌గా తెలంగాణ: భట్టి

హైదరాబాద్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఇతర రాష్ట్రాల్లో జల, సౌర విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలనుకుంటున్నట్లు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. హిమాచల్ ప్రదేశ్‌లో జల విద్యుత్, రాజస్థాన్‌లో సౌర విద్యుత్ ప్లాంట్లను ఆయా రాష్ట్రాలతో కలిసి ఏర్పాటు చేసే ఆలోచన చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో క్లీన్, గ్రీన్ ఎనర్జీని ప్రోత్సహించేందుకు నూతన ఇంధన విధానాన్ని త్వరలో తేనున్నామని ఆయన పేర్కొన్నారు. మంత్రివర్గంలో దీనిపై చర్చించిన తర్వాత ప్రకటిస్తామని తెలిపారు. ఫ్యూచర్ సిటీ, ఫార్మా సిటీ, మెట్రో రైలు విస్తరణతో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరగనున్నందున దీనికి అనుగుణంగా హరిత ఇంధన రంగంలోకి రావాలని సీఐఐ, ఫిక్కీ,

మిగతా 14వ పేజీలో...

6.5 డిగ్రీలు

సిర్పూర్‌లో నమోదైన ఉష్ణోగ్రత

రాష్ట్రంలో పెరిగిన చలి తీవ్రత.. అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదు



ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్

రాష్ట్రంలో చలి తీవ్రత మళ్లీ పెరుగుతోంది. మూడు రోజుల క్రితం వరకు కనిష్ఠ ఉష్ణోగ్రతలు 14-20 డిగ్రీల మధ్య నమోదు కాగా... తాజాగా అవి సగానికి పడిపోయాయి. గురువారం పలు జిల్లాల్లో 10 డిగ్రీల లోపునకు రాత్రిపూట ఉష్ణోగ్రతలు పడిపోయాయి. ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్‌లో రాష్ట్రంలోనే అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. అక్కడ 6.5 డిగ్రీలు నమోదు కాగా.. ఇదే జిల్లా తిర్యాణి మండలంలో 6.6 డిగ్రీలు, సంగారెడ్డి జిల్లా

మిగతా 3వ పేజీలో...

అల్లు అర్జున్‌కు ఊరట 10

షరతులతో కూడిన బెయిల్ మంజూరు

అనుమతి లేకుండా దేశం విడిచి వెళ్లరాదు

ప్రతి ఆదివారం పోలీసుల ఎదుట హాజరు

తొక్కిసలాట కేసులో నాంపల్లి కోర్టు ఆదేశం

సంగారెడ్డి జిల్లాలో రోడ్డు ప్రమాదం..

నలుగురి మృతి 14

గుమ్మడిదల మండలం నల్లవల్లి అటవీ ప్రాంతంలో ఆటోను ఢీకొన్న కారు

బోల్తాపడ్డ ఆటోను ఢీకొట్టిన మరో ఆటో

వైద్య కోర్సుల సీట్లను ఖాళీగా ఉంచొద్దు

రాష్ట్రాలతో కేంద్రం చర్చించాలి: సుప్రీం 2

చైనాలో కొత్త వైరస్ కలకలం



చైనాలో రోగులతో కిటకిటలాడుతున్న ఓ ఆస్పత్రి

హెచ్ఎంపీవీ విజృంభణ.. ఆస్పత్రులకు జనం

శీతాకాలంలో శ్వాసకోశ సమస్యలు తలెత్తడం సహజం

ఆందోళన అనవసరమన్న చైనా ప్రభుత్వం

2001లోనే హెచ్ఎంపీవీ గుర్తింపు.. అది సీజనల్ వ్యాధే 2

మనసును చదివే యంత్రం

'మైండ్ రీడింగ్ మెషిన్'ను అభివృద్ధి చేసిన చైనా శాస్త్రజ్ఞులు

మూర్ఛ బాధితురాలి ఆలోచనల్ని డీకోడ్ చేసిన యంత్రం

పరిహారం ఆలస్యమైతే.. మార్కెట్ రేటు

చెల్లించాల్సిందే

- భూసేకరణ ప్రక్రియలో వ్యవధే కీలకం
- పాత ధరల ప్రకారమే పరిహారం అంటే '300ఏ' అధికరణను ఉల్లంఘించినట్టే
- తీర్పులో స్పష్టం చేసిన సుప్రీంకోర్టు



న్యూఢిల్లీ, జనవరి 3: ఎప్పుడో 2003లో సేకరించిన భూమికి.. 2011నాటి ధరల ప్రకారం రేటు నిర్ధారించి.. ఆ సొమ్మును 2019లో చెల్లిస్తామంటే కుదరదని సుప్రీం కోర్టు తేల్చిచెప్పింది! అధికారుల కారణంగా పరిహారం చెల్లింపులు ఆలస్యమైతే.. ఆ పరిహారం చెల్లించేనాటికి సదరు భూములకు మార్కెట్ రేటు ఎంత ఉంటే అంత చెల్లించాల్సిందేనని, అలా మార్కెట్ ధరను పొందే హక్కు భూయజమానులకు ఉంటుందని స్పష్టం చేసింది. బెంగళూరు-మైసూరు మౌలిక వసతుల నడవా ప్రాజెక్టు (బీఎంఐసీపీ) కోసం 22 ఏళ్ల క్రితం భూములు సేకరించినా ఇంతవరకు నష్టపరిహారం చెల్లించలేదంటూ దాఖలైన పిటిషన్‌పై జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌తో కూడిన ధర్మాసనం విచారణ జరిపి ఈ కీలక తీర్పు ఇచ్చింది. దేశవ్యాప్తంగా ప్రభుత్వాలు చేపట్టిన భూసేకరణలో భూములను కోల్పోయి ఏళ్లు గడుస్తున్నా పరిహారం అందని రైతులు, సామాన్య పౌరులకు ఉపశమనం ఇచ్చే తీర్పు ఇది. బీఎంఐసీపీ కోసం కర్ణాటక పారిశ్రామిక ప్రాంతాల అభివృద్ధి బోర్డు (కేఐఏడీబీ) 2003లో ప్రాథమిక నోటిఫికేషన్ ఇచ్చింది. కేఐఏడీ చట్టం ప్రకారం 2005 నవంబరులో భూసేకరణ చేపట్టింది. సేకరణ పూర్తయి ఏళ్లు గడుస్తున్నా భూయజమానులకు పరిహారం చెల్లించలేదు. వారి అభ్యంతరాలనూ

మిగతా 2వ పేజీలో...

పరిహారం ఇవ్వడంలో ఆలస్యమైతే..
మార్కెట్ రేటు చెల్లించాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)

పట్టించుకోలేదు. పదహారేళ్ల తర్వాత ఎట్టకేలకు 2019లో పరిహారం ఇచ్చారు. కానీ.. 2011 నాటి మార్కెట్ రేట్లు ఇచ్చారు! దీంతో భూయజమానులంతా బెర్నార్డ్ ఫ్రాన్సిస్ జోసెఫ్ అనే వ్యక్తి నేతృత్వంలో కోర్టును ఆశ్రయించారు. విచారణ సమయంలో దీనిపై తీవ్రంగా స్పందించిన ధర్మాసనం..“వారు 22 ఏళ్లుగా పలుమార్లు కోర్టు తలుపులు తడుతూనే ఉన్నారు. వారివైపు నుంచి ఎలాంటి అలసత్వం లేదు. నష్టపరిహారం పొందలేకపోవడంలో వారి తప్పేమీ లేదు. రాష్ట్ర ప్రభుత్వ/కేఐఏడీబీ అధికారుల సోమరితనం కారణంగానే ఇంత ఆలస్యమయింది. అదీ కోర్టు ధిక్కరణ నోటీసులు ఇచ్చాకనే అధికారులు స్పందించారు. 2019 ఏప్రిల్ 22న.. భూమికి ఇవ్వాల్సిన మార్కెట్ ధరను ప్రత్యేక భూసేకరణ అధికారులు నిర్ణయించారు. కాబట్టి అప్పటి మార్కెట్ రేటు ప్రకారమే ఇప్పుడు పరిహారం చెల్లించాలి” అని ధర్మాసనం ఆదేశించింది. ఒకవేళ నోటిఫికేషన్ జారీ చేసిన 2003 నాటి ధరల ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని ఆదేశిస్తే అది న్యాయాన్ని, ఆస్తి హక్కు రక్షణకు ఉద్దేశించిన రాజ్యాంగంలోని 300ఏ అధికరణాన్ని అపహాస్యం చేసినట్టవుతుందని వ్యాఖ్యానించింది. 2019 ఏప్రిల్ 22 నాటి మార్కెట్ ధరలను పరిగణనలోకి తీసుకొని, మొత్తం నష్టపరిహారాన్ని లెక్కించాలని సూచించింది. 2నెలల్లోగా ఈ ప్రక్రియను పూర్తి చేయాలని భూ సేకరణ అధికారిని ఆదేశించింది. ఈ నిర్ణయం నచ్చకపోతే సవాలు చేసే హక్కు ఇరు పార్టీలకూ ఉందని పేర్కొంది.

మెడికల్ సీట్లు ఖాళీగా ఉండకూడదు

న్యూఢిల్లీ, జనవరి 3: వైద్య కళాశాలల్లో సీట్లను ఖాళీగా ఉంచకూడదని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. వీటి భర్తీ విషయమై రాష్ట్ర ప్రభుత్వాలు, ఇతర భాగస్వాములతో చర్చలు జరపాలని కేంద్రాన్ని ఆదేశించింది. ఈ సమస్యపై నిపుణుల కమిటీ అధ్యయనం చేసి ఇచ్చిన సూచనలను పరిశీలించాలని సూచించింది. వైద్య కళాశాలల్లో 1,003 విలువైన సూపర్ స్పెషాలిటీ కోర్సుల సీట్లు భర్తీ కాకపోవడంపై 2023 ఏప్రిల్‌లో జరిగిన విచారణ సందర్భంగా ధర్మాసనం ఆందోళన వ్యక్తం చేసింది. దీనిపై అధ్యయనానికి ఆరోగ్య సేవల డైరెక్టర్ జనరల్ అధ్యక్షతన ప్రభుత్వ, ప్రయివేటు వైద్య కళాశాలల ప్రతినిధులు సహా భాగస్వాములందరూ సభ్యులుగా ఉండేలా కమిటీని ఏర్పాటు చేయాలని సూచించింది. ఈ అంశంపై మళ్లీ శుక్రవారం ధర్మాసనం విచారణ జరిపింది. ఈ సందర్భంగానే సీట్లు ఖాళీగా మిగిలకూడదని వ్యాఖ్యానించింది. 3నెలల్లోగా స్పష్టమైన విధానాన్ని రూపొందించాలని సూచిస్తూ విచారణను ఏప్రిల్ నెలకు వాయిదా వేసింది.

లోకం తీరు



రాష్ట్రాలకు ఇక భారీ మొత్తంలో
మూలధన వ్యయ రుణాలు

న్యూఢిల్లీ, జనవరి 3(ఆంధ్రజ్యోతి): కీలకమైన మూలధన వ్యయం విషయంలో రాష్ట్ర ప్రభుత్వాలు వెనుకబడ్డాయని కేంద్రం గుర్తించింది. ఈ నేపథ్యంలో వివిధ రాష్ట్రాలకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారీ మొత్తంలో మూలధన వ్యయ రుణాలను మంజూరు చేయాలని నిర్ణయించింది. ఈ రుణాలన్నీ వడ్డీ లేనివే కావడం గమనార్హం. మొత్తంగా రూ.1.5 లక్షల కోట్లను ఎలాంటి వడ్డీ లేకుండా మంజూరు చేయనుంది. దీనిలో రూ.95 వేల కోట్లను రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టే సంస్కరణల ఆధారంగా ఇస్తారు. మరో రూ.35 వేల కోట్లను రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యత మేరకు చేపట్టే ప్రాజెక్టులకు కేటాయిస్తారని కేంద్ర ఆర్థిక శాఖ వర్గాలు తెలిపాయి. కాగా, షరతులతో కూడిన మూలధన వ్యయ రుణాలకు కూడా కేంద్రం నిబంధనలను సడలించింది. 10 శాతం కంటే మించి మూల ధన వ్యయాన్ని చేసిన రాష్ట్రాలకు గతంలో రూ.25 వేల కోట్ల మేరకు నిధుల కేటాయింపు జరుగుతుండగా ఇప్పుడు 10 శాతం ఖర్చు పెట్టిన రాష్ట్రాలకు కూడా ఈ నిధులు కేటాయిస్తారు. పట్టణ ప్రణాళికలను అమలు చేసిన రాష్ట్రాలకు మరో రూ.5 వేల కోట్లను కేటాయించనుంది. గ్రామీణ మౌలిక సదుపాయల కల్పనకు కేటాయించే నిధులను ఖర్చు పెట్టిన రాష్ట్రాలకు కూడా అదనపు రుణాలను ఇవ్వాలని కేంద్రం భావిస్తోంది. ప్రకృతి విపత్తులకు గురైన రాష్ట్రాలకు అదనపు నిధులను కేటాయించాలని కేంద్రం నిర్ణయించింది. ఈ క్రమంలో నిబంధనలను సైతం సడలించనుంది. దీని ప్రకారం ఆయా రాష్ట్రాలకు సాధారణంగా కేటాయించిన మొత్తం కంటే 50 శాతం నిధులు అదనంగా లభిస్తాయని కేంద్ర ఆర్థిక శాఖ అధికారులు తెలిపారు. నిధులను పూర్తిగా ఉపయోగించుకున్న రాష్ట్రాలకు మరో 50 శాతం నిధులు అదనంగా ఇస్తారు.

రైల్వే గ్రూప్ డీ ఉద్యోగాలకు
పదో తరగతి పాస్ అయితే చాలు

న్యూఢిల్లీ, జనవరి 3: రైల్వే శాఖలో పలు విభాగాల్లోని లెవల్-1(గ్రూప్ డీ) ఉద్యోగాల భర్తీకి విద్యార్హతలను సడలిస్తూ రైల్వే బోర్డు నిర్ణయం తీసుకుంది. నూతన ప్రమాణాల ప్రకారం.. పదో తరగతి లేదా ఐటీఐ డిప్లొమా లేదా నేషనల్ కౌన్సిల్ ఫర్ వొకేషనల్ ట్రైనింగ్(ఎన్‌సీవీటీ) జారీ చేసిన జాతీయ అప్రెంటిస్‌షిప్ సర్టిఫికెట్(ఎన్‌ఏసీ) కలిగిన ఎవరైనా ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చని స్పష్టం చేసింది. ఇటీవల విడుదలైన నోటిఫికేషన్‌లో సాంకేతిక విభాగాల్లో పోస్టులకు దరఖాస్తు చేసుకొనేందుకు కనీస విద్యార్హత పదో తరగతితో పాటు ఎన్ఏసీ సర్టిఫికెట్ లేదా ఐటీఐ డిప్లొమా ఉన్నవారిని మాత్రమే అర్హులుగా పేర్కొన్న విషయం తెలిసిందే. అయితే తాజాగా ఆ విద్యార్హత ప్రమాణాలను సడలిస్తూ నిర్ణయం ప్రకటించింది. రైల్వే శాఖలోని పలు విభాగాల్లో పాయింట్స్‌మెన్, అసిస్టెంట్, ట్రాక్ మెయింటెయినర్ సహా దాదాపు 32 వేల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ ఉద్యోగాలకు జనవరి 23 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నారు.

తల్లిదండ్రుల అనుమతి ఉంటేనే 'సోషల్' ఖాతా!

న్యూఢిల్లీ, జనవరి 3: పిల్లలు సామాజిక మాధ్యమాల్లో ఖాతా తెరవాలంటే తల్లిదండ్రుల అనుమతి తప్పనిసరిగా ఉండాలని కేంద్రం ప్రతిపాదిత డిజిటల్ డేటా రక్షణ చట్టం నిబంధనల్లో పేర్కొంది. సంబంధిత సామాజిక మాధ్యమ సంస్థలు పిల్లల వ్యక్తిగత వివరాలు నమోదు చేయడానికి ముందే వారి తల్లిదండ్రుల ఆమోదం(వెరిఫైయబుల్ కన్సెంట్) తీసుకోవాలని నిబంధనల్లో పేర్కొంది. ఈమేరకు వ్యక్తిగత డిజిటల్ డేటా రక్షణ నిబంధనల డ్రాఫ్టును విడుదల చేసింది. ఫిబ్రవరి 18 తర్వాత దీనిపై తుది నిర్ణయం తీసుకొంటారు.

కుంభమేళాకు ఉగ్ర ముప్పు.. నిఘా వర్గాల అలెర్ట్

న్యూఢిల్లీ/ప్రయాగ్‌రాజ్, జనవరి 3: ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరిగే మహా కుంభమేళాకు ఉగ్ర ముప్పు పొంచి ఉందని నిఘా వర్గాలు హెచ్చరించాయి. ఉగ్రవాదులు సాధువుల వేషంలో జనంలోకి చొరబడి.. దాడులకు పాల్పడే ఆలోచన చేస్తున్నారని వెల్లడించాయి. ఈ నేపథ్యంలో అధికారులు భద్రత కట్టుదిట్టం చేశారు. కుంభమేళాకు వెళ్లే ప్రతి ప్రవేశ మార్గంలో తనిఖీలు చేస్తున్నారు. ప్రయాగ్‌రాజ్‌కు వచ్చే ప్రతి ఒక్కరిని నిశితంగా పర్యవేక్షిస్తున్నారు. మరోవైపు ఉత్తరాదిలో తీవ్రమైన చలి వాతావరణం నెలకొంది. ఈ నేపథ్యంలో మహా కుంభమేళా కోసం ప్రయాగ్‌రాజ్‌కు వచ్చే భక్తులు అక్కడి వాతావరణం గురించి తెలుసుకునేందుకు వాతావరణ శాఖ వెబ్‌సైట్‌లో ప్రత్యేక పేజీ ఏర్పాటు చేశామని ఐఎండీ డైరెక్టర్ మనీశ్ రణాల్కర్ తెలిపారు.

180 కి.మీ. వేగంతో వందే భారత్ స్లీపర్

న్యూఢిల్లీ, జనవరి 3: వందే భారత్ స్లీపర్ రైళ్లను ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకొని రావడానికి రైల్వే తన ప్రయత్నాలను ముమ్మరం చేసింది. తాజాగా నిర్వహించిన పరీక్షలో వందేభారత్ స్లీపర్ రైలు 180 కి.మీ. వేగాన్ని అందుకుంది. దీనికి సంబంధించిన వీడియోను రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఎక్స్‌లో షేర్ చేశారు. రెండు బెర్తుల మధ్య ఉన్న ట్రేపై ఉంచిన మొబైల్ రైలు ప్రయాణ వేగాన్ని సూచిస్తోంది. దాని పక్కనే నీళ్లు నిండుగా పోసిన గాజు గ్లాసు ఉంది. రైలు 170 కి.మీ. నుంచి క్రమంగా 180 కి.మీ. వేగానికి చేరుకోవడాన్ని, అంత వేగంలోనూ చుక్క నీరు తొలక్కపోవడం ఆ వీడియోలో కనిపించింది. ఈ పరీక్ష సందర్భంగా రైలులో పూర్తి స్థాయి ప్రయాణికులు ఉన్నప్పుడు ఉండే బరువును ఉంచారు. కోట, లబాన్ స్టేషన్ల మధ్య 30 కి.మీ. దూరం ఈ పరీక్షకు వేదికయింది. జనవరి 1, 2025న రోహల్ కుర్ద్, కోటా మధ్య 40 కి.మీ. దూరం ఉన్న ట్రాక్‌పై ఇదే మాదిరి పరీక్ష నిర్వహించారు. ఆరోజు కూడా రైలు ఇదే వేగాన్ని అందుకుంది.

లద్దాఖ్‌లో చైనా కౌంటీలపై భారత్ అభ్యంతరం

న్యూఢిల్లీ, జనవరి 3: లద్దాఖ్‌లోని సరిహద్దు ప్రాంతంలో చైనా కొత్తగా రెండు కౌంటీల(స్థావరాల)ను ఏర్పాటు చేయడంపై భారత్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. తమ పరిధిలోని ఆ ప్రాంతంలో చైనా ఆక్రమణలను ఎన్నడూ అంగీకరించబోమని స్పష్టం చేసింది. కౌంటీల ఏర్పాటుతో ఆ ప్రాంతంపై మా సార్వభౌమాధికారానికి సంబంధించి దీర్ఘకాల, స్థిరమైన వైఖరిలో ఎటువంటి మార్పు ఉండబోదన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని వ్యాఖ్యానించింది. చైనా చట్ట విరుద్ధమైన, బలవంతపు ఆక్రమణలకు ఎప్పటికీ చట్టబద్ధత లభించదని విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ అన్నారు. ఈ అంశంపై దౌత్య మార్గాల ద్వారా చైనాకు తమ నిరసన తెలిపినట్లు వెల్లడించారు. టిబెట్‌లో బ్రహ్మపుత్ర నదిపై చైనా భారీ జల విద్యుత్తు డ్యామ్‌ను నిర్మించేందుకు సిద్ధమవుతున్న నేపథ్యంలో భారత్ తొలిసారి స్పందించింది. దీనిపై పర్యవేక్షణ కొనసాగిస్తామని తెలిపింది.

దక్షిణ కొరియా అధ్యక్ష భవనం వద్ద హైడ్రామా

సియోల్, జనవరి 3: దక్షిణ కొరియాలో శుక్రవారం భారీ హైడ్రామా చోటు చేసుకుంది. అభిశంసనకు గురైన అధ్యక్షుడు యూన్ సుక్ యోల్‌ను విచారించేందుకు వచ్చిన అధికారులకు అధ్యక్ష కార్యాలయం అధికారుల నుంచి అనుమతి లభించలేదు. దీంతో 6 గంటలకు పైబడి వేచి చూసిన అధికారులు చివరకు ఇంటిముఖం పట్టారు. తనను విచారించేందుకు కానీ, నిర్బంధించేందుకు కానీ యోల్ అంగీకరించలేదు. ఈ పరిణామాలపై జాతీయ పోలీసు విభాగం తీవ్రంగా స్పందించింది. అధ్యక్ష భవనం భద్రతా సిబ్బంది తీరుపై నిప్పులు చెరిగింది. భద్రతా సిబ్బందికి నేతృత్వం వహిస్తున్న చీఫ్, డిప్యూటీ చీఫ్‌లను ఈ విషయంపై ప్రశ్నించనున్నట్టు తెలిపింది. ఈ మేరకు శనివారం విచారణకు హాజరు కావాలని కోరుతూ సమన్లు జారీ చేసింది.

చైనాలో కొత్త వైరస్!

హెచ్ఎంపీవీ విజృంభణతో కలకలం

- కొవిడ్ తరహా లక్షణాలతో ఆందోళన
- ఆస్పత్రులకు జనం పోటెత్తారంటూ సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం
- ఫ్లూ కేసులేమీ భారీగా పెరగలేదు: చైనా
- హెచ్ఎంపీవీని 2001లోనే గుర్తించారు
- అది సీజనల్ వ్యాధే అంటున్న నిపుణులు



న్యూఢిల్లీ, జనవరి 3: చైనాలో కొత్త వైరస్ కలకలం సృష్టిస్తోంది. కరోనా మహమ్మారికి మూల కేంద్రమైన డ్రాగన్ దేశంలో తాజాగా 'హ్యూమన్ మెటానిమోవైరస్ (హెచ్ఎంపీవీ)' వేగంగా వ్యాప్తి చెందుతున్నట్లు సామాజిక మాధ్యమాల్లో విస్తృత ప్రచారం జరుగుతోంది. ఈ వైరస్ బారినపడిన స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో ఆస్పత్రుల్లో చేరుతున్నట్లు చెబుతున్నారు. హెచ్ఎంపీవీతోపాటు ఇన్‌ఫ్లూయెంజా ఏ, మైకోప్లాస్మా, నిమోనియా, కొవిడ్-19 వైరస్‌లు కూడా వ్యాప్తి చెందుతున్నట్లు పలువురు పోస్టులు పెడుతున్నారు. చైనాలోని ఆస్పత్రులు కిటకిటలాడుతున్నట్లు కొందరు వీడియోలు కూడా పోస్ట్ చేస్తున్నారు. అయితే దీనిపై ఇంకా స్పష్టత రాలేదు. ఈ వైరస్ సోకినవారిలో కొవిడ్ తరహా లక్షణాలే కనిపిస్తున్నట్లు తెలుస్తోంది. జలుబు, జ్వరం, దగ్గు, ముక్కు కారడం వంటి లక్షణాలతో ఆస్పత్రులకు క్యూ కడుతున్నట్లు సమాచారం. ఓ అంతర్జాతీయ వార్తా సంస్థ తాజాగా విడుదల చేసిన నివేదిక ఈ ఊహాగానాలకు మరింత బలం చేకూరుస్తోంది. గుర్తు తెలియని నిమోనియా తరహా వైరస్ మూలాలను కనుగొనేందుకు చైనా వ్యాధి నియంత్రణ సంస్థ ఓ పర్యవేక్షక వ్యవస్థను ప్రారంభించిందని ఆ నివేదిక వెల్లడించింది. డిసెంబరు 16 నుంచి 22 వరకు చైనాలో అంటువ్యాధులతో బాధపడుతున్న వారి సంఖ్య భారీగా పెరిగినట్లు తెలుస్తోంది. కాగా, హెచ్ఎంపీవీని 2001లోనే గుర్తించారు. ప్రస్తుతం చైనాలో వెలుగు చూస్తున్న కేసులకు ఇదే కారణమని చెబుతున్నారు. ఇది అక్కడ సీజనల్ వ్యాధి అని పేర్కొంటున్నారు. ఇదిలా ఉండగా, చైనాలో భారీ సంఖ్యలో ఫ్లూ కేసులు వచ్చాయని, జనం ఆస్పత్రుల బాట పడుతున్నారన్న వార్తలను చైనా తేలిగ్గా తీసుకుంది. శీతాకాలంలో శ్వాసకోశ వ్యాధులు సహజమని, గత ఏడాదితో పోలిస్తే ఈ సారి వాటి తీవ్రత చాలా తక్కువగా ఉందని ఆ దేశ విదేశాంగ శాఖ శుక్రవారం తెలిపింది. చైనా ఉత్తరప్రాంతంలో శీతాకాలంలో ఫ్లూ, శ్వాసకోశ బాధితులు ఎక్కువగా ఉంటారని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి మావో నింగ్ తెలిపారు. గత ఏడాదితో పోలిస్తే అలాంటి కేసులు ఈ సారి చాలా తక్కువగా ఉన్నాయన్నారు. చైనా పౌరులు, చైనాలో ఉన్న విదేశీయుల ఆరోగ్యానికి తమ ప్రభుత్వానిది హామీ అని పేర్కొన్నారు. విదేశీయులు నిర్భయంగా చైనాలో పర్యటించవచ్చన్నారు.

భయపడాల్సిన పని లేదు: కేంద్రం

దేశంలో సీజనల్ ఇన్‌ఫ్లూయెంజా, శ్వాసకోశ వ్యాధులపై 'జాతీయ వ్యాధుల నివారణ కేంద్రం (ఎన్‌సీడీసీ)' దృష్టి పెట్టిందని కేంద్రం వెల్లడించింది. చైనాలో హెచ్ఎంపీవీ వైరస్ విజృంభిస్తోందన్న వార్తల నేపథ్యంలో అప్రమత్తంగా ఉన్నట్లు ఆరోగ్య సేవల డైరెక్టర్ జనరల్ అతుల్ గోయెల్ చెప్పారు. చైనాలో వైరస్ అంశంపై సమాచారాన్ని సేకరిస్తున్నామన్నారు. హెచ్ఎంపీఎస్ వైరస్ వల్ల సాధారణ జలుబు, దగ్గు, శ్వాసకోశ సమస్యలే వస్తాయని తెలిపారు. అయితే దేశవ్యాప్తంగా గత నెలలో శ్వాసకోశ సమస్యలతో బాధపడేవారి సంఖ్య ఏమీ పెరగలేదని చెప్పారు.

లక్షణాలు ఏంటి..?

హెచ్ఎంపీవీ వైరస్ లక్షణాలు కూడా ఫ్లూ, ఇతర శ్వాసకోశ ఇన్ఫెక్షన్ల మాదిరిగానే ఉంటాయని వైద్య నిపుణులు వెల్లడించారు. దగ్గు, జ్వరం, ముక్కు దిబ్బడగా అనిపించడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటివి కనిపిస్తాయి. వైరస్ తీవ్రత ఎక్కువగా ఉన్న వారిలో బ్రాంకైటిస్, నిమోనియాకు దారితీయొచ్చని చెబుతున్నారు. దగ్గు, తుమ్ముతో వెలువడే తుంపర్ల కారణంగా, వైరస్ బారిన పడిన వ్యక్తులతో సన్నిహితంగా మెలగడం, వైరస్ వ్యాపించిన ప్రాంతాలను తాకిన తర్వాత నోరు, ముక్కు, కళ్లను తాకడం వంటివి చేస్తే హెచ్ఎంపీవీ సోకుతుందని వైద్యనిపుణులు చెబుతున్నారు. ఈ వైరస్ సోకిన వారికి ప్రత్యేకించి చికిత్స ఏమీ లేదని అంటున్నారు.

నివారణ ఇలా..

చిన్నపాటి ముందుజాగ్రత్త చర్యలతో వైరస్ సోకకుండా చూసుకోవచ్చని వైద్యులు స్పష్టం చేస్తున్నారు. సబ్బుతో 20 సెకన్ల పాటు తరచూ చేతులు శుభ్రం చేసుకోవాలంటున్నారు. అపరిశుభ్ర చేతులతో ముఖాన్ని తాకకూడదని, వైరస్ బారినపడిన వ్యక్తులకు దూరంగా ఉండాలని, తరచూ తాకాల్సి వచ్చే పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచిస్తున్నారు. వైరస్ బారిన పడినవారు తమ వస్తువులను ఇతరులు వాడకుండా చూడాలని, లక్షణాలు కనిపిస్తున్నప్పుడు బయటికి వెళ్లకుండా ఇంట్లోనే ఉండి, విశ్రాంతి తీసుకుంటే మంచిదని చెబుతున్నారు.

ఏటా 15 వేల కోట్లు

- 'లాటరీ కింగ్' మార్టిన్ వ్యాపార స్థాయి ఇది.. వెల్లడించిన ఈడీ
- మార్టిన్ నుంచి వైసీపీకి రూ.154 కోట్లు



న్యూఢిల్లీ, జనవరి 3: 'లాటరీ కింగ్'గా పేరు పొందిన శాంటియాగో మార్టిన్ వ్యాపారం ఏటా రూ.15వేల కోట్లు అని ఈడీ తాజాగా ప్రకటించింది. మార్టిన్ అక్రమాలపై 2014లో తొలి కేసు సీబీఐ నమోదు చేసింది. ఆ తర్వాత మార్టిన్, ఆయన కంపెనీలపై పలు కేసులు నమోదయ్యాయి. వీటిపై విచారణ చేస్తున్న ఈడీ.. ఇటీవల మార్టిన్‌కు చెందిన ప్రాంగణాల్లో భారీ ఎత్తున అక్రమాస్తులను గుర్తించింది. గతంలోనే రూ.1,000 కోట్లకు పైగా విలువైన మార్టిన్ ఆస్తులను ఈడీ అటాచ్ చేసింది. అక్రమంగా సంపాదించిన డబ్బుతో ఆస్తులు కూడబెట్టడానికి మార్టిన్ 350 కంపెనీలు స్థాపించాడు. ఆస్తులు అమ్మే యజమానులకు బహుమతి గెలిచే లాటరీ టికెట్లు ఇచ్చి వారి నుంచి ఆ ఆస్తులు పొందినట్లు ఈడీ విచారణలో వెల్లడైంది. ఇదిలా ఉండగా, మార్టిన్‌కు చెందిన కంపెనీ ఫ్యూచర్ గేమింగ్ సంస్థ ద్వారా ఎలక్టోరల్ బాండ్స్ రూపంలో రాజకీయ పార్టీలకు భారీ మొత్తం విరాళంగా ఇచ్చినట్లు విచారణలో బయటపడింది. 2019 నుంచి 2024 మధ్య కాలంలో వివిధ రాజకీయ పార్టీలకు మొత్తం రూ.1368 కోట్లు విరాళం అందజేసినట్లు వెల్లడైంది. దీనిలో అందరికన్నా ఎక్కువగా టీఎంసీ రూ.542 కోట్లు అందుకుంది. మార్టిన్ కంపెనీ నుంచి విరాళాలు అందుకున్న పార్టీల్లో వైసీపీ, బీజేపీ, కాంగ్రెస్ కూడా ఉన్నట్లు విచారణలో బయటపడింది. ఆ లాటరీ వ్యాపారి నుంచి వైసీపీ రూ.154 కోట్లు అందుకున్నట్లు వెల్లడైంది.

తగ్గిన గ్రామీణ పేదరికం

- 2012లో 25.7%.. ప్రస్తుతం 4.86%
- పట్టణ పేదరికం 13.7% నుంచి 4%కి
- ఎస్‌బీఐ పరిశోధన పత్రం వెల్లడి

న్యూఢిల్లీ, జనవరి 3: ప్రభుత్వ సంక్షేమ చర్యల కారణంగా దేశంలో గ్రామీణ పేదరికం గణనీయంగా తగ్గిందని ఎస్‌బీఐ నిర్వహించిన ఓ అధ్యయనంలో వెల్లడైంది. 2011-12లో 25.7 శాతంగా ఉన్న గ్రామీణ పేదరికం 2024 మార్చి నాటికి 4.86 శాతానికి తగ్గిపోయిందని, ఇదే కాలవ్యవధిలో పట్టణ పేదరికం 13.7 శాతం నుంచి 4.09 శాతానికి తగ్గిందని ఈ అధ్యయనం తెలిపింది. తాజా (2023-24) అంచనాల ప్రకారం.. గ్రామీణ ప్రాంతాల్లో దారిద్ర్యరేఖను రూ.1,632గా, పట్టణ ప్రాంతాల్లో రూ.1,944గా నిర్ణయించినట్లు వెల్లడించింది (ఒక వ్యక్తి కనీస అవసరాలు తీరటానికి నెలకు అయ్యే సగటు ఖర్చునే దారిద్ర్యరేఖగా నిర్ణయిస్తారు). ఈ మేరకు ఎస్‌బీఐ శుక్రవారం ఒక పరిశోధన పత్రాన్ని విడుదల చేసింది. 2021 జనాభా లెక్కలు పూర్తయితే ఈ గణాంకాలపై మరింత స్పష్టత వస్తుందని, ముఖ్యంగా పట్టణ పేదరికం మరింత తగ్గినట్టు వెల్లడయ్యే అవకాశం ఉందని ఎస్‌బీఐ సర్వే తెలిపింది. మొత్తంగా దేశంలో పేదరికం ప్రస్తుతం 4-4.5% మధ్యలో ఉండవచ్చని, కటిక పేదరికం అనేది దాదాపుగా కనుమరుగైనట్లు భావిస్తున్నామని పేర్కొంది. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో సగటు నెలవారీ వినియోగ వ్యయంలో తేడా 2009-10లో 88.2 శాతం ఉండగా.. ప్రస్తుతం అది 69.7 శాతానికి తగ్గిందని తెలిపింది. ప్రత్యక్ష నగదు బదిలీ, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన, రైతుల ఆదాయాన్ని పెంచే చర్యలు, గ్రామీణ జీవన ప్రమాణాల్లో మెరుగుదల వంటి వాటి వల్లే ఇది సాధ్యమైందని వెల్లడించింది.

నీతిమాలిన వాళ్లు!

అన్నా హజారేను ముందుపెట్టి వంచించారు

- కేజ్రీవాల్ బృందంపై ప్రధాని ఫైర్





న్యూఢిల్లీ, జనవరి 3: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా షెడ్యూల్ విడుదల కాకముందే ప్రధాని మోదీ ప్రచార భేరి మోగించారు. మాజీ సీఎం, ఆప్ అధినేత కేజ్రీవాల్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. కొందరు 'నీతిమాలిన' వ్యక్తులు గాంధేయవాది అన్నా హజారేను ముందుపెట్టి ప్రజలను వంచించారని ధ్వజమెత్తారు. మోదీ శుక్రవారమిక్కడ అశోక్‌విహార్‌లోని స్వాభిమాన్ అపార్ట్‌మెంట్స్‌లో జేజే క్లస్టర్స్‌కు చెందిన మురికివాడ ప్రజలకు కొత్తగా నిర్మించిన 1,675 ఫ్లాట్ల తాళాలను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా రామ్‌లీలా మైదానంలో జరిగిన బహిరంగ సభలో ప్రసంగిస్తూ ఆప్ నేతలపై విరుచుకుపడ్డారు. నీతే లేని కొందరు గత పదేళ్లుగా దేశ రాజధానిని 'ఆప్'ద పాల్జేశారన్నారు. 'వీళ్లు ఢిల్లీ అభివృద్ధి గురించి మాట్లాడుతుంటారు. కానీ ఈ 'ఆప్', ఈ 'ఆప్'ద ఢిల్లీని చుట్టుముట్టింది. దీని నుంచి రాజధానిని విముక్తి చేసేందుకు ఓటర్లు సిద్ధంగా ఉన్నారు. ఆప్ ప్రభుత్వం తొలుత అవినీతికి పాల్పడుతుంది. తర్వాత దానిని గొప్పగా సమర్థించుకుంటుంది. మొదట చోరీకి పాల్పడి తర్వాత అహంకారం ప్రదర్శిస్తుంటారు. మద్యం స్కాం, స్కూల్ స్కాం, కాలుష్య కుంభకోణానికి పాల్పడ్డారు. బహిరంగంగా అవినీతికి పాల్పడుతూ.. పైగా ప్రచారం చేసుకుంటున్నారు' అని దుయ్యబట్టారు. కేజ్రీవాల్ సీఎంగా ఉన్నప్పుడు ప్రజాధనంతో తన నివాసాన్ని అద్దాల మహల్‌గా మలచుకోవడాన్ని మోదీ ఎద్దేవా చేశారు. 'నేను కూడా అద్దాల మహల్ కట్టుకోగలను. కానీ మోదీ తన సొంతానికి ఇల్లు కట్టుకోలేదని.. 4 కోట్ల మందికిపైగా పేదలకు ఇళ్లు కట్టించి ఇచ్చాడని దేశానికి తెలుసు' అని వ్యాఖ్యానించారు. ఢిల్లీలోని మురికివాడల ప్రజలకు ఇవాళ కాకపోయినా రేపైనా పక్కా ఇళ్లు నిర్మించి ఇస్తానని.. ఇది తన మాటగా వారందరికీ చెప్పాలని సభకు హాజరైనవారికి పిలుపిచ్చారు. ఎమర్జెన్సీ సమయంలో తాను, ఇతర కార్యకర్తలు అశోక్ విహార్ ప్రాంతంలోనే ఉండి అజ్ఞాతంగా కార్యకలాపాలు నిర్వహించామని మోదీ గుర్తుచేసుకున్నారు. ఇళ్ల లబ్ధిదారులతో ఆయన సంభాషించారు. ఈ సందర్భంగా నౌరోజీనగర్‌లో వరల్డ్ ట్రేడ్ సెంటర్, సరోజినీనగర్‌లో జనరల్ పూల్ రెసిడెన్షియల్ అకామడేషన్ (జీపీఆర్ఏ) టైప్-2 క్వార్టర్స్, ద్వారకలో సీబీఎస్ఈ కార్యాలయ సముదాయం సహా పలు ప్రాజెక్టులను ప్రారంభించారు. ఢిల్లీ విశ్వవిద్యాలయంలో వీరసావర్కర్ కాలేజీ, తూర్పు, పశ్చిమ క్యాంపస్‌లలో అకడమిక్ బ్లాకుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

వచ్చే వారంలో ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్?

న్యూఢిల్లీ, జనవరి 3(ఆంధ్రజ్యోతి): ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ ఈనెల వచ్చే వారంలో వెలువడే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఎన్నికల షెడ్యూల్ నేపథ్యంలో ప్రధాని మోదీ శుక్రవారం ఢిల్లీలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఢిల్లీ ప్రస్తుత అసెంబ్లీ పదవీకాలం ఫిబ్రవరి 23న ముగియనుండడంతో ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం సమాయత్తమవుతోంది. ఫిబ్రవరి మూడో వారంలో ఎన్నికలు జరిపేలా ప్రయత్నాలు ప్రారంభించింది. తుది ఓటర్ల జాబితాను వచ్చే ఈనెల 6వ తేదీన ప్రచురిస్తామని ఈసీ అధికారులు తెలిపారు. కాగా, ఆప్ వరుసగా ఢిల్లీలో నాలుగోసారి అధికారాన్ని చేపట్టాలనే లక్ష్యం పెట్టుకోగా, ఆప్‌ను అడ్డుకోవాలని బీజేపీ, కాంగ్రెస్ ప్రణాళికలకు సిద్ధమవుతున్నాయి. 2015, 2020 అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ ఘనవిజయం సాధించింది.

10లక్షల సూట్.. 8,400 కోట్ల విమానం: కేజ్రీ

మోదీ వ్యాఖ్యలను కేజ్రీవాల్ తిప్పికొట్టారు. రూ.2,700 కోట్ల ఖర్చుతో ఇల్లు కట్టుకుని.. రూ.10 లక్షల విలువ చేసే సూట్ వేసుకుని.. రూ.8,400 కోట్ల ఖరీదు చేసే విమానంలో తిరిగే వ్యక్తి నోట అద్దాల మహల్ ప్రస్తావన శోభిల్లదని అన్నారు. గత పదేళ్లలో కేంద్రం ఢిల్లీకి చేసిందేమీ లేదని.. అయినా తమ ప్రభుత్వానికి శాపనార్థాలు పెడుతున్నారని విమర్శించారు. మోదీ సభ ముగియగానే ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. గత పదేళ్లలో తాము చేసిన అభివృద్ధి చెప్పడానికి 2-3 గంటలైనా చాలవన్నారు. కాగా, కేజ్రీవాల్ సీఎంగా ఉన్నప్పుడు ఢిల్లీలో 24 హిందూ ప్రార్థనాస్థలాలను కూల్చివేశారని లెఫ్టినెంట్ గవర్నర్ (ఎల్‌జీ) వీకే సక్సేనా వెల్లడించారు.

హెచ్-1బీ వీసాలపై రచ్చ!

- డెమోక్రటిక్, రిపబ్లికన్ పార్టీల్లో భిన్నస్వరాలు
- హెచ్-1బీ వీసాలకు మేం అనుకూలమే: ట్రంప్
- విదేశీ కార్మికులను దోపిడీ చేయడానికే హెచ్ 1బీ
- డెమోక్రటిక్ సెనేటర్ బెర్నీ శాండర్స్ ఆరోపణలు



వాషింగ్టన్, జనవరి 3: అమెరికాలో డొనాల్డ్ ట్రంప్ ప్రమాణ స్వీకారానికి ముహూర్తం ముంచుకొస్తున్న వేళ హెచ్-1బీ వీసాలపై చర్చ తీవ్రరూపం దాల్చింది. ఈ వ్యవహారం డెమొక్రటిక్, రిపబ్లికన్ పార్టీల్లో అంతర్గతంగా మంటలు రేపుతోంది. వివిధ దేశాలకు చెందిన వృత్తి నిపుణుల సేవలను వినియోగించుకోవాలని భావించే అమెరికా సంస్థలు ఈ వీసాలను స్పాన్సర్ చేస్తుంటాయి. ఇందుకోసం ప్రతి ఏడాది 85వేల హెచ్-1బీ వీసాలను అమెరికా జారీ చేస్తుంది. ఈ వీసా ద్వారా లబ్ధి పొందినవారిలో భారతీయులే అధికంగా ఉన్నారు. వీసాల అంశంపై ట్రంప్ ఇటీవల స్పందించారు. తాను ఎల్లప్పుడూ హెచ్-1బీ వీసాలకు అనుకూలమేనని చెప్పారు. 'అమెరికాలో అత్యంత సమర్థులైన వ్యక్తులు ఉండాలని నేను ఎల్లప్పుడూ భావిస్తాను. మనకు సమర్థులు అవసరం. మన దేశంలోకి తెలివైన వ్యక్తులు చాలామంది రావాలి. మునుపెన్నడూ లేని స్థాయిలో మనకు ఉద్యోగాలు రాబోతున్నాయి' అని కొత్త సంవత్సరం వేడుకల్లో ఆయన మీడియాతో అన్నారు. ఆయన సన్నిహితులైన ఎలాన్ మస్క్, వివేక్ రామస్వామి సైతం ఈ వీసాలకు మద్దతు ప్రకటించారు. అత్యుత్తమ ప్రతిభను ఆకర్షించడానికి ఈ వీసాలు తప్పనిసరి అన్నారు.

శ్రీరామ్ నియామకంతో మొదలైన వివాదం

ఏఐపై వైట్‌హౌస్ సీనియర్ పాలసీ అడ్వైజర్‌గా శ్రీరామ్ కృష్ణన్‌ను ట్రంప్ ఎంపిక చేయడంతో హెచ్-1బీ వీసాలపై వ్యతిరేకత ప్రారంభమైంది. నైపుణ్యం కలిగిన వలసదారుల కోసం గ్రీన్‌కార్డుల విషయంలో ఉన్న పరిమితులను తొలగించాలని గతంలో శ్రీరామ్ పిలుపునిచ్చారు. దీనిపై ట్రంప్ మద్దతుదారుల నుంచి తీవ్ర ప్రతిఘటన వ్యక్తమవుతోంది. అయితే, ఈ విధానం అమెరికన్ల ఉద్యోగాలను హరిస్తోందని వారు వాదించడంపై మస్క్ మండిపడ్డారు. 'స్పేస్ ఎక్స్, టెస్లా తరహాలో అమెరికాను బలోపేతం చేసిన వందలాది కంపెనీలను స్థాపించిన నాలాంటి వ్యక్తులు ఇక్కడకు రావడంలో హెచ్1బీ వీసాలదే కీలక పాత్ర. అందుకే ఈ వీసాలపై ఎవరితోనైనా యుద్ధానికి సిద్ధమే' అని 'ఎక్స్'లో పేర్కొన్నారు. కాగా, హెచ్-1బీ వీసాల వ్యవహారంలో ట్రంప్ సన్నిహితులు ఇద్దరూ తప్పు చేస్తున్నారని డెమోక్రటిక్ సెనేటర్ బెర్నీ శాండర్స్ గురువారం వ్యాఖ్యానించారు. 'ప్రస్తుతం హెచ్-1బీ ప్రధాన ఉద్దేశం ప్రతిభావంతులను నియమించుకోవడం కాదు. మంచి వేతనంతో కూడిన అమెరికన్ ఉద్యోగాల్లో విదేశాల నుంచి తక్కువ వేతనంతో కూడిన ఒప్పంద సేవకులను నియమించడమే లక్ష్యం. ఎంత చౌకగా కార్మికులను నియమించుకుంటే అంత ఎక్కువ డబ్బును ఈ బిలియనీర్లు ఆదా చేసుకుంటారు' అని పేర్కొన్నారు. కానీ ఆ పార్టీకే చెందిన రో ఖన్నా, రాజా కృష్ణమూర్తి హెచ్-1బీలకు మద్దతు ప్రకటించారు.

మనసును చదివే యంత్రం

- అభివృద్ధి చేసిన చైనా శాస్త్రజ్ఞులు
- మూర్ఛ వ్యాధి బాధితురాలి ఆలోచనల్ని డీకోడ్ చేసిన యంత్రం

బీజింగ్, జనవరి 3: 'ఆదిత్య 369' సినిమాలో హీరో, హీరోయిన్లు భవిష్యత్తులోకి వెళ్లే సీన్ గుర్తుందా? అందులో వారు మనసులో అనుకునే మాటలు బయటకు వినపడిపోతుంటాయి!! మరీ ఆ స్థాయిలో కాదుగానీ.. మన మనసులో ఆలోచనలను న్యూరల్ నెట్‌వర్క్ మోడల్ ద్వారా డీకోడ్ చేసే 'మైండ్ రీడింగ్ మెషీన్'ను చైనా శాస్త్రజ్ఞులు అభివృద్ధి చేశారు. 'బ్రెయిన్-కంప్యూటర్ ఇంటర్‌ఫేస్(బీసీఐ)'ల అభివృద్ధి దిశగా మరో కీలక ముందడుగు వేశారు. చైనాకు చెందిన న్యూరోయాక్సెస్ అనే స్టార్టప్ తన ప్రయోగాల్లో భాగంగా బీసీఐ పరికరాన్ని.. మెదడుకు గాయమైన ఒక 21 ఏళ్ల మూర్ఛవ్యాధి బాధితురాలికి నిరుడు ఆగస్టులో అమర్చగా.. అది ఆమె ఆలోచనలను 60మిల్లీసెకన్ల వ్యవధిలో డీకోడ్ చేయగలిగింది. అంతేకాదు.. డిసెంబరులో నిర్వహించిన మరో పరీక్షలో ఆ పరికరం చైనీస్ మాటలను సైతం 100 మిల్లీసెకన్ల తేడాతో డీకోడ్ చేసినట్టు న్యూరోయాక్సెస్ సంస్థ ఒక ప్రకటనలో వెల్లడించింది. ఈ పరికరం సాయంతో పేషెంట్లు తమ ఆలోచనల ద్వారానే కంప్యూటర్‌లో సాఫ్ట్‌వేర్‌ను, వస్తువులను నియంత్రించగలిగారు. ఏఐ మోడళ్లతో సంభాషించగలిగారు.

తెలంగాణలో బ్లాక్ చైన్ సిటీ

- క్వాంటం కంప్యూటింగ్‌లో 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'
- త్వరలో ఏఐ సిటీకి శంకుస్థాపన : శ్రీధర్ బాబు

హైదరాబాద్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో బ్లాక్ చైన్ సిటీని ఏర్పాటు చేయబోతున్నట్లు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. ఎక్కడ, ఎంత విస్తీర్ణంలో ఏర్పాటు చేయాలనే అంశంపై ఇప్పటికే సంబంధిత పరిశ్రమలు, నిపుణులతో సంప్రదింపులు ప్రారంభించామన్నారు. డ్రోన్ టెక్నాలజీ, రోబోటిక్స్ రంగంలో దాదాపు 1,800 మందికి ఉపాధి కల్పిస్తున్న సెంటిలియన్ నెట్‌వర్క్స్ అండ్ హెచ్‌సీ రోబోటిక్స్ కంపెనీ నూతన క్యాంపస్‌ను మంత్రి శుక్రవారం మాదాపూర్‌లో ప్రారంభించారు. 'కొత్త సాంకేతికతల ఆవిష్కరణలో తెలంగాణను నంబర్ వన్‌గా నిలిచేలా ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నాం. ఫ్యూచర్ సిటీలో నిర్మించ తలపెట్టిన ఏఐ యూనివర్సిటీకి త్వరలో శంకుస్థాపన చేయబోతున్నాం. అలాగే ప్రత్యేకంగా క్వాంటం కంప్యూటింగ్‌లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ప్రారంభించబోతున్నాం' అని వెల్లడించారు. 'దేశంలో ఫ్రాంటియర్ టెక్నాలజీ హబ్‌ను ఏర్పాటు చేసే యోచనలో కేంద్రం ఉంది. ఆ హబ్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేయాలంటూ ఇప్పటికే కేంద్రాన్ని కోరాం. ఇక్కడి అనుకూలతలను వివరించాం.' అని తెలిపారు. పౌర సేవలను చివరి వ్యక్తి వరకు సమర్థంగా అందించాలనే లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం ముందుకెళ్తోందని చెప్పారు.


సంచార ప్రయోగశాలను పరిశీలిస్తున్న మంత్రి శ్రీధర్ బాబు

సంచార ప్రయోగశాల 'ఫ్లో' ప్రారంభం..

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు రూపొందించిన ఫ్యూచరిస్టిక్ ల్యాబ్ ఆన్ వీల్స్ (ఫ్లో) వాహనాన్ని మంత్రి శ్రీధర్ బాబు సచివాలయంలో జెండా ఊపి ప్రారంభించారు. ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, వర్చువల్ రియాలిటీ, రోబోటిక్స్, 3డీ ప్రింటింగ్, మెషీన్ లెర్నింగ్‌లతో కూడిన పరికరాలు, నిపుణులతో కూడిన ఈ ప్రత్యేక వాహనం 33 జిల్లాల్లోని ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లనుంది. మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం స్ఫూర్తి యాత్ర-33 పేరుతో ఒక స్వచ్ఛంద సంస్థ ఈ వాహనాన్ని రూపొందించింది. దీని కయ్యే వ్యయం లక్ష డాలర్ల సాయాన్ని 'సేల్స్ ఫోర్స్ ఇండియా' సంస్థ అందించింది. 45 రోజుల్లో 33 జిల్లాలకు చేరి ఫ్లో వాహనం విద్యార్థులకు అవగాహన కల్పిస్తుందని వెల్లడించారు. కార్యక్రమంలో సీఈవో మధు లాష్, సలహాదారు వికాస్ క్వాట్రగడ్డ తదితరులు పాల్గొన్నారు.


ఆయుధాలను పరిశీలిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

'ఆర్మీ మేళా'ను ప్రారంభించిన గవర్నర్

అల్వాల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): చారిత్రాత్మక గోల్కొండ కోటలో 'నో యువర్ ఆర్మీ మేళా' ప్రారంభమైంది. శుక్రవారం రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, మేజర్ జనరల్ అజయ్ మిశ్రాతో కలిసి ఈ మేళాను ప్రారంభించారు. ఈ సందర్భంగా భారత సైన్యం ఉపయోగించే అత్యాధునిక ఆయుధ పరికరాలతో పాటు వివిధ రకాల ఆవిష్కరణలను ప్రదర్శించారు. పంజాబ్ రెజిమెంట్‌లోని సైనికులు గట్కాతో ప్రత్యేక ప్రదర్శనలు ఇచ్చారు. ఆర్టిలరీ సెంటర్‌లోని సైనికులు నిరాయుధ పోరాట యుద్ధ కళలను ప్రదర్శించారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5వరకు నిర్వహిస్తున్న ఈ మేళా ఆదివారం వరకు కొనసాగనుంది.

మూడో వారంలో సంచారజాతుల స్థితిగతుల పరిశీలనకు బీసీ కమిషన్

హైదరాబాద్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): సంచారజాతుల సామాజిక పరిస్థితులను అధ్యయనం చేయడానికి జనవరి మూడోవారంలో ఆయా ప్రాంతాలను బీసీ కమిషన్ సందర్శించనుంది. శుక్రవారం ఖైరతాబాద్‌లోని కార్యాలయంలో బీసీ కమిషన్ చైర్మన్ జీ. నిరంజన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయించారు. సమాజంలో న్యూనతాభావంతో చూస్తున్న దొమ్మర, పిచ్చిగుంట్ల, తమ్మళి బుడబుక్కల, కుమ్మర, వీరముష్టి కులాల పేర్లను మార్చాలనే ఆయా కులాల ప్రతినిధుల నుంచి వచ్చిన ఫిర్యాదులపై చర్చించినట్లు చైర్మన్ నిరంజన్ పేర్కొన్నారు. పేరు మార్చాలనే ఇతర కులాలకు సంబంధించి జనవరి 4 నుంచి 18 వరకు ఖైరతాబాద్‌లోని తమ కార్యాలయంలో అభ్యంతరాలను స్వీకరిస్తున్నట్లు తెలిపారు.

అమెరికాలో ఉన్న అల్లుడిపై కేసు పెట్టండి

- హైకోర్టులో ఓ వృద్ధుడి పిటిషన్
- విచారణార్హం కాదన్న ధర్మాసనం

హైదరాబాద్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): అమెరికాలో ఉంటున్న అల్లుడు అక్కడే ఉన్న తన కుమార్తెను వేధింపులకు గురిచేస్తున్నాడని 84 ఏళ్ల వృద్ధుడు ఒకరు హైకోర్టుకు ఫిర్యాదు చేశాడు. అతడిపై ఎస్ఆర్ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయడం లేదని పేర్కొన్నారు. అయితే ఆ కేసు ఇక్కడ విచరణార్హం కాదని జస్టిస్ బీ విజయ్‌సేన్‌రెడ్డి ధర్మాసనం పేర్కొంది. ఆయన కుమార్తె అమెరికాలో వివిధ అథారిటీల వద్ద కేసు కొనసాగిస్తున్నారని, భారత విదేశాంగశాఖకు సైతం ఫిర్యాదు చేశారని తెలిపింది. అందువల్ల ఈ పిటిషన్ విచారణార్హత ఏమిటో వివరించాలని పిటిషనర్ న్యాయవాదికి ఆదేశిస్తూ విచారణను ఈనెల8కి వాయిదా వేసింది.

6.5 డిగ్రీలు

(మొదటి పేజీ తరువాయి)

కోహిర్‌లో 6.9, ఆదిలాబాద్ జిల్లా బేలలో 7.1, భీంపూర్‌లో 7.2, తలమడుగులో 8.5, పిప్పల్‌ధరిలో 8.8, వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట్‌లో 7.3, రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌లో 7.5, కామారెడ్డి జిల్లా డొంగ్లిలో 8, నిర్మల్ జిల్లా పెంబిలో 8.5, మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్, సిరిసిల్ల జిల్లా గంభీరావుపేటలో 9 డిగ్రీలు, మెదక్ జిల్లా నర్సాపూర్‌లో 9.1 డిగ్రీల చొప్పున కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తారంలో 9.9, ములుగు జిల్లా మల్లంపల్లిలో 10.8, వరంగల్ జిల్లా చెన్నారావుపేటలో 11.1, జనగామ జిల్లా కేంద్రంలో 11.4, మహబూబ్‌నగర్ జిల్లా కొత్తగూడలో 11.4 డిగ్రీలు నమోదయ్యాయి. 15 జిల్లాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు 10 డిగ్రీలలోపు నమోదు కాగా, మిగిలిన జిల్లాల్లో 13 డిగ్రీలలోపు రికార్డు అయ్యాయి. రాబోయే మూడు రోజులు రాష్ట్రంలో సాధారణంకంటే 3-4 డిగ్రీలు తక్కువగా ఉష్ణోగ్రతలు నమోదు అయ్యే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

దేవాదుల ప్రతిపాదనల తిరస్కరణ

- మళ్లీ తగిన రీతిలో సమర్పించాలని ఎస్ఎల్ఎస్సీ ఆదేశం

హైదరాబాద్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): దేవాదుల ఎత్తిపోతల పథకం ఫేజ్-3లోని ప్యాకేజీ-3కి సంబంధించిన ప్రతిపాదనలను రాష్ట్రస్థాయి స్టాండింగ్ కమిటీ(ఎస్ఎల్ఎస్సీ) తిరస్కరించింది. ప్యాకేజీ-3లో చెన్నూరు, పాలకుర్తి చెరువులకు సంబంధించిన ప్రతిపాదనలు రాగా... పలు ఉల్లంఘనలు ఉన్నట్లు ఈఎన్సీ(జనరల్) జి.అనిల్ కుమార్ నేతృత్వంలోని ఎస్ఎల్ఎస్సీ గుర్తించింది. దాంతో తగిన రీతిలో ప్రతిపాదనలను సమర్పించాలని శుక్రవారం సిఫారసు చేసింది.

ఇద్దరు ఇంజనీర్లపై అభియోగాలు!

మేడిగడ్డ నిర్మాణం పూర్తవకున్నా అయినట్లుగా సర్టిఫికెట్ ఇచ్చిన ఈఈ తిరుపతిరావు, సీఈ రమణారెడ్డి

- ఇద్దరిపై అభియోగాలు నమోదు చేసిన సర్కారు
- 10 రోజుల్లోగా లిఖితపూర్వక వివరణ ఇవ్వాలని ఆదేశం



హైదరాబాద్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోయిన ఘటనలో రాష్ట్ర ప్రభుత్వం అధికారులపై చర్యలకు ఉపక్రమించింది. ఇద్దరు అధికారులపై అభియోగాలు (ఆర్టికల్ ఆఫ్ చార్జెస్) నమోదు చేసింది. కాళేశ్వరం ప్రాజెక్టులో మేడిగడ్డ కుంగిపోగా.. అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో భారీగా సీపేజీలు బయటపడ్డాయి. ఈ మూడు బ్యారేజీల వ్యవహారంపై ఇప్పటికే విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణ చేపట్టి, పలువురు అధికారులను ప్రశ్నించింది. జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ కూడా విచారణ జరుపుతోంది. మేడిగడ్డ బ్యారేజీ, దాని చుట్టూ గైడ్‌బండ్ వంటి నిర్మాణాలు జరుగుతుండగానే బ్యారేజీ పూర్తయినట్లుగా సర్టిఫికెట్ ఇచ్చిన అప్పటి మహదేవ్‌పూర్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ)-1 తిరుపతిరావు, అప్పట్లో రామగుండం ఇన్‌చార్జి ఎస్ఈగా పనిచేసి, ప్రస్తుతం మహబూబ్‌నగర్ చీఫ్ ఇంజనీర్ (సీఈ)గా పనిచేస్తున్న బి.రమణారెడ్డిపై ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. మేడిగడ్డ బ్యారేజీ, దాని అనుబంధ పనులు పూర్తికానప్పటికీ అయినట్లుగా తిరుపతిరావు సర్టిఫికెట్ ఇవ్వగా.. దానిపై రమణారెడ్డి కౌంటర్ సంతకం చేశారు. పనులు పూర్తవకున్నా.. అయినట్లుగా ఎలా సర్టిఫికెట్ ఇస్తారని జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ఆ సర్టిఫికెట్లు జారీ చేసిన అధికారులపై ఏం చర్యలు తీసుకున్నారని నిలదీసింది. మరోవైపు అధికారుల తీరును విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కూడా తప్పుపట్టింది. దీంతో గత జూన్ 3న ప్రభుత్వానికి నీటిపారుదల శాఖ ఈఎన్సీ జి.అనిల్‌కుమార్ లేఖ రాస్తూ.. నిర్మాణ సంస్థ ఎల్అండ్‌టీకి కంప్లీషన్ సర్టిఫికెట్ ఇచ్చిన ఈఈ తిరుపతిరావుతో పాటు దానిపై సంతకం చేసిన రమణారెడ్డిపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సిఫారసు చేశారు. ప్రభుత్వ ఆదేశాలతో ఆయన అధికారుల వివరాలతో కూడిన నివేదిక అందజేశారు. దాని ఆధారంగా వీరిద్దరిపై అభియోగాలు నమోదు చేస్తూ నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా జీవో నంబరు 1, 2లు జారీ చేశారు.

నిర్ధారణ అయితే జీవితాంతం ప్రభావం

అభియోగాలు నిరూపితమైతే అధికారులపై తీవ్ర ప్రభావం పడుతుంది. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం పదిరోజుల్లో సంజాయిషీ ఇవ్వకున్నా, వ్యక్తిగతంగా హాజరు కాకపోయినా కఠిన చర్యలు తీసుకుంటారు. వీరిపై అభియోగాల ప్రభావం తదుపరి పదోన్నతులపై కూడా ఉంటుంది. సస్పెన్షన్ కన్నా ఆర్టికల్ ఆఫ్ చార్జెస్ తీవ్రతే అధికంగా ఉంటుంది. సస్పెండైతే ఆర్నెల్లపాటు పనిచేయకున్నా సగం జీతం పొందుతారు. అదే అభియోగాలు నిరూపణ అయితే ఇంక్రిమెంట్లలో కోత పడుతుంది. అంటే విధుల్లో ఉన్నంత కాలం వేతనంలో కోత పడుతుంది.

నిర్మాణం పూర్తికాకుండానే మేడిగడ్డ ప్రారంభం

మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణాన్ని ఎల్అండ్‌టీ సంస్థ 2016 నవంబరులో ప్రారంభించగా.. 2019లో పూర్తయింది. బ్యారేజీ ప్రారంభించిన తర్వాత తొలి వరదలకే సీసీ బ్లాకులు చెల్లాచెదురు కావడంతో పాటు బ్యారేజీ ఎగువ, దిగువభాగంలోని అప్రాన్లు దెబ్బతిన్నాయి. ఏటా వరదల అనంతరం నష్టం జరుగుతున్నా తాత్కాలిక చర్యలు తప్ప.. శాశ్వత చర్యలకు ఎల్అండ్‌టీ ఉపక్రమించలేదు. అయితే నిర్మాణ సంస్థకు, స్థానిక అధికారుల మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు నడిచినా పనులు కార్యరూపం దాల్చలేదు. నిర్వహణ పనుల్లో వైఫల్యంతో 2023 అక్టోబరులో మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోయింది. మరమ్మతులకు ఎల్అండ్‌టీ తొలుత నిరాకరించింది. అధికారులు జారీ చేసిన సర్టిఫికెట్ ప్రకారం 2021తోనే డిఫెక్ట్ లయబిలిటీ కాలం పూర్తయినందున బ్యారేజీ మరమ్మతుల బాధ్యత తమది కాదని తేల్చిచెప్పింది. ఆ తర్వాత కఠిన చర్యలకు ఉపక్రమించాల్సి ఉంటుందని సర్కారు హెచ్చరించడంతో తాత్కాలిక మరమ్మతులు చేసింది. కాగా, ప్రాజెక్టు పూర్తయినట్లు ఇచ్చిన సర్టిఫికెట్‌ను ప్రభుత్వం ఇటీవలే రద్దు చేసింది.

గోవాలో న్యూ ఇయర్ వేడుకలు.. ఏపీ యువకుడి దారుణ హత్య

- కర్రలతో కొట్టి చంపిన రెస్టారెంట్ సిబ్బంది



రవితేజ(ఫైల్), తాడేపల్లిగూడెంలో ర్యాలీ నిర్వహిస్తున్న యువకులు

తాడేపల్లిగూడెం రూరల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సర వేడుకల కోసం గోవా వెళ్లిన పశ్చిమ గోదావరి యువకుడు అక్కడ దారుణ హత్యకు గురైన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం డీఎస్ చెరువు ప్రాంతానికి చెందిన రవితేజ(27) హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నారు. అందరితో సౌమ్యంగా, స్నేహంగా ఉండే రవితేజ తన సోదరుడు ఫణితో కలిసి తక్కువ సమయంలోనే కన్సల్టెన్సీ పెట్టారు. ఈ ఏడాది పెళ్లి చేసుకుని, కొత్త జీవితం ప్రారంభించాలని భావించారు. ఈ నేపథ్యంలో కొత్త సంవత్సరం వేడుకల కోసం నలుగురు యువకులు, ముగ్గురు యువతులతో కలిసి రవితేజ గోవాకు వెళ్లారు. అక్కడ తన స్నేహితురాలితో రెస్టారెంట్ నిర్వాహకులు అసభ్యంగా మాట్లాడటంతో వారిని ప్రశ్నించారు. దీంతో కోపోద్రిక్తులైన రెస్టారెంట్ సిబ్బంది రవితేజపై కర్రలతో విచక్షణారహితంగా దాడి చేశారు. తలకు తీవ్ర గాయమైన అతన్ని స్థానిక ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆలస్యమైందని, అరగంట ముందు తీసుకొచ్చి ఉంటే బతికేవాడని గోవా ఆస్పత్రి వైద్యులు చెప్పారు. కేసు నమోదు చేసుకున్న గోవా పోలీసులు రెస్టారెంట్ నిర్వాహకుడు సిల్వేరాతోపాటు, సిబ్బందిని అరెస్టు చేసినట్టు తెలిపారు. రవితేజ తండ్రి బొల్లా సుబ్రహ్మణ్యం లారీ మెకానిక్‌గా పనిచేస్తూ.. ఇద్దరు కుమారులను బాగా చదివించి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లను చేశారు. ఈ ఏడాది రవితేజకు వివాహం చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్న సమయంలో హత్యకు గురికావడం ఆ కుటుంబంలో విషాదం నింపింది.

'బాయ్‌కాట్ గోవా..' నినాదాలు..

గోవాలో హత్యకు గురైన రవితేజ మృతదేహం తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ చొరవతో స్వస్థలానికి చేరింది. రవితేజ స్నేహితులు, కుటుంబ సభ్యులు మృతదేహంతో పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. రవితేజ ఫొటోలు ప్రదర్శిస్తూ.. 'బాయ్‌కాట్ గోవా' అంటూ నినాదాలు చేశారు. ఆటవిడుపు కోసం గోవాకు వెళ్తే రక్షణ కరువైందంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

తిరుపతన్నకు అంత స్థోమత ఎక్కడిది?

- ఫోన్ ట్యాపింగ్ కేసులో బెయిల్ కోసం సుప్రీంకోర్టులో సీనియర్ న్యాయవాదితో వాదనలు
- ఫీజు చెల్లింపుపై పోలీసుల ఆరా?

హైదరాబాద్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): పోలీసు శాఖలో ఆయన ఓ అదనపు డీసీపీ స్థాయి అధికారి. ఫోన్ ట్యాపింగ్ కేసులో అరెస్టయి.. 9 నెలలుగా జైల్లో ఉన్నారు. బెయిల్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. సుప్రీంకోర్టులో తన తరఫున వాదనలు వినిపించేందుకు ఓ సీనియర్ న్యాయవాదిని నియమించుకోవడం ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. గత ప్రభుత్వ హయాంలో ఎస్ఐబీలో సీక్రెట్ సెల్ ఏర్పాటు చేసి.. ప్రతిపక్ష నేతల, హైకోర్టు జడ్జిల, వ్యాపారవేత్తల ఫోన్ కాల్స్‌ను ట్యాపింగ్ చేశారనే ఆరోపణలపై కేసు నమోదై విచారణ సాగుతున్న విషయం తెలిసిందే. ఈ కేసులో అరెస్టయిన వారిలో సస్పెన్షన్‌కు గురైన అదనపు డీసీపీ తిరుపతన్న ఒకరు. బెయిల్ కోసం ఆయన హైకోర్టులో చేసిన ప్రయత్నాలు విఫలమవడంతో సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అదీ.. ప్రముఖ సీనియర్ న్యాయవాది ఆయన తరఫున వాదిస్తున్నారు. అంత పెద్ద న్యాయవాదిని నియమించుకోవాలంటే ఫీజుగా పెద్దమొత్తమే చెల్లించుకోవాల్సి ఉంటుందన్న అభిప్రాయాలున్నాయి. తిరుపతన్నకు అంత ఆర్థిక స్థోమత ఎక్కడిదన్న చర్చ మొదలైంది. ఆయనకు ఎవరైనా సహాయం చేస్తున్నారా? అన్న కోణంలో పోలీసులు ఆరా తీస్తున్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇప్పటివరకు తిరుపతన్నతోపాటు పోలీసు అధికారులు ప్రణీత్‌రావు, భుజంగరావు మాజీ పోలీసు అధికారి రాధాకిషన్‌రావు అరెస్టయ్యారు. ఇతర నిందితులైన ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు, ఒక టీవీ చానల్ యజమాని శ్రవణ్‌కుమార్‌రావు ఇంకా విదేశాల్లోనే తలదాచుకున్నారు. వీరిని ఇక్కడికి రప్పించడం కోసం తెలంగాణ పోలీసులు రెడ్ కార్నర్ నోటీసులు జారీ చేయించినా.. అది ఇప్పటివరకు అమలు కాలేదు. దీనిపై సంప్రదింపులు జరుపుతున్నామని డీజీపీ జితేందర్ ఇటీవలే ప్రకటించారు.

హైకోర్టు పరిధిలో 1673 పోస్టులకు నోటిఫికేషన్

హైదరాబాద్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ హైకోర్టు పరిధిలోని 1673 టెక్నికల్, నాన్ టెక్నికల్ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. ఆసక్తిగల అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సంబంధిత అధికారులు తెలిపారు. జిల్లా కోర్టుల్లో జూనియర్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్, రికార్డ్ అసిస్టెంట్ వంటి నాన్‌టెక్నికల్ పోస్టులు 1277, స్టెనోగ్రాఫర్, టైపిస్ట్ వంటి టెక్నికల్ పోస్టులు 184 ఉన్నాయి. ఇక హైకోర్టులో టెక్నికల్ అండ్ నాన్ టెక్నికల్ పోస్టులు 212 ఉన్నాయి. జిల్లా న్యాయస్థానాలు, హైకోర్టు పరిధిలో ఉన్న ఈ ఖాళీలకు ఆయా పోస్టుల అర్హతలను అనుసరించి దరఖాస్తులను జనవరి 31లోగా పంపుకోవాలి. వయస్సు, విద్యార్హతలు వంటి వివరాల కోసం https://tshc.gov.in/ వెబ్‌సైట్ చూడొచ్చు.

ఎకరాకు రూ.20- 27లక్షల పరిహారం

- నాగ్‌పూర్- విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ హైవేకు భూపాలపల్లి జిల్లాలో 322.20 ఎకరాల భూసేకరణకు మార్గం సుగమం



నాగపూర్-విజయవాడ ఎక్స్‌ప్రెస్ వే రూట్ మ్యాప్

(ఆంధ్రజ్యోతి, భూపాలపల్లి): నాగపూర్-విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి నిర్మాణానికి సంబంధించి భూపాలపల్లి జిల్లాలో నెలకొన్న అడ్డంకులు తొలగిపోయాయి. జిల్లాలో 322.20 ఎకరాల భూసేకరణకు మార్గం సుగమం అయింది. భూసేకరణకు ప్రతిబంధకంగా మారిన నష్టపరిహారం విషయం ఎట్టకేలకు కొలిక్కి వచ్చింది. ఒక్కో ఎకరాకు రూ.20 లక్షల నుంచి రూ.27 లక్షల దాకా నష్ట పరిహారం ఇచ్చేందుకు జాతీయ రహదారుల సంస్థ అంగీకరించింది. భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మధ్యవర్తిత్వంతో ముందుగా ప్రకటించిన పరిహారాన్ని మూడు రెట్ల మేర పెంచింది. దీంతో భూములు ఇచ్చేందుకు రైతులు ముందుకొచ్చారు. మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ను కలిపే ఈ ఎకనామిక్ కారిడార్‌లో.. మంచిర్యాల జిల్లా జైపూర్ నుంచి ఖమ్మం జిల్లా వెంకటాయపాలెం వరకు 216 కిలోమీటర్ల మేర నాలుగు లేన్ల రహదారి నిర్మాణానికి జాతీయ రహదారుల విభాగం పనులు ప్రారంభించింది. తెలంగాణ సరిహద్దు ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి నుంచి మంచిర్యాల వరకు బ్రౌన్‌ఫీల్డ్ రోడ్డు నిర్మాణ పనులను ఇప్పటికే పూర్తిచేసింది. అయితే మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం నర్వ గ్రామం నుంచి వరంగల్ వరకు 108 కిమీల రహదారి నిర్మాణానికి అవసరమైన 589హెక్టార్ల భూసేకరణకు అనేక సవాళ్లు ఎదురయ్యాయి. ఇందులో భూపాలపల్లి జిల్లాలోని చిట్యాల, టేకుమట్ల, మొగుళ్ళపల్లి మండలాలకు సంబంధించిన 14 గ్రామాల్లోని 322.20 ఎకరాలను సేకరించాలని నిర్ణయించారు. తొలుత ఎకరాకు రూ.3లక్షల నష్టపరిహారం నిర్ణయించడంతో భూమి ఇచ్చేందుకు రైతులు నిరాకరించారు. భూమికి బదులు భూమి లేదంటే అలైన్‌మెంట్ మార్చాలంటూ ఆందోళనలకు దిగారు. గత ఆగస్టులో అప్పటి కలెక్టర్ అవార్డు పెంపు కోసం ఆర్బిట్రేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలని రైతులకు సూచించారు. దీంతో చాలామంది దరఖాస్తు చేశారు. తొలుత పరిహారం పెంపునకు నిరాకరించిన జాతీయ రహదారుల విభాగం ఆ తర్వాత అంగీకరించింది. గతంలో నిర్ణయించిన భూమి విలువను రెట్టింపు చేసి దానికి మూడు రెట్ల పరిహారం, నోటిఫికేషన్ జారీ చేసిన నాటి నుంచి 12శాతం వడ్డీతో కలుపుకొని పరిహారం ఇచ్చేందుకు అంగీకరించింది. భూమి రిజిస్ట్రేషన్ విలువ, స్వభావం ప్రకారం పరిహారాన్ని ఎకరాకు రూ.20 లక్షలు, రూ.25 లక్షలు, రూ.27లక్షలని మూడు క్యాటగిరీలుగా విభజించింది. పరిహారం పెరగడంతో రైతులు భూమి ఇచ్చేందుకు ముందుకొస్తుండగా చెక్కుల పంపిణీ కూడా ప్రారంభమైంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మొత్తం మూడు మండలాల్లో 14గ్రామాలకు చెందిన 515 మంది రైతులు 322.20 ఎకరాల భూములకు గాను రూ.77.20 కోట్లు పరిహారం అందుకొనున్నారు.

శస్త్రచికిత్స మర్నాడు మహిళ మృతి!

- ఆస్పత్రి యాజమాన్యం నిర్లక్ష్యమే కారణమని ఆస్పత్రి ఎదుట బంధువుల ఆందోళన
- వికారాబాద్ జిల్లా పరిగిలో ఘటన

పరిగి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): శస్త్రచికిత్స చేసిన మర్నాడే ఓ మహిళ మృతి చెందింది. ఇందుకు వైద్యులు, ఆస్పత్రి యాజమాన్యం నిర్లక్ష్యమే కారణమని ఆమె బంధువులు ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ ఘటన వికారాబాద్ జిల్లా పరిగిలో శుక్రవారం జరిగింది. మృతురాలి కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం... దోమ మండలం గూడూరు గ్రామానికి చెందిన వడ్డె యాదమ్మ(40) అనారోగ్యంతో పరిగిలోని సాధన ఆస్పత్రిలో చేరింది. వైద్య పరీక్షలు చేసి వైద్యులు గర్భసంచిని తొలగించాలని సూచించారు. గురువారం శస్త్ర చికిత్స చేసి గర్భసంచిని తొలగించారు. శుక్రవారం ఉదయం యాదమ్మ ఆరోగ్యం పరిస్థితి విషమించింది. ఆ సమయంలో ఆస్పత్రిలో డాక్టర్లు, సిబ్బంది ఎవరూ లేరు. ఈ క్రమంలో యాదమ్మ బెడ్‌పై నుంచి కిందకు జారిపడింది. తాపీగా వచ్చిన సిబ్బంది యాదమ్మను వాహనంలో వికారాబాద్ ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే యాదమ్మ మృతి చెందిందని వైద్యులు ధ్రువీకరించారు. పరిగి సాధన ఆస్పత్రి డాక్టర్లు, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే యాదమ్మ మృతి చెందిందని మృతదేహాన్ని ఆస్పత్రి వద్దకు తీసుకొచ్చి బంధువులు ఆందోళనకు దిగారు. ఆస్పత్రి సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్ఐ సంతోష్ ఆస్పత్రికి వద్ద చేరుకుని సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని చెప్పి ఆందోళన నుంచి విరమింపజేశారు. యాదమ్మ మృతదేహానికి పరిగి ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

హాలికుల ఆవేదన

'అన్నీ వేచి ఉండగలుగుతాయి, వ్యవసాయం మాత్రం కాదు'– దశాబ్దాల క్రితం నెహ్రూ గుర్తించిన ఈ సత్యం ఇప్పుడు మరింత ప్రాసంగికతను సంతరించుకున్నది. ఆహార భద్రత, ఉపాధి కల్పన ఆవశ్యకతలను దృష్టిలో ఉంచుకుంటే మన వ్యవసాయ రంగానికి, రైతులకు సహాయ సహకారాలను సమృద్ధిగా ఎందుకు అందించాలో స్పష్టమవుతుంది.

2023–24లో ప్రపంచ వ్యాప్తంగా ఆహార ధాన్యాల ఉత్పత్తి 2,875 మిలియన్ టన్నులు కాగా వినియోగం 2,843 మిలియన్ టన్నులుగా ఉన్నదని ఐక్యరాజ్యసమితి ఆహార, వ్యవసాయ సంస్థ నివేదిక పేర్కొంది. భావి అవసరాలకు నిల్వ చేసుకోగల ఆహార ధాన్యాలు స్వల్పాతి స్వల్ప పరిమాణంలో మాత్రమే ఉన్నాయి. అదే సంవత్సరంలో మన దేశంలో ఆహార ధాన్యాల ఉత్పత్తి 338.29 మిలియన్ టన్నులు. దేశ ప్రజల ఆహార అవసరాలను ఇవి సమృద్ధిగా తీర్చగలుగుతాయా? ఉపాధికల్పన విషయం చూస్తే దేశ శ్రామిక శ్రేణుల్లో అత్యధికులు వ్యవసాయ రంగంలోనే ఉన్నారు. అయితే వారికి నాణ్యమైన ఉపాధి, భద్రమైన ఆదాయం ఏ మాత్రం సమకూరడం లేదు. అదే సమయంలో మరే రంగం కూడా ఈ భారీ శ్రామిక శక్తి వినియోగించుకోలేదు. ఈ వాస్తవాల దృష్ట్యా ఆహార సమృద్ధికి, ఉపాధి భద్రతకు వ్యవసాయ రంగం, రైతులకు తోడ్పడేందుకు ప్రభుత్వాలు ప్రథమ ప్రాధాన్యమివ్వాలి.

విస్మరించకూడని మరొక వాస్తవమేమిటంటే స్వాతంత్ర్యానంతరం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ రంగ అభివృద్ధికి, రైతుల స్థితిగతుల మెరుగుదలకు అత్యధిక ప్రాధాన్యమిచ్చాయి. అనేకానేక అధ్యయనాలు నిర్వహించాయి. రైతుల సహాయార్థం వివిధ సంస్థల నేర్పాటు చేశాయి. రైతుల ఆదాయాలను పెంపొందించేందుకై నిపుణుల సిఫారసుల కోసం వివిధ కమిషన్‌లను నియమించాయి. అయితే ఆ అధ్యయనాల, కమిషన్ల నివేదికలలోని సూచనలు, సిఫారసుల అమలుకు ప్రభుత్వాలు శ్రద్ధ చూపుతున్నాయా? చూపడం లేదన్నది నిష్ఠుర సత్యం. ఎమ్ఎస్ స్వామినాథన్ జాతీయ కమిషన్ సూచనలను కేంద్రం అమలుపరచకపోవడమే అందుకొక తిరుగులేని నిదర్శనం. 2020లో కేంద్ర ప్రభుత్వం ఆ సిఫారసులను ఉపేక్షిస్తూ మూడు కొత్త సాగు చట్టాలను తీసుకురావడంతో ఉత్తరాది రైతాంగం భగ్గుమన్నది. దేశ రాజధానిని ముట్టడించి నెలల తరబడి ఆందోళన చేసింది. రైతుల పోరాట సంకల్పాన్ని గ్రహించిన కేంద్ర ప్రభుత్వం ఆ కొత్త సాగు బిల్లులను ఉపసంహరించుకున్నది. ఆ సందర్భంగా రైతులకు ఇచ్చిన హామీలను పూర్తిగా నెరవేర్చలేదు. దీంతో ఉత్తరాది, ముఖ్యంగా పంజాబ్, హరియాణా రైతులు మళ్లీ ఆందోళనకు దిగారు. గత నవంబర్ 26 నుంచి జగ్జీత్ సింగ్ డల్లేవాల్ అనే రైతునాయకుడు పంజాబ్–హరియాణా సరిహద్దుల్లో ఖనౌరీ వద్ద చేపట్టిన ఆమరణ నిరాహారదీక్షతో 2020లో వలే ఉత్తరాది రైతుల పోరాటం ఆసేతు హిమాచలం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది.

స్వామినాథన్ కమిషన్ సిఫారసులను పూర్తిగా అమలుపరచాలని ముఖ్యంగా కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని, పంట రుణాలను పూర్తిగా రద్దు చేయాలని, సన్నకారు చిన్నకారు రైతులకు నష్టదాయకంగా పరిణమించిన కార్పొరేట్ వ్యవసాయ సానుకూల విధానాలను మార్చాలనేవి ఆందోళన చేస్తున్న రైతుల డిమాండ్లుగా ఉన్నాయి. ఈ డిమాండ్లను నెరవేర్చేంతవరకు తమ ఆందోళనను విరమించేది లేదని రైతులు స్పష్టం చేస్తున్నారు. కేన్సర్ వ్యాధిగ్రస్తుడైన డల్లేవాల్ ఆరోగ్య పరిస్థితి విషమించినా వెనకడుగువేయబోమని స్పష్టంచేస్తున్నారు. రైతుల ఉద్యమాన్ని సమాజంలోని అన్ని వర్గాల వారూ సమర్థిస్తున్నప్పటికీ వారి ఆందోళన పౌర జీవనానికి తీవ్ర అంతరాయం కలిగించడాన్ని ఎవరూ హర్షించలేకపోతున్నారు. పాలనలో తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న పాలకులను రైతుల ఆగ్రహావేశాలు సంయమనపరుస్తాయనే సత్యాన్ని విశాల సమాజం గుర్తించాలి. ఆందోళన సందర్భంగా చోటుచేసుకున్న అరాచక చర్యలు, పార్లమెంటులో బాధ్యతగల ప్రజాప్రతినిధుల వివేచనారహిత, అసంబద్ధ ప్రవర్తనల కంటే మన ప్రజాస్వామ్యానికి ఎక్కువ హాని చేస్తాయా? ఇది డల్లేవాల్, ఆయన మద్దతుదారుల తీరుతెన్నులను సమర్థించడం ఎంత మాత్రం కాదు. ప్రభుత్వంతో అర్థవంతమైన చర్చలకు వారు సంసిద్ధమవ్వాలన్నదే అందరి కోరిక.

కొత్త సంవత్సరం మొదటి రోజున పంట బీమా పథకాల పొడిగింపు, ఎరువులపై రాయితీకి సంబంధించి కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు రైతుల హర్షామోదాలు పొందుతాయి. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ '2025 సంవత్సరంలో ప్రభుత్వ మొదటి నిర్ణయాన్ని కోట్లాది రైతు జనుల శ్రేయస్సుకు అంకితం చేశామని' పేర్కొన్నారు. ఈ శ్రేయో వైఖరి ప్రతీకాత్మకంగా పరిమితమవకుండా సదా వాస్తవంగా రూపుదాల్చాలన్నదే అందరి ఆకాంక్ష.

కొత్త సంవత్సరంలో రూపాయి దారెటు?

డాలర్ ముందు రూపాయి తేలిపోతోంది. రోజురోజుకూ విలువ కోల్పోతూ తన రికార్డును తానే బద్దలుకొడుతోంది. జనవరి 3న రూపాయి మారకం విలువ డాలర్‌కు 85.79. డిసెంబరు 27న 85.80కు క్షీణించిన విషయం తెలిసిందే. సమీపకాలంలో రూపాయి విలువ మరింత పతనం కావచ్చునని ఆర్థికవేత్తలు అంచనావేస్తున్న నేపథ్యంలో, 2014లో ఎన్నికల ప్రచారంలో నరేంద్ర మోదీ రూపాయి పతనం గురించి చేసిన వ్యాఖ్యలు అందరికీ గుర్తుకు వస్తున్నాయి. దేశ రక్షణ గురించి గానీ, రూపాయి పతనం గురించి గానీ మన్మోహన్‌సింగ్ ప్రభుత్వానికి పట్టింపు లేదని మోదీ అప్పట్లో ఘాటైన వ్యాఖ్యలు చేశారు. ఆయనతో పాటు, ఆయన ప్రధాని కావాలని కోరుకున్న ప్రముఖులంతా రూపాయి పతనం మీద చేసిన వెటకారపు వ్యాఖ్యలు ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో మళ్లీ ప్రత్యక్షమవుతున్నాయి. అప్పట్లో రూపాయి బాగోగుల గురించి గుండెలుబాదుకున్న పెద్దలంతా ఇప్పుడు ఎందుకో నోరువిప్పడం లేదు మరి.

రూపాయి విలువ ఈ స్థాయిలో పడిపోవడం ఆర్థిక నిపుణుల్లో కలకలం రేపింది. రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా దిద్దుబాటు చర్యలేవో చేపట్టింది కానీ, అవి ఏ మాత్రం ఫలితాలను సాధిస్తాయో వేచి చూడాల్సిందే. సెప్టెంబర్ నెల నుండి రూపాయి పతనం స్పష్టంగానే కనిపిస్తోంది. సెప్టెంబర్ 12న డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ రూ.83.98కి పడిపోయింది. అప్పట్లో అదో రికార్డు. ఆ స్థాయికి రూపాయి విలువ పడిపోవడం అదే మొదటిసారి కావడంతో కలకలం రేగింది. మార్కెట్లో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. ఆర్థిక నిపుణులు రకరకాల విశ్లేషణలు చేశారు. అయితే, ఎన్నికల పబ్బాలను గడుపుకునే పనిలో ఉన్న మోదీ ప్రభుత్వానికి అప్పట్లో ఈ విషయమే పట్టలేదు. ఫలితంగా పతనంలో రూపాయి కొత్త రికార్డులు సృష్టించడం ప్రారంభమైంది.



రూపాయి విలువ ఈ స్థాయిలో పడిపోవడం ఆర్థిక నిపుణుల్లో కలకలం రేపింది. రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా దిద్దుబాటు చర్యలేవో చేపట్టింది కానీ, అవి ఏ మాత్రం ఫలితాలను సాధిస్తాయో వేచి చూడాల్సిందే. గత ఏడాది సెప్టెంబర్ నెల నుండి రూపాయి పతనం స్పష్టంగానే కనిపిస్తోంది. ఈ పతనం ఇంకొంత కాలం, ఇంకా హెచ్చుగా సాగే అవకాశాలే అధికం. అంటే ధరలు మరింత పెరగడం ఖాయం.

రూపాయి విలువ తగ్గిపోతోంది కాబట్టి మన జేబులో డబ్బు ఎక్కువగా ఖర్చు చెయ్యాల్సి వస్తోంది. గత పదేళ్లలో డాలర్‌తో రూపాయి మారకపు విలువ 25 శాతం పతనమైంది. అప్పట్లో 3వేల రూపాయలు ఉండే ఇంటి అద్దె ఇప్పుడు 15వేల రూపాయలు అయ్యింది. ఆ లెక్కన అప్పట్లో నెలకు రూ.10వేలు సంపాదించేవారు. ఇప్పుడు నెలకు దాదాపు రూ.50వేల దాకా సంపాదించాలి. ఆ స్థాయిలో సామాన్యుల వేతనాలు పెరుగుతున్నాయా? లేదు కదా కాబట్టి రూపాయి పతనం వల్ల నష్టపోతున్నది పేదలు, మధ్య తరగతివారు, సామాన్యులే. పదేళ్ల కిందట ఒక డాలర్ కోసం మనం 63 రూపాయలు చెల్లించాల్సి వచ్చేది. మరి ఇప్పుడు 85 రూపాయలు చెల్లించాల్సి వస్తోంది. ఇదివరకు కూరగాయలు కొంటే 100 రూపాయలకి సంచినిండేది, ఇప్పుడు 500 రూపాయలు పెట్టినా నిండట్లేదు. ఒక్క కూరగాయలే కాదు, ఇంట్లో వాడే ప్రతీ నిత్యావసరం ధరా పెరుగుతూనే ఉంటుంది.

ఈ పతనం ఇంకొంత కాలం, ఇంకా హెచ్చుగా సాగే అవకాశాలే అధికం. అంటే ధరలు మరింత పెరగడం ఖాయం. రూపాయి పతనం వల్ల పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు బాగా పెరుగుతాయి. మనం విదేశాల నుంచి చమురును ఎక్కువగా కొంటున్నాం, భారీగా చెల్లింపులు జరుపుతున్నాం కనుక విలువ ప్రభావం ఇక్కడ అధికంగా ఉంటుంది. మన నెలవారీ బడ్జెట్ ప్రతీ నెలా పెరుగుతూండటానికి ద్రవ్యోల్బణం కూడా కారణం. కోడిగుడ్డు ఒక రూపాయి నుంచి గత సంవత్సరం 5 రూపాయలు అయ్యింది. ఈ సంవత్సరం 7 రూపాయలు అయ్యింది. కోళ్ల దాణా, కరెంటు ఖర్చు, కూలీ వేతనాలు, నిర్వహణ ఖర్చులు, రవాణా ఖర్చులు ఇలా అన్నీ పెరుగుతూ గుడ్డు ధర కూడా పెరిగింది. ఇలా ఒకదానిపై ఒకటి ఆధారపడుతూ ధరలు పెరుగుతూనే ఉన్నాయి.

అమెరికాతో పోల్చితే ఇండియా చాలా వేగంగా వృద్ధి చెందుతున్న దేశం. అయినా రూపాయి పతనం కావడానికి కారణం డాలర్ అంతర్జాతీయ స్టాండర్డ్ కరెన్సీగా ఉండటమే. ప్రతీ దేశమూ విదేశాలతో వ్యాపారం డాలర్ల రూపంలో చేస్తున్నాయి. దాంతో డాలర్ విలువ పెరుగుతూనే ఉంది. మనం విదేశాలతో రూపీలో వాణిజ్యం చేస్తే మన కరెన్సీ కూడా బలపడగలదు. కానీ అమెరికా అందుకు అంగీకరించక, ఆంక్షల పేరిట భయపెడుతోంది. ఆసియాలో రూపీ రూపంలో వాణిజ్యం జరపాలనే డిమాండ్లు ఉన్నాయి. ఈ దిశగా అడుగులు పడితే మన కష్టాలు తీరగలవు. బ్రిక్ దేశాలు ఉమ్మడి కరెన్సీని ప్రవేశపెట్టి డాలర్‌కి చెక్ పెట్టాల్సిన టైమ్ వచ్చింది. ఇప్పటికైనా అడుగులు పడకపోతే, భారతీయులు మరింతగా నష్టపోతారు. మన ఎగుమతులను, ఉత్పాదకత సామర్థ్యాలను పెంచుకోవాల్సిన అవసరం ఉన్నది. ప్రభుత్వాలు ఉద్యోగ కల్పన, మౌలిక వసతుల కల్పనపై దృష్టి పెట్టాలి. దీంతో ఉత్పత్తి పెరిగి ఎగుమతుల ద్వారా విదేశీ మారక ద్రవ్యం ఆర్జించి రూపాయి స్థిరీకరణ చేయవచ్చు. దేశీయంగా ఎలక్ట్రానిక్స్ సంస్థలు నెలకొల్పి, ఉన్నవాటి సామర్థ్యాన్ని ఉత్పత్తిని పెంచి దేశీయ ఉత్పత్తిని ప్రోత్సహించాలి. దిగుమతుల్లో ప్రముఖపాత్ర వహిస్తున్న ఇంధన అవసరాల కోసం దేశీయ సంస్థల్ని పురికొల్పి, ఎక్కువ ఉత్పత్తిని సాధించాలి. ప్రత్యామ్నాయ ఇంధన వనరుల ఉత్పాదకతను పెంచడం ద్వారా స్వయం సమృద్ధి సాధించాలి.

● నాదెండ్ల శ్రీనివాస్

మధ్యతరగతి 'మన్మోహనం'!

డాక్టర్ మన్మోహన్ సింగ్ గత నెల 26న 92 ఏళ్ల వయసులో కీర్తిశేషుడు అయ్యారు. జూన్ 21, 1991న కేంద్ర ఆర్థిక మంత్రిగా డాక్టర్ సాబ్ ప్రమాణం చేసిన రోజు నుంచి ఆయనతో ఏర్పడ్డ నా అనుబంధం ముగిసిపోయింది.

మన్మోహన్ సింగ్ గురించి ఆయన మాటల్లోనే చెప్పాలంటే ఒక 'యాదృచ్ఛిక ఆర్థిక మంత్రి'. పీవీ నరసింహారావు తొలుత తన ఆర్థిక మంత్రిగా ప్రముఖ విద్యావేత్త, ఆర్థికవేత్త ఐ.జి.పటేల్‌ను నియమించేందుకు ప్రాధాన్యమిచ్చారు. అయితే పటేల్ నిరాకరించి, ఆ పదవికి డాక్టర్ మన్మోహన్ సింగ్ పేరును సూచించారు. నీలిరంగు తలపాగాతో, హుందాతనం ఉట్టి పడుతున్న ఒక సిక్కు పెద్ద మనిషి ముందు వరుసలో కూర్చొని ఉండడం చూసి ఎంతో మంది విస్మయం చెందారు. ఆ గౌరవనీయుడు కేబినెట్ మంత్రిగా పదవీ ప్రమాణం చేయనున్నారనేది స్పష్టమయింది. అయితే ప్రధానమంత్రి ఆయనకు ఏ మంత్రిత్వ శాఖ కేటాయించనున్నారు? అందరిలో ఆసక్తి, ఉత్కంఠ నెలకొన్నాయి. కొద్ది గంటలలోనే ఆయన నార్త్ బ్లాక్ (ఆర్థిక మంత్రిత్వశాఖ నెలవు)లో కనిపించారు.



■ పి. చిదంబరం

'పళని' పలుకు

జూలై 1, 1991న రిజర్వ్ బ్యాంక్ తొలి దశ రూపాయి విలువ తగ్గింపును ప్రకటించింది. జూలై 3 ఉదయం ప్రధానమంత్రి నన్ను తన కార్యాలయానికి పిలిచి, తన కేబినెట్ సహచరులు కొంతమంది రూపాయి విలువ తగ్గింపుపై వ్యక్తం చేసిన భయ సందేహాలు (నిజానికి ఇవి నరసింహారావువే) నాకు తెలిపారు. నేను పాత పాటే పాడాను. రూపాయి విలువ వాస్తవ విలువ కంటే అధికంగా ఉన్నదని, ఫలితంగా ఎగుమతులు దెబ్బ తింటున్నాయని, విదేశీ మారక ద్రవ్య నిల్వలు అడుగంటాయని, విదేశీ మదుపుదారులు మన దేశంలో పెట్టుబడులు పెట్టేందుకు జంకుతున్నారని వగైరా వగైరా చెప్పాను. రూపాయి విలువను మరొకసారి తగ్గించవలసి ఉన్నదని వివరిస్తూ ఆర్థికమంత్రి వద్దకు వెళ్లి రెండవ దశ రూపాయి విలువ తగ్గింపును నిలిపివేయడం సాధ్యం కానిపక్షంలో వాయిదా అయినా వెయ్యాలని ఆయన్ను అభ్యర్థించాలని నాకు చెప్పారు. పీవీ ఇలా మన్మోహన్ వద్దకు పంపుతున్న దూతను నేను ఒక్కడినే కాదన్న భావన నాలో నిశ్చితంగా ఏర్పడింది.

సంశయాగ్రస్తుడిని అయినప్పటికీ నార్త్ బ్లాక్‌కు వెళ్లాను. ఆర్థికశాఖ అధికారులు నన్ను సాదరంగా మంత్రి వద్దకు తీసుకువెళ్లారు. మన్మోహన్ సింగ్‌తో అదే నా మొదటి అధికారిక సమావేశం. ప్రధానమంత్రి సందేశాన్ని ఆయనకు తెలియజేశాను. అది ఆదేశం కానే కాదని, అభ్యర్థన మాత్రమేనని స్పష్టంగా చెప్పాను. ఆ సందేశం, బహుశా సందేశవాహకుడు విషయమై కూడా మన్మోహన్ దిగ్భ్రమ చెందినట్టు కనిపించారు. అది ఆయన ముఖంలో స్పష్టంగా ద్యోతకమయింది. నేను చెప్పింది ఆయన శ్రద్ధగా విని, రెండో దశ రూపాయి విలువ తగ్గింపు నిర్ణయాన్ని ఆ రోజు ఉదయం పది గంటలకు మార్కెట్లు ప్రారంభమైన కొద్ది నిమిషాలకే తీసుకోవడం జరిగిందని చెప్పారు. ఆర్బీఐ డిప్యూటీ గవర్నర్ డాక్టర్ సి. రంగరాజన్‌తో మన్మోహన్ ఎలా మాట్లాడిందీ, ఆయన మాటలకు ప్రతిస్పందనగా 'వెన్వెంటనే ఆ నిర్ణయాన్ని అమలుపరచనున్నట్టు' రంగరాజన్ చెప్పిన మాటలు ఇప్పుడు ఆ చరిత్రాత్మక నిర్ణయానికి సంబంధించిన గాథావళిలో భాగంగా ఉన్నాయని మరి చెప్పనవసరం లేదు. ఈ రూపాయి విలువ తగ్గింపు ఉదంతంతో యాదృచ్ఛిక ఆర్థికమంత్రి అయిన మన్మోహన్ సింగ్ ఎంత దృఢసంకల్పుడు అన్నది స్పష్టమయింది. తాను సరైనది అనుకున్న నిర్ణయాన్ని ఆయన ఎంత దీక్షా దక్షతలతో అమలుపరుస్తారో ఆ తొలిరోజుల్లోనే విశదమయింది.

మన్మోహన్ ఎంత దృఢసంకల్పుడో కొద్ది సంవత్సరాల అనంతరం ప్రభుత్వ మనుగడ ప్రమాదంలో పడినప్పుడు మరోసారి అందరికీ తెలిసివచ్చింది. ప్రతిపాదిత భారత్–అమెరికా పౌర అణు ఒప్పందానికి వామపక్షాల నుంచి ముఖ్యంగా సీపీఎం నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురయింది. అమెరికాతో ఆ ఒప్పందాన్ని ఖరారు చేసుకుంటే యూపీఏ ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరిస్తామని సీపీఎం ప్రధాన కార్యదర్శి ప్రకాశ్ కరత్ కటువుగా హెచ్చరించారు. ప్రధానమంత్రిని, ప్రతిపాదిత పౌర అణు ఒప్పందాన్ని సమర్థిస్తున్న కాంగ్రెస్ నాయకులు పలువురు ఆ ఒప్పందం కోసం ప్రభుత్వాన్ని త్యాగం చేయవలసి రావడం పట్ల అభ్యంతరాలు తెలిపారు. ప్రభుత్వం మెజారిటీని కోల్పోతే ఆ ఒప్పందం సైతం రద్దయిపోతుంది కదా అని వారు వాదించారు. అయినప్పటికీ మన్మోహన్ సింగ్ దృఢవైఖరితో నిలబడ్డారు. ఆ ఒప్పందాన్ని త్యజించాలని కాంగ్రెస్ పార్టీ స్పష్టం చేస్తే మన్మోహన్ ప్రధానమంత్రి పదవి నుంచి వైదొలగవలసివస్తుందనేది స్పష్టం. మన్మోహన్ వాదన సబబైనదని నేను విశ్వసించాను. ఈ కారణంగా ఇతర పార్టీల నుంచి మద్దతు తీసుకునే అవకాశాలను అన్వేషించాలని ఆయనకు సూచించాను. ఈ విషయంలో ఆయన చాలా తెలివిగా వ్యవహరించారు. తొలుత ప్రతిపాదిత అణు ఒప్పందాన్ని సమర్థిస్తూ ఒక ప్రకటన చేయాలని మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాంకు మన్మోహన్ నచ్చచెప్పారు. కలాం ప్రకటన ఆలంబనతో ములాయంసింగ్ యాదవ్, సమాజ్‌వాది పార్టీ మద్దతును సాధించగలిగారు. ములాయం మద్దతుతో వామపక్షాల దబాయింపులను మన్మోహన్ గట్టిగా ఎదుర్కొన్నారు. లోక్‌సభలో విశ్వాస పరీక్షలో విజయం సాధించారు. దీంతో భారత్–అమెరికా పౌర అణు ఒప్పందం ఆమోదానికి అవరోధాలు పూర్తిగా తొలగిపోయాయి. కాంగ్రెస్‌కు వామపక్షాలు తమ మద్దతును ఉపసంహరించుకున్న తరువాత మన్మోహన్ తన స్వతస్సిద్ధ స్వభావానికి అనుగుణంగా ఆ పార్టీ నాయకులను ఎప్పటిలాగానే అమితంగా గౌరవించారు. వారితో సుహృద్భావపూర్వక సంబంధాలు కొనసాగించారు.



మన్మోహన్ సింగ్ పట్ల చరిత్ర కరుణ చూపినా చూపకపోయినా దేశ చరిత్రపై ఆయన ముద్ర ప్రగాఢమైనది. నవ భారతదేశ చరిత్రలో ఆయన అడుగు జాడలు అజరామరమైనవి. స్థూల దేశీయోత్పత్తి సగటు వృద్ధిరేటు 6.8 శాతంగా ఉండడం, 27 కోట్ల మంది భారతీయులు పేదరికం నుంచి విముక్తం చేయడం ఆయన పాలన సాధించిన అపూర్వ ఆర్థిక విజయాలు.

మన్మోహన్ సింగ్ సంపూర్ణ మద్దతులేని పక్షంలో వివిధ ప్రజా సంక్షేమ పథకాలు, కార్యక్రమాలను యూపీఏ ప్రభుత్వాలు రూపొందించి, అమలుపరచడం సాధ్యమయ్యేది కాదన్న వాస్తవం చాలా కొద్దిమందికి మాత్రమే తెలుసు. ముఖ్యంగా రెండు పథకాలను ప్రత్యేకంగా ప్రస్తావించవలసి ఉన్నది. అవి: వ్యవసాయ రుణాల మాఫీ (2008), ఆహార హక్కు కార్యక్రమం (2013). ఈ రెండు సంక్షేమ కార్యక్రమాలను మన్మోహన్ చాలా గట్టిగా సమర్థించారు. వాటి ఆవశ్యకత విషయమై శక్తిమంతమైన వాదనలు చేశారు. వాటి అమలు ప్రభావం ద్రవ్యలోటుపై ఎలా ఉంటుందనే విషయాన్ని జాగ్రత్తగా గమనిస్తుండాలని నాకు ఆయన సూచించారు. స్థూల ఆర్థిక వ్యవస్థలో స్థిరత్వం లేని పక్షంలో ఏ సంక్షేమ కార్యక్రమాన్నీ అమలుపరచడం సాధ్యంకాదన్న వాస్తవాన్ని ఆయన సదా గుర్తుంచుకునేవారు. ఈ ఆర్థిక పరిజ్ఞానం విషయంలో ఆయనకు సాటివచ్చే రాజకీయవేత్త మరెవరూ లేరు. ద్రవ్యలోటు భర్తీ లక్ష్యాలను పరిపూర్తి చేసినప్పుడే సంక్షేమ కార్యక్రమాలకు ఆయన ఆమోదం తెలిపేవారు. డాక్టర్ మన్మోహన్ సింగ్ స్వాభావికంగా సంస్కర్త అయినప్పటికీ పేదల శ్రేయస్సును ఎట్టి పరిస్థితులలోను విస్మరించేవారు కాదు. సంక్షేమ పథకాలను ఆయన ఎంతగానో ప్రోత్సహించారు ఆర్థిక సంస్కరణలు సంక్షేమ చర్యలు ఏక సమయంలో అమలుకావలసిన అవసరం ఎంతైనా ఉందనే విషయాన్ని ఆయన మాకు బోధించారు. మన్మోహన్ సింగ్ ఆర్థిక విధానాలు వర్తమాన మధ్యతరగతిని సృష్టించాయని నేను దృఢంగా విశ్వసిస్తున్నాను.

1991 తరువాత జన్మించిన వర్తమాన తరం వారు మన దేశంలో ఒకప్పుడు ఒకటే టెలివిజన్ ఛానెల్, ఒకే ఒక్క బ్రాండ్ కారు, ఒకటే పౌర విమానయాన సంస్థ, ఏకైక టెలిఫోన్ సర్వీస్ ప్రొవైడర్ ఉండేవని చెప్పితే నమ్మరేమో కదా?! ట్రంక్ కాల్స్, పీసీఓ/ఎస్టీడీ/ఐఎస్‌డీ బూత్‌లతో ప్రజలు సతమతమవుతుండేవారని; టూ వీలర్స్ నుంచి రైలు టిక్కెట్ల దాకా అన్నిటికీ నిరీక్షించే వారి జాబితా కొండవీటి చాంతాడంత పొడుగున ఉండేదన్న వాస్తవాలు వారికి నమ్మశక్యంగా ఉండవనడంలో అతిశయోక్తి లేదు. మన జీవన రీతులలో మహా ఆశ్చర్యకరమైన మార్పులకు బీజాలు వేసింది డాక్టర్ మన్మోహన్ సింగ్. అయితే ఈ చారిత్రక వాస్తవాన్ని ఆ నవ్య పథ నిర్దేశకుడికి తన నివాళితో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర కేబినెట్ తీర్మానంతో భారత ప్రభుత్వమూ ఆలస్యంగా అంగీకరించాయి.

మన్మోహన్ సింగ్ పట్ల చరిత్ర కరుణ చూపినా చూపక పోయినా దేశ చరిత్రపై ఆయన ముద్ర ప్రగాఢమైనది. నవ భారతదేశ చరిత్రలో ఆయనవి అయిన రెండు అడుగు జాడలు అజరామరమైనవి. ఒకటి– తన పది సంవత్సరాల ప్రధానమంత్రిత్వ కాలంలో స్థూల దేశీయోత్పత్తి సగటు వృద్ధిరేటు 6.8 శాతంగా ఉండేలా చేయడంలో ఆయన అనితర సాధ్యంగా సఫలమయ్యారు; రెండు– యుఎన్‌డీపీ (ఐక్యరాజ్యసమితి అభివృద్ధి కార్యక్రమం) ప్రకారం యూపీఏ ప్రభుత్వాలు తమ పదేళ్ల పాలనా కాలంలో 27 కోట్ల మంది భారతీయులను పేదరికం నుంచి విముక్తం చేశాయి. ఈ ఆర్థిక విజయాలు మన దేశ చరిత్రలో అపూర్వమైనవి. మన్మోహన్ అనంతరం అధికారంలో ఉన్న ప్రభుత్వాలు వాటికి సరిసమానమైన వాటిని సాధించలేకపోయాయి. చరిత్ర ఇప్పటికే తీర్పు ఇచ్చింది. ఆ తీర్పు శాశ్వతమైనది.

కేశవరావు జాదవ్ స్మారక చిహ్నాలు నెలకొల్పాలి

ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారికి...

తెలంగాణ రాష్ట్రానికి కాంగ్రెస్ పార్టీ పక్షాన తొలి ముఖ్యమంత్రిగా మీరు అధికారంలోకి వచ్చి రాగానే మాది ప్రజా ప్రభుత్వమని ప్రకటించి ఏడాది కావస్తోంది. ఈ మధ్య కోఠి మహిళా యూనివర్సిటీకి తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ పేరు పెట్టడం హర్షణీయం. కానీ నిఖార్సయిన తెలంగాణ ఉద్యమకారుడిగా, మిస్టర్ తెలంగాణగా ప్రజల మన్ననలు పొందిన ప్రొఫెసర్ కేశవరావు జాదవ్ (1933– 2018)ను గత ప్రభుత్వం విస్మరించింది. అది సబబు కాదని భావిస్తూ జనవరి 27, 2025న ఆయన 92వ జయంతి నాటికి తెలంగాణలో ఆయన స్మారక చిహ్నాలు నెలకొల్పి, కేశవరావు జాదవ్ జీవితాన్ని పాఠ్యాంశంగా పెట్టాలని తమరికి విజ్ఞప్తి చేస్తున్నాం.



దేశ–విదేశీ సమున్నత విలువలను, సంస్కృతులను తనలో ఇముడ్చుకున్న హైదరాబాద్ రాష్ట్రానికి ఆయన ప్రతీక. హైదరాబాదీ మాటతీరుకు, తెలంగాణ గంగా–జమున తెహజీబ్‌కు ప్రతినిధిగా పెరిగి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్న గర్వంతో కనుమూసిన జాదవ్ సార్ వలస విముక్త నవ తెలంగాణ గురించి కన్న కలలు ఇంకా నెరవేరలేదు. అందుకే ఆయన జీవితం తెలంగాణ యువతి–యువకులను సదా జాగృతపరిచేలా ఒక పాఠ్యాంశంగా ఉండాలని మా విజ్ఞప్తి, డిమాండ్ కూడా. జనవరి 27, 1933లో హైదరాబాద్‌లోని హుస్సేనీ ఆలంలో జన్మించిన కేశవరావు జాదవ్ జీవితమంతా హైదరాబాద్‌లోనే గడిచింది. తన జీవిత కాలంలో 1946–51 వరకు కొనసాగిన తెలంగాణ సాయుధ పోరాటాన్ని, 1952 ముల్కీ ఉద్యమాన్ని, 1969 నుండి సాగిన తెలంగాణ రాష్ట్ర సాధన పోరాటాన్ని, నక్సలైట్ ఉద్యమాన్ని, హక్కుల ఉద్యమాన్ని ప్రత్యక్షంగా గమనించాడు. వీటన్నింటిలో ఆయన ప్రత్యక్ష, పరోక్ష భాగస్వామ్యం పొంది తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమానికి కేంద్ర బిందువుగా మారాడు. తెలంగాణ ఉద్యమానికి సైద్ధాంతిక భూమిక అందించడంలో అంతర్గత వలస సూత్రీకరణ అనేది మలిదశ ఉద్యమానికి పునాది. ఆ భావ ప్రచారంలో కేశవరావు జాదవ్‌ది కీలక పాత్ర.

జాదవ్‌ను స్మరించుకోవడమంటే గంగా–జమునా తెహజీబ్‌ను, వలస విముక్త నవ తెలంగాణను, సామాజిక న్యాయాన్ని, తెలంగాణ ఆత్మగౌరవాన్ని గుర్తు చేసుకోవడం. అందుకే ఈ ప్రతిపాదనలను మీ ముందు పెడుతున్నాం, ఆమోదించమని కోరుతున్నాం. 1. ప్రొ. కేశవరావు జాదవ్ జీవితాన్ని విద్యార్థులకు పాఠ్యాంశంగా పెట్టాలి. 2. ఆయన ఎక్కువ కాలం ఇంగ్లీష్ ప్రొఫెసర్‌గా పనిచేసిన ఉస్మానియా ఇంజనీరింగ్ కళాశాలకు జాదవ్ పేరు పెట్టాలి. 3. ఆయన జన్మించిన హుస్సేనీ ఆలంలో, ఉస్మానియాలో, 10 పాత జిల్లా కేంద్రాల్లో ఆయన విగ్రహాలు నెలకొల్పాలి. 4. హుస్సేన్ సాగర్ తీరంలో ప్రొ. కేశవరావు జాదవ్ స్మృతి వనం ఏర్పర్చాలి.

– విమలక్క, కపిలవాయి దిలీప్ కుమార్, ఎస్. జీవన్ కుమార్, చంద్రశేఖర్ (న్యాయవాది), ప్రొ. లక్ష్మణ్, టి. హన్మాండ్లు, ఆచార్య కట్టా భగవంత్ రెడ్డి, దూసరి రాజుగౌడ్, పాశం యాదగిరి,

'పాలమూరు–డిండి'.. అనాలోచిత ప్రతిపాదన

శ్రీశైలం ప్రాజెక్టు లోపలి నుంచి చేపట్టిన కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలాగా, జూరాల ప్రాజెక్టు లోపలి నుంచి షాద్‌నగర్ ఎత్తిపోతల పథకం చేపట్టాలని, తద్వారా మహబూబ్‌నగర్ పార్లమెంటు పరిధి ఎగువ ప్రాంత భూములు సాగు భూములై ప్రజాజీవనం బాగుపడుతుందని బలమైన ఉద్యమాలు నిర్మించాం. ఆ పథకమే తరువాతి రోజుల్లో పాలమూరు– రంగారెడ్డి ఎత్తిపోతలగా ప్రాచుర్యం పొందింది. తెలంగాణ ఉద్యమం జరిగిన 1994–2014 మధ్యలో ఎన్నడూ పాలమూరు–డిండి ఎత్తిపోతల చర్చ లేనే లేదు. కేవలం ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పూర్తి చేసి, శ్రీశైలం ఎడమ కాలువలో పారించాలని, అప్పుడు ఎలిమినేటి మాధవరెడ్డి ఎత్తిపోతల (ఏఎంఆర్) నీటిని నీటి వసతి లేని నల్లగొండ జిల్లా ఎగువ ప్రాంతానికి ఇవ్వాలని చర్చ జరిగేది. ఈ చర్చను తప్పుదారి పట్టించే విధంగా ఎస్ఎల్‌బీసీ నీటిని మన్నెవారిపల్లి నుంచి... అంటే అక్కడ నిర్మించే ప్రాజెక్టును లోయర్ డిండి అని, డిండి దిగువన మధ్యలో ఒక రిజర్వాయర్ నిర్మించి దానిని మిడ్ డిండి అనాలని, ప్రస్తుత డిండి భారీగా పెంచి అప్పర్ డిండి అనాలని ఒక ప్రతిపాదన తెచ్చారు. ఎడమ కాలువలో పారే గ్రావిటీ నీటిని మరోవైపు ఎత్తిపోసి గ్రావిటీ కాలువను ఎత్తిపోతల కాలువగా ఏఎంఆర్ లిఫ్టుతో ఎల్లకాలమూ ఉపయోగించుకోవాలనే ప్రతిపాదనను ఆ కాలువ కింది నాయకత్వం తీవ్రంగా వ్యతిరేకించింది. అవసరమైతే ఏఎంఆర్ నీటినే ఎటైనా తరలించుకోవచ్చునని చెప్పింది. దీనికి మహబూబ్‌నగర్‌లో అడ్డంకులు రాకూడదని అమ్రాబాద్ ఎత్తిపోతలతో మరో ప్రతిపాదన తెచ్చారు. అసలు డిండి ఎత్తు పెంచి కొత్తగా పన్నెండు గ్రామాలు ముంచే ఆలోచనను మహబూబ్‌నగర్ రైతాంగం తీవ్రంగా వ్యతిరేకించడంతో వెనక్కి తగ్గారు.

ఇంతలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతలను జూరాల నుంచి శ్రీశైలం ప్రాజెక్టు వైపు మార్చడంతో అనేక లోపాయకారీ ఆలోచనలతో పాలమూరు–రంగారెడ్డి పథకాన్ని నిర్వీర్యం చేసే విధంగా పాలమూరు–డిండి ప్రతిపాదన ముందుకు తెచ్చారు. భిన్నమైన ఆలోచనలతో ఏడుసార్లు, ఏడు విధాలుగా ఒకే సర్వే కంపెనీతో సర్వే చేయించారు. ఆ సర్వేల మీద, ఆ సర్వే కంపెనీ మీద, ప్రజానిధుల దుర్వినియోగం మీద చాలా చర్చ జరిగింది. అయినా పాలమూరు–డిండి పేరుతో నల్లగొండ జిల్లాలో సింగరాజుపల్లి, గొట్టిముక్కల, చింతపల్లి, కిష్టరాంపల్లి, శివన్నగూడెం రిజర్వాయర్ల పనులు చేపట్టారు. మహబూబ్‌నగర్‌లో ఇర్విన్ పనులు ప్రారంభించారు. ఎర్రవల్లి–గోకారం, ఉల్పర రిజర్వాయర్ల పనులను రైతాంగం అడ్డుకున్నారు. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకపు నీటిని నార్లాపూర్ నుంచి తరలించాలనే ప్రతిపాదనను వ్యతిరేకించారు. దాంతో నేరుగా శ్రీశైలం నుండి ప్రత్యేక లిఫ్టుతో నీరు తరలించే ప్రతిపాదన తెచ్చారు.

పాలమూరు–డిండి ఆలోచనను మూడు కారణాలతో మహబూబ్‌నగర్ రైతాంగం, ప్రజాసంఘాలు, పార్టీలు, ప్రజాప్రతినిధులు ముక్తకంఠంగా వ్యతిరేకించారు. 1) నీటిని తరలించవద్దని. 2) ఇప్పటికే కల్వకుర్తి, శ్రీశైలం, పాలమూరు–రంగారెడ్డి పథకాలకు భూములు కోల్పోయిన రైతులు తమకు మిగిలిన కొద్దిపాటి ఆయకట్టును ముంచుకుని, నిర్వాసితులు కావడానికి సిద్ధంగా లేరని. 3) నల్లగొండ జిల్లా అవసరాలకు నీరు తీసుకోవడానికి ఆ జిల్లాలో అవకాశం ఉన్నప్పుడు ఇప్పటికే వెనుకకు నెట్టిన మహబూబ్‌నగర్ ప్రజల జీవితాలతో ఆడుకునే అవసరం లేదన్నవి ఆ కారణాలు. తీవ్ర చర్చోపచర్చలు, ఉద్యమాల క్రమంలో అప్పటి అధికార పార్టీ టీఆర్ఎస్ ప్రతినిధులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఆ ప్రతిపాదన మానుకొమ్మని, దానితో కలిగే నష్టాలు వివరిస్తూ మంత్రి జూపల్లి కృష్ణారావు లెటర్ హెడ్‌తో ఫిబ్రవరి 22, 2016న లేఖ రాశారు. కల్వకుర్తి ఎమ్మెల్యే వంశీచంద్‌రెడ్డి అసెంబ్లీలో ప్రశ్నించారు. అప్పటి కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ప్రజాసంఘాలతో కలిసి పాలమూరు అధ్యయన వేదిక నిర్వహించిన ధర్నాలకి నాయకత్వం వహించి, పాల్గొన్నారు. ఈ పథకం అమలు జరగదని అసెంబ్లీలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించారు. తెలంగాణ రిటైర్డ్ ఇంజినీర్స్ ఫోరం మోక్షగుండం విశ్వేశ్వరయ్య హాల్‌లో సమావేశమై ఈ పథకం అనర్థాలపై తీర్మానం చేసింది.



నేడు రాష్ట్ర మంత్రివర్గ సమావేశం పాలమూరు–డిండి ఎత్తిపోతలను ఆమోదిస్తుందని వింటున్నాం. అలా జరగకూడదు. తెలిసి అన్యాయం చేస్తుంటే తమ పదవుల కోసం లీడర్లు ఊరుకుంటారేమో కానీ, ప్రజాపక్ష పార్టీలు, ప్రజాస్వామికవాదులు ఊరుకోరు.


ఈ చరిత్రనంతా వదిలేసి ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మరోసారి పాలమూరు–డిండి ప్రతిపాదన ముందుకు తెచ్చింది. కాంగ్రెస్ పార్టీలోను, ఆ పార్టీ ప్రజాప్రతినిధుల మధ్య అంతర్గత అవగాహన ఏమిటో కానీ, మహబూబ్‌నగర్ జిల్లా నుంచి ఒక శాసనసభ్యుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆ ప్రతిపాదన మరింత దూకుడుగా ముందుకు రావడం చారిత్రక విషాదం మాత్రమే కాదు. తీవ్రమైన అన్యాయం. దీనితో మహబూబ్‌నగర్‌ను చెదరగొట్టి కొత్తగా ఏర్పరచిన ఏడు జిల్లాలు, 14 శాసనసభ నియోజకవర్గాలు ఘోరంగా నష్టపోతాయి. పక్కన రంగారెడ్డి జిల్లాకు తీరని ద్రోహం జరుగుతుంది.

నిజానికి నీళ్ల కోసమే మహబూబ్‌నగర్ జిల్లా మూడు దశాబ్దాల క్రితం 1994లో తెలంగాణ ఉద్యమంలోకి దిగింది. 2005లో కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా 1–2, కోయిల్‌సాగర్ పథకాల పనులు మొదలవటం వెనుక కరువు, వలసలు, ఆత్మహత్యలే కాదు, నిరంతరం సాగిన పోరాటాలు, త్యాగాలున్నాయి. 2012లో లిఫ్టులు పనిచేయటం ప్రారంభమైనా అవసరానికి తగ్గ పంపులు కానీ, కాలువల సామర్థ్యం కానీ, కేటాయింపులు ప్రకటించిన మేరకైనా నీరు నిలిపే వ్యవస్థలు కానీ లేవు. ఆయకట్టు నిర్ధారణ చేయలేదు. నీటి నిర్వహణ లేదు. ఏ సంవత్సరంలోను మూడోవంతు నీరు తీసుకోలేదు. వాస్తవ పరిస్థితులు ఏ ప్రభుత్వమూ ప్రజలకు చెప్పలేదు. అబద్ధపు ప్రచారాలతో వాస్తవాలను కప్పిపుచ్చారు. మహబూబ్‌నగర్ కరువు, వలసలు, నీటి ఎద్దడికి పాటలు కట్టి సాగిన తెలంగాణ ఉద్యమం గెలిచిన తరువాత కళాత్మకంగా జిల్లాను వంచనకు బలి చేస్తున్నారు.

ఈ విమర్శను నల్లగొండ జిల్లా భూములకి, ప్రజలకి వ్యతిరేకమైన చర్చగా చూసే ఎవరికైనా సమస్య అర్థం కాదు. ఏడు దశాబ్దాలుగా తీవ్ర నీటి ఎద్దడికి, విధ్వంసానికి గురైన జిల్లాలకు న్యాయం చేయవలసిన సమయం, అందుకు అవసరమైన అధికారం వచ్చిన తరువాత కూడా ప్రభుత్వాలే చేస్తున్న అన్యాయంగా పరిశీలించాలని తెలంగాణ సమాజానికి విజ్ఞప్తి చేస్తున్నాం.

నేడు రాష్ట్ర మంత్రివర్గ సమావేశం పాలమూరు–డిండి ఎత్తిపోతలను ఆమోదిస్తుందని వింటున్నాం. అలా జరగకూడదు. ఎందుకంటే 1950ల నాటి రాజోలిబండ మళ్లింపు పథకం శిథిల సమాధిగా మారింది. ఆంధ్రకు నీరు తరలించే సుంకేశులను పాలకులు ఆధునిక ప్రాజెక్టుగా మార్చారు. 2005లో ప్రారంభించి అరకొరగా పూర్తిచేసిన పథకాలు నిర్వహణ లోపాలతో అసంపూర్తిగా శిథిలమైపోతున్నాయి. పాలమూరు–రంగారెడ్డి పథకం పేరుతో ఎత్తిపోసే నీటిని రోజుకు టీఎంసీ చొప్పున అయిదువేల క్యూసెక్కులకు పైగా తరలించిన తరువాత మిగిలే నీళ్లు కూడా ఉండవు. ఈ నిజం ప్రజలకన్నా ప్రభుత్వాలకే బాగా తెలుసు. తెలిసి అన్యాయం చేస్తుంటే తమ పదవుల కోసం లీడర్లు నోరు మూసుకుంటారేమో కానీ, ప్రజాపక్ష పార్టీలు, ప్రజాస్వామికవాదులు ఊరుకోరు.

■ ఎం. రాఘవాచారి
పాలమూరు అధ్యయన వేదిక



ఇష్టారీతిన తిష్ట!



వరంగల్ మెడికల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో డిప్యూటేషన్ల దందా యథేచ్ఛగా కొనసాగుతోంది. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అక్రమ పదోన్నతులు, డిప్యూటేషన్లతో అస్తవ్యస్తంగా మారింది. గ్రామీణ ప్రాంతాల్లో జాతీయ ఆరోగ్య కార్యక్రమాలన్నీ కుంటుపడిపోయాయి. అంకెలగారడీతో అంతా మాయ చేస్తున్నట్లు సమాచారం. ఏ ప్రభుత్వ జిల్లా కార్యాలయంలో కూడా ఇంత మందిని డిప్యూటేషన్‌పై కొనసాగించిన దాఖలాలు లేవని సహచర ఉద్యోగులే విస్తుపోతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోని అన్ని కేడర్ల ఉద్యోగులు ఖాళీ అయిపోతున్నారు. ఇష్టారాజ్యంగా డిప్యూటేషన్ల వల్ల ఆరోగ్య కార్యక్రమాల పనులు పూర్తిగా స్తంభించిపోయాయి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రసూతి సేవలకు కూడా అంతరాయం ఏర్పడుతోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఇంత పెద్ద మొత్తంలో జరిగిన డిప్యూటేషన్లపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

సాంక్షన్డ్ పోస్టుల కంటే అదనంగా..

హనుమకొండ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో డీఎంహెచ్‌వో నుంచి మొదలుకొని నాలుగో తరగతి ఉద్యోగి వరకు ఎంత మంది విధులు నిర్వర్తించాలో ప్రభుత్వం ఆ పోస్టులను సాంక్షన్ చేస్తుంది. వీరితోనే కార్యాలయంలో పని చేయించుకొని జిల్లాను ఆరోగ్య కార్యక్రమాల అమలులో ముందు ఉంచాల్సి ఉంటుంది.

గ్రామం వద్దు.. పట్టణం ముద్దు..

జిల్లావ్యాప్తంగా ఉన్న వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్లు, ఎంపీహెచ్‌వోలు, సీహెచ్‌వోలు, ఆడ, మగ హెల్త్ సూపర్‌వైజర్లు, నర్సింగ్ ఆఫీసర్లు, నర్సింగ్ సూపర్ వైజర్లు, ల్యాబ్ టెక్నీషియన్లు, హెల్త్ అసిస్టెంట్లు, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు తదితర ఉద్యోగులు గ్రామీణ ఆరోగ్య వికాసం కోసం పని చేయాల్సి ఉంటుంది. మాతా, శిశు ఆరోగ్యం, జాతీయ కీటక జనిత వ్యాధుల నియంత్రణ, సంక్రమిత వ్యాధులు, అసంక్రమిత వ్యాధులు లాంటి అనేక కార్యక్రమాల అమలులో క్షేత్రస్థాయిలో సిబ్బంది కీలకంగా ఉంటారు. వీరితోనే గ్రామీణ ప్రజల ఆరోగ్యం ముడిపడి ఉంటుంది. జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలులో క్షేత్రస్థాయి సిబ్బంది కీలకంగా వ్యవహరించాల్సి ఉంటుంది. ఇలా కీలకమైన విధులు నిర్వర్తించాల్సిన వారు ప్రధాన కార్యాలయంపై కన్నేస్తున్నారు.

రూ.30వేలు కొట్టు.. చోటు పట్టు..

రూ.30వేలు తీసుకొని హనుమకొండ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో అక్రమంగా డిప్యూటేషన్లు ఇస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఇష్టారాజ్యంగా ఇస్తున్న అక్రమ డిప్యూటేషన్లు జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలుకు అడ్డంకిగా మారాయి. ప్రభుత్వం సాంక్షన్ చేసిన పోస్టుల కంటే రెట్టింపు సంఖ్యలో డిప్యూటేషన్లు ఇవ్వడంపై ఆ శాఖ ఉద్యోగులే బాహాటంగా విమర్శిస్తున్నారు. గ్రామీణ వైద్యాన్ని కుప్పకూలుస్తున్నారని విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఎవరు, ఎక్కడ డిప్యూటేషన్‌పై ఉన్నారో, ఎంతమంది ఉన్నారో.. ఆ శాఖ ఉన్నతాధికారికే తెలియకపోవడంపై విస్మయం వ్యక్తం అవుతోంది.

- డీఎంహెచ్‌వో కార్యాలయంలో డిప్యూటేషన్ల హవా
- పల్లెల నుంచి జిల్లా కేంద్రంలో పోస్టింగ్ కోసం ఆసక్తి
- రూ.30వేలతో పోస్టింగ్ వేయించుకున్నట్లు ఆరోపణలు
- ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోతున్న ఉద్యోగులు
- గ్రామాల్లో సిబ్బంది లేక పడకేస్తున్న పల్లె వైద్యం
- కలెక్టర్ చొరవ తీసుకోవాలని సిబ్బంది విజ్ఞప్తి

అంతా మాయ

డిప్యూటేషన్ సిబ్బంది ప్రధాన కార్యాలయంలో ఏ విధులు నిర్వర్తిస్తున్నారో తెలియని అయోమయ పరిస్థితి నెలకొని ఉన్నది. డిప్యూటేషన్‌లో పని చేస్తున్న ఉద్యోగులు.. వాళ్ల విధులు ఏమిటో కూడా ఎవరికీ అర్థం కావడం లేదు. ఆఫీసుకు రావడం.. కనబడి తిరిగి ఇంటికి వెళ్లడం.. దినచర్యగా మారినట్లు తెలుస్తోంది. కొందరు డిప్యూటేషన్ ముసుగులో రియల్ ఎస్టేట్ దందా, ప్రయివేట్ వ్యాపారాలు నిర్వహిస్తున్నట్లు ఆశాఖ ఉద్యోగులే గుసగుసలాడుకుంటున్నారు.

ఇవిగో సాక్షాలు

కమలాపూర్, వంగర, భీమదేవరపల్లి, హసన్‌పర్తి, ధర్మసాగర్, కడిపికొండ లాంటి ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లోని హాజరు పట్టికను గమనిస్తే అనేక మంది ప్రధాన కార్యాలయానికి డిప్యూటేషన్‌పై వెళ్లినట్లు స్పష్టంగా అర్థమవుతోంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోని హెడ్ క్వార్టర్ సిబ్బందితోపాటు క్షేత్రస్థాయి సిబ్బంది కూడా డిప్యూటేషన్ల బాటనే పట్టారు. ప్రతీ అర్బన్ హెల్త్ సెంటర్‌లో కూడా ఆయా పోస్టులు లేకున్నప్పటికీ అక్రమంగా డిప్యూటేషన్‌పై కొనసాగుతున్న వారి సంఖ్య అధికంగానే ఉన్నట్లు సమాచారం. వీరు ఎలాంటి విధులు నిర్వర్తించకుండానే నెలనెలా జీతం పొందుతున్నట్లు సమాచారం. ఏ ఉద్యోగికి కూడా నెలవారి ప్రగతి నివేదిక లేనట్లు తెలిసింది. అయినప్పటికీ జీతాలు చెల్లించడం పట్ల పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయాన్ని గాడిలో పెట్టాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

అక్రమ పదోన్నతులు

హనుమకొండ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో నాలుగో తరగతి ఉద్యోగులకు జూనియర్ అసిస్టెంట్ పదోన్నతులు ప్రభుత్వ అనుమతి లేకుండానే కల్పించారని ఆరోపణలు వస్తున్నాయి. అదే విధంగా కారుణ్య నియామకాల కింద జిల్లా కలెక్టర్ అనుమతి లేకుండానే జూనియర్ అసిస్టెంట్ పోస్టులు మొత్తం నింపినట్లు సమాచారం. అయితే ఈమధ్య కాలంలో తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ నుంచి ఆరుగురు జూనియర్ అసిస్టెంట్లు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖకు కేటాయించబడ్డారు. ఈ కార్యాలయంలో పోస్టులు ఖాళీ లేకపోవడం వల్ల వారికి మాయమాటలు చెప్పి మరో డిపార్ట్‌మెంట్‌కు వెళితే భవిష్యత్ చాలా బాగా ఉంటుందని చెప్పి పంపించినట్లు సమాచారం. వీరిలో ఒకరిద్దరు మాత్రం 'మేము ఎక్కడికి వెళ్లం.. ఇదే శాఖలో ఉంటాం..' అని విధుల్లో చేరారు. ఇంతవరకు వారికి జీతాలు చెల్లించలేనట్లు తెలుస్తోంది. కొత్తగా చేరిన టీఎస్‌పీఎస్‌సీ వారికి సీట్లు ఖాళీ లేకపోవడంతో జీతాలు చెల్లింపులో సాంకేతిక సమస్య ఏర్పడినట్లు తెలిసింది. ప్రభుత్వ అనుమతి లేకుండానే జూనియర్ అసిస్టెంట్ పోస్టులు నింపడం వల్ల ఈ సమస్య ఏర్పడినట్లు ఆ శాఖ ఉద్యోగులు విమర్శిస్తున్నారు.



శిక్షణ కానిస్టేబుళ్ల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న తరుణ్ జోషి

పోలీస్ అంటే ఉద్యోగం కాదు.. కర్తవ్యం

- ప్రతీ సంఘటనను ఒక చాలెంజ్‌గా తీసుకోవాలి
- నిస్వార్థంగా ప్రజా సేవకు అంకితం కావాలి
- ప్రజల ప్రాణరక్షణే మన లక్ష్యం అవ్వాలి
- సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కోవాలి
- ఏసీబీ రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ తరుణ్ జోషి
- శిక్షణ పూర్తిచేసుకున్న 453 మంది కానిస్టేబుళ్లు
- అట్టహాసంగా దీక్షాంత్ పాసింగ్ పరేడ్

7

రేపు హనుమకొండలో

'ఆంధ్రజ్యోతి - ఏబీఎన్' ముత్యాల ముగ్గుల పోటీలు

హనుమకొండ టౌన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి సందర్భంగా ప్రతీ సంవత్సరం లాగే ఈ ఏడాది కూడా 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' సంతూర్ ముత్యాలముగ్గుల పోటీలను నిర్వహిస్తోంది. ఆదివారం హనుమకొండ కొత్త బస్టాండ్ రోడ్డులోని ప్రభుత్వ కాకతీయ డిగ్రీ కళాశాల (కేడీసీ) మైదానంలో ఉదయం 9 గంటల నుంచి 12గంటల వరకు ఈ పోటీలు జరగనున్నాయి. ఆంధ్రజ్యోతి-ఏబీఎన్. సంతూర్ ముత్యాలముగ్గుల పోటీలు గార్డెనింగ్ పార్ట్‌నర్ క్రాఫ్ట్ వారి పర్‌ఫెక్ట్, ఫ్యాషన్ పార్ట్‌నర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) సౌజన్యంతో మహిళల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు నిర్వహిస్తున్న ఈ పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న మహిళలు 9985401515, 9849336896లలో సంప్రదించొచ్చు. జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతిగా రూ.6వేలు, ద్వితీయ బహుమతిగా రూ.4వేలు, తృతీయ బహుమతిగా రూ.3వేలు అందజేయనున్నారు. పోటీల్లో పాల్గొన్న ప్రతీ మహిళకు ప్రోత్సాహక బహుమతి ఉంటుంది.



మాట్లాడుతున్న టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు

కొత్త రుణాలు మంజూరు చేయండి

- రికవరీ లక్ష్యాలు వంద శాతం సాధించాలి
- డిపాజిట్లపై విస్తృత ప్రచారం జరపాలి
- రుణమాఫీ సమస్యలను పరిష్కరించాలి
- డీసీసీబీ పాలకవర్గ సమావేశంలో టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు

6

పీఎఫ్ కటాఫ్ తేదీ ఎత్తివేత ఎప్పుడు?

- నష్టపోతున్న బీడీ కార్మికులు
- జీవన భృతి రాక ఇబ్బందులు
- పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం

6

బల్దియా కార్మికులను పర్మినెంట్ చేయాలి

ఏఐటీయూసీ రాష్ట్ర కమిటీ డిమాండ్

బల్దియా కార్యాలయంలో ధర్నా కార్యక్రమం



బల్దియా కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

వరంగల్ కార్పొరేషన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ నగర పాలకసంస్థ పరిధిలో పని చేస్తున్న శానిటేషన్ ఔట్‌సోర్సింగ్ కార్మికులందరినీ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి పర్మినెంట్ చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. శుక్రవారం బల్దియా కార్యాలయం ఆవరణలో కార్మికులు పెద్ద ఎత్తున ధర్నా చేపట్టారు. కార్మికుల సమస్యలు పరిష్కరించడంతో పాటు ఉద్యోగం పర్మినెంట్ చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏసురత్నం, రాష్ట్ర కార్యదర్శి వనం పెల్లి జైపాల్‌రెడ్డి సంయుక్తంగా మాట్లాడారు. శానిటేషన్ కార్మికులకు పర్మినెంట్ చేసేవరకు నెలకు రూ.26 వేల జీతం పెంచి బ్యాంకుల్లో జమచేయాలని డిమాండ్ చేశారు. కార్మికులందరికీ జాతీయ పండుగ సెలవులు ఇవ్వడం లేదని, ఇప్పటి వరకు కొందరు కార్మికులకు గుర్తింపు కార్డులు కూడా ఇవ్వకపోవడం బాధాకరం అన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా జీతాలు పెంచాలని అన్నారు. ప్రమాదంలో మరణించిన కార్మికుల కుటుంబాలకు రూ.25లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలన్నారు. మరణించిన కార్మికుల దహన సంస్కారాల కోసం వారి కుటుంబాలకు రూ.30 వేల ఆర్థిక సహాయం అందించాలన్నారు.

టీఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు బొట్ల బిక్షపతి మాదిగ, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏల్పుల ధర్మరాజు యాదవ్ మాట్లాడుతూ.. వరంగల్ బల్దియా పరిధిలో సుమారు 3వేలకు పైగా కార్మికులు పని చేస్తున్నారని, వారికి కావలసిన పీపీఈ కిట్లు, చలి కోట్లు వెంటనే అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, ఎంహెచ్‌వో డాక్టర్ రాజేశ్‌లకు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సారంగపాణి, యూనియన్ నాయకులు బొక్క ఏలియా, రఘు, రవి, ఎల్లస్వామి, ఎస్‌కే షమీం, బొట్ల యాదమ్మ, రామరాజుతో పాటు మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

ఫిల్టర్‌బెడ్ మరమ్మతు పనులు త్వరగా పూర్తి చేయండి

- మేయర్ గుండు సుధారాణి
- ప్రతాపరుద్ర ఫిల్టర్‌బెడ్‌లో ఆకస్మిక తనిఖీలు



ఫిల్టర్‌బెడ్ అధికారులతో మాట్లాడుతున్న మేయర్ సుధారాణి

వరంగల్ కార్పొరేషన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): వరంగల్ దేశాయిపేటలోని ప్రతాపరుద్ర ఫిల్టర్‌బెడ్‌లో నెలకొన్న మరమ్మతు పనులను త్వరగా పూర్తి చేయాలని మేయర్ గుండు సుధారాణి అధికారులకు సూచించారు. దేశాయిపేటలోని ఫిల్టర్‌బెడ్ శుక్రవారం మేయర్‌తో పాటు సంబంధిత అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ.. నీటిని ప్రజలకు అందించవలసిన నాణ్యతా ప్రమాణాలతో శుద్ధి చేసి సరఫరా చేయాలని ఆదేశించారు. ఫిల్టర్‌బెడ్‌లో చాలా మరమ్మతు సమస్యలు ఉన్నాయని, రూ.1కోటి నిధులతో మరమ్మతు పనులకు టెండర్ పిలవాలని అన్నారు. వేసవికాలం ప్రారంభం కాకముందే పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం మేయర్ అక్కడి నీటిని అధికారుల సమక్షంలో పరిశీలించారు. మేయర్ వెంట ఎస్‌ఈ ప్రవీణ్‌చంద్ర, ఈఈ శ్రీనివాస్, డీఈ రంగనాథ్‌లతో పాటు ఫిల్టర్‌బెడ్ సిబ్బంది పాల్గొన్నారు.

పీఎఫ్ కటాఫ్ తేదీ ఎత్తివేత ఎప్పుడు?

• నష్టపోతున్న బీడీ కార్మికులు • జీవన భృతి రాక ఇబ్బందులు • పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం

హనుమకొండ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలో బీడీ కార్మికులు పీఎఫ్ కటాఫ్ తేదీ వల్ల జీవన భృతి (పింఛన్) పొందలేక పోతున్నారు. అనేక సంవత్సరాలుగా బీడీల తయారీపైనే ఆధారపడి జీవిస్తున్న కార్మికులు జీవన చరమాంకంలో ఎలాంటి ఆర్థిక భరోసా లేక దుర్భర జీవితం గడుపుతున్నారు. చివరకు ఎలాంటి ఆసరా లేకుండానే కన్నుమూస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ అనుసరిస్తున్న వైఖరి వేలాది మంది బీడీ కార్మికుల పాలిట శాపంగా మారుతోంది. 2014 ఫిబ్రవరి 28 వరకు ప్రావిడెంట్ ఫండ్ (పీఎఫ్) ఖాతాలో నమోదు అయినవారికి మాత్రమే ప్రస్తుతం జీవన భృతి పింఛన్లు అందుతున్నాయి. కటాఫ్ తేదీ తర్వాత పీఎఫ్ కార్డు వచ్చినా ప్రభుత్వం పింఛన్‌కు పరిగణలోకి తీసుకోవడం లేదు.



ఎత్తివేతపై యూ టర్న్

2022 ఆగస్టులో పీఎఫ్ కటాఫ్ తేదీని ఎత్తివేస్తున్నట్టు ప్రకటించిన బీఆర్ఎస్ ప్రభుత్వం ఆ తర్వాత యూటర్న్ తీసుకున్నది.. ఇక బీడీ పింఛన్లు పెంచేది లేదని చేతులెత్తేసింది. గత ప్రభుత్వం ఈ కటాఫ్ తేదీని ఎత్తివేస్తూ నిర్ణ యం తీసుకున్నది. పీఎఫ్ నెంబరు ఉంటే చాలు అందరికి జీవన భృతి లభిస్తుందని గొప్పగా చెప్పింది. ఈ మేరకు జీవో కూడా జారీ చేసింది. దీనితో బీడీ కార్మికులు పెద్ద ఎత్తున దరఖాస్తులు చేసుకున్నారు. 18-50 ఏళ్ల వయసువారు 1.5 లక్షల లోపు ఆదాయం కలిగి, ఆధార్, ఓటరు గుర్తింపుకార్డు, బ్యాంకు ఖాతా, రేషన్ కార్డు, ఈపీఎఫ్ అర్హత ధృవీకరణ పత్రం, ఆన్‌లైన్ స్టేట్‌మెంట్, పాస్‌పోర్టు సైజు ఫొటోతో ఎంపీడీవో, మున్సిపల్ కార్యాలయాల్లో అందజేశారు. కానీ వారికి ఇప్పటి వరకు పింఛన్ మంజూరు కాలేదు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 20వేల మంది వరకు దరఖాస్తులు దాఖలయ్యాయి. ఇవన్నీ ఇప్పుడు జిల్లాల వారీగా కలెక్టర్ల వద్ద ఉన్నాయి. వీటిపై సర్కార్ యూటర్న్ తీసుకోవడంతో కలెక్టర్లు కూడా ఏమీ చేయలేకపోయారు. దీంతో జీవన భృతి కోసం పెట్టుకున్న దరఖాస్తులకు మోక్షం లేకుండా పోయింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచినా ఎత్తి వేయకపోవడంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో వేలాది మంది బీడీ కార్మికులు జీవన భృతి ఆసరా పింఛన్‌కు అర్హులైనప్పటికీ పొందలేక పోతున్నారు.

ఉమ్మడి వరంగల్‌లో లక్ష మంది కార్మికులు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో లక్ష మందికిపైగా బీడీ కార్మికులు ఉన్నారు. వీరిలో ఎక్కువ మంది వరంగల్, హనుమకొండ, జనగామ జిల్లాలో ఉన్నారు. బీడీ పరిశ్రమ సంక్షోభంలో కూరుకు పోవడంతో పదేళ్ల కాలంలో చాలా బీడీ ఫ్యాక్టరీలు మూత పడ్డాయి. ఒకప్పుడు ఉమ్మడి జిల్లా లో 25కిపైగా బీడీ ఫ్యాక్టరీలు ఉండేవి.

కానీ ఇప్పుడు వాటి సంఖ్య పదికి తగ్గిపోయింది. బీడీ ఫ్యాక్టరీల యజమానులు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న తమ బ్రాంచీల్లో కొన్నిటిని మూసివేయడంతో అనేక దశాబ్దాలుగా బీడీల తయారీపై ఆధారపడి జీవిస్తున్న బీడీ కార్మికుల సంఖ్య కూడా క్రమంగా తగ్గుతూ వస్తోంది.

గతంలో ఆందోళనలు

పీఎఫ్ కటాఫ్ తేదీ ఎత్తివేయాలని కోరుతూ పలు వామపక్ష కార్మిక సంఘాల నాయకత్వంలో గతంలో అనేక సార్లు బీడీ కార్మికులు పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. పీఎఫ్ జీవన భృతి కోసం దరఖాస్తు చేసుకున్నవారు ఇప్పటికీ సంబంధిత ప్రభుత్వ కార్యాలయాల చుట్టు తిరుగుతున్నారు.

ఇప్పటికైనా పీఎఫ్ కటాఫ్ తేదీని ఎత్తివేసి బీడీలు చుట్టేవారితో పాటుగా ఇతర కార్మికులకు పింఛన్ మంజూరీ చేయాలని, జీవన భృతి కింద నెలకు రూ 2016 అందజేయాలని, బీడీల తయారీకి తగినట్టు తునికాకును సరఫరా చేయాలని, బీడీల తయారీ కూలీ రేటు పెంచాలని, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన ద్వారా ఇళ్ల నిర్మాణానికి రాయితీ ఇవ్వాలని, గతంలో మాదిరిగా ప్రభుత్వం సంక్షేమ నిధిని పునరుద్ధరించాలని, తమ పిల్లలకు ఉపకార వేతనాలు మంజూరు చేయాలని ఈఎస్ఐ కార్మిక ఆస్పత్రి ద్వారా వైద్య సేవలందించాలని బీడీ కార్మికులు కోరుతున్నారు.

50 ఏళ్లుగా నాణాలు, కరెన్సీ సేకరణ

అభిరుచి

ప్రత్యేకతను చాటుకుంటున్న సుధాకర్



స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఒకటా, రెండా.. వందలు రకాల నాణేలు, కరెన్సీ నోట్లు సేకరించారాయన. సుమారు 50ఏళ్లుగా తన అభిరుచిని కొనసాగిస్తూ ప్రత్యేకతను చాటుకుంటున్నారు స్టేషన్ ఘన్‌పూర్‌కు చెందిన యంజాల సుధాకర్. ఈ క్రమంలో రాజుల కాలంలో, స్వాతంత్ర్యం రాక ముందు, వచ్చిన తర్వాత వచ్చిన రకరకాల నాణేలు, నోట్లు ఆయన వద్ద ఉన్నాయి. ఎవరి దగ్గరైన ఏదైనా పాత నాణం, నోటు ఉందని తెలిస్తే వారి వద్దకు వెళ్లి మరీ దానిని సేకరించి భద్రపరుస్తున్నారు. స్టేషన్‌ఘన్‌పూర్‌లోని మండల ఆఫీసు క్రాస్ రోడ్డులో టెంట్ హౌస్ నిర్వహించే ఆయన వద్ద 1980 వరకు మనం విరివిగా వినియోగించిన పైస, 2 పైసలు, 3 పైసలు, 5 పైసలు, 10 పైసలు, 20 పైసలు, 25 పైసలు, 50 పైసలు, రూపాయి, రూ.5 నాణేలు, రూపాయి, రూ.2, రూ.5, రూ.10, రూ.20, రూ.50, రూ.100 నోట్లు ఉన్నాయి. వీటిలో శ్రీకృష్ణ దేవరాయలు, నిజాం నవాబుల కాలం నాటి నాణేలు కూడా కొన్ని ఉన్నాయి.

అప్పుడప్పుడు ఆయన వీటిని ప్రదర్శనకు పెట్టి మురిసి పోతుంటారు. దీపావళి పండుగ రోజు ధన లక్ష్మీ వ్రతాలు ఆచరించే వారెవరైనా పూజలుర చేసేందుకు అడిగితే కాదనకుండా ఇస్తుంటారు. పూజల అనంతరం మళ్లీ భద్రపరుస్తారు. 1980సమయంలో పాపడాలు అమ్మే వ్యక్తి వద్ద చిల్లర పైసలు ఎక్కువగా ఉండేవని, రకరకాల నాణేలను చూసి తనకు సేకరించాలనే ఆలోచన వచ్చిందని సుధాకర్ చెబుతున్నారు. ఆ రోజుల్లో ఎక్కువగా పోస్టల్ స్టాంపులు, సాలార్ జంగ్ మ్యూజియం చిత్రాలు, అగ్గి పెట్టె మూతలు, మార్బుల్ గోలీలు, పత్తాలు ఎక్కువగా సేకరించే వారని, అలా తాను కూడా ఒక హాబీగా ఎంచుకున్నానన్నారు. పాతతరం నాణేలు, కరెన్సీ నోట్లపై ముద్రించిన సంవత్సరంతోపాటు సంస్కృతీ, సంప్రదాయాలకు సంబంధించిన గుర్తులు ఉంటాయని, మన దేశ భాషలు, జాతీయ చిహ్నాలు, జాతీయ నాయకుల చిత్రాలు, ఆర్‌బీఐ గవర్నర్ పేరు, పంటలు, కళాకారులు, కవులు, నృత్య రీతులు, పాతకాలం నాటి రాజుల బొమ్మలు... ఇలా ఎన్నో అంశాలు తెలుస్తాయన్నారు. ప్రతీ నాణెం, కరెన్సీ నోటు అప్పటి పాలకులు, ప్రభుత్వ విధానాలను తెలియజేసేలా ఉంటాయన్నారు.











సుధాకర్ సేకరించిన నాణాలు, వివిధ దేశాల కరెన్సీ

అప్పులభారమున్నా హామీల అమలు

• 8 నుంచి అశ్వరావుపల్లి సాగునీటి విడుదల
• స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి
• లింగాలఘణపురం లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ

లింగాలఘణపురం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఆర్థిక పరిస్థితి పెనుభారంగా ఉన్నా, వెనకడుగు వేయకుండా ప్రభుత్వం హామీలు చేస్తోందని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. శుక్రవారం లింగాలఘణపురం మండలకేంద్రంలో కల్యాణ లక్ష్మి, షాదీముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రం రూ. 7లక్షల కోట్ల అప్పుల భారంలో ఉందని, ప్రతీ నెలవడ్డీలతో పాటుగా అసలు డబ్బులను వాయిదాల రూపంలో చెల్లిస్తూనే మరో పక్క ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తుందన్నారు. సంక్రాంతి నుంచి రైతు భరోసా పథకాన్ని అమలు చేసేందుకు ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసిందన్నారు. ప్రతీ ఎకరాకు రూ.7500 చొప్పున రైతుల ఖాతాల్లో డబ్బులను జమచేసేందుకు సిద్ధంగా ఉందన్నారు. దేశంలో మరెక్కడా లేనివిధంగా 25 లక్షల మంది రైతులకు రూ.21వేల కోట్లు రుణాలను మాఫీ చేసిందన్నారు. ఈనెల 8 నుంచి అశ్వరావుపల్లి కుడికాలువ ద్వారా ప్రతీ ఎకరానికి గోదావరి జలాలను అందించేందుకు ఏర్పాట్లు చేపట్టడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా 109 మంది లబ్ధిదారులకు రూ.1.09కోట్లు, 32 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ. 11 లక్షలు మొత్తంగా రూ.1.20కోట్ల విలువైన చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా, ఆర్డీవో గోపిరామ్, మాజీ జడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి, వ్యవసాయ మార్కెట్ వైస్‌చైర్మన్ కొల్లూరు నర్సింహులు, తహసీల్దార్ రవీందర్, ఎంపీడీవో జలంధర్‌రెడ్డి, ఆర్‌బి లుకిశోర్, భగత్ పాల్గొన్నారు.



లింగాలఘణపురంలో డ్రోన్ స్ప్రేయర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఆధునిక సాగువిధానంతో లాభాలు

పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానాని కనుగుణంగా ఆధునిక సాగువిధానం రైతులకు ఎంతో లాభదాయకంగా ఉంటుందని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. శుక్రవారం లింగాలఘణపురం మండల కేంద్రంలో వనపర్తి గ్రామానికి చెందిన నేలతల్లి రైతు సహకార సంఘానికి నాబార్డు ఆర్థిక సహకారంతో మంజూరైన డ్రోన్ స్ప్రేయర్‌ను కలెక్టర్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. డ్రోన్ లాంటి ఆధునిక పరికరాలతో రైతులు వ్యవసాయంలో ముందుకు కదిలితే శారీరక శ్రమతో పాటుగా అనవసరమైన ఖర్చులు తగ్గుతాయని ఎమ్మెల్యే అఅన్నారు. డ్రోన్‌కు రూ. 7.25 లక్షలు కానుండగా నాబార్డు రూ.6లక్షల ఆర్థికంగా రుణసాయాన్ని అందజేస్తుందని మిగతా 1.25 లక్షలు రైతులు తమ వాటాగా చెల్లించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో డీఏవో రామారావు నాయక్, ఆర్డీవో గోపీరాం, తహసిల్దార్ రవీందర్, ఎంపీడీవో జలంధర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి, ఏఎంసీ చైర్‌పర్సన్ కొల్లూరు నర్సింహులు, పీఏసీఎస్ చైర్మన్లు బుషిగంపల ఉపేందర్, మల్ల శ్రీశైలం పాల్గొన్నారు.

చేర్యాల మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ శ్వేతకు అస్వస్థత

• ఆత్మహత్యాయత్నం చేశారంటూ మొదట్లో ప్రచారం
• ఫుడ్‌పాయిజన్ అయిందంటూ వీడియో ద్వారా వెల్లడించిన భర్త



నల్లనాగుల శ్వేత

బచ్చన్నపేట, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా చేర్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జనగామ జిల్లా బచ్చన్నపేట మండలంలోని కట్కూరుకు చెందిన నల్లనాగుల శ్వేత వెంకటాచారి శుక్రవారం తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. కుటుంబ సభ్యులు హుటాహుటిన జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. శ్వేత పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిందంటూ ఉదయం పెద్దఎత్తున ప్రచారం జరిగింది. దీంతో ఆమె భర్త వెంకటాచారి వీడియో సందేశాన్ని విడుదల చేశారు. తన భార్య శ్వేతకుఫుడ్‌పాయిజన్ అయిందని, దాంతో తీవ్ర అస్వస్థతకు గురైనట్టు వివరించారు. తమపై దుష్ప్రచారాలు చేయటం తగదంటూ కోరారు. తమ కుటుంబంలో ఎలాంటి గొడవలు లేవని, రెండు రోజుల్లో డిశ్చార్జ్ అయి వస్తుందని తెలిపారు. ఈ ప్రచారం సిద్దిపేట, జనగామ జిల్లాల్లో సంచలనం సృష్టించింది.

ఆయిల్‌పాంతో లాభాలు

తెలంగాణ ఆయిల్‌ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి

జనగామ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పాం సాగుతో రైతులకు మంచి లాభాలు వస్తాయని తెలంగాణ రాష్ట్ర ఆయిల్‌ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి అన్నారు. జనగామ మండలం ఎల్లంల శివారులోని ఆయిల్‌పాం నర్సరీని శుక్రవారం పరిశీలించారు. ఆయిల్‌పాం మొక్కల ఉత్పత్తి, నిర్వ హణపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడు తూ రాష్ట్రంలో రైతును రాజును చేయాలన్న లక్ష్యంతో సీఎం రేవంత్‌రెడ్డి పనిచేస్తున్నారన్నారు. పామాయిల్ ఉత్పత్తులను ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నామని, రాష్ట్రంలోనే పండించడం ద్వారా ప్రభుత్వాలపై భారం తగ్గడంతో పాటు రైతులకు మంచి ఆదాయం వస్తుందన్నారు. ఆయిల్ పాం సాగుపై కొన్ని కంపెనీలు, కొన్ని సంఘాలు కావాలనే దుష్ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. ఆయిల్‌పాం గెలలను సేకరించేందుకు నియోజకవర్గానికి ఒకటి చొప్పున సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం జనగామ జిల్లాలో 7 వేల ఎకరాల్లో పంటలు సాగవుతున్నాయని, 30వేల ఎకరాలకు చేరగానే ప్రాసెసింగ్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. రైతులను ఆయిల్‌పామ్ సాగు వైపు మొగ్గు చూపేలా అధికారులు అవగాహన కల్పించాలని ఆయన సూచించారు.



జనగామ నర్సరీలో ఆయిల్‌పాం మొక్కలను పరిశీలిస్తున్న జంగా రాఘవరెడ్డి

గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): స్టేషన్‌ఘన్‌పూర్ సాంఘిక సంక్షేమ గురుకులంలో ప్రవేశానికి విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కృతమూర్తి శుక్రవారం కోరారు. 2025-26సంవత్సరానికి ప్రవేశాలకు ఉమ్మడి ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ గురుకులాల్లో 5వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. ప్రస్తుతం 4వ తరగతి చదువుతున్న వారు ఫిబ్రవరి 1 వరకు ఆన్‌లైన్‌లో రూ.100 చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఫిబ్రవరి 23న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు ప్రవేశ పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు.

చైనా మాంజాలను పట్టుకున్న టాస్క్‌ఫోర్స్

వరంగల్ క్రైం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): నిషేధిత చైనా మాంజాలను టాస్క్‌ఫోర్స్ పోలీసులు శుక్రవారం కాజీపేట పీఎస్ పరిధిలో పట్టుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ కథనం ప్రకారం.. పతంగులు ఎగురవేసేందుకు నిషేధిత మాంజాలను కాజీపేటలో పలుషాపుల్లో విక్రయిస్తున్నట్లుగా వచ్చిన పక్కా సమాచారం మేరకు ఐదుగురు వ్యక్తుల నుంచి రూ.2,30,000 విలువ చేసే మాంజాలను స్వాధీనం చేసుకొని స్థానిక పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు.



సమావేశంలో డీసీసీ బ్యాంకు 2025- డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించిన టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు

కొత్త రుణాలు మంజూరు చేయండి

• డీసీసీబీ పాలకవర్గ సమావేశంలో టెస్కాబ్ చైర్మన్ మార్నేనీ రవీందర్‌రావు •

హనుమకొండ సిటీ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): రుణమాఫీ పొందిన రైతులకు వెంటనే కొత్తగా పంట రుణాలు అందచేయాలని డీసీసీ బ్యాంకు అధికారులను టెస్కాబ్ చైర్మన్ మార్నేనీ రవీందర్‌రావు ఆదేశించారు. శుక్రవారం హనుమకొండ నక్కలగుట్టలోని డీసీసీ బ్యాంకు ప్రధాన కార్యాలయంలో బ్యాంకు పాలకవర్గ సమావేశం జరిగింది. అధ్యక్షత వహించిన రవీందర్‌రావు అధికారులు, సభ్యులకు దిశా, నిర్దేశం చేశారు. ఇటీవలే మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో హైదరాబాద్‌లో జరిగిన సమీక్ష అంశాలను రవీందర్‌రావు సమావేశంలో ప్రస్తావించారు. డీసీసీ బ్యాంకు ఆర్థిక ప్రగతి, రుణాలు, రికవరీలు, పంట రుణాలు, రుణమాఫీ తదితర విషయాలపై మంత్రి స్పష్టమైన ఆదేశాలిచ్చినట్లు రవీందర్‌రావు పేర్కొన్నారు. ముఖ్యంగా కొత్త రుణాల మంజూరులో జాప్యం ఉండరాదని మంత్రి నిక్కచ్చిగా చెప్పినట్లు రవీందర్‌రావు వెల్లడించారు. అదే విధంగా రుణమాఫీ పొందిన రైతులకు కొత్త రుణాలు అందడంలో ఏమైనా సమస్యలు ఎదురైతే బ్యాంకు అధికారులు, సిబ్బంది వెను వెంటనే పరిష్కరించే బాధ్యతలు నిర్వహించాలన్నారు. బ్యాంకు ఆర్థిక ప్రగతి మరింత ఉన్నత స్థాయికి చేరేలా ప్రణాళికలు రూపొందించి కార్యాచరణలోకి తీసుకురావాలన్నారు. పలు విధాలుగా బ్యాంకు రుణాలు అందుబాటులో ఉన్నాయని, అయితే అవగాహన కొరవడడం వల్ల ప్రజలు రుణాలు పొందలేక పోతున్నారని పేర్కొన్నారు. ఉన్నత విద్య కోసం రుణాలు, బంగారం రుణాలు ఇలా కమర్షియల్ బ్యాంకుల కంటే విస్తృతంగా రుణాల కల్పన ఉన్న దశలో విస్తృత ప్రచారం జరపాలని ఆదేశించారు. అదే విధంగా డిపాజిట్లపై కూడా ఆకర్షణీయమైన వడ్డీని అందిస్తున్న క్రమంలో ప్రతీ అధికారి గ్రామ స్థాయిలోకి వెళ్లి ప్రచారం చేయాలని సూచించారు. రుణాల రకవరీ విషయంలో నిర్లక్ష్యం తగదని హెచ్చరించారు. వందకు వంద శాతం రికవరీ జరగాలని స్పష్టం చేశారు. రుణమాఫీలో ఏమైనా సాంకేతిక సమస్యల కారణంగా ఇంకా లబ్ధిపొందని వారు ఉంటే వెంటనే సమస్యను పరిష్కరించాలని టెస్కాబ్ చైర్మన్ రవీందర్‌రావు అధికారులను ఆదేశించారు.

సమావేశం అనంతరం డీసీసీ బ్యాంకు 2025-డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. వరంగల్ డీసీసీ బ్యాంకు డైరెక్టర్ ఉపేందర్‌రెడ్డి గ్రేటర్ హైదరాబాద్ గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా నియమితులైన క్రమంలో ఆయనను రవీందర్‌రావు, పాలక వర్గ సభ్యులు, బ్యాంకు అధికారులు శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ సమావేశంలో సీఈవో వజీర్ సుల్తాన్, వైస్ చైర్మన్ వెంకటేశ్వరరెడ్డి, డైరెక్టర్లు రమేశ్, రంజిత్, హరిప్రసాద్, రాజేశ్వర్‌రెడ్డి, మురళీధర్‌రావు, గోపాల్‌రావు, యాదగిరిరెడ్డి, నర్సింగరావు, శ్రీనివాసరెడ్డి, రవి రాజు, టెస్కాబ్ డీజీయం శ్రీనివాస్‌రావు, డీసీసీ బ్యాంకు డీజీఎం అశోక్, ఏజీఎం రాజు, మేనేజర్ నిహారిక తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు (బిల్టీ రకం)	2570	2345
పల్లికాయ (సూక)	7300	5600
పల్లికాయ (పచ్చిది)	4700	4500
కందులు	-	-
పెసళ్లు	7500	4000
పత్తి	7020	5800
పసుపు (కాడి)	11329	10235
పసుపు (గోల)	-	-
తేజ మిర్చి	14000	9000
తేజ మిర్చి (కొత్తది)	15500	12000
తేజ ఏసీ	15400	14000
వండర్‌హాట్ ఏసీ	13500	13000
యూఎస్341ఏసీ	15000	11000
యూఎస్ 341 కొత్తది	15500	14500
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	6500	3000

- వరంగల్ వ్యవసాయం

హ్యాట్సాఫ్ వాట్సాప్ యూత్

- గ్రామాల పేరుతో గ్రూపుగా ఏర్పడుతున్న యువత
- పేదలకు చేయూతనిస్తూ స్ఫూర్తిగా నిలుస్తున్న యువకులు

ఆదర్శం


తొర్రూరు మండలం వెంకటాపురంలో వెంకటాపురం సేవా ట్రస్టుద్వారా 50కేజీల బియ్యం అందస్తున్న వాట్సాప్ గ్రూపు సభ్యులు (ఫైల్)

తొర్రూరు రూరల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం సాంకేతికత ఏ మేరకు ప్రభావం చూపుతోందో అందరికీ తెలిసిందే. ముఖ్యంగా సోషల్ మీడియా అందరి జీవనంలో భాగమైపోయింది. ఇక వాట్సాప్ గ్రూపులకైతే కొదవేలేదు. అందరూ ఏదోఒక రకంగా వాట్సాప్ గ్రూప్‌లను వినియోగిస్తున్నారు. ఈ క్రమంలో కొందరు యువత సమాజసేవే లక్ష్యంగా తమతమ గ్రామాల పేర్లతో గ్రూపులు తయారుచేసి.. నిరుపేదలకు, ఆర్థికంగా చితికిపోతున్న కుటుంబాలకు అండగా నిలుస్తున్నారు. అలా సహాయం పొందిన పలువురు 'హ్యాట్సాఫ్ వాట్సాప్ యూత్' అంటూ అభినందిస్తున్నారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలంలోని 29 గ్రామాలు ఉండగా, ప్రతీ గ్రామంలో తమ ఊరి పేరుమీద వాట్సాప్ గ్రూప్ క్రియేట్ చేసి, ఆయా గ్రామాల్లో అనారోగ్యంతో బాధపడుతున్న, ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న వారిని, నిరాశ్రయులైన వృద్ధులను గుర్తించి.. వారి వివరాలను వాట్సాప్ గ్రూప్‌ల్లో షేర్ చేసి.. విద్యావంతులు, సేవాతత్పరులు, ఇతర ప్రాంతాల్లో ఉండే వారి తోచినంత సాయం చేస్తున్నారు.

- వెంకటాపురం గ్రామంలో 'మన ఊరు-మనమందరం' అనే వాట్సాప్ గ్రూప్ ద్వారా కొండ యాకన్న అనే గ్రామస్థుడు గ్రూపులోని సభ్యులను భాగస్వామ్యం చేస్తూ వెంకటాపురం సేవా ట్రస్టు పేరుతో వృద్ధులకు, నిరుపేదలకు, విద్యార్థులకు సాయం అందిస్తున్నారు. చనిపోయిన వారి కుటుంబాలకు అండగా నిలవడం, చలితో ఇబ్బందులు పడుతున్న వృద్ధులకు దుప్పట్లు, రగ్గులను అందజేస్తున్నారు. అలాగే తమతతమ ఇళ్లలో కనీసం శుభ, అశుభకార్యాలు చేసుకునే స్థితిలో లేని పేదలకు వంట సామగ్రిని అందిస్తున్నారు.
- వెలికట్టె గ్రామానికి చెందిన పోసాని సంతోష్, దీకొండ యాకన్న, రాము, అనిల్ అనే యువకులు వెల్లికట్టె గ్రామ సమాచారం, వెల్లికట్టె గ్రామ ప్రజలు అనే గ్రూపును క్రియేట్ చేసి.. అనారోగ్యంతో ఉన్న పేదలు, తమ వారి అంత్యక్రియలు కూడా చేయలేని స్థితిలో ఉన్న వారికి మరణించిన పేదల కుటుంబాలకు సాయం అందించడంతో పాటు.. ఏదైనా సమస్యతో మృతి చెందిన వారి కుటుంబాల్లో ఉన్న చిన్నారుల పేరిట తమకు తోచిన కొంత మొత్తాన్ని ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేస్తున్నారు.
- కంతాయపాలెం గ్రామానికి చెందిన ఎర్రం రాజు, కమ్మగాని శ్యామ్ అనే ఇద్దరు 'మా గ్రామం కంతాయపాలెం, మా ఊరు కంతాయపాలెం' అనే వాట్సాప్ గ్రూపులను క్రియేట్ చేశారు. తద్వారా గ్రామంలో అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్నా, ఆర్థికంగా చితికిపోతున్న వారికి ఆయా గ్రూపుల్లో ఉన్న సభ్యుల సహకారంతో సహాయం చేస్తుంటారు. ఇలా ఎన్నో గ్రామాల్లో అనేక మంది యువకులు వాట్సాప్ గ్రూప్‌ల ద్వారా సమాజసేవలో పాలుపంచుకుంటున్నారు. సాంకేతికతను వినియోగించుకుంటూ అభాగ్యులకు అండగా ఉంటున్నారు.


వెల్లికట్టెలో కొమ్ము సతీష్ భార్యకు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసిన పత్రాన్ని అందజేస్తున్న వాట్సాప్ గ్రూప్ సభ్యులు (ఫైల్)


ఐనవోలు మల్లికార్జున స్వామి దేవస్థానం

ఐనవోలు జాతరపై సమీక్ష సమావేశమేదీ?

- పట్టుమని పదిరోజులే సమయం
- నిర్లక్ష్యం వీడకపోతే భక్తులకు తిప్పలు తప్పనట్టే!

ఐనవోలు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే రెండో పెద్ద జాతరగా గుర్తింపు పొందిన ఐనవోలు మల్లికార్జునస్వామి జాతర ఉత్సవాలకు పట్టుమని పదిరోజుల సమయమే ఉంది. నెల రోజుల ముందే ఏర్పాటు చేయాల్సిన సమీక్ష సమావేశం.. నేటికీ నిర్వహించకపోవడంపై భక్తులకు అసౌకర్యాలు కలిగే అవకాశం ఉంది. దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, స్థానిక ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు జాతర సమయం సమీపిస్తున్నా.. నేటికీ సమీక్ష సమావేశం ఏర్పాటు చేయకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. నెల ముందే జాతర సమీక్ష సమావేశం నిర్వహించి 15 శాఖల జిల్లా అధికారులకు దిశానిర్దేశం చేస్తేగానీ జాతర వరకు 80 శాతం పనులు పూర్తవుతాయి. కలెక్టర్ ఆధ్వర్యంలో 15 శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తేనే భక్తులకు సౌకర్యాలు లభిస్తాయి. లేదంటే ఇబ్బంది పడాల్సిన పరిస్థితి నెలకొంటుంది. పారిశుధ్య సిబ్బంది నియమించి వ్యర్థాలను తొలగించడం, తాగునీరు, రహదారుల మరమ్మతులు, విద్యుత్ సరఫరా, ట్రాఫిక్ చెక్‌పోస్టుల ఏర్పాటు, పార్కింగ్‌లకు స్థలాల కేటాయింపు, వైద్య సేవలు, ఆర్టీసీ బస్సుల రవాణా సౌకర్యం, తాత్కాలిక మరుగుదొడ్ల నిర్మాణం, భక్తుల స్నానాలకు నల్లాల ఏర్పాటు, మహిళలు దుస్తులు మార్చుకోడానికి (డ్రెస్సింగ్ రూమ్) తడుకలతో ఏర్పాటు, భక్తుల వసతి, పోలీస్‌బందోబస్తు, సీసీ కెమెరాలు ఏర్పాటుచేసి కమాండ్ కంట్రోల్ సిస్టం ద్వారా జాతరను పర్యవేక్షిస్తారు. గత జాతరలో జరిగిన లోపాలను గుర్తించి మళ్లీ పునరావృతం కాకుండా సౌకర్యాలను మెరుగుపర్చాల్సిన అవసరం ఉంది.

ట్రస్టు బోర్డు నియామకం ఎప్పుడు?

ఐనవోలు దేవస్థానం ట్రస్టుబోర్డు నియామకం ఊసేలేకుండా పోయింది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ట్రస్టుబోర్డులో ధర్మకర్తలు, చైర్మన్ పదవుల కోసం ఆ పార్టీ నాయకులు ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నారు. గత జాతర సమయంలో వారం రోజుల కోసం చైర్మన్ లేకుండా ధర్మకర్తల కమిటీని నియమించి చేతులు దులుపుకున్నారు. వచ్చే జాతర వరకు ట్రస్టుబోర్డును నియమింపచేస్తామని పార్టీ శ్రేణులకు హామీ ఇచ్చారు. కానీ మళ్లీ జాతర రానేవచ్చింది. ఇప్పటి వరకు ట్రస్టు బోర్డు నియామకమే జరుగలేదని ఆశావహులు మదనపడుతున్నారు. ఈ సారి పునరుద్ధరణ కమిటీతోనే సరిపెట్టే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

సమీక్ష సమావేశం ఏర్పాటు చేస్తాం

- అద్దంకి నాగేశ్వర్‌రావు, ఈవో

జాతర సమీక్ష సమావేశం తేదీని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఖరారు చేస్తానని చెప్పారు. ఎండోమెంట్ శాఖ నుంచి జాతర టెండర్లు పూర్తిచేసుకున్నాం. చలువ పందిర్లు, క్యూలైన్ల నిర్మాణ పనులు, విద్యుత్తు లైట్ల ఏర్పాట్లు చేపట్టాం. పార్కింగ్ స్థలాల చదును, చెక్‌పోస్టుల ఏర్పాట్లలో పోలీస్‌శాఖ నిమగ్నమైంది.

ఆధ్యాత్మికం

12 నుంచి మల్లికార్జునుడి మహాజాతర

- సంక్రాంతి నుంచి ఉగాది వరకు ఉత్సవాలు
- లక్షలాదిగా తరలిరానున్న భక్తులు


ఐనవోలు మల్లికార్జునస్వామి

ఐనవోలు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఐనవోలు మల్లికార్జునస్వామి జాతర ఉత్సవాలు సమీపించాయి. లక్షలాది మంది భక్తులు భక్తి భావంతో ముద్దుగా పిలుచుకునే మల్లన్న జాతర ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. జనవరి మకర సంక్రమణంతో ప్రారంభమయ్యే జాతర ఉత్సవాలు ఉగాది వరకు కొనసాగుతాయి. స్వామి వారికి ధృష్టికుంభం డిసెంబరు 16 సోమవారం (ధను సంక్రమణ) నిర్వహించారు. ఈ నెల 12న ఆదివారం ఉత్సవాలు ప్రారంభమవుతాయి. ధ్వజరోహణం, నూతన వస్త్రాలంకరణం చేయనున్నారు. 13న సోమవారం భోగి పండుగ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి లక్షలాది మంది భక్తులు తరలివచ్చి దర్శించుకుంటారు. 14న మంగళవారం మకర సంక్రాంతిని పురస్కరించుకుని రాత్రి దేవుడి రథం(బండ్లు) ఆలయం చుట్టూ తిరుగుతాయి. ఆయా జిల్లాల నుంచి వచ్చే భక్తులతోపాటు ఉమ్మడి జిల్లాకు చెందిన భక్తులు తరలివస్తారు. 15న బుధవారం కనుమ స్వామి వారి దర్శనం. 16న గురువారం మహాసంప్రోక్షణ క్రతువు సమారాధన పూజ కార్యక్రమాలు జరుగుతాయి. ఫిబ్రవరి 3 సోమవారం వసంత పంచమి శ్రీభ్రమరాంబిక అమ్మవారి దశమ వార్షికోత్సవం, 12న బుధవారం రేణుకాదేవి(ఎల్లమ్మదేవత) పండగ నిర్వహిస్తారు.

శివరాత్రి కల్యాణ బ్రహ్మోత్సవములు

శివరాత్రి కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఫిబ్రవరి 24 నుంచి 28 వరకు పాంచాహ్నిక దీక్షతో త్రికుండాత్మకంగా భ్రమరాంబికా మల్లికార్జున స్వామి వారి కల్యాణ బ్రహ్మోత్సవములు శైవాగమోక్తంగా వైభవంగా నిర్వహించనున్నారు. 24న సోమవారంసూర్యచంద్ర ప్రభవాహనసేవలు, 25న మంగళవారం అశ్వవాహనసేవ, శేషవాహనసేవ, 26న బుధవారం మహాశివరాత్రి శివకల్యాణం, పెద్దపట్నం, సింహవాహనసేవ, రాత్రి 7 గంటలకు శ్రీ భ్రమరాంబమల్లికార్జునస్వామి వారి కల్యాణం అనంతరం నంది వాహనసేవ నిర్వహి స్తారు. 27న గురువారం రావణ వాహనసేవ, రథోత్సవం, పురవీధి సేవ, 28న శుక్రవారం పర్వతవాహనసేవ నిర్వహిస్తారు. వంసతోత్సవము, పండితసన్మానాలు జరుగును. మార్చి 23న ఆదివారం పెద్దపట్నం కల్యాణం, 30న ఆదివారం మంగళవారం ఉగాది పండుగ పంచాంగ శ్రవణం నిర్వహించనున్నారు.

వారంతపు జాతర జరుగుతుందిలా..

జనవరి 19 నుంచి మార్చి 30 వరకు వారంతపు జాతరలు ప్రతీ ఆది, బుధ వారల్లో నిర్వహిస్తారు. ఈ యేడు మొత్తం 11 ఆదివారాలు, 10 బుధవారాల్లో వారాంతపు జాతర జరుగనుంది. జాతర వివిధ ప్రాంతాల నుంచి లక్షలాది మంది భక్తులు వచ్చి దర్శనం చేసుకుని మొక్కులు చెల్లించుకుంటారుని ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావు, ఆలయ ఉప ప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్ తెలిపారు.

వలస జీవులు..


వరి నాట్లు వేస్తున్న పురుషులు, మహిళలు

కోల్‌కతా టు కాటారం!

- ఉపాధి కోసం వస్తున్న కూలీలు
- ఉదయం నుంచే పొలం పనుల్లోకి..

కాటారం, జనవరి 3(ఆంధ్రజ్యోతి): ఉపాధి కోసం వందలాది మైళ్లు కుటుంబాలతో సహా తరలివచ్చారు. ఉన్న ఊరు వదిలి.. వందలాది మంది పశ్చిమబెంగాల్ రాష్ట్ర కూలీలు భూపాలపల్లి జిల్లా కాటారానికి వచ్చారు. కోల్‌కతాకు 16కిలోమీటర్ల దూరంలో ఉన్న పలు గ్రామాలకు చెందిన వారు రైళ్లలో సుమారు 1200 కిలోమీటర్లు ప్రయాణించి.. కాటారం చేరుకున్నారు. వారంతా కొందరు స్థానికుల సాయంతో వరినాటు పనులకు వెళుతున్నారు. 20 నుంచి 22మందితో బృందాలుగా ఏర్పడి వరినాట్లు వేస్తున్నారు. మహిళలు నాట్లు వేస్తుండగా.. పురుషులు నారు మోయడం, మడుల్లో పంచడం, ఇతరత్రా పనులు చేస్తున్నారు. అయితే వీరి రాకతో రైతులకు కొంత ఊరట లభించినట్లయ్యింది. స్థానికంగా గ్రామాల్లో ఉండే కూలీలు ఉదయం 9-10గంటల మధ్య నాట్లు వేయడానికి ఇళ్ల నుంచి బయలుదేరుతుంటారు. కానీ పశ్చిమబెంగాల్ కూలీలు మాత్రం ఉదయం 7గంటలకే పొలాలకు చేరుకుంటున్నారు. తాము పనికి వచ్చిన చోటనే కలిసికట్టుగా వంట చేసుకుంటూ భోజనం చేయడం లాంటివి చేస్తున్నారు. ఇక కూలీల బృందాలకు పనులు చూపిస్తున్న మధ్యవర్తులు వంటసామగ్రి, నిత్యవసరాలు అందిస్తున్నారు. వారే రైతులనుంచి ఎకరానికి ఇంత వసూలు చేస్తూ నెలవారీగా కూలీలకు డబ ఉబ్బులు చెల్లిస్తున్నారు. ఈ క్రమంలో కొంత కమీషన్ తీసుకుంటున్నారు. ఏదేమైనా ఇతర ప్రాంతాల కూలీల రాకతో స్థానికంగా కూలీల కొరత, ఇతర ఇబ్బందుల నుంచి రైతులు కొంత ఉపశమనం పొందుతున్నారు.


ఉదయాన్నే వంటలతో సహా పొలం వద్ద కూలీలు

చైనా వైరస్‌పై సర్వత్రా చర్చ

అప్రమత్తత అవసరమంటున్న వైద్యులు, అధికారులు

వరంగల్ మెడికల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): చైనాలో హెచ్ఎంపీవీ అనే కొత్త వైరస్ విస్తరిస్తోందన్న వార్తలు సర్వత్రా చర్చనీయాంశమయ్యాయి. కొవిడ్ తరహాలోనే ఈ వైరస్ లక్షణాలు కూడా ఉంటాయన్న సమాచారంతో అందరూ నాలుగేళ్ల క్రితం నాటి కొవిడ్ అత్యవసర పరిస్థితులను గుర్తుచేసుకుంటున్నారు. కొవిడ్ తరహాలోనే కొత్తవైరస్ కూడా చైనా నుంచే విజృంభిస్తోందని తెలియడంతో ఆందోళన చెందుతున్నారు. అయితే దీనిపై స్పందించిన ఇండియన్ హెల్త్ ఏజెన్సీ ప్రజలకు పలు సూచనలు చేసింది. ప్రస్తుతం మన దేశంలో ఈ కొత్తవైరస్ జాడ లేదని, అయినప్పటికీ కొవిడ్ నాటి పరిస్థితుల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని పేర్కొంది. దీనిపై హనుమకొండ డీఎంహెచ్‌వో అప్పయ్యతో పాటు పలువురు వైద్య నిపుణులు మాట్లాడుతూ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ముందుజాగ్రత్తగా మాస్కులు ధరించాలని, సమూహాల్లోకి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కొవిడ్ సమయంలో తీసుకున్న జాగ్రత్తలనే పాటిస్తే వైరస్ బారి నుంచి తప్పించుకోచ్చని చెబుతున్నారు.

పోలీస్ అంటేనే ఉద్యోగం కాదు కర్తవ్యం

- ఏసీబీ రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ తరుణ్ జోషి
- శిక్షణ పూర్తిచేసుకున్న 453 మంది కానిస్టేబుళ్లు
- అట్టహాసంగా దీక్షంత్ పాసింగ్ పరేడ్


పరేడ్ నిర్వహిస్తున్న కానిస్టేబుల్స్, గౌరవవందనం స్వీకరిస్తున్న తరుణ్‌జోషి


మాట్లాడుతున్న ఏసీబీ డైరెక్టర్ డా, తరుణ్ జోషి (ఐపీఎస్)


పాసింగ్ పరేడ్‌లో జాతీయజెండాతో ప్రదర్శన

మామునూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): పోలీస్ అంటే కేవలం ఉద్యోగం కాదని.. అది ఒక కర్తవ్యం అని, ప్రతీ సంఘటనను పోలీసులు ఒక చాలెంజ్‌గా తీసుకోవాలని తెలంగాణ ఏసీబీ డైరెక్టర్ తరుణ్ జోషి సూచించారు. శుక్రవారం మామునూరు పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన దీక్షంత్ పాసింగ్ ఔట్ పరేడ్‌కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై శిక్షణ పూర్తి చేసుకున్న పోలీసులకు, ఉన్నతాధికారులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా 9 నెలల కఠోర శిక్షణలో కానిస్టేబుళ్లు నేర్చుకున్న కొన్ని ప్రధాన అంశాలను ప్రదర్శించారు. బైక్ స్టంట్స్, ఆత్మరక్షణ ఫైట్స్, కత్తిసాము, కర్రసాము చేసి అధికారులను ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా తరుణ్ జోషి మాట్లాడుతూ.. సమస్యల తో పోలీసులను ఆశ్రయించే వారికి న్యాయం చేయాలని సూచించారు. ఇటీవల సమాజంలో సైబర్ నేరాలు, హింస, ఆర్థిక నేరాలు బాగా పెరిగాయని అన్నారు. అన్ని సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొని పనిచేయాలని సూచించారు. ట్రైనింగ్‌లో ఉన్న ఫిట్‌నెస్‌ను ఎప్పటికీ కాపాడుకోవాలన్నారు. ట్రైనింగ్‌తో పాటు పరేడ్‌లో ప్రతిభ కనబరిచిన వారికి ఏసీబీ డైరెక్టర్ తరుణ్ జోషి ప్రశంసాపత్రాలతో పాటు బహుమతులను అందించి అభినందించారు. అనంతరం 453 మంది పోలీస్ కానిస్టేబుళ్లకు ఈ పరేడ్‌తో వీడ్కోలు పలికారు. వారిని కలుసుకునేందుకు ఉమ్మడి పది జిల్లాల నుంచి తల్లిదండ్రులు, బంధుమిత్రులు తరలివచ్చారు. పరేడ్‌లో వారి విన్యాసాలు చూస్తూ ఆనందంలో మునిగిపోయారు. ఆత్మీయ ఆలింగనం చేసుకొని తన్మయత్వం చెందారు.


పాసింగ్ పరేడ్‌కు హాజరైన పోలీస్ అధికారులు, సిబ్బంది, శిక్షణ పూర్తి చేసుకున్న కానిస్టేబుళ్ల కుటుంబ సభ్యులు

ఒక్కొక్కరిని ఒక్కో ఆయుధంలా తయారు చేశాం..

- రామ్‌ప్రకాశ్, కమాండెంట్



ప్రతీ ఒక్కరిని ఒక వెపన్ (ఆయుధం)లా తయారు చేశాం. ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కొనే మానసిక ధైర్యాన్ని అందించాం. శారీరక దృఢత్వం కోసం పరేడ్ డ్రిల్ నిర్వహించాం. మానసిక ఒత్తిడిని తగ్గించేందుకు యోగా, మెడిటేషన్ వంటివి నేర్పించాం. శిక్షణలో ఎక్కువ మంది పేద, మధ్య తరగతి వారే ఉన్నందున పేదలకు సత్వర న్యాయం అందిస్తారని ఆశిస్తున్నాం.

మా అన్నయ్య కల నెరవేర్చా..


- ఎల్ నాగేందర్, టీజీఎస్పీ కానిస్టేబుల్ సంగారెడ్డి



మా అన్నయ్య చిన్నప్పటి నుంచి పోలీస్ అవ్వాలని చాలా ప్రత్నించారు. కాని ఫిజికల్ టెస్టులలో ఫెయిలై ఉద్యోగం సాధించలేకపోయాడు. కాని, పోలీస్ ఉద్యోగంపై మక్కువతో నాకు అనేక సూచనలు చేసి పోలీస్ ఉద్యోగం సాధించేలా సహాయపడ్డాడు. భవిష్యత్తులో మరిన్ని ప్రమోషన్‌లు తెచ్చుకుని మంచి స్థాయికి చేరుకుంటా. సమాజానికి సేవ చేస్తా.

నాన్న స్ఫూర్తితో..

- ఎ.విజయ్ టీజీఎస్పీ కానిస్టేబుల్ సిద్దిపేట్



నాకు చిన్నప్పటి నుంచి పోలీస్ వృత్తి అంటే చాలా ఇష్టం. మానాన్న కూడా పోలీస్ ఆఫీసర్ అవ్వాలని చాలా సార్లు ప్రయత్నించారు. కానీ ఉపాధ్యాయ వృత్తిలోనే ఉండి పోయారు. అందువల్ల నన్ను ప్రోత్సహించారు. పోలీస్ ఉద్యోగం సాధించి సమాజానికి సేవ చేయాలని చేప్పేవారు. ఆ ప్రోత్సాహంతోనే నేను ఈ రోజు మొదటి ప్రయత్నంలోనే ఉద్యోగం సాధించాను. చాలా ఆనందంగా ఉంది.

అన్యాయాన్ని అరికట్టడమే లక్ష్యం

- నగేష్ యాదవ్, టీజీఎస్పీ కానిస్టేబుల్ సంగారెడ్డి



మాది వ్యవసాయ కుటుంబం. గొర్రెల కాపరిగా పనిచేస్తూ రెండోసారి ప్రయత్నించి ఉద్యోగం సంపాదించాను. ఆర్థికంగా చిన్నప్పటి నుంచి అనేక కష్టాలు పడ్డాను. నా కష్టాలే గురువులా నన్ను ముందుకు నడిపించాయి. పేదవారికి న్యాయం చేస్తూ డ్రగ్స్, హత్యాచారాలను అరికట్టేందుకు కృషి చేస్తా. భవిష్యత్తులో ఇన్‌స్పెక్టర్ అవ్వాలన్నది నా కల.

సమాజ సేవే లక్ష్యం..

- పాండు, టీజీఎస్పీ కానిస్టేబుల్ సంగారెడ్డి



సమాజంలో జరిగే అఘాయిత్యాలు, అత్యాచారాలను టీవీలలో చూస్తూ విసిగిపోయా. వాటిని అరికట్టాలంటే పోలీసు ఉద్యోగమే కరెక్టని యూనిఫాం మీద మక్కువతో ఈ ఉద్యోగం సాధించాను. అల్లరిమూకల ఆగడాలను అరికట్టడంతో పాటు వీలైనంతవరకు సంఘసేవ చేస్తా.

గ్రంథాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా మలుసూరు

హనుమకొండ టౌన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి వరంగల్ జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల సంఘం ఎన్నికలు హనుమకొండలోని జిల్లా గ్రంథాలయంలో ఏకగ్రీవంగా శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మలుసూరు, ప్రధాన కార్యదర్శిగా సుతారి నిఖిల్, కమిటీ ఉపాధ్యక్షులుగా పద్మారావు, చంద్రమౌళి, సహాయ కార్యదర్శిగా సమ్మక్క, కోశాధికారిగా సత్యప్రకాష్, ప్రచార కార్యదర్శిగా కొండయ్య, ఈసీ మెంబర్లు ఎం.చిన్నబాబు, టి.అనిత, కృష్ణ, లక్ష్మీనారాయణ, ఈశ్వర్, ప్రదీప్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు టీఎన్‌జీవోస్ కోశాధికారి ఐనం రాజేష్ తెలిపారు. కమిటీ సభ్యులను టీఎన్‌జీవోస్ సంఘం నాయకులు, గ్రంథాలయ సంస్థ సిబ్బంది అభినందనలు తెలిపారు.



మలుసూరుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఉద్యోగులు

ఫిల్టర్‌బెడ్ కార్మికులకు చలికోట్లు అందించాలి

వరంగల్ కార్పొరేషన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): వరంగల్ ప్రతాపరుద్ర ఫిల్టర్‌బెడ్‌లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ కార్మికులకు చలికోట్లతో పాటు యూనిఫామ్‌ను అందించాలని ఫిల్టర్‌బెడ్ కార్మికులు మేయర్‌కు వినతి పత్రం అందించారు. శుక్రవారం దేశాయిపేట ఫిల్టర్‌బెడ్‌ను తనిఖీ చేసిన మేయర్‌ను కార్మికులు కలిసి విజ్ఞప్తి చేశారు. ఇక్కడ పనిచేసే కార్మికులకు నీటిని శుద్ధి చేసేందుకు ఉపయోగించే రసాయనాల వల్ల చాలా అనారోగ్య సమస్యలు వస్తున్నాయని అధికారులు గుర్తించి తమకు కనీస సౌకర్యాలు కల్పించాలని కోరారు. శానిటేషన్ వర్కర్స్‌తో పాటు తమను కూడా గుర్తించి రూ.1000 అలవెన్స్ అందించాలని అన్నారు. మేయర్‌ను కలిసిన వారిలో ఫిల్టర్‌బెడ్ కార్మికులు సుద్దాల కుమార్, శోభ, రమేష్, రాజు, మధుకర్, వెంకట్, మనోహర్, అశోక్, సుదర్శన్, శ్రీనాథ్‌లు ఉన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు కట్టుబడి ఉండాలి

మడికొండ, జనవరి 3(ఆంధ్రజ్యోతి): మడికొండలోని సిటీ పోలీస్ శిక్షణా కేంద్రంలో ఎంపిక చేసిన పోలీసు అధికారులు, సిబ్బందికి రెండురోజుల పాటు ఏర్పాటు చేసిన పునశ్చరణ శిక్షణా తరగతులను శుక్రవారం అడిషనల్ డీసీపీ రవి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీసు అధికారులు, సిబ్బందికి వ్యాయామం, శాంతిభద్రతల పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను విధి నిర్వణలో పాటించి ప్రజలకు మెరుగైనసేవలు అందించాలని సూచించారు. సీటీసి ప్రిన్సిపాల్ రమణబాబు, ఇన్‌స్పెక్టర్లు రవికుమార్, మంగీలాల్, ఆర్ఐ ఉదయ్ భాస్కర్, సబ్‌ఇన్‌స్పెక్టర్ లలిత, ఇండోర్, అవుట్‌డోర్ సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది సమన్వయంతో పనిచేయాలి

వరంగల్ మెడికల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): వైద్యాధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని హనుమకొండ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎ.అప్పయ్య అన్నారు. శుక్రవారం హనుమకొండ బోడగుట్ట పట్టణ ఆరోగ్య కేంద్రం, దర్గా బస్తీ దఖానాలను డీఎంహెచ్‌ఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలో ఉన్న మందులను, స్టాక్ రిజిస్టర్లను తనిఖీ చేశారు. అనంతరం డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ.. ఆరోగ్య కేంద్రం పరిధిలో 12 మంది క్యాన్సర్‌కు చికిత్స తీసుకుంటున్నారని, 4,131 మంది బీపీ, 2,052 మంది డయాబెటీస్ వ్యాధిగ్రస్తులు ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో వైద్య సిబ్బంది సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సృజన, డాక్టర్ వివేక్ వర్ధన్, మాస్ మీడియా అధికారి అశోక్‌రెడ్డి, రాజశ్రీ, స్వరూప, ఏఎన్‌ఎంలు, హెల్త్‌అసిస్టెంట్లు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పాత కలెక్టర్ క్యాంపు కార్యాలయాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే

హనుమకొండ కలెక్టరేట్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): సుబేదారిలోని పాత కలెక్టర్ క్యాంపు కార్యాలయాన్ని పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి శుక్రవారం కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి, జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతో కలిసి పరిశీలించారు. పాత కలెక్టరేట్ క్యాంపు కార్యాలయంతో పాటు చుట్టూ ఉన్న పరిసరాలను ఎమ్మెల్యే పరిశీలించారు. పాత కలెక్టరేట్ క్యాంపు కార్యాలయ భవనాన్ని మరమ్మతు పనులు చేయించి అందుబాటులోకి తీసుకురావడానికి గల అవకాశాల గురించి అధికారులతో ఈ సందర్భంగా ఎమ్మెల్యే చర్చించారు.

సీపీకి టీఎన్‌జీవోల శుభాకాంక్షలు



సీపీకి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

హనుమకొండ కలెక్టరేట్, జనవరి3 (ఆంధ్రజ్యోతి): వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్‌కిశోర్ ఝాను టీఎన్‌జీవోస్ యూనియన్ అధ్యక్షుడు ఆకుల రాజేందర్ ఆధ్వర్యంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీపీ అంబర్‌కిశోర్ ఝా జిల్లా లోని ఉద్యోగులందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. సీపీని కలిసిన వారిలో టీఎన్‌జీఓస్ జిల్లా కార్యదర్శి బైరి సోమయ్య, కోశాధికారి పనికెల రాజేష్, గౌరవఅధ్యక్షుడు శ్యాంసుందర్, కేంద్ర సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.


పోలీసులు పారదర్శకంగా విధులు నిర్వర్తించాలి

వరంగల్ క్రైం: పోలీసులపై ప్రజలకు మరింత నమ్మకం కలిగించేలా పారదర్శకంగా విధులు నిర్వర్తించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా పిలుపునిచ్చారు. నూతన సంవత్సర వేడుకలను శుక్రవారం కమిషనరేట్ కార్యాలయం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు, వివధ రంగాల వ్యక్తులు, పోలీస్ అధికారులు కమిషనరేట్ కార్యాలయానికి చేరుకొని సీపీకి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. వేడుకలకు హాజరైన వారితో సీపీ కేక్‌కట్ చేసి ప్రజలందరికీ న్యూ ఇయర్ శుభాకాంక్షలు తెలియజేశాడు. ఈ కార్యక్రమంలో డీసీపీలు రాజమహేంద్ర నాయక్, ఏఎస్పీ మనాన్‌భట్, అదనపు డీసీపీలు రవి, సురేశ్, ఏసీపీలు, ఆర్‌ఐలు పాల్గొన్నారు.

గురుకుల విద్యాలయాల్లో ప్రవేశాలు

హనుమకొండ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): సాంఘిక సంక్షేమ గురుకులాలతో పాటు బీసీ వేల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్, జనరల్ గురుకులాల్లో 2025-26 విద్యా సంవత్సరానికి 5వ తరగతి ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవలసిందిగా హనుమకొండ హంటర్ రోడ్డులో ఉన్న ధర్మసాగర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సల్ల శైలజ ఒక ప్రకటనలో కోరారు. ఈ విద్యా సంవత్సరం ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలల్లో 4వ తరగతి చదువుతున్న ఆసక్తిగల విద్యార్థులు ఫిబ్రవరి 1లోపు రూ.100 రుసుముతో దరఖాస్తు చేసుకోవల్సిందిగా ఆమె సూచించారు. ఫిబ్రవరి 23న గురుకులాల్లో ఉమ్మడి పరీక్ష నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అలాగే మరింత సమాచారం కోసం 040-23391598, 9491063511 ఫోన్ నెంబర్లలో సంప్రదించవచ్చునని తెలిపారు.

కేసీఆర్‌ను కలిసిన లింగంపల్లి కిషన్‌రావు



హనుమకొండ టౌన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా నర్సక్కపల్లి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు, ఆగ్రోస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ లింగంపల్లి కిషన్‌రావు తన జన్మదినం సందర్భంగా శుక్రవారం మాజీ సీఎం కేసీఆర్‌ను ఎర్రవల్లిలోని ఫాంహౌస్‌లో మర్యాద పూర్వకంగా కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం మాజీ మంత్రి బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను, మాజీ మంత్రి హరీష్ రావును కలిసినట్లు కిషన్‌రావు తెలిపారు.

పంచాయతీరాజ్ ఉద్యోగుల క్యాలెండర్ ఆవిష్కరణ

హనుమకొండ కలెక్టరేట్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం జిల్లా-2025 క్యాలెండర్‌ను శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజాపరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఎం.విద్యాలత, తెలంగాణ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం నాయకులు రవిప్రకాశ్, రవికుమార్, సునిల్‌కుమార్, పల్లవి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సావిత్రిబాయి ఫూలే జయంతి వేడుకలు

హనుమకొండ కలెక్టరేట్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): దేశంలోని మొదటి మహిళా ఉపాధ్యాయురాలు, సంఘ సంస్కర్త సావిత్రిబాయి ఫూలే జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. హనుమకొండ కలెక్టరేట్ కాన్ఫరెన్స్‌హాల్‌లో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, కలెక్టర్ పి.ప్రావీణ్య, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాకడేలు ఫూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆర్డీవో రాథోడ్ రమేష్, డీఈవో వాసంతి, మహిళా ఉపాధ్యాయులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



హనుమకొండ కలెక్టరేట్‌లో సావిత్రిబాయి ఫూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నాయిని, కలెక్టర్ ప్రావీణ్య



హనుమకొండలోని స్వగృహంలో డాక్టర్ విజయలక్ష్మిని సన్మానిస్తున్న విజయ్‌కుమార్

- వరంగల్ ఎడ్యుకేషన్: మట్టెవాడలోని ఆక్స్‌ఫర్డ్ గ్రా మర్ హైస్కూల్లో పాఠశాల కరస్పాండెంట్ దండాపంతుల రామ్మూర్తి శర్మ ఆధ్వర్యంలో సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పాఠశాలలోని మహిళా ఉపాధ్యాయులను సత్క రించారు. కార్యక్రమంలో స్కూల్ ప్రెసిడెంట్ గంగు రాధారాణి, ఉపాధ్యాయులు యాస్మిన్ అన్వారి, హబీబ్ జిలానీ, ప్రసాద్, సంధ్య, సంధ్యారాణి, మౌనిక, సౌజన్య, జ్యోతి, ధృవతార, ఆరిఫా, అఫ్సాన్ తదితరులు పాల్గొన్నారు. హంటర్ రోడ్‌లోని జానపద గిరిజన విజ్ఞానపీఠంలో పీఠాధిపతి ప్రొఫెసర్ భూక్య బాబురావు ఫూలే చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు. సుబేదారి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెడ్మాస్టర్ జి.నెహ్రూ నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు. ఆర్ట్స్ కళాశాలలో మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని సావిత్రిబాయి చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.
- హనుమకొండటౌన్: సావిత్రిబాయి ఫూలే జయంతిని శుక్రవారం బాలసముద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించా రు. బీఆర్‌ఎస్ వరంగల్ పశ్చిమ కోఆర్డినేటర్ పులి రజినీకాంత్ నివాళులర్పించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సంకు నర్సింగ్, బోయినపెల్లి రంజిత్ రావు, మాజీ కార్పొరేటర్లు కుసుమ లక్ష్మీనారాయణ, మేకల బాబురావు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.
- కాజీపేట: కాజీపేట రైల్వే వోబీసీ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫూలే జయంతిని నిర్వహించారు. డివిజన్ అధ్యక్షుడు రేండ్ల రమేశ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రన్నింగ్ బ్రాంచ్ వైస్ చైర్మన్ కె.రేవతి విజయకుమారి, చీఫ్ క్రూ కంట్రోలర్ మౌలా షరీఫ్, రైల్వే నాయకులు సుదర్శన్ రావు, కంచు రాజు తదితరులు పాల్గొన్నారు. కాంగ్రెస్ నాయకుడు కొడవటి రవి ఆధ్వర్యంలో కాకతీయ యూనివర్సిటీలో సావిత్రిబాయి ఫూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం ఆధ్వర్యంలో సావిత్రిబాయి ఫూలే జరిగిన జయంతి కార్యక్రమంలో సంఘం నేతలు గడ్డం అశోక్, ఏఈవోలు పి.రజిత, డి.సంధ్య పాల్గొన్నారు.
- మడికొండ: కాజీపేట మండలం కడిపికొండలోని మండల ప్రాథ విక పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు చుంచుకాల లింగారావు మాట్లాడుతూ... ఫూలే జీవితం ఆదర్శనీయమని పేర్కొన్నారు. అనంతరం మహిళా ఉపాధ్యాయురాళ్లు జమీలబేగం, సిరా జ్‌బేగంను ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు.
- వడ్డెపల్లి: హనుమకొండ వడ్డెపల్లిలోని ప్రభుత్వ పింగిళి మహిళా డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో సావిత్రిబాయి ఫూలే జయంతిని నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జి.సుహాసిని తదితరులు నివాళులర్పించారు. కార్యక్రమంలో చరిత్ర విభాగాధిపతి డాక్టర్ కొలిపాక శ్రీనివాస్, అధ్యాపకులు కుమారస్వామి, సురేష్‌బాబు, అరుణ, కవిత, రామ రత్నమాల, యుగంధర్ పాల్గొన్నారు. గ్రేటర్ 56వ డివిజన్ గోపాల్‌పూర్‌లో జరిగిన జయంతి వేడుకల్లో టీపీసీసీ లీగల్ సెల్ కన్వీనర్ కందుకూరి రజినీకాంత్, సామాజిక వేత్త రమేష్, కందుకూరి ప్రవీణ్ పాల్గొన్నారు. కేయూ ఎస్‌డీఎల్‌సీఈ వద్ద గల సావిత్రి, ఫూలే విగ్రహాలకు నివాళులర్పించారు.
- బాలసముద్రం: సావిత్రిబాయిఫూలే జయంతి సందర్భంగా ఆమె ఆశయ సాధనలో నడుస్తున్న డాక్టర్ విజయలక్ష్మిని తెలంగాణ బీసీ బహుజన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రతాపగిరి విజయ్‌కుమార్ హనుమకొండలోని ఆమె స్వగృహంలో సన్మానించారు. కార్యక్రమంలో దాసరి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటనర్సయ్య, పార్థసారథి, సౌమ్య, సంధ్య, మహ్మద్ అమీనా, క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.
- హనుమకొండ (ఆంధ్రజ్యోతి): వరంగల్ ఎన్ఐటీలో సావిత్రిబాయి ఫూలే జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. నిట్ డైరెక్టర్ ప్రొఫెస ర్ బిద్యాధర్ సుబుధి సావిత్రిబాయి ఫూలే చిత్రపటానికి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జ్యోతిరావు ఫూలే, సావిత్రిబాయి ఫూలే జయంతి, వర్ధంతి వేడుకలను నిట్ యేటా అధికారికంగా జరుపుతోందన్నారు. కార్యక్రమంలో ఓబీసీ అసోసియేషన్ అధ్యక్షుడు వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి దిలీప్ కుమార్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎన్‌వీ ఉమామహేష్‌తో పాటు డీన్లు, అధికారులు రాంచందర్, కుమారస్వామి, సాంబయ్య, బట్టు శ్రీను, భాస్కర్, రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.
- కేయూ క్యాంపస్: విద్యతోనే సామాజిక అభివృద్ధి సాధ్యం అవుతుందని కేయూ వీసీ కర్నాటి ప్రతప్‌రెడ్డి ఉద్బోధించారు. శుక్రవారం కేయూ సెనెట్ హాల్‌లో వర్సిటీ మహిళ అధ్యయన కేంద్రం, బీసీ సెల్ సంయుక్తంగా సావిత్రిబాయి ఫూలే జయంతిని నిర్వహించారు. డాక్టర్ బి.దీపాజ్యోతి అధ్యక్షత జరిగిన సమావేశంలో ప్రతాప్‌రెడ్డి మాట్లాడారు. వర్సిటీలో మహిళా విద్యార్థుల సంఖ్య పెరుగుతోందని చెప్పారు. గౌరవ అతిథి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి మాట్లాడుతూ సావిత్రిబాయి ఫూలేను స్మరించుకోవడంతో పాటు ఆమెను స్ఫూర్తిగా తీసుకోవాలని అన్నారు. పాలక మండలి సభ్యుడు ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్ మాట్లాడుతూ మహిళా సాధికారతకు పురుషుల సహకారం అవసరమన్నారు. కార్యక్రమంలో డాక్టర్ బి.రమ, డాక్టర్ చిర్రా రాజుగౌడ్, సోషియాలజీ విభాగాధిపతి డాక్టర్ స్వర్ణలత, మహిళా అధ్యాపకులు డాక్టర్ సీజే శ్రీలత తదితరులు, పీఆర్వో డాక్టర్ వల్లాల పృథ్వీరాజ్ పాల్గొన్నారు.
- కాకతీయ యూనివర్సిటీ దూరవిద్య కేంద్రం వద్ద శుక్రవారం ఫూలే విగ్రహాలకు పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్, కేయూవీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డిల పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కేయూ బీసీ సెల్ డైరెక్టర్ డాక్టర్ ఆకుతోట శ్రీనివాస్, డాక్టర్ కొట్టె భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.
- సావిత్రీబాయి జయంతిని మహిళా ఉపాధ్యాయ దినంగా ప్రకటించి చదువుల తల్లికి పురస్కారమిచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాస్ నేతృత్వంలో క్షీరాభిషేకం చేశారు. కాకతీయ యూనివర్సిటీలో ఫూలే ఆశయాల సాధన సమితి (పాస్) వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ సంగాని మల్లేశ్వర్ నేతృత్వంలో ఈ కార్యక్రమం జరిగింది. పాస్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ తాడూరి శాస్త్రి, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చందా మల్లయ్య, రాష్ట్ర పాస్ నాయకులు ప్రొఫెసర్ బి. సురేశ్‌లాల్, ప్రొఫెసర్ వై.వెంకయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ నల్లాని శ్రీనివాస్, డాక్టర్ ఆకుతోటశ్రీనివాస్, డాక్టర్ దాడబోయిన శ్రీకాంత్ యాదవ్, బొనగాని యాదగిరిగౌడ్, డాక్టర్ వంగాల సుధాకర్ పాల్గొన్నారు.
- పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.నరసింహరావు నేతృత్వంలో ఫూలే విగ్రహం వద్ద పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకులు కావ్య, కేయూ నేతలు బి.బాలకృష్ణ, పి.అనూష, పృథ్వీరాజ్, సాధన, శ్రీజ, అర్చన, మౌనిక, రమ్య, నరేశ్, సతీశ్, యాదగిరి, సాయి, సాయికుమార్ పాల్గొన్నారు. తెలంగాణ స్టూడెంట్ ఫోరం (టీఎస్‌ఎఫ్) జిల్లా అధ్యక్షుడు కొలుపుల శ్రీధర్, అడ్వకేట్ పాణి, రాఘవ, శ్రీకాంత్, ప్రకాశ్, భరత్‌లు పాల్గొన్నారు. టీఎస్‌ఎఫ్ కేయూ ఇన్‌చార్జి, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు బొట్ల మనోహర్ నేతృత్వంలో నివాళులర్పించారు. కార్యక్రమంలో జర్నలిజం విభాగం అధ్యాపకుడు దాడబోయిన శ్రీకాంత్ యాదవ్, నాయకులు దుర్గం మహేశ్, గారె శ్రావణ్, దర్శనం అమర్, నాగమణి, హారిక, కృష్ణవేణి, స్వాతి, లహరిక, సౌమ్య, అనా విక తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ రెసిడెన్షియల్ కళాశాలలో హంటర్‌రోడ్డులోని తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళ డిగ్రీ కళాశాలలో ఫూలే జన్మదిన వేడుకలు నిర్వహించారు. విద్యార్థులకు ఉపన్యాస పోటీలు నిర్వహించి బహుమతులను అందచేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ గోలి శ్రీలత, సాంబలక్ష్మి, భద్రకాళి, డాక్టర్ జక్కె పద్మ, జ్యోతి, రాధిక, డాక్టర్ విమల తదితరులు పాల్గొన్నారు. సుబేదారిలోని యూనివర్సిటీ న్యాయ కళాశాలలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నిమ్మ సుదర్శన్ నేతృత్వంలో ఫూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఫూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు డాక్టర్ ఎడ్ల ప్రభాకర్, విద్యార్థులు పాల్గొన్నారు.







కేయూలో ఫూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వీసీ ప్రతాప్‌రెడ్డి తదితరులు, నిట్‌లో వేడుకల్లో పాల్గొన్న డైరెక్టర్ విద్యాధర్ సుబుధి, కాజీపేట రైల్వే వోబీసీ కార్యాలయంలో సావిత్రిబాయి జయంతి వేడుకలు

అట్టహాసంగా టీపీజేఎంఏ క్రీడా సంబురాలు

▸▸ ఎస్సార్‌యూలో మూడు రోజుల పాటు కొనసాగనున్న క్రీడలు

హసన్‌పర్తి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎస్సార్ విశ్వవిద్యాలయంలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న టీపీజేఎంఏ క్రీడా సంబురాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. తెలంగాణ ప్రైవేటు జూనియర్ కాలేజ్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని కళాశాలల కరస్పాండెంట్స్‌కి ఎస్సార్ విశ్వవిద్యాలయం స్టేడియంలో జరుగుతున్న క్రికెట్ పోటీలను టీపీజేఎంఏ వరంగల్ డీఐఈవో శ్రీధర్‌సుమన, హనుమకొండ డీఐఈవో గోపాల్, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి ప్రారంభించి మాట్లాడారు. కొన్ని సంవత్సరాలుగా టీపీజేఎంఏ ఈ క్రీడలను ప్రోత్సహిస్తూ అన్ని కళాశాలల యాజమాన్యంతో కలిసి ఐకమత్యం చాటుతున్నామన్నారు. యేటా అన్ని కళాశాలల యాజమాన్యాలను ఏకతాటిపైకి తీసుకొచ్చి సంఘం బలోపేతం చేయడానికి కృషిచేస్తున్న టీపీజేఎంఏ బాధ్యులను అభినందించారు.

ఈ కార్యక్రమంలో టీపీ జేఎంఏ గౌరవ అధ్యక్షుడు, ఎస్సార్ విద్యాసంస్థల చైర్మన్ ఎనగందుల వరదారెడ్డి, ఏకశిల విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ గౌరు తిరుపతిరెడ్డి, సంఘ సభ్యులు కుమార్, రాజు, అశోక్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, జక్కుల రాజ్‌యాదవ్, అనుమాండ్ల విద్యాసాగర్, శివకుమార్‌తో పాటు జిల్లాలోని అన్ని కళాశాలల యాజమాన్యాల సభ్యులు పాల్గొన్నారు.



క్రీడల్లో పాల్గొన్న కళాశాలల యాజమాన్యం

ఎంజీఎం సూపరింటెండెంట్‌ను కలిసిన టీఎన్‌జీవోలు

వరంగల్ మెడికల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని హనుమకొండ జిల్లా టీఎన్‌జీవో నాయకులు ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ కిశోర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం సూపరింటెండెంట్ చాంబర్‌లో కలిసి పుష్పగుచ్ఛాలు అందించి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్, కార్యదర్శి సోమన్న, కోశాధికారి పి.రాజేష్, రాము నాయక్, శ్యామ్, కత్తి రమేశ్, లక్ష్మీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

డీఈవో కార్యాలయంలో అయ్యప్ప స్వాముల ఆందోళన

వరంగల్ ఎడ్యుకేషన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ డీఈవో కార్యాలయంలో శుక్రవారం రాత్రి అయ్యప్ప స్వాములు ఆందోళనకు దిగిన సంఘటన చోటుచేసుకుంది. డీఈవో వాసంతి తనను ఇబ్బందులకు గురిచేస్తోందని డీఈవో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ కవిత ఆరోపిస్తున్నారు. అయ్యప్ప మాల విరమణకు శుక్రవారం రాత్రి శబరికి వెళ్లాల్సి ఉండగా, సెలవు ఇచ్చినట్టే ఇచ్చి పని పూర్తిచేసి వెళ్లాలని రాత్రి 8 గంటల వరకు ఆఫీసులోనే ఉండేలా చేసిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఇరుముడిని కట్టుకునేందుకు తాను రావడం లేదని కుటీరంలోని స్వాములు ఫోన్ చేయగా విషయం చెప్పడంతో వారంతా డీఈవో కార్యాలయానికి చేరుకొని ఆందోళనకు దిగారు. దీంతో ఆఫీసులో పనిచేసుకుంటున్న ఎఫ్ఏవో కలుగజేసుకొని స్వాములకు సర్దిచెప్పి కవితను అక్కడ నుంచి పంపించి వేశారు. కాగా, వాసంతి హనుమకొండ డీఈవోగా బాధ్యతలు చేపట్టిన నాటినుంచి తనను హేళన చేస్తూ వేధిస్తోందని కవిత ఆరోపించారు. మూడున్నర నెలలుగా వేతనం చేయకుండా ఇబ్బంది పెడుతోందన్నారు. అయితే డీఈవో వాసంతిని వివరణ కోరగా.. కవితకు ఆఫీస్ పని రాదని, ఆమె శబరి వెళ్లేందుకు సెలవు మంజూరు చేశానన్నారు. అయితే ఆమె సెక్షన్‌లో పని పూర్తిచేసి వెళ్లాలని మాత్రమే చెప్పానని, తాను ఎవరినీ ఇబ్బందులకు గురిచేయడం లేదని వాసంతి వివరణ ఇచ్చారు.

ముడుపుల బాగోతంపై

నిఘా వర్గాల ఆరా

'ఆంధ్రజ్యోతి' కథనంతో కమిషనరేట్‌లో కలకలం

వరంగల్‌క్రైం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మహిళను మోసగించిన నిందితుడిని సెంట్రల్ జోన్ పరిధిలోని ఓ ఏసీపీ, సీఐ ముడుపులు తీసుకొని కాపాడుతున్నారని 'నిందితుడికి ఖాకీల వత్తాసు' పేరిట ఆంధ్రజ్యోతిలో శుక్రవారం ప్రచురించిన కథనం వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో చర్చనీయాంశమైంది. ఎవరు ఆ ఏసీపీ, సీఐ.. అని తెలుసుకునేందుకు పలువురు ఆసక్తి కనబరిచారు. ఇంటెలిజెన్స్, ఎస్‌బీ వర్గాలు ఆరా తీశాయి. బాధితురాలితోపాటు నిందితులు, ఠాణాలోని కొంతమంది సిబ్బందితో మాట్లాడి జరిగిన విషయాలు రాబట్టే ప్రయత్నం చేసినట్లుగా తెలిసింది. ఈ క్రమంలో నిఘా వర్గాలకు ఆ అధికారుల గురించి ఇంత వరకు తెలియని పలు విషయాలు వెలుగులోకి వచ్చినట్లుగా తెలుస్తోంది. ఆంధ్రజ్యోతి కథనంతో అప్రమత్తమైన సదరు అధికారులు.. ముడుపుల బాగోతం నుంచి బయటపడేందుకు కట్టుకథలతో కొత్త నాటకానికి తెరలేపుతున్నట్లుగా తెలుస్తోంది. అవసరమైతే బాధితులతోనే చెప్పించుకునే ప్రయత్నానికి తెరలేపుతున్నట్లుగా విశ్వసనీయమైన సమాచారం.

సెంట్రల్ జోన్ పరిధిలోని సదరు ఇద్దరు అధికారుల పనితీరుపై ఇప్పటికే పోలీస్‌బాస్ అసంతృప్తిగా ఉండగా, కొంతమంది రాజకీయ నాయకులు, వారి అనుచరులతో చెలరేగిపోతున్న ఆ ఇద్దరికి పోలీస్‌బాస్ త్వరలోనే చెక్ పెట్టబోతున్నట్లుగా తెలుస్తోంది. గతంలో ఆ ఏసీపీ వివాదం డీజీ స్థాయికి వెళ్లగా ఓ రాజకీయ నాయకుడి అండతో బయటపడ్డట్లుగా తెలుస్తోంది. ఈసారి ఆ పప్పులు ఏమీ ఉడకవని పోలీస్ బాస్ ఆగ్రహానికి గురికాక తప్పదని పోలీసు వర్గాలు అంటున్నాయి.

రైలు పట్టాలపై గుర్తు తెలియని మృతదేహం

గిర్మాజీపేట, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): వరంగల్ అండర్ రైల్వేగేటు సమీపంలోని సంతోషిమాత దేవాలయం ఎదురుగా రైలు పట్టాల పక్కన శుక్రవారం కుళ్లిపోయిన స్థితిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభించిందని వరంగల్ జీఆర్‌పీ సీపీ పి.సురేందర్ తెలిపారు. మృతుడు 5 అడుగుల 5 అంగుళాల ఎత్తు, తెలుపు రంగు లోయర్ ప్యాంటు, ఎరుపు రంగు టీషర్టు ధరించి ఉన్నాడని, అతడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని సీఐ వివరించారు. మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీలో భద్రపరిచి హెడ్ కానిస్టేబుల్ పి.రాజు కేసు దర్యాప్తు చేస్తున్నారని, ఆచూకీ తెలిసిన వారు 9441557232/8712658585 మొబైల్ నెంబర్లలో సంప్రదించాలని సీఐ కోరారు.

ఉద్యోగావకాశాలు సృష్టించడమే 'ఆసరా' ధ్యేయం

కాజీపేట, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు సృష్టించడమే ఆసరా ధ్యేయమని ఓమ్ని మార్ట్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపకుడు రాజేశ్ బాబు తుర్లపాటి అన్నారు. కాజీపేట మీడియా పాయింట్‌లో శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో రాజేశ్ బాబు తుర్లపాటి, ఆసరా స్టోర్స్ చీఫ్ ప్రాజెక్ట్ ఆఫీసర్ బాకీ భైరెడ్డి, కపాట్స్ బోర్డు డైరెక్టర్ ఆలేటి సుధాకర్‌లు మాట్లాడారు. ఆసరా స్టోర్‌ల ద్వారా అన్నిరకాల నాణ్యమైన నిత్యావసర సరుకులు అందిస్తూ, వాటి అమ్మకాల ద్వారా స్టోర్ నిర్వాహకులకు జీవనోపాధి అందిస్తామన్నారు. ప్రభుత్వంచే గుర్తింపు పొందిన స్టార్టప్, ఓమ్ని ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, గ్రామీణ రిటైల్ రంగాన్ని మారుస్తూ నిరుద్యోగులకు ఆసరా స్టోర్‌లు ప్రారంభిస్తున్నామన్నారు. ఒక్కో ఆసరా స్టోర్‌లకు నిర్వాహకులకు రూ.1,78500 ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. స్టోర్ నిర్వాహకులకు నెలకు రూ.5వేల గౌరవ వేతనం అందిస్తున్నామన్నారు. హనుమకొండ జిల్లా కాజీపేట, ధర్మసాగర్ మండలాల్లో పైలెట్ ప్రాజెక్ట్ కింద 10 ఆసరా స్టోర్‌లు ఏర్పాటు చేస్తున్నామని, ఈనెల చివరి వారంలో గ్రామీణ ప్రాంతాల్లో పర్యటించి అర్హులైన వారిని ఎంపిక చేస్తామని చెప్పారు.

సర్వమానవాళి సుఖసంతోషాలతో జీవించాలి

▸▸ బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్



దర్గాకు గిలాఫ్‌ను సమర్పిస్తున్న వినయ్ భాస్కర్

హనుమకొండ టౌన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): సర్వమానవాళి సుఖ సంతోషాలతో జీవించాలని మాజీ చీఫ్ విప్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో శుక్రవారం అజ్మీర్ ఖాజా గరీబ్ నవాజ్ రహమతుల్లా అల్లై దర్గాకు గిలాఫ్‌ను సమర్పించారు. ప్రత్యేక ప్రార్థనలు ముస్లింలతో కలిసి చేశారు. ఈ సందర్భంగా వినయ్ భాస్కర్ మాట్లాడుతూ.. యేటా కేసీఆర్, బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో గిలాఫ్‌ను పంపేవారమని అన్నారు. ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తూ పార్టీ హనుమకొండ జిల్లా పక్షాన గిలాఫ్‌ను పంపిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ వరంగల్ ఉమ్మడి జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎం.డి.నయీమొద్దీన్, జిల్లా నాయకులు ఎం.డి.పాషా, హుస్సేన్, అన్వర్ అలీ, ఎం.డి.అఫ్జల్, ఎం.డి.ఇస్మాయిల్, సిరాజ్, ఖలీల్, తస్నీం, నయీం, అక్బర్, ఫకీర్, రహీం, ఆఫ్రిన్, షకీల్, బియా, సందానీ, సర్దార్, యాకూబ్, పార్టీ శ్రేణు లు పులి రజినీకాంత్, శ్రీకాంతాచారి, బచ్చు అనిల్, భైరపాక ప్రశాంత్, చాగంటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



శాకాలు... పోషకాల నిధులు

భోజనకుతూహలం
ఆహారంతో ఆరోగ్యం

"మూల పత్ర కరీరాగ్ర ఫల కాండాధిరూఢకా
త్వక్ పుష్పం కవకంచేతి శాకం దశవిధం స్మృతమ్"

అంటాడు భోజన కుతూహల రచయిత రఘునాథ సూరి. ఆహారంలో శాకాలది ప్రధానమైన భాగస్వామమని దీని అర్థం. దుంప కూరలు, ఆకు కూరలు, చిగుర్లు, పండ్లు, కాయలు, కాడలు, మొలకలు, బెరళ్లు, పూలు, పుట్టగొడుగులు... వీటిని మనం తరచూ తింటూ ఉంటే ఆరోగ్యంగా ఉండగలుగుతాం. ఇప్పుడు మనం వీటిగురించి మరిన్ని వివరాలు తెలుసుకుందాం.

శాకాలలో చాలా పోషకపదార్థాలు ఉంటాయి. ఇవి రూపం మారినప్పుడు వాటిలో పోషక విలువలు కూడా మారిపోతూ ఉంటాయి. ఉదాహరణకు ఒక గింజను నానబెట్టి వుంచితే మొలకలొస్తాయి. ఈ మొలకల నుంచి కూరగాయలు పండుతాయి. మొలకలలో పోషక విలువలు.. కూరగాయల్లో పోషక విలువలు వేర్వేరుగా ఉంటాయి. అయితే ఈ శాకాలను తినే విషయంలో కొన్ని జాగ్రత్తలు పాటించాలి. ఒకే రకం కూరగాయని విడవకుండా తింటే అస్థిభేదక (ఎముకలు దెబ్బతినటం). నేత్రశక్తి నాశక (కంటి చూపు మందగించటం), రక్తశుక్ర నాశక (రక్త కణాల్ని, పురుషుల్లో జీవకణాల్ని నశింపచేయటం), ప్రజ్ఞాక్షయం (మేథశక్తిని హరిస్తుంది), ఫాలిత్యకారక (జుట్టు నెరిసిపోతుంది), స్మరణ శక్తి నాశక (జ్ఞాపక శక్తిని నశింప చేస్తుంది) అని భావప్రకాశ అనే ఆయుర్వేద గ్రంథం వివరించింది. కాబట్టి ప్రతి రోజూ ఒకే రకం కూరగాయలు కాకుండా ఒక రోజు దుంపకూర, ఒకరోజు ఆకు కూర, ఒకరోజు కాయగూర ఇలా ఆరు రకాల్నీ మార్చిమార్చి తినాలనేది అయిర్వేద నిపుణుల చెబుతూ ఉంటారు. దీనికి తగిన విధంగానే మన ఆహార ప్రణాళిక కూడా ఉండాలి. అంతే కాకుండా శరీర తత్వానికి ఏది మంచిదో దానినే తినాలి. లేకపోతే ఇబ్బందులు ఎదురయ్యే అవకాశముంది.

క్యారెట్, ముల్లంగి, కీరా, టమోటా లాంటి శాకాల్ని వండకపోయినా తేలికగానే అరుగుతాయి. తక్కిన కూరగాయల్ని సుపక్వంగా అంటే చక్కగావండుకొని తినటమే మంచిది.



ఈ మధ్యకాలంలో కూరల్లో కూరగాయలు తక్కువగా ఉంటున్నాయి. మసాలా గ్రేవీ లేదా చింతపండు రసం వంటివి సింహ భాగం కనిపిస్తున్నాయి. శాస్త్ర ప్రకారంలో కూరలో- కూరగాయ ముక్కలు ఎక్కువగా ఉండాలి. పోపు లేదా మసాలా తక్కువగా ఉండాలి. పోపు లేదా మసాలా వాసన కూరగాయలకు సహజంగా వచ్చే రుచిని చంపేయకూడదు.

తెల్లని దంతాలకు...

తెల్లగా మెరిసే దంతాలు అందంగా కనిపించడమే కాదు నోటి ఆరోగ్యానికి చిహ్నం కూడా. సమస్య వచ్చినప్పుడు చాలామంది రసాయనాలతో కూడిన చికిత్సలను ఆశ్రయిస్తుంటారు. వీటివల్ల పళ్ల మీద ఎనామిల్ పొర దెబ్బతినే అవకాశం ఉంది. అలాకాకుండా సహజ రీతిలో దంతాలను తెల్లగా మెరిపించే చిట్కాల గురించి తెలుసుకుందాం!

ఆయిల్ పుల్లింగ్




- ఇది ఆయుర్వేద విధానం. నోటిలో రెండు చెంచాల నువ్వుల నూనె లేదా కొబ్బరి నూనె వేసుకుని ఇరవై నిమిషాలపాటు పుక్కిలించి ఆ తరవాత ఉమ్మేయాలి. తరచూ ఇలా చేస్తుంటే నోటిలోని హానికారక సూక్ష్మజీవులు నశించిపోతాయి. నోటి కండరాలు బలోపేతమవుతాయి. చిగుళ్లకు రక్త ప్రసరణ జరుగుతుంది. దంతాలమీద పేరుకున్న పాచి, ఇతర పదార్థాల అవశేషాలు క్రమంగా కరిగిపోతాయి.

వేప పుల్ల...

- లావుగా ఉండే వేప పుల్లను తీసుకొని దాని కొనను నమిలి బ్రష్‌లా చేయాలి. ఇలా నములుతున్నపుడు నోటిలో ఊరే లాలాజలాన్ని ఉమ్మివేయాలి. చిగుళ్లను, దంతాలను మెల్లగా తోమాలి. వేప పుల్ల నుంచి వెలువడే యాంటీ బ్యాక్టీరియల్ దంతాలపై పేరుకున్న పాచిని తొలగిస్తుంది. ఇలా రోజూ చేస్తూ ఉంటే దంతాలు తెల్లగా ఆరోగ్యంగా ఉంటాయి. చిగుళ్ల వాపు, నోటి దుర్వాసన, దంతక్షయం లాంటి సమస్యలు రావు.

ముత్యాల ముగ్గు





11 మధ్య 6



చందన
తణుకు

ఈ-మెయిల్:
features@andhrajyothy.com

వంటిల్లు



ముల్లంగిని దక్షిణభారత దేశంలో కన్నా ఉత్తర భారత దేశంలో ఎక్కువగా తింటారు. శీతాకాలంలో పండే ఈ దుంప చూడటానికి చాలా అందంగా ఉంటుంది. ఈ వారం ముల్లంగితో చేసే కొన్ని వంటలు నేర్చుకుందాం...

ముల్లంగితో రుచి రుచిగా

ముల్లంగి కూర

కావాల్సిన పదార్థాలు

ముల్లంగి కోరు- రెండు కప్పులు, తరిగిన టమోటా ముక్కలు- ఒక కప్పు, జీలకర్ర- ఒక చెంచా, ఆవాలు- ఒక చెంచా, శనగపప్పు- ఒక చెంచా, మినపప్పు- ఒక చెంచా, కరివేపాకు- ఒక చెంచా, తరిగిన కొత్తిమీర- ఒక చెంచా, పల్లీల పొడి- నాలుగు చెంచాలు, నువ్వులు- రెండు చెంచాలు, పచ్చిమిరపకాయ ముక్కలు- ఒక చెంచా, వెల్లుల్లి రెబ్బలు- రెండు, ఇంగువ- తగినంత, ఉప్పు- తగినంత, పసుపు- అరచెంచా, కారం- అర చెంచా, నూనె- నాలుగు చెంచాలు, నీళ్లు- తగినన్ని.

తయారీ విధానం

1 ఒక మూకుడులో నూనెను వేడి చేసి జీలకర్ర, ఆవాలు, శనగపప్పు, మినపప్పులను వేయించాలి. అవి వేగిన తర్వాత కరివేపాకు, పచ్చిమిరపకాయ ముక్కలను కూడా వేసి వేయించాలి.

1 ఆ తర్వాత టమోటా ముక్కలు, ఇంగువ, కారం కలిపాలి. టమోటా ముక్కలు పచ్చి వాసన పోయే దాకా వేగనివ్వాలి.

1 ఈ మిశ్రమంలో ముల్లంగి కోరును వేయాలి. ఈ మిశ్రమం దగ్గర పడిన తర్వాత పల్లీల పొడి, నువ్వులు, ఉప్పు కలపాలి.

1 మూకుడు మీద నుంచి కిందకు దింపే ముందు కొత్తిమీర వేయాలి.

జాగ్రత్తలు

1 పచ్చి ముల్లంగికి కొద్దిగా వాసన ఉంటుంది. కానీ ముల్లంగి కోరును వేయిస్తే పోతుంది.

1 హైబ్రీడ్ టమోటాల కన్నా దేశవాళి టమోటాలను వాడితే బావుంటుంది.

1 పల్లీల పొడి బదులుగా కొబ్బరి కోరును కూడా వాడవచ్చు.





ముల్లంగి సలాడ్

కావాల్సిన పదార్థాలు:

ముల్లంగి ముక్కలు- ఒక కప్పు, ఉడికించిన బీన్స్- ఒక కప్పు, పళ్ల ముక్కలు- ఒక కప్పు, నిమ్మకాయ రసం- రెండు చెంచాలు, ఆవపిండి- ఒక చెంచా, తేనె- ఒక చెంచా, సోయా సాస్- ఒక చెంచా, మిరియాల పొడి- ఒక చెంచా, ఆవ నూనె- పావు చెంచా, ఉప్పు- తగినంత

తయారీ విధానం

1 ఒక గిన్నెలో ముల్లంగి ముక్కలు, ఉడికించిన బీన్స్, పళ్లముక్కలను బాగా కలపాలి.

ఆ మిశ్రమంలో నిమ్మకాయ రసం, ఆవపిండి, సోయా సాస్ వేసి కలపాలి.

1 దానిపై మిరయాల పొడి, ఆవ నూనె, ఉప్పు వేసి కలపాలి. ఈ సలాడ్ సూప్‌లో బావుంటుంది.

జాగ్రత్తలు

1 కొందరు ముల్లంగి ముక్కలను నూనె లేదా నెయ్యిలలో వేయిస్తారు. దీని వల్ల ఈ ముక్కలు దోరగా అవుతాయి.

1 కొందరు సలాడ్‌లో బూందీ మిక్సర్‌ను కలుపుతారు. దీని వల్ల అదనపు రుచి వస్తుంది.

ముల్లంగి పచ్చడి

కావాల్సిన పదార్థాలు

ముల్లంగి ముక్కలు: ఒక కప్పు, ఎర్ర ఉల్లిపాయ ముక్కలు- అరకప్పు, తెల్ల వెనిగర్: ఒక కప్పు, పంచదార- అర కప్పు, ఆవాలు- ఒక చెంచా, మిరియాల పొడి- ఒక చెంచా, లవంగాలు- ఆరు

తయారీ విధానం

1 ఒక మూకుడులో తెల్ల వెనిగర్, పంచదార, ఆవాలు, మిరియాల పొడి వేసి- పంచదార కరిగే దాకా వేడిచేయాలి.

1 ఆ తర్వాత ఆ మిశ్రమంలో ముల్లంగి ముక్కలు, ఉల్లిపాయ ముక్కలు వేయాలి. ఒక నిమిషం తర్వాత దింపేయాలి.

1 ఈ మిశ్రమం బాగా చల్లారిన తర్వాత ఒక గ్లాస్ జార్‌లో వేయాలి. దానిలో లవంగాలు వేయాలి.

జాగ్రత్తలు

1 ముల్లంగి, ఉల్లిపాయ ముక్కలను ఎక్కువ వేడి చేయకూడదు. ఎక్కువ వేడి చేస్తే చెడు వాసన వచ్చే ప్రమాదం ఉంది.

1 ఈ పచ్చడి బాగా చల్లారిన తర్వాత కానీ ఫ్రిజ్‌లో పెట్టకూడదు. ఇది రెండు వారాల దాకా నిల్వ ఉంటుంది.



మచ్చలు మటుమాయం చేసేలా...

ముఖం మీద మొటిమలు, గాట్లు, పుట్టుమచ్చ ల్లాంటి వాటిని దాచేయాలంటే, కొన్ని మేకప్ మెలకువలు అనుసరించాలి. అవేంటో తెలుసుకుందాం!

కన్‌సీలర్‌తో: మచ్చల రంగును బట్టి వాటిని కనిపించకుండా చేసే కన్‌సీలర్ ఎంచుకోవాలి. మచ్చ ఎర్రగా ఉండే గ్రీన్ టింట్ కలిగి ఉండే కన్‌సీలర్ అద్దుకోవాలి. నల్లగా ఉంటే, ఎరుపు రంగు కన్‌సీలర్ ఎంచుకోవాలి. ఇందుకోసం మేకప్ స్పాంజ్‌తో ఈ కన్‌సీలర్ పలుచగా అద్దుకుని, ఆ తర్వాత సాధారణ కన్‌సీలర్‌ను మచ్చ ఉన్న ప్రదేశంలో అద్దుకోవాలి. ఇందుకోసం మేకప్ స్పాంజ్ మీద కన్‌సీలర్ వొంపి, మచ్చతో పాటు, దాని చుట్టూరా అద్దుకోవాలి.

మేకప్



ఫౌండేషన్ ఇలా: కన్‌సీలర్ అద్దుకున్న తర్వాత మేకప్ స్పాంజ్‌తో ఫౌండేషన్ పూసుకోవాలి. అసహజమైన గీతలు కనిపించకుండా, ముఖం మొత్తం ఫౌండేషన్ సమంగా పరుచుకునేలా స్పాంజ్‌తో అద్దుకోవాలి. తర్వాత మేకప్ దవడ ఎముక దిగువ వరకూ బ్లెండ్ చేయాలి. తర్వాత పెద్ద బ్రష్‌తో లూజ్ మ్యాట్ పౌడర్‌ను తీసుకుని, వృత్తాకారంలో ముఖం మీద అద్దుకోవాలి. మచ్చ మీద పౌడర్ పరుచుకోవడం వల్ల, అది చర్మంలో కలిసిపోతుంది.

ఎన్నారైల మానసిక సమస్యలు- పరిష్కారాలు



ప్రముఖ సైక్రియాటిస్ట్ డాక్టర్ స్రవంతి ఉత్పల ఇంటర్వ్యూ
మీ ఏబీఎన్ యూట్యూబ్ ఛానల్‌లో

యువ

తండ్రి ఆస్తిపాస్తులకే కాదు... ఆయన ఆశయాలకు కూడా వారసురాలిగా నిలిచింది సారా టెండూల్కర్. క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ కుమార్తెగా ఆమె ప్రపంచానికి సుపరిచితురాలు. కానీ నాన్న నీడలో కాకుండా స్వశక్తితో ఎదిగి... తనదైన బాటను నిర్మించుకొంటోంది. ప్రముఖ బ్రాండ్లకు ప్రచారకర్తగా వ్యవహరిస్తున్న సారా... మోడల్‌గానే కాకుండా సామాజిక సేవ వైపూ అడుగులు వేస్తోంది. 'సచిన్ టెండూల్కర్ ఫౌండేషన్' డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించి... ఆపన్నులకు అండగా నిలుస్తోంది.

మన సారా మంచి కోసం



క్రికెట్ దేవుడు సచిన్ కుమార్తె సారా టెండూల్కర్ ఇప్పుడు ఇంటర్నెట్ సంచలనం. షార్ట్ రీల్స్, ఫేస్‌బుక్, యూట్యూబ్... రోజూ ఎక్కడో అక్కడ కనిపిస్తూనే ఉంటుంది. భారత క్రికెట్ స్టార్ శుభ్‌మన్ గిల్ ప్రేయసి అంటూ 27 ఏళ్ల సారా గురించి కొన్ని మాధ్యమాలు ఊదరగొడుతున్నాయి. అందులో వాస్తవం ఎంతనేది పక్కన పెడితే... దీనివల్ల ఆమెకు ఊహించని ప్రచారం లభించింది. కోట్ల మంది అభిమాన తార అయింది. ముంబయిలో పుట్టి పెరిగిన సారా... 'ధీరూభాయ్ అంబానీ ఇంటర్నేషనల్ స్కూల్'లో చదివింది. 2018లో యూకేలోని 'యూనివర్సిటీ కాలేజీ లండన్' (యూసీఎల్) నుంచి బయోకెమికల్ సైన్స్ పట్టా పొందింది. అదే కాలేజీలో క్లినికల్ అండ్ పబ్లిక్ హెల్త్ న్యూట్రిషన్‌తో 2023లో ఎంఎస్సీ పూర్తి చేసింది. తరువాత భారత్‌కు తిరిగివచ్చింది. యూకే 'అసోసియేషన్ ఫర్ న్యూట్రిషన్'లో రిజిస్టర్డ్ న్యూట్రిషనిస్టు. పోషకాహార నిపుణురాలిగా కొనసాగాలన్నది ఆమె నిర్దేశించుకున్న లక్ష్యాల్లో ఒకటి. తమ్ముడు అర్జున్ టెండూల్కర్ క్రికెటర్. అమ్మ అంజలి వైద్యురాలు.

అదే ఆమె ఆకాంక్ష...

సచిన్ నీడలో కాకుండా... స్వయంకృషితో ఎదిగి, తనదైన ముద్ర వేయడానికి సారా తాపత్రయపడుతోంది. ఎక్కడకు వెళ్లినా టెండూల్కర్ కూతురుగా కాకుండా తనను తనుగా గుర్తించాలనేది ఆమె ఆకాంక్ష. అందుకే తనకు నచ్చినట్టు కెరీర్‌ను మలుచుకొనే ప్రయత్నం చేస్తోంది. అందుకు ఆమె తల్లితండ్రులు కూడా పూర్తి స్వేచ్ఛనిచ్చారు. ఏదికావాలన్నా సమకూరుస్తున్నారు. ఆ క్రమంలోనే ఇన్‌స్టాలోకి అడుగుపెట్టిన సారాకు ఆరంభంలోనే మంచి స్పందన లభించింది. ఇన్‌స్టాగ్రామ్‌లో ఇప్పుడామెకు 75 లక్షలకు పైగా ఫాలోవర్స్ ఉన్నారు. అందుకే బడా బ్రాండ్లు సారా వెంట పడుతున్నాయి. తన దైనందిన జీవిత విశేషాలు, కుటుంబం, స్నేహితులు, సన్నిహితులతో కలిసి విహార యాత్రల్లో ఆస్వాదిస్తున్న మధుర క్షణాలకు సంబంధించిన చిత్రాలు, చిన్న చిన్న వీడియోలను ఆమె ఇన్‌స్టాలో పోస్ట్ చేస్తుంటుంది. వాటితోపాటు 'సచిన్ టెండూల్కర్ ఫౌండేషన్' (ఎస్‌టీఎఫ్) చేపట్టే కార్యక్రమాలు, దానితో కలిసి పని చేస్తున్న పలు సంస్థల వివరాలు, తను ప్రచారకర్తగా వ్యవహరిస్తున్న ప్రకటనలను అక్కడ పంచుకొంటోంది.

ఫిట్‌నెస్ తరువాతే ఏదైనా...

ఎంత పని ఒత్తిడిలో ఉన్నా సారా జిమ్‌కు వెళ్లడం మాత్రం మానదు. ఆమెకు ఫిట్‌నెస్ తరువాతే ఏదైనా. సెలవు రోజుల్లో అయినా, ఇతర ప్రాంతాల్లో పర్యటిస్తున్నా... దగ్గర్లోని జిమ్‌కు వెళ్లి వ్యాయామాలు చేస్తుంది. ఇటీవల తమ్ముడు అర్జున్‌తో కలిసి విహార యాత్రకు దుబాయ్ వెళ్లిన ఆమె... ఫిట్‌నెస్‌ను మాత్రం మరిచిపోలేదు. ఉదయం లేవగానే కొంత సమయం కసరత్తులకు కేటాయించింది. ఆహార విషయంలో కూడా ఎన్నో జాగ్రత్తలు తీసుకొంటుంది. చర్మ సంరక్షణకు ప్రాధాన్యం ఇస్తుంది. పలు చర్మసౌందర్య ఉత్పత్తుల ప్రకటనల్లో కూడా నటించింది. భారతీయ సంప్రదాయ వంటలతో పాటు ఇటాలియన్ రుచులంటే ఆమెకు ఇష్టం. బాలి, ఇటలీ నచ్చిన పర్యాటక ప్రాంతాలు. సారా జంతు ప్రేమికురాలు కూడా. పిల్లులు, అరుదైన చేపలు పెంచుకొంటోంది. రెండు మేలు జాతి కుక్కలు కూడా ఇంట్లో ఉన్నాయి.

> **మనం ఎదగడమే కాదు... మనం జీవిస్తున్న సమాజం గురించి కూడా పట్టించుకోవాలనేది సారా అభిమతం. ఇటీవల తండ్రి నెలకొల్పిన 'సచిన్ టెండూల్కర్ ఫౌండేషన్'కు డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టి, ఆ దిశగా తొలి అడుగు వేసింది.**



సామాజిక చైతన్యం...

మనం ఎదగడమే కాదు... మనం జీవిస్తున్న సమాజం గురించి కూడా పట్టించుకోవాలనేది సారా అభిమతం. ఇటీవల తండ్రి నెలకొల్పిన 'సచిన్ టెండూల్కర్ ఫౌండేషన్'కు డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టి, ఆ దిశగా తొలి అడుగు వేసింది. 'ఈ కొత్త పాత్రలో సారాను చూస్తుంటే నాకు గర్వంగా ఉంది. ప్రజలకు, సమాజానికి చేయూత అందించడంలో తను ఎప్పుడూ ముందుంటుంది. మా ఫౌండేషన్‌ను మరో ఎత్తుకు తీసుకెళతుందన్న నమ్మకం నాకు ఉంది. వైద్య రంగంపై ఉన్న పరిజ్ఞానం సమాజ సాధికారతకు మరింతగా తోడ్పడుతుంది' అంటూ ఈ సందర్భంగా సచిన్ తన ట్వీట్ చేశారు.

'మా నాన్న చేపట్టిన ఈ అద్భుతమైన పనిలో భాగమై, సమాజంలో మార్పు తీసుకురావడానికి నేను కూడా దోహదపడుతున్నందుకు ఎంతో సంతోషంగా ఉంది' అంటూ బాధ్యతలు స్వీకరించిన అనంతరం సారా పేర్కొంది. మారుమూల పల్లె ప్రాంతాల్లోని పిల్లలకు వైద్య సేవలు అందిస్తూ, పోషకాహార లోపాన్ని అధిగమించేలా ఈ ఫౌండేషన్ కార్యక్రమాలు చేపడుతుంది. క్రీడలు, విద్య, ఆరోగ్య సంరక్షణ ద్వారా వారిని సమున్నతంగా నిలిపేందుకు కృషి చేస్తోంది.

ప్రత్యేక సమయం...

ఎస్‌టీఎఫ్ డైరెక్టర్‌గా తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించడానికి సారా ప్రత్యేక సమయం కేటాయిస్తోంది. మోడల్‌గా, న్యూట్రిషనిస్టుగా తన కెరీర్‌కు సంబంధించిన అంశాలతో పాటు ఫౌండేషన్ కార్యక్రమాలు కూడా చూసుకొంటోంది. తరచూ మారుమూల గ్రామాలకు వెళ్లి, అక్కడి పిల్లలతో మమేకం అవుతోంది. ఈ మధ్య తల్లితో కలిసి రాజస్థాన్ ఉదయ్‌పూర్‌లోని గ్రామానికి వెళ్లింది. 'అక్కడి అణగారిన వర్గాలకు చెందిన చిన్నారులను కలిశాను. వారి ఆరోగ్య సంరక్షణకు క్లినిక్స్ నెలకొల్పాం. పోషకాహారం అందించేందుకు తగిన ఏర్పాట్లు చేశాం. ఆ పర్యటన అర్థవంతంగా ముగిసినందుకు సంతృప్తిగా ఉంది' అంటూ తన సంతోషాన్ని పంచుకుంది. మరింతమంది చిన్నారుల ఆరోగ్యం, అభివృద్ధికి తన వంతు సహకారం అందించే దిశగా భవిష్యత్తు ప్రణాళికలు రచించే పనిలో సారా నిమగ్నమైంది.

సీఎంఆర్ కళాశాల ఘటనపై ప్రత్యేక కమిటీ!

- ఏర్పాటు చేసే యోచనలో ప్రభుత్వం!
- ఘటనపై మహిళా కమిషన్ సీరియస్
- కాలేజీలకు 2 రోజులు సెలవు ప్రకటించిన యాజమాన్యం
- నిరసనలు విరమించి ఇంటి బాట పట్టిన విద్యార్థులు

మేడ్చల్ టౌన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): సీఎంఆర్ కళాశాల బాలికల వసతిగృహం ఘటనపై విచారణకు ప్రభుత్వం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు తెలుస్తోంది. కమిటీ ద్వారా వాస్తవాలను బయటకు తెచ్చేందుకు గట్టి చర్యలు తీసుకుంటున్నట్లు సమాచారం. కళాశాల వసతి గృహంలో బాత్రూమ్ వెంటిలేటర్ నుంచి వీడియోలు చిత్రీకరిస్తున్నారని విద్యార్థులు రెండు రోజులుగా నిరసనలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో కళాశాలకు యాజమాన్యం రెండు రోజులు సెలవులు ప్రకటించింది. ఆదివారంతో మొత్తం మూడు రోజులు సెలవులు రావడంతో విద్యార్థులు ఆందోళన విరమించి ఇంటి బాట పట్టారు. అయితే ఇది నిరసనలకు తాత్కాలిక విరామం మాత్రమేనని విద్యార్థి సంఘాలు ప్రకటించాయి. యాజమాన్యం సెలవులు ప్రకటించి తమ ఉద్యమాన్ని నీరుగార్చే ప్రయత్నం చేసిందని కొందరు విద్యార్థులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనపై మహిళా కమిషన్ కూడా సీరియస్‌గా ఉంది. ఈ వ్యవహారాన్ని సుమోటోగా స్వీకరించిన మహిళా కమిషన్ ఇప్పటికే కళాశాలకు నోటీసులు జారీ చేయటంతో పాటు విచారణకు ఆదేశాలు ఇచ్చింది. మరోవైపు పోలీసులు కూడా దర్యాప్తు చేస్తూనే ఉన్నారు. వసతి గృహంలో పనిచేసే సిబ్బంది నుంచి స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్‌ల లోని డేటాలో ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో మరింత లోతుగా విచారణ చేపట్టేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. బాత్రూమ్ వెంటిలేటర్‌పై వేలి ముద్రలు సేకరించినప్పటికీ వాటి ఆధారంగా వీడియోలు తీసిన వారిని గుర్తించడం కష్టతరమని పోలీసులు భావిస్తున్నారు. ఇప్పటికే వార్డెన్‌తో సహా సిబ్బంది వేలి ముద్రలను సేకరించి పరీక్షల కోసం పంపారు. హాస్టల్ నిర్వహణలో కొన్ని లోపాలను పోలీసులు, మహిళ కమిషన్ గుర్తించినట్టు సమాచారం.

పండుగ వేళ పరీక్షలు.. విద్యార్థుల మండిపాటు

- కనుమ నాడు సెమిస్టర్ పరీక్షకు జేఎన్‌టీయూ షెడ్యూల్

హైదరాబాద్ సిటీ, జనవరి 3(ఆంధ్రజ్యోతి): కనుమ పండుగ రోజున సెమిస్టర్ పరీక్షలు నిర్వహించాలని జేఎన్‌టీయూ పరీక్షల విభాగం అధికారుల తీసుకున్న నిర్ణయంపై కళాశాలల యాజమాన్యాలు, విద్యార్థులు, తల్లిదండ్రులు మండిపడుతున్నారు. ఈనెల 15న కనుమ పండుగ నాటి నుంచి అఫిలియేటెడ్ కళాశాలకు చెందిన ఇంజనీరింగ్ విద్యార్థులకు సెమిస్టర్ పరీక్షల నిర్వహణకు జేఎన్‌టీయూ అధికారులు శుక్రవారం షెడ్యూల్ జారీ చేశారు. దీని వల్ల సుమారు లక్షమందికి పైగా విద్యార్థులు ఇబ్బంది పడాల్సివస్తుంది. పండుగకు దూరప్రాంతాల్లోని సొంతూళ్లకు వెళ్లిన విద్యార్థులు, ఉద్యోగులు 15వ తేదీన కళాశాలలకు రావడం సాధ్యపడే పని కాదని కళాశాలల యాజమాన్యాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేయాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు.

ఎల్లుండి విచారణకు రండి!

- విజయసాయిరెడ్డికి మళ్లీ ఈడీ నోటీసులు

అమరావతి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): కాకినాడ సీపోర్టులో కేవీరావు వాటాలను బలవంతంగా లాక్కున్న కేసులో సోమవారం విచారణకు రావాలంటూ వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డిని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఆదేశించినట్టు తెలిసింది. ఇప్పటికే ఈడీ ఒకసారి ఆయనకు నోటీసు ఇచ్చింది. పార్లమెంటు సమావేశాలు జరుగుతున్నాయన్న కారణం చూపి విజయసాయి అప్పట్లో విచారణకు హాజరుకాలేదు. తాజాగా మరోసారి ఆయనకు నోటీసులు అందినట్టు వైసీపీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ 'డీల్'లో విజయ సాయిరెడ్డి, ఆయన కుమారుడు విక్రాంత్ రెడ్డిదే కీలక పాత్ర! ఈ వ్యవహారంలో భారీగా మనీ లాండరింగ్ కూడా జరిగినట్లు గుర్తించడంతో... ఈడీ రంగంలోకి దిగింది. విక్రాంత్ రెడ్డి, విజయ సాయిరెడ్డికి నోటీసులు జారీ చేసింది.

నటుడు అల్లు అర్జున్‌కు ఊరట

- షరతులతో కూడిన బెయిల్ మంజూరు

హైదరాబాద్, జనవరి3(ఆంధ్రజ్యోతి): పుష్ప2 బెనిఫిట్ షో సందర్భంగా సంధ్య థియేటర్ దగ్గర డిసెంబరు నాలుగున జరిగిన తొక్కిసలాట ఘటనలో హీరో అల్లు అర్జున్‌కు నాంపల్లి కోర్టు షరతులతో కూడిన బెయిల్‌ను మంజూరు చేసింది. బెయిల్ పిటిషన్‌పై గత నెల 30వ తేదీన వాదనలు పూర్తి కాగా శుక్రవారం ఈ పిటిషన్‌పై నాంపల్లిలోని రెండో మెట్రోపాలిటన్ సెషన్స్ కోర్టు అదనపు న్యాయమూర్తి వినోద్ కుమార్ తీర్పును వెల్లడించారు. ఈ కేసులో ఏ11గా ఉన్న అల్లు అర్జున్ ప్రస్తుతం హైకోర్టు ఇచ్చిన మధ్యంతర బెయిల్‌పై ఉండగా తాజాగా నాంపల్లి కోర్టు షరతులతో కూడిన సాధారణ బెయిల్ ఇచ్చింది. పోలీసులు పూర్తి చార్జిషీట్ దాఖలు చేసే వరకు 2 నెలల పాటు అల్లు అర్జున్ ప్రతి ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు చిక్కడపల్లి పోలీసుల ఎదుట విచారణకు హాజరవ్వాలని ఆదేశించింది. ముందస్తు అనుమతి లేకుండా దేశం విడిచి వెళ్లరాదని పేర్కొంది.

బీజాపూర్‌లో జర్నలిస్టు హత్య

- చంపి సెప్టిక్ ట్యాంక్‌లో పడేసిన దుండగులు

చర్ల, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాలో ఓ యువ జర్నలిస్టును గుర్తుతెలియని దుండగులు హత్య చేశారు. శుక్రవారం ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. బీజాపూర్ వాసి ముకేష్ చంద్రాకర్ ఎన్‌డీటీవీ రిపోర్టర్‌గా పని చేస్తున్నాడు. బస్తర్ జంక్షన్ యూట్యూబ్ రిపోర్టర్‌గా కూడా పని చేస్తున్నాడు. జనవరి 1వ తేదీ నుంచి ముకేష్ కనిపించడం లేదు. దీంతో అతని అన్నయ్య యుకేష్ జిల్లా ఎస్పీకి శుక్రవారం ఫిర్యాదు చేశాడు. ముకేష్ సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా ఎస్పీ విచారణ ప్రారంభించారు. బీజాపూర్‌లోని ఓ కాంట్రాక్టర్ ఇంటి వద్ద లోకేష్ ఫోన్‌సిగ్నల్ ఆగిపోయింది. అక్కడే, సెప్టిక్ ట్యాంక్‌పై సిమెంట్ పూత పూసిన ఆనవాళ్లు కనిపించాయి. దీంతో అనుమానం వచ్చిన పోలీసులు అక్కడ తవ్వకాలు జరపగా.. ముకేష్ చంద్రాకర్ మృతదేహం లభ్యమైంది. కాగా కొద్దిరోజుల క్రితం ఓ రోడ్డు పనులు నాణ్యత లేకుండా జరిగాయని ముకేష్ ఓ వార్తను ప్రచురించినట్లు తెలుస్తోంది. ఈక్రమంలో సంబంధిత కాంట్రాక్టర్ మనుషులు ముకేష్‌ను హత్య చేసినట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మంచి రిపోర్టర్‌ను ఛత్తీస్‌గఢ్ కోల్పోయిందని, ముకేష్‌ను చంపిన వారిని పట్టుకుంటామని ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్‌సాయి పేర్కొన్నారు.

వేగంగా చెరువుల ఎఫ్‌టీఎల్ నిర్ధారణ

హైకోర్టు విచారణతో ప్రభుత్వ విభాగాల్లో పెరిగిన స్పీడు

- 3503 చెరువుల సర్వే పూర్తి
- గత రెండు నెలల్లో 300కుపైగా తుది నోటిఫికేషన్లు



హైదరాబాద్ సిటీ, జనవరి3 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ హైదరాబాద్, హెచ్ఎండీఏ పరిధిలోని చెరువుల ఎఫ్‌టీఎల్(ఫుల్ ట్యాంక్ లెవల్) నిర్ధారణ ప్రక్రియ ఇటీవల వేగవంతం అయింది. చెరువుల సంరక్షణ కోసం లేక్ ప్రొటెక్షన్ కమిటీ(ఎల్‌పీసీ) ఏర్పాటై పదేళ్లు అవుతుంది. ఈ పదేళ్లలో చెరువుల హద్దులు నిర్ణయిస్తూ జారీ అయిన తుది నోటిఫికేషన్ల సంఖ్య 300 లోపే ఉంటుంది. అలాంటిది గత రెండు నెలల్లో 300కు పైగా తుది నోటిఫికేషన్లు జారీ అయ్యాయంటే.. చెరువుల సంరక్షణకు ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యాన్ని అర్థం చేసుకోవచ్చు. హైడ్రా ఏర్పాటైన తర్వాత చెరువుల్లో ఆక్రమణల కూల్చివేతలు పెరిగాయి. ఈ నేపథ్యంలో చెరువుల హద్దులకు సంబంధించిన తుది నోటిఫికేషన్ల జారీ అంశంపై ఆరు నెలల క్రితం సుమోటోగా ఓ పిటిషన్ రిజిస్టర్ చేసిన హైకోర్టు ప్రతి నెలా విచారణ జరుపుతోంది. దీంతో అప్రమత్తమైన హెచ్ఎండీఏ, రెవెన్యూ, ఇరిగేషన్ ఇతర ప్రభుత్వ విభాగాలు వేగం పెంచాయి. ఫలితంగా ఆరు నెలల క్రితం 300లోపు ఉన్న తుది నోటిఫికేషన్ జారీ అయిన చెరువుల సంఖ్య ప్రస్తుతం 765కు చేరింది. ఫిబ్రవరి 4న జరిగే తదుపరి విచారణ నాటికి ఈ సంఖ్యను వెయ్యి దాటించాలని హెచ్ఎండీఏ లక్ష్యంగా పెట్టుకుంది. తుది నోటిఫికేషన్ల జారీలో రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, యాదాద్రి భువనగిరి, మెదక్, సిద్దిపేట జిల్లాల్లో పురోగతి ఉండగా హైదరాబాద్ జిల్లాలో అడుగులు ముందుకు పడడం లేదు.

2891 చెరువులకు ప్రాథమిక నోటిఫికేషన్

గ్రేటర్ హైదరాబాద్, హెచ్ఎండీఏ పరిధిలోని చెరువుల సంరక్షణకు 2010లో అప్పటి ప్రభుత్వం ఎల్‌పీసీని ఏర్పాటు చేసింది. ఎల్‌పీసీ ఆదేశాల ప్రకారం జీహెచ్ఎంసీ పరిధిలో 175, ఔటర్ పరిధిలో 326 కలిపి 501 చెరువుల్లో సర్వే చేసి ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లను నిర్ధారించే పనిని టెండరు ప్రక్రియ ద్వారా 2013లో ఓ కన్సల్టెన్సీకి అప్పగించారు. అనంతరం ఫేజ్-2లో మరో 2,402 చెరువుల సర్వేకు ఒప్పందం చేసుకున్నారు. మొత్తం 3532 చెరువుల్లో 3,503కు సంబంధించిన సర్వే పూర్తయినట్టు సమాచారం. అయితే, ఇందులో రెవెన్యూ, ఇరిగేషన్ శాఖలు ధ్రువీకరించిన 2,891 చెరువులకు హెచ్ఎండీఏ ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేసింది. ఆయా చెరువులకు ఐడీ నెంబర్లు ఇచ్చింది. ప్రజల నుంచి అభ్యంతరాలను స్వీకరించిన తర్వాత వీటిల్లో 765 చెరువులకు తుది నోటిఫికేషన్లు జారీ చేశారు.

ఎఫ్‌టీఎల్ నిర్ధారణ ఇలా

ఎల్‌పీసీ మార్గదర్శకాల ప్రకారం.. ఏదైనా ఓ చెరువుకు అలుగు (మత్తడి) ఉంటే దాని ఎత్తును ఆధారంగా చేసుకొని.. చెరువుకు అన్నివైపులా అదే స్థాయి స్థలం ఉండేలా కొలతలు తీసుకుంటారు. అలుగు ఎత్తునే ఆ చెరువు ఎఫ్‌టీఎల్‌గా నిర్ధారిస్తున్నారు.

అలుగు లేని చెరువుల అంశంలో ఎఫ్‌టీఎల్ నిర్ధారణ తూముల ఆధారంగా జరుగుతుంది. తూముకు 0.6మీటర్ల ఎత్తు నుంచి డీజీపీఎస్ అనే పరికరాన్ని వినియోగించి కొలతలు తీసుకుంటున్నారు.

అలుగు, తూము లేని చెరువుల ఎఫ్‌టీఎల్ నిర్ధారణకు ఆయా చెరువుల కట్ట ప్రామాణికం అవుతుంది. చెరువు నిండిన సమయంలో కట్ట(బండ్)కు ఆనుకుని నీరు బయటకు వెళుతుంది. దాన్ని ఆధారంగా చేసుకొని ఎఫ్‌టీఎల్ నిర్ధారిస్తున్నారు.

అలుగు, తూము, కట్ట లేని చెరువుల ఎఫ్‌టీఎల్ నిర్ధారణకూ మార్గదర్శకాలున్నాయి. చెరువు నిండిన తర్వాత నీళ్లు బయటకు పోయేందుకు ఆ చెరువుకు అనుకొని రోడ్డు మార్గం ఉన్న ప్రాంతాల్లోనే పైపులను అమర్చుతారు. ఆ పైపులకు కింది లెవల్‌ను ఆధారంగా చేసుకొని ఆయా చెరువుల ఎఫ్‌టీఎల్‌ను నిర్ధారిస్తున్నారు. సర్వే వివరాలను రెవెన్యూ, ఇరిగేషన్ రికార్డులతో పోల్చుతున్నారు.

చెరువుల ఎఫ్‌టీఎల్ నిర్ధారించే క్రమంలోనే బఫర్‌జోన్‌ను కూడా గుర్తిస్తున్నారు. 10హెక్టార్ల లోపు (24.75ఎకరాలు) ఉన్న చెరువులకు బఫర్ జోన్ 9మీటర్లుగా (30అడుగులు).. 10 హెక్టార్ల కంటే (24.75ఎకరాలు) మించి ఉండే చెరువులకు బఫర్ జోన్‌ను 30మీటర్లు (వంద అడుగులు) తీసుకుంటున్నారు.



సంద్రంలో సాహస యాత్ర

- 150 కి.మీ. అలవోకగా ఈదిన 52ఏళ్ల స్విమ్మర్ శ్యామల
- ఏడు రోజుల్లో విశాఖ నుంచి కాకినాడ తీరానికి రాక

సర్పవరం జంక్షన్(కాకినాడ), జనవరి 3(ఆంధ్రజ్యోతి): నడి సముద్రంలో మహిళా స్విమ్మర్ గోలి శ్యామల సాహసం చేశారు. విశాఖ నుంచి కాకినాడ వరకు 150 కిలోమీటర్లు అవలీలగా ఈది రికార్డు సృష్టించారు. మహిళల ఆరోగ్యం, పర్యాటకరంగ అభివృద్ధి లక్ష్యంతో కాకినాడ జిల్లా సామర్లకోటకు చెందిన 52 ఏళ్ల గోలి శ్యామల డిసెంబరు 28న విశాఖలోని ఆర్కే బీచ్ నుంచి ఈత ప్రారంభించారు. జనవరి 3వ తేదీ శుక్రవారం మధ్యాహ్నానికి కాకినాడ రూరల్ ఎన్టీఆర్ బీచ్‌కు చేరుకున్నారు. ఆసియాలోనే ఈ లక్ష్యాన్ని సాధించిన మొదటి స్విమ్మర్‌గా అరుదైన ఘనత సొంతం చేసుకున్నారు. సముద్రంలో ప్రతిరోజూ సూర్యోదయం సమయంలో ఆమె ఈత ప్రారంభించేవారు. సూర్యాస్తమయానికి ఆపేసి రాత్రి విశ్రాంతి తీసుకునేవారు. దీని కోసం ఆమెకు సహకారంగా ఒక నేవీ బోటు వెంట వచ్చింది.

తాబేళ్లు వెంట వచ్చాయి..

ఈత పూర్తయిన తర్వాత స్విమ్మర్ శ్యామల మాట్లాడుతూ.. ఈ రికార్డుతో ప్రపంచంలోనే నాలుగో అంతర్జాతీయ స్విమ్మర్‌గా, దేశంలో నంబర్‌వన్‌గా నిలవడం ఆనందంగా ఉందన్నారు. భోజన విరామం కోసం మధ్యాహ్నం అరగంట బోట్‌లోకి వెళ్లి పెరుగు అన్నం, లిక్విడ్‌ని ఆహారంగా తీసుకున్నానని చెప్పారు. రాంబిల్లి సముద్రంలో తాబేళ్లు చక్కగా తనను వెంబడించడం ఆనందంగా ఉందని, జెల్లీ ఫిష్‌లు ఇబ్బంది పెట్టాయని తెలిపారు. తన బృందంలో ఒక డాక్టర్, ముగ్గురు సూపర్ డైవర్స్, ఫీడర్, అబ్జర్వర్ ఉన్నారని తెలిపారు. రోడ్డు మార్గంలో అంబులెన్స్ వచ్చిందన్నారు. ఏపీలో పర్యాటక రంగం అభివృద్ధి చెందాలని, ఇతర దేశాల స్విమ్మర్లు ఇక్కడకు వచ్చి స్విమ్మింగ్ చేయాలని ఆకాంక్షించారు. వాటర్ స్పోర్ట్స్ అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. సాహస యాత్ర పూర్తి చేసుకున్న స్విమ్మర్ శ్యామలకు పలు ప్రజాసంఘాల ప్రతినిధులు కాకినాడ తీరంలో ఘనస్వాగతం పలికారు.

చిత్రజ్యోతి
SINCE 1965

రెట్రో రీ లోడెడ్



హిమేష్ రేష్మియా కథానాయకుడిగా నటిస్తూ, నిర్మిస్తున్న బాలీవుడ్ చిత్రం 'బదాస్ రవికుమార్'. 1980ల నేపథ్యంలో సాగే కథతో ఈ చిత్రం తెరకెక్కుతోంది. శుక్రవారం చిత్ర బృందం విడుదల తేదీని ప్రకటించింది. ఫిబ్రవరి 7న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు తెలిపింది. అలాగే ఈ నెల 5న ట్రైలర్‌ను విడుదల చేస్తున్నట్లు మేకర్స్ తెలిపారు. ఈ యాక్షన్ థ్రిల్లర్‌లో ప్రభుదేవా ప్రతినాయక పాత్ర పోషించారు. రెట్రో రీ లోడెడ్ అంటూ యూనిట్ మోషన్ పోస్టర్‌ను విడుదల చేసింది. పాతతరం బాలీవుడ్ హీరోల ఆహార్యాన్ని ప్రతిబింబించే లుక్‌లో హిమేశ్ ఆకట్టుకున్నారు. 80ల నాటి బాలీవుడ్ స్వర్ణయుగాన్ని ఈ తరానికి పరిచయం చేసే ప్రయత్నం ఈ చిత్రం ద్వారా చేస్తున్నామని దర్శకుడు కెయిత్ గోమెస్ తెలిపారు.



రీ రికార్డింగ్‌లో '1000 కోట్లు'

మోహన్‌లాల్ హీరోగా జోషి దర్శకత్వంలో కాసుల రామకృష్ణ, శ్రీకర గుప్త నిర్మించిన చిత్రం '1000 కోట్లు'. మలయాళంలో విజయవంతమైన ఈ చిత్రం త్వరలో తెలుగు ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత కాసుల రామకృష్ణ మాట్లాడుతూ 'మలయాళంలో సూపర్‌హిట్ అయిన చిత్రాన్ని తెలుగులో '1000 కోట్లు' పేరుతో విడుదల చేస్తున్నాం. మోహన్ లాల్ సరసన కావ్య మాధవన్ నటించారు. ప్రముఖ సీనియర్ ఆర్టిస్ట్ నాగ మహేశ్ మోహన్‌లాల్‌కు వాయిస్ ఓవర్ ఇచ్చారు. ఈ చిత్రాన్ని జనవరి చివరి వారంలో ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నాం' అని అన్నారు. పీఆర్‌ఓ వీరబాబు ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నాడు.

'నా ప్రయాణం ఓ కలలా ఉంది'

మీనాక్షి చౌదరి


'చిత్రపరిశ్రమలో నా ప్రయాణం ఓ కలలా ఉంది. నన్ను నమ్మి మంచి పాత్రలు ఇస్తున్న దర్శకనిర్మాతలకు కృతజ్ఞతలు' అన్నారు హీరోయిన్ మీనాక్షి చౌదరి. విక్టరీ వెంకటేశ్ హీరోగా నటించిన 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రంలో ఆమె ఓ కథానాయికగా నటించారు. అనిల్ రావిపూడి దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఈ నెల 14న విడుదలవుతున్న సందర్భంగా శుక్రవారం మీనాక్షి మీడియాతో ముచ్చటిస్తూ చిత్ర విశేషాలు పంచుకున్నారు.

- గతేడాది సంక్రాంతికి నేను నటించిన 'గుంటూరు కారం' చిత్రం విడుదలైంది. ఇప్పుడు 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాతో మరోసారి పండుగకు వస్తున్నందుకు చాలా ఆనందంగా ఉంది. తొలిసారిగా ఈ సినిమాలో కామెడీ జానర్ ట్రై చేశా. కామెడీ స్పేస్ కలిగిన పోలీస్ పాత్ర చేయడం చాలా ఆనందంగా ఉంది. మా నాన్నగారు ఆర్మీ ఆఫీసర్. అందుకే ఆఫీసర్ బాడీ లాంగ్వేజ్ పై అవగాహన ఉంది. పోలీస్ పాత్ర చేయాలనేది నా కల. కెరీర్ ప్రారంభంలోనే ఆ అవకాశం రావడం లక్కీ. ఈ సినిమాలో యాక్షన్ సీన్లూ చేశాను. వాటిని చూసి జనం ఎంజాయ్ చేస్తారు.



- వెంకటేశ్ అద్భుతమైన వ్యక్తి. ఆయనతో వర్క్ చేయడం హ్యాపీ. ఆయన ముఖంలో ఎప్పుడూ ఆనందం కనిపిస్తుంటుంది. ఆయన కామెడీ టైమింగ్ అద్భుతం. అనిల్, వెంకీలది సూపర్ కాంబినేషన్. అన్ని సీన్లూ అద్భుతంగా కుదిరాయి.
- దర్శకుడు అనిల్ రావిపూడి కామెడీ టైమింగ్ ఫెంటాస్టిక్. సీన్‌ను పండించడంలో ఆయన ఆలోచనలు అద్భుతంగా ఉంటాయి. కామెడీ పాత్ర చేయడం నాకు తొలిసారే అయినా అనిల్ ఎంతో ఓపికగా ప్రతి సీన్ వివరించేవారు. ఇది ఫ్యామిలీ సబ్జెక్ట్ అయినా కామెడీది మేజర్ పార్ట్. అన్ని ఎమోషన్స్ ఉంటాయి.
- కొత్త సంవత్సరం కూడా ఆశాజనకంగానే ఉంటుందని అనుకుంటున్నాను. నవీన్ పోలిశెట్టితో ఓ సినిమా చేస్తున్నాను. మరో రెండు సినిమాలు ఉన్నాయి. నిర్మాతలే వాటిని ప్రకటిస్తారు.

మంచి స్పందన వస్తోంది



మూలవిరాట్, పద్మ, రాజ్‌కుమార్, స్వప్న నటీ నటులుగా ప్రభాకర్ జైనీ దర్శకత్వంలో విజయలక్ష్మీ జైనీ నిర్మించిన చిత్రం 'ప్రజాకవి కాళోజీ' బయోపిక్. ఇటీవలె విడుదలైన ఈ చిత్రం విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత విజయలక్ష్మి మాట్లాడుతూ' తెలంగాణకు చెందిన ప్రజాకవి, స్వాతంత్ర్య సమరయోధుడు కాళోజీ నారాయణరావు జీవితాన్ని వెండితెరపై ఆవిష్కరించే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నాను. విద్యార్థుల కోసం ఉదయం ఆటను ఉచితంగా ప్రదర్శిస్తున్నాం. దీనికి విద్యార్థుల నుంచి మంచి స్పందన వస్తోంది' అని తెలిపారు. చిత్ర దర్శకుడు ప్రభాకర్ జైనీ మాట్లాడుతూ 'ప్రేక్షకుల నుంచి మేము ఊహించిన దానికన్నా ఎక్కువ రెస్పాన్స్ వస్తోంది. ఈ సినిమా విడుదలకు సహకరించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పెద్దలకు నా ధన్యవాదాలు' అని అన్నారు.

దర్శకురాలు అపర్ణ మల్లాది కన్నుమూత



టాలీవుడ్ దర్శకురాలు అపర్ణ మల్లాది (54) కేన్సర్‌తో కన్నుమూశారు. నాలుగేళ్ల క్రితం కేన్సర్ బారిన పడిన అపర్ణ అమెరికాలో చికిత్స పొందుతూ గురువారం కన్నుమూశారు. 'ది అనుశ్రీ ఎక్స్‌పెరిమెంట్స్, పెళ్లికూతురు పార్టీ' చిత్రాలను ఆమె తెరకెక్కించారు. ఓటీటీల రాకకు పూర్వమే 'పోష్ పోరీస్' పేరుతో ఆమె రూపొందించిన వెబ్‌సిరీస్‌కు యూట్యూబ్‌లో మంచి ఆదరణ దక్కింది.



అడ్వంచర్ లుక్ అదిరింది

బెల్లంకొండ సాయి శ్రీనివాస్ లుధీర్ బైరెడ్డి దర్శకత్వంలో నటిస్తోన్న చిత్రం 'బీఎస్ఎస్12'(వర్కింగ్ టైటిల్). మహేశ్ చందు నిర్మిస్తున్నారు. బెల్లంకొండ సాయి శ్రీనివాస్ పుట్టిన రోజు సందర్భంగా ఈ సినిమాలో అతని క్యారెక్టర్ పోస్టర్‌ని రిలీజ్ చేశారు మేకర్స్. హీరోను అడ్వంచర్ అవతార్‌లో ప్రెజెంట్ చేశారు. రెండు కాళ్లు సీటుపై పెట్టుకుని బైక్‌ని నడుపుతూ ధైర్యంగా దూసుకెళ్తున్న లుక్ అదిరిపోయింది. బ్యాక్ గ్రౌండ్ మూమెంట్ ఇంటెన్సిటీని పెంచింది. ఒక విశాలమైన లోయ, అతని వెనుక ఒక కొండపై విష్ణు నామాలు కనిపించడం అద్భుతంగా ఉంది.



యాక్షన్ హీరోగా పేరు తెస్తుంది

సత్యరాజ్

దర్శకుడు మారుతి సమర్పకుడిగా రూపొందుతున్న చిత్రం 'బార్బరిక్'. మోహన్ శ్రీవత్స దర్శకత్వంలో విజయపాల్ రెడ్డి నిర్మిస్తున్నారు. సత్యరాజ్, వశిష్ట ఎన్ సింహ, సాంచి రాయ్, సత్యం రాజేశ్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రం టీజర్‌ను శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో మారుతి మాట్లాడుతూ 'ఈ సినిమా కోసం సలహాలు, సూచనలు ఇవ్వడం తప్ప నేనే మరేమీ చేయలేదు. ఇది రిస్కీ జానర్ అని మాత్రం చెప్పా. విజయ్ ఈ సినిమా కోసం చాలా ఖర్చు పెట్టారు. చిత్రం చాలా కొత్తగా ఉంటుంది. పెద్ద హిట్ అవుతుంది' అన్నారు.

'ఈ సినిమాకు కథే హీరో. ఇందులో నా పాత్ర కొత్తగా ఉంటుంది. ఏజ్డ్ యాక్షన్ హీరో అనే ట్యాగ్ కోసం ప్రయత్నిస్తున్న నాకా ఆ ట్యాగ్ ఈ సినిమాతో వస్తుంది. తెలుగులో నేనే డబ్బింగ్ చెప్పా' అన్నారు సత్యరాజ్. దర్శకుడు మారుతితో కలసి ఈ సినిమా చేస్తున్నందుకు ఆనందంగా ఉందని నిర్మాత విజయపాల్ చెప్పారు. ఇంత పెద్ద సినిమా చేస్తానని అనుకోలేదనీ, చిత్రం అద్భుతంగా ఉంటుందని దర్శకుడు మోహన్ చెప్పారు.



రోహిత్‌కు ముందే చెప్పేశారా?

» అందుకే 'విశ్రాంతి' పేరిట దూరం

బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ సిరీస్ ఆఖరి టెస్టుకు కెప్టెన్ రోహిత్ శర్మ 'విశ్రాంతి' పేరుతో దూరంగా ఉండడం వెనుక పెద్ద కథే నడిచినట్టు సమాచారం. టెస్టులకు సంబంధించి భారత జట్టు ప్రణాళికల్లో 37 ఏళ్ల రోహిత్ లేడని బీసీసీఐ ఇటీవల అతడికి స్పష్టం జేసినట్టు తెలిసింది. భారత జట్టు ప్రపంచ టెస్ట్ చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్ అవకాశాలు సంక్లిష్టంగా ఉన్నాయి. పరిస్థితులు అనుకూలించి ఒకవేళ టీమిండియా తుది పోరుకు చేరినా.. బుమ్రానే కెప్టెన్‌గా వ్యవహరిస్తాడని బోర్డు పెద్దలు రోహిత్‌కు చెప్పినట్టు సమాచారం. మొత్తంగా పరిస్థితులు అనుకూలంగా లేవని గ్రహించిన హిట్‌మ్యాన్ సిడ్నీ టెస్టుకు 'విశ్రాంతి' పేరిట దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నాడు. ఈనేపథ్యంలో బాక్సింగ్ డే టెస్టుతోనే రోహిత్ సుదీర్ఘ ఫార్మాట్‌లో ఆఖరి మ్యాచ్ ఆడేశాడన్నమాట!

రోడ్ మ్యాప్ ఇదే!

చివరి టెస్టు ఆడేసిన రోహిత్‌కు..అంతర్జాతీయంగా మిగిలింది వన్డేలే. వాస్తవంగా దక్షిణాఫ్రికా ఆతిథ్యమిచ్చే 2027 వన్డే ప్రపంచ కప్ వరకు ఆడాలనేది రోహిత్ అభిలాష. కానీ ఇప్పుడు అది నెరవేరేలా కనిపించడంలేదు. భారత జట్టు వచ్చే నెలలో స్వదేశంలో ఇంగ్లండ్‌తో మూడు వన్డేలు ఆడనుంది. ఆపై చాంపియన్స్ ట్రోఫీలో పాల్గొననుంది. అంటే..ఇంగ్లండ్‌తో సిరీస్‌తోపాటు చాంపియన్స్ ట్రోఫీలో కెప్టెన్‌గా ఆడించడం ద్వారా 50 ఓవర్ల ఫార్మాట్‌కూ రోహిత్ వీడ్కోలు పలికేలా బీసీసీఐ ప్రణాళిక తయారు చేయనున్నట్టు సమాచారం. ఒకవేళ చాంపియన్స్ ట్రోఫీని భారత్ గెలిస్తే రోహిత్ అంతర్జాతీయ కెరీర్‌కు ఘనమైన ముగింపు లభించినట్టే. అలాగే ధోనీ (2007 టీ20, 2011 వన్డే వరల్డ్ కప్‌లు) తర్వాత సారథిగా రెండు ఐసీసీ ట్రోఫీలు అందుకున్న ఘనత రోహిత్‌కు దక్కుతుంది.

ఛే.. అదే తీరు

కొనసాగిన బ్యాటింగ్ వైఫల్యం

ఐదో టెస్టు



కోహ్లీని అవుట్ చేసిన బోలాండ్ ఆనందం

భారత్ తొలి ఇన్నింగ్స్ 185
ఆసీస్ మొదటి ఇన్నింగ్స్ 9/1
రోహిత్‌కు విశ్రాంతి

సిడ్నీ: బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో వేదికలు మారుతున్నాయి కానీ భారత బ్యాటింగ్ తీరు మాత్రం మారడం లేదు. పేలవ ఫామ్ కారణంగా కెప్టెన్ రోహిత్ శర్మపై వేటు పడినా.. ఎలాంటి ఫలితమూ కనిపించలేదు. కొత్త ఏడాదిలో ఆరంభమైన ఐదో టెస్టులో శుక్రవారం తొలి రోజే జట్టు కుప్పకూలింది. బంతి అనూహ్యంగా బౌన్స్ కావడంతో ఆస్ట్రేలియా పేసర్ల ధాటికి పరుగులు సాధించడంలో వెనుకబడ్డారు. అయితే రిషభ్ పంత్ (40) మాత్రం బౌన్సర్లను కాచుకుంటూ ఒళ్లు హూనమవుతున్నా ఓపిగ్గా క్రీజులో నిలిచాడు. కానీ అతడి అద్భుత పోరాటం మరోసారి అనవసర షాట్‌తో ముగిసింది. అటు విరాట్ (17) సైతం తన బలహీనతను ఈసారీ అధిగమించలేకపోయాడు. దీంతో భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 72.2 ఓవర్లలో 185 పరుగులు మాత్రమే చేసింది. పంత్‌కు జడేజా (26) సహకరించగా, చివర్లో తాత్కాలిక కెప్టెన్ బుమ్రా (22) చెలరేగాడు. పేసర్లు బోలాండ్‌కు 4, స్టార్క్‌కు 3, కమిన్స్‌కు 2 వికెట్లు దక్కాయి. ఆ తర్వాత బరిలోకి దిగిన ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో 3 ఓవర్లలో ఖవాజా (2) వికెట్ కోల్పోయి 9 రన్స్ చేసింది. క్రీజులో కాన్‌స్టాస్ (7) ఉన్నాడు. రోహిత్ స్థానంలో గిల్, ఆకాశ్ స్థానంలో ప్రసిద్ధ్ బరిలోకి దిగారు.

ఆరంభం నుంచే..: భారత్ టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగడం ప్రతికూల ప్రభావాన్ని చూపింది. సిడ్నీ పిచ్ సహజంగా ఆరంభంలో బ్యాటర్లకు అనుకూలంగా ఉంటుందన్న అంచనాతో బుమ్రా ఈ నిర్ణయం తీసుకున్నాడు. కానీ ఆకాశం మబ్బుపట్టి ఉండడంతో పాటు పిచ్‌పై పచ్చిక ఉండడంతో ఆసీస్ పేసర్లు పండగ చేసుకున్నారు. చక్కటి సీమ్‌తో భారత బ్యాటర్లకు చుక్కలు చూపించారు. దీంతో ఒక్కో పరుగు కోసం కష్టపడిన జట్టు తొలి సెషన్‌లో 57 పరుగులు మాత్రమే సాధించి రాహుల్ (4), జైస్వాల్ (10), గిల్ (20) వికెట్లను కోల్పోయింది. విరాట్ సైతం గోల్డెన్ డకౌట్ అయ్యేవాడే. స్లిప్‌లో స్మిత్ అందుకున్న క్యాచ్ తిరిగి గాల్లోకి లేవగా బోలాండ్ అందుకున్నాడు. అయితే రీప్లేలో స్మిత్ చేతిలో ఉన్నప్పుడే బంతి నేలకు తాకినట్టు తేలింది. ఆ తర్వాత విరాట్ దీటుగా క్రీజులో నిలిచాడు. ఆఫ్‌సైడ్ ఆవలి బంతులను వదిలేస్తూ ఆత్మవిశ్వాసంతో కనిపించాడు. ఈసారి తన స్టాన్స్‌ను కూడా మార్చుకున్నాడు. కానీ 69 బంతులాడిన కోహ్లీ ఆసీస్ ఉచ్చులో పడక తప్పలేదు.

పంత్-జడేజా పోరాటం: కోచ్ గంభీర్ సూచనల మేరకు పంత్ ఈసారి భారీ షాట్లకు వెళ్లకుండా ఓపిగ్గా ఆడాడు. అటు జడేజా కూడా సహకరించడంతో ఐదో వికెట్‌కు 48 పరుగులు సమకూరాయి. జడ్డూ మూడు పరుగుల వద్ద ఉన్నప్పుడు స్లిప్‌లో స్మిత్ సులువైన క్యాచ్‌ను వదిలేశాడు. అయితే చివరి సెషన్‌లో ఆసీస్ మరోసారి దెబ్బతీసింది. ఒకే ఓవర్‌లో పంత్, నితీశ్ (0)లను వరుస బంతుల్లో బోలాండ్ అవుట్ చేసి షాకిచ్చాడు. 120/6 స్కోరుతో నిలిచిన జట్టుకు చివర్లో బుమ్రా వేగంగా పరుగులు అందించాడు. 68వ ఓవర్‌లో 3 ఫోర్లతో, ఆ తర్వాత ఓ సిక్సర్ బాది ఆఖరి వికెట్‌గా వెనుదిరిగాడు.

1 ఒక్క బౌండరీ కూడా బాదకుండా ఎక్కువ బంతులు (69) ఎదుర్కోవడం కోహ్లీకిదే తొలిసారి.

విదేశీ గడ్డపై ఓ సిరీస్‌లో ఎక్కువ వికెట్లు (31) తీసిన భారత బౌలర్‌గా బిషన్ సింగ్ రికార్డును సమం చేసిన బుమ్రా.

స్కోరుబోర్డు

భారత్ తొలి ఇన్నింగ్స్: జైస్వాల్ (సి) వెబ్‌స్టర్ (బి) బోలాండ్ 10; రాహుల్ (సి) కాన్‌స్టాస్ (బి) స్టార్క్ 4; గిల్ (సి) స్మిత్ (బి) లియోన్ 20; కోహ్లీ (సి) వెబ్‌స్టర్ (బి) బోలాండ్ 17; పంత్ (సి) కమిన్స్ (బి) బోలాండ్ 40; జడేజా (ఎల్బీ) స్టార్క్ 26; నితీశ్ (సి) స్మిత్ (బి) బోలాండ్ 0; సుందర్ (సి) క్యారీ (బి) కమిన్స్ 14; ప్రసిద్ధ్ (సి) కాన్‌స్టాస్ (బి) స్టార్క్ 3; బుమ్రా (సి) స్టార్క్ (బి) కమిన్స్ 22; సిరాజ్ (నాటౌట్) 3; **ఎక్స్‌ట్రాలు: 26; మొత్తం: 72.2 ఓవర్లలో 185 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-11, 2-17, 3-57, 4-72, 5-120, 6-120, 7-134, 8-148, 9-168, 10-185. **బౌలింగ్:** స్టార్క్ 18-5-49-3; కమిన్స్ 15.2-4-37-2; బోలాండ్ 20-8-31-4; వెబ్‌స్టర్ 13-4-29-0; లియోన్ 6-2-19-1.

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: కాన్‌స్టాస్ (బ్యాటింగ్) 7; ఉస్మాన్ ఖవాజా (సి) రాహుల్ (బి) బుమ్రా 2; **మొత్తం: 3 ఓవర్లలో 9/1. వికెట్ పతనం:** 1-9; **బౌలింగ్:** బుమ్రా 2-0-7-1; సిరాజ్ 1-0-2-0.

పోటెత్తిన ఫ్యాన్స్

సిడ్నీ టెస్టులో తొలి రోజు ఆటను తిలకించేందుకు అభిమానులు భారీ స్థాయిలో హాజరయ్యారు. గ్రౌండ్ సామర్థ్యం 48 వేలు కాగా, శుక్రవారం 47,556 మంది ఆటను తిలకించారు. 1976 తర్వాత ఈస్థాయిలో హాజరుకావడం ఇదే తొలిసారని క్రికెట్ ఆస్ట్రేలియా ప్రకటించింది.

తొలి సెషన్‌లో చెలరేగితే..

సిడ్నీ పిచ్‌పై తొలి రోజు బంతి ఇంతలా బౌన్స్ కావడం గతంలో జరగలేదని విశ్లేషకులు చెబుతున్నారు. పంత్‌కు తగిలిన బంతులు కూడా అలాంటివే. అందుకే ఆసీస్‌కు టాస్ కోల్పోవడమే లాభించిందని చెబుతున్నారు. ఇక రెండో రోజు శనివారం కూడా ఇదే పరిస్థితి కొనసాగే అవకాశం ఉంది. దీంతో ఆరంభంలోనే బుమ్రా మరింతగా చెలరేగి ఆసీస్ వికెట్లను త్వరత్వరగా పడగొడితే మ్యాచ్‌పై భారత్ పట్టు బిగించే అవకాశం ఉంటుంది.

దెబ్బలే దెబ్బలు



భారత్ తొలి ఇన్నింగ్స్‌లో ఆసీస్ పేసర్ల నుంచి బుల్లెట్‌లాంటి బంతులు నేరుగా శరీరాన్ని తాకడంతో రిషభ్ పంత్ బాధతో విలవిల్లాడాడు. ఈక్రమంలో అతడి పొత్తి కడుపులో రెండుసార్లు, ఓసారి హెల్మెట్‌కు బంతి తాకింది. ఇక మిచెల్ స్టార్క్ ఓవర్‌లో దూసుకువచ్చిన ఓ బంతి అయితే అతడి మోచేతికి కాస్త పైన తాకడంతో ఆ ప్రాంతమంతా ఎర్రగా కమిలిపోయింది. ఇక వాషింగ్టన్ సుందర్, సిరాజ్ కూడా బంతి తగలడంతో ఇబ్బంది పడ్డారు.



మాటల తూటాలతో ముగిసె..

ఆసీస్ తొలి రోజు ఆడింది కేవలం మూడు ఓవర్లే అయినా మైదానంలో ఉత్కంఠభరిత వాతావరణం నెలకొంది. శుక్రవారం ఆట ఆఖరి బంతికి ఓపెనర్ ఖవాజాను బుమ్రా అవుట్ చేశాడు. స్లిప్‌లో రాహుల్ క్యాచ్ తీసుకోవడంతో భారత ఆటగాళ్లు ఒక్కసారిగా మరో టీనేజ్ ఓపెనర్ కాన్‌స్టాస్ వైపు దూసుకువచ్చి కసిగా సంబరాలు చేసుకున్నారు. దీనికి కారణం.. ఆ బంతి వేయడానికి ముందు బుమ్రా, కాన్‌స్టాస్ మధ్య జరిగిన వాగ్వాదమే. బుమ్రా బౌలింగ్ వేసేందుకు ప్రయత్నిస్తుండగా ఓపెనర్ ఖవాజా కాస్త ఆగమన్నట్టు సైగ చేశాడు. దీంతో బుమ్రా ఏమైందంటూ రెండు చేతులు చాపి అసహనం వ్యక్తం చేశాడు. ఇంతలో నాన్‌స్ట్రయికింగ్ ఎండ్‌లో ఉన్న కాన్‌స్టాస్ కలుగజేసుకున్నాడు. దీంతో సీరియస్ అయిన బుమ్రా 'మధ్యలో నీకెందుకు?' అన్నట్టుగా ముందుకు వచ్చాడు. అటు కాన్‌స్టాస్ ఏమాత్రం తగ్గకుండా బుమ్రా వైపు రావడంతో అంపైర్ సర్దిచెప్పాడు. ఆ వెంటనే తక్కువ ఎత్తులో వచ్చిన బంతిని ఆడి ఖవాజా అవుటయ్యాడు. అంతే.. ఎన్నడూ ప్రశాంతత కోల్పోని బుమ్రా ఒక్కసారిగా కాన్‌స్టాస్ వైపు దూసుకువచ్చి సంబరాలు చేసుకున్నాడు. పెవిలియన్ వైపు వెళుతున్న కాన్‌స్టాస్‌ను ఆటగాళ్లు కూడా చుట్టుముట్టి సీరియస్‌గా చూడడం కనిపించింది. బుమ్రాతో పెట్టుకుంటే ఇలాగే ఉంటుందని నెట్టింట ఫ్యాన్స్ కామెంట్స్ పెడుతున్నారు.



న్యూయార్క్‌లో జరిగిన ప్రపంచ ర్యాపిడ్ చెస్‌లో విజేతగా నిలిచిన కోనేరు హంపి న్యూఢిల్లీలో ప్రధాని మోదీని శుక్రవారం కలుసుకున్న దృశ్యం

రాష్ట్ర బ్యాడ్మింటన్ చీఫ్‌గా శ్రీధర్‌బాబు

హఠాత్తుగా వైదొలగిన కేటీఆర్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): తెలంగాణ బ్యాడ్మింటన్ సంఘం అధ్యక్షుడిగా ఐటీ శాఖ మాజీ మంత్రి కేటీఆర్ హఠాత్తుగా వైదొలిగారు. దీంతో ఆయన స్థానంలో ప్రస్తుత ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం సచివాలయంలోని శ్రీధర్ బాబు కార్యాలయంలో తెలంగాణ బ్యాడ్మింటన్ సంఘం సమావేశమైంది. తొలుత కొత్త అధ్యక్షుడితో కూడిన పాత కార్యవర్గాన్ని రాష్ట్ర బ్యాడ్మింటన్ సంఘం ప్రధాన కార్యదర్శి గోపీచంద్ అధికారికంగా ప్రకటించారు.

కరుణ్ కొత్త రికార్డు

విజయనగరం (ఆంధ్రజ్యోతి): విదర్భ కెప్టెన్ కరుణ్ నాయర్ విజయ్ హజారే టోర్నమెంట్‌లో సరికొత్త రికార్డు సృష్టించాడు. ఉత్తరప్రదేశ్‌తో శుక్రవారం ఇక్కడ జరిగిన మ్యాచ్‌లో సెంచరీ సాధించిన కరుణ్ నాయర్ (112).. లిస్ట్-ఎ క్రికెట్ (50 ఓవర్ల ఫార్మాట్)లో అవుట్ కాకుండా అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా నిలిచాడు. నాయర్ అవుట్ కాకుండా ఓవరాల్‌గా 541 పరుగులు కొల్లగొట్టాడు. ఈ క్రమంలో న్యూజిలాండ్ ఆల్‌రౌండర్ జేమ్స్ ఫ్రాంక్లిన్ (527) పేరిటనున్న రికార్డును అధిగమించాడు. అంతేకాదు.. ఈ టోర్నీలో నాయర్ ఐదు ఇన్నింగ్స్‌ల్లో నాలుగు సెంచరీలు చేసి మరో రికార్డును కూడా ఖాతాలో వేసుకున్నాడు. ఇక, యూపీతో పోరులో విదర్భ 8 వికెట్లతో గెలిచింది.

హైదరాబాద్‌కు నిరాశ

అహ్మదాబాద్: విజయ్ హజారే టోర్నీలో పంజాబ్‌తో జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ ఓటమిపాలైంది. తొలుత పంజాబ్.. ప్రభ్‌సిమ్రన్ (137) సెంచరీకి తోడు అభిషేక్ (93) రాణించడంతో 4 వికెట్లకు 426 రన్స్ చేసింది. ఛేదనలో అర్ష్‌దీప్ (4/50), రఘు(3/68) ధాటికి హైదరాబాద్ 47.5 ఓవర్లలో 346 రన్స్‌కు ఆలౌటైంది. నితేశ్ రెడ్డి (111) సెంచరీ వృథా అయింది. ఇక గ్రూప్-బిలో ఆంధ్ర జట్టు 5 వికెట్లతో మహారాష్ట్ర చేతిలో చిత్తయింది.

సీజేఐ బెంచ్ ఎదుట హెచ్‌సీఏ వివాదం

న్యూఢిల్లీ (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) వివాదాలకు సంబంధించి సుప్రీం కోర్టులో దాఖలైన పిటిషన్‌ను శుక్రవారం జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ ప్రసన్న బి వరాలేతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. అయితే, ఇదే తరహా పిటిషన్ సుప్రీం ప్రధాన న్యాయమూర్తి వద్ద పెండింగ్‌లో ఉన్నందున, దీంతో కలిపి హెచ్‌సీఏ పిటిషన్‌ను విచారించాలన్న ప్రతివాదుల విజ్ఞప్తికి సుప్రీం అంగీకరించింది. ఇందుకు సంబంధించిన డాక్యుమెంట్లను ధర్మాసనం ముందు ఉంచాలని రిజిస్ట్రార్‌ను ఆదేశించింది. ఈ అంశాన్ని సీజేఐ బెంచ్‌కు రిఫర్ చేస్తున్నట్టు తెలిపింది.

బిజినెస్

ఎస్‌బీఐ రెండు కొత్త డిపాజిట్ పథకాలు

న్యూఢిల్లీ: దేశీయ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బీఐ.. హర్ ఘర్ లఖ్‌పతీ, ఎస్‌బీఐ ప్యాట్రన్స్ పేరుతో రెండు కొత్త డిపాజిట్ పథకాలను ప్రారంభించింది. హర్ ఘర్ లఖ్‌పతీ ప్రీ-క్యాల్కులేటెడ్ రికరింగ్ డిపాజిట్ పథకమని, కస్టమర్లు రూ.లక్ష చొప్పున పోగేసుకునేందుకు దోహదపడనుందని శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో ఎస్‌బీఐ తెలిపింది. ఈ పథకం ఆర్థిక లక్ష్యాల సాధన ప్రక్రియను సరళీకరిస్తుందని, కస్టమర్లు భవిష్యత్ ఆర్థిక ప్రణాళిక రచించుకోవడంతో పాటు సమర్థవంతంగా ఆదా చేసేందుకు అనుమతిస్తుందని బ్యాంక్ పేర్కొంది. కాగా, 80 ఏళ్లు, ఆపైబడిన సీనియర్ సిటిజన్ల కోసం ఎస్‌బీఐ ప్యాట్రన్స్ డిపాజిట్ స్కీమ్‌ను ప్రవేశపెట్టినట్లు బ్యాంక్ వెల్లడించింది.

ప్రస్తుత, కొత్త కస్టమర్లందరికీ ఈ పథకం అందుబాటులో ఉంటుందని.. ఈ పథకంపై సీనియర్ సిటిజన్లకు ఆఫర్ చేసే వడ్డీ రేటు కంటే 0.10 శాతం అధికంగా చెల్లించడం జరుగుతుందని బ్యాంక్ స్పష్టం చేసింది. రికరింగ్ డిపాజిట్ పథకానికి విఎగతా ఎఫ్‌డీలకు చెల్లించే వడ్డీనే లభించనుంది. ప్రస్తుతం ఎస్‌బీఐ ఏడాదికి పైగా కాలపరిమితి డిపాజిట్లపై 6.80 శాతం, రెండేళ్లకు పైగా ఎఫ్‌డీపై 7 శాతం, 3-5 ఏళ్ల డిపాజిట్‌పై 6.75 శాతం, 5-10 ఏళ్ల డిపాజిట్‌పై 6.5 శాతం వార్షిక వడ్డీ ఆఫర్ చేస్తోంది. రికరింగ్ డిపాజిట్ కనీస కాలపరిమితి ఏడాది. గరిష్ఠ కాలపరిమితి 10 ఏళ్లుగా ఉంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



4వ తేదీ			
హైదరాబాద్	525	విజయవాడ	535
వరంగల్	527	గోదావరి	525
చిత్తూరు	563	విశాఖపట్నం	545
		డజను గుడ్లు రూ.	84

ఫామ్‌గేట్ ధర వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	103	విజయవాడ	108
వరంగల్	103	గుంటూరు	108
కరీంనగర్	103	ఒంగోలు	108
మహబూబ్‌నగర్	103	చిత్తూరు	88
కర్నూలు	103	నెల్లూరు	92
విశాఖపట్నం	97	అనంతపురం	92
గోదావరి	108		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	79,200 ▲	72,600 ▲	1,00,000 ▲
విజయవాడ	81,000 ▲	75,000 ▲	92,500 ▲
విశాఖపట్నం	77,980 ▲	71,480 ▲	89,830 ▲
రాజమండ్రి	79,200 ▲	72,600 ▲	90,300 ▲
ప్రొద్దుటూరు	78,200 ▼	73,340 ▲	90,200 ▲
ముంబై	77,504 ▲	70,994 ▲	88,221 ▲

ఐటీ ఉద్యోగాలకు 'టెక్' గండం

2030 నాటికి కోటి కొలువులు కష్టమే.. కొత్త టెక్నాలజీల్లోనే 20 లక్షల ఉద్యోగాలు

అదనంగా రూ.13 లక్షల కోట్ల టర్నోవర్

క్వెస్ట్ ఐటీ స్టాఫింగ్

న్యూఢిల్లీ: ఇన్ఫర్మేషన్ అండ్ టెక్నాలజీ (ఐటీ) రంగంలో నియామకాల భవిష్యత్ ఆశాజనకంగా కనిపించడం లేదు. కంపెనీలు ఇప్పటికే ఆచితూచి నియామకాలు జరుపుతున్నాయి. గత రెండేళ్లలో ఐఐటీలతో సహా ప్రముఖ ఇంజనీరింగ్ కాలేజీల్లోనూ ప్రాంగణ నియామకాలు భారీగా తగ్గాయి. అమెరికా, యూరప్‌ల నుంచి మన ఐటీ కంపెనీలకు వచ్చే ప్రాజెక్టులు తగ్గడం ఇందుకు ఒక కారణమైతే, కృత్రిమ మేధ (ఏఐ), మెషిన్ లెర్నింగ్ (ఎంఎల్) వంటి సరికొత్త టెక్నాలజీలు ఇందుకు మరో కారణం. ప్రస్తుతం భారత ఐటీ రంగం 54 లక్షల మందికి ఉద్యోగాలు కల్పిస్తోంది. 2030 నాటికి ఇది కోటికి చేరుతుందని' క్వెస్ట్ ఐటీ స్టాఫింగ్' అనే సంస్థ గతంలో అంచనా వేసింది. అయితే ఏఐ వంటి టెక్నాలజీల కారణంగా 2030 నాటికి ఇది 75 లక్షలకు విఎంచకపోవచ్చని తన తాజా నివేదికలో తెలిపింది.

మారుతున్న సమీకరణాలు: ఏఐ, ఎంఎల్, ఆటోమేషన్ కారణంగా మన ఐటీ కంపెనీల స్వరూప, స్వభావాలు మారిపోతున్నాయి. కంపెనీలు సాధారణ టెక్ ఉద్యోగుల కంటే జనరేటివ్ ఏఐ, ఎంఎల్, క్లౌడ్ కంప్యూటింగ్, బ్లాక్ చెయిన్, డేటా సైన్స్, ఆటోమేషన్ వంటి ప్రత్యేక నైపుణ్యాల్లో పట్టు ఉన్న వారి కోసం వెదుకుతున్నాయి. ఈ సంవత్సరం వీరి నియామకాలు 20 శాతం వరకు పెరిగే అవకాశం ఉందని టీమ్‌లీజ్ డిజిటల్ వైస్ ప్రెసిడెంట్ కృష్ణ విజ్ చెప్పారు. కాగా 2030 నాటికి ఈ ప్రత్యేక రంగాల్లో 20 లక్షల మందికి ఉద్యోగావకాశాలు, రూ.12.86 లక్షల కోట్ల వ్యాపారం లభించే అవకాశం ఉందని క్వెస్ట్ ఐటీ స్టాఫింగ్ సీఈఓ కపిల్ జోషి అంచనా. అయితే ప్రస్తుతం దేశీయ ఐటీ కంపెనీలకు ఈ నైపుణ్యాలు ఉన్న ఉద్యోగులు చాలినంత మంది దొరకడం లేదు. దీంతో కంపెనీలు ఉన్న ఉద్యోగులకే ఈ నైపుణ్యాల్లో శిక్షణ ఇస్తూ నెట్టుకొస్తున్నట్టు జోషి చెప్పారు. ఈ మార్పులతో భారత ఐటీ పరిశ్రమ ముందు ముందు హై వాల్యూ టెక్ సేవలు, నవ కల్పనలకు కేంద్రంగా మారనుందన్నారు.



'జీసీసీ'లదే హవా

నిన్న మొన్నటి వరకు ఐటీ కంపెనీలు పెద్ద ఎత్తున నియామకాలు చేపట్టేవి. ఇప్పుడు గ్లోబల్ క్యాపబిలిటీ కేంద్రాలు (జీసీసీ) ఆ స్థానాన్ని ఆక్రమించాయి. ప్రస్తుతం మన దేశంలోని 1,700 జీసీసీల్లో 19 లక్షల మంది పని చేస్తున్నారు. 2030 నాటికి ఈ కేంద్రాల సంఖ్య 2,200కు, ఉద్యోగుల సంఖ్య 25 నుంచి 28 లక్షలకు పెరుగుతుందని మార్కెట్ వర్గాల అంచనా.

బెంగళూరు టాప్

కంపెనీలు, ఉద్యోగాలపరంగా చూస్తే దేశ ఐటీ రంగంలో ఇప్పటికీ బెంగళూరుదే హవా. సరికొత్త టెక్నాలజీ కంపెనీల పరంగా చూసినా బెంగళూరు విఎగతా అన్ని నగరాల కంటే ముందుంది. బెంగళూరు తర్వాత ఈ విషయంలో హైదరాబాద్ రెండో స్థానంలో ఉన్నట్టు క్వెస్ట్ ఐటీ స్టాఫింగ్ తెలిపింది.

పెన్షన్ చెల్లింపులకు కేంద్రీయ వ్యవస్థ

అన్ని ప్రాంతీయ కార్యాలయాల్లోనూ అందుబాటు

న్యూఢిల్లీ: ఉద్యోగుల భవిష్య నిధి సంస్థకు (ఈపీఎఫ్‌ఓ) చెందిన దేశంలోని అన్ని ప్రాంతీయ కార్యాలయాల్లోను కేంద్రీయ పెన్షన్ చెల్లింపు వ్యవస్థ (సీపీపీఎస్) అందుబాటులోకి వచ్చింది. ఇది 68 లక్షల మంది పెన్షనర్లకు ప్రయోజనం కలిగిస్తుందని కార్మిక మంత్రిత్వ శాఖ తెలిపింది. ప్రస్తుతం పెన్షన్ చెల్లింపుల వ్యవస్థ వికేంద్రీకృతంగా ఉన్నందు వల్ల ప్రతి జోనల్/ప్రాంతీయ కార్యాలయం వేర్వేరుగా 3 లేదా 4 బ్యాంకులతో అంగీకారాలు కుదుర్చుకోవాల్సి వస్తోందని అధికారులు తెలిపారు. ఈ సీపీపీఎస్ వ్యవస్థ కింద లబ్ధిదారుడు ఏ బ్యాంకు నుంచైనా పెన్షన్ డ్రా చేసుకోవచ్చు. పెన్షన్ ప్రారంభం సమయంలో వెరిఫికేషన్ కోసం బ్యాంకుకు కూడా వెళ్లాల్సిన పని ఉండదు. పెన్షన్ మొత్తం విడుదల కాగానే లబ్ధిదారుల ఖాతాల్లో సొమ్ము జమ అయిపోతుంది. పెన్షనర్ ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి మారినా లేదా లబ్ధిదారుని బ్యాంక్/బ్రాంచి మారిన సందర్భాల్లో ఒక కార్యాలయం నుంచి మరో కార్యాలయానికి పెన్షన్ పేమెంట్ ఆర్డర్లు (పీపీఓ) జారీ చేయాల్సిన అవసరం లేకుండానే ఈ జనవరి నుంచి సీపీపీఎస్ వ్యవస్థ కింద పెన్షన్లు చెల్లించగలుగుతారు. రిటైర్మెంట్ అనంతరం స్వస్థలాలకు వెళ్లే పెన్షనర్లకు దీని ద్వారా పెద్ద ఊరట లభిస్తుంది. డిసెంబరు నాటికి ఈపీఎఫ్‌ఓ 122 పెన్షన్ చెల్లింపు ప్రాంతీయ కార్యాలయాల ద్వారా 68 లక్షల మంది పైగా పెన్షనర్లకు రూ.1570 కోట్ల మొత్తంలో పెన్షన్లు చెల్లిస్తోంది.

2025లో స్మార్ట్‌ఫోన్ మార్కెట్ రూ.4.29 లక్షల కోట్లు

కౌంటర్ పాయింట్ అంచనా

న్యూఢిల్లీ: ప్రీమియం డివైస్‌లకు డిమాండ్ పెరగడంతో దేశంలో ఈ ఏడాది స్మార్ట్‌ఫోన్ మార్కెట్ 5,000 కోట్ల డాలర్లకు (రూ.4,28,900 కోట్లు) చేరుతుందని అంచనా. 2021 సంవత్సరంలో భారత స్మార్ట్‌ఫోన్ మార్కెట్ పరిమాణం 3790 కోట్ల డాలర్ల (రూ.3.25 లక్షల కోట్లు) స్థాయిలో ఉంది. ప్రధానంగా యాపిల్, సామ్‌సంగ్ ప్రీమియం, అల్ట్రా ప్రీమియం ఫోన్ల మార్కెట్‌కు చోదకంగా ఉన్నాయని టెక్నాలజీ మార్కెట్ పరిశోధన సంస్థ కౌంటర్ పాయింట్ తాజా నివేదికలో తెలిపింది. మొబైల్ ఫోన్ల విభాగం ద్వారా 2024 సంవత్సరంలో యాపిల్ రూ.67,121.6 కోట్లు, సామ్‌సంగ్ రూ.71,1,57.6 కోట్ల ఆదాయం నమోదు చేశాయి. దేశంలో స్మార్ట్‌ఫోన్ల రిటైల్ సగటు విక్రయ ధర 300 డాలర్ల (రూ.25,700) దాటుతుందని ఆ నివేదిక అంచనా వేసింది. యాపిల్ స్మార్ట్‌ఫోన్లను స్థానికంగా తయారుచేయడం, ఐఫోన్ల ధరలు ఇటీవల తగ్గింపు వల్ల ఆ కంపెనీకి చెందిన ప్రో మోడళ్లకు బలమైన డిమాండ్ కనిపిస్తోంది. అలాగే సామ్‌సంగ్ ఎస్ సిరీస్ ఫోన్ల ద్వారా విలువ ఆధారిత వ్యూహం అనుసరిస్తోంది. నివేదిక ముఖ్యాంశాలు...

- చైనాకు చెందిన వివో, ఒప్పో, వన్‌ప్లస్ బ్రాండ్లు రూ.30,000-రూ.45,000 ధరల శ్రేణిలో అత్యాధునిక కెమెరా ద్వారా కస్టమర్లను ఆకర్షిస్తున్నాయి.
- వన్‌ప్లస్ తన స్మార్ట్‌ఫోన్లలో ఎదురైన మదర్‌బోర్డ్ సమస్యను, రిటైలర్ల ఫిర్యాదులను కూడా పరిష్కరించి పూర్వ వైభవం సాధించేందుకు కృషి చేస్తోంది. దీనికి తోడు ఈ కంపెనీ స్థానిక మార్కెట్లో విస్తరణపై రూ.6,000 కోట్లు పెట్టుబడి పెడుతోంది.
- ఈ ఏడాది ప్రీమియం విభాగం (రూ.30,000 ధర పైన) 20 శాతం పైబడిన మార్కెట్ వాటా సాధిస్తుందని అంచనా.

హెచ్‌యూఎల్ గూటికి మినిమలిస్ట్!

- డీల్ విలువ రూ.3,000 కోట్లు

న్యూఢిల్లీ: దేశీయ ఎఫ్‌ఎంసీజీ దిగ్గజం హిందుస్థాన్ యూనిలీవర్ లిమిటెడ్ (హెచ్‌యూఎల్) భారీ కొనుగోలుకు సిద్ధమైనట్లు తెలిసింది. జైపూర్‌కు చెందిన స్కిన్‌కేర్ ఉత్పత్తుల స్టార్టప్ మినిమలిస్ట్‌ను టేకోవర్ చేసే ప్రయత్నాల్లో ఉన్నట్లు సమాచారం. ఈ డీల్ విలువ రూ.3,000 కోట్ల స్థాయిలో ఉండే అవకాశం ఉంది. అంతర్జాతీయ ప్రైవేట్ ఈక్విటీ సంస్థ పీక్ ఎక్స్‌వీ పార్ట్‌నర్స్ పెట్టుబడులు కలిగిన మినిమలిస్ట్.. గతంలో హెచ్‌యూఎల్ మాతృసంస్థ యూనిలీవర్‌కు చెందిన పెట్టుబడి విభాగమైన యూనిలీవర్ వెంచర్స్ నుంచి రూ.110 కోట్లు సమీకరించింది. చర్మ సంరక్షణ ఉత్పత్తుల మార్కెట్లో మినిమలిస్ట్ అనతి కాలంలోనే ప్రముఖ బ్రాండ్‌గా ఎదిగింది. 2022-23లో రూ.184 కోట్లుగా నమోదైన ఈ స్టార్టప్ ఆదాయం.. గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో 89 శాతం వృద్ధితో రూ.350 కోట్లకు పెరిగింది.

మార్కెట్ జోరుకు బ్రేకులు

ఐటీ, బ్యాంకింగ్ షేర్లలో అమ్మకాలు..
సెన్సెక్స్ 720 పాయింట్లు పతనం

ముంబై: కొత్త ఏడాదికి శుభారంభంగా తొలి రెండు సెషన్లలో భారీగా పుంజుకున్న స్టాక్ మార్కెట్ సూచీలు మళ్లీ చతికిలపడ్డాయి. శుక్రవారం ట్రేడింగ్‌లో దాదాపు ఒక శాతం క్షీణించాయి. సెన్సెక్స్ 720.60 పాయింట్ల నష్టంతో 79,223.11 వద్దకు జారుకుంది. నిఫ్టీ 183.90 పాయింట్లు కోల్పోయి 24,004.75 వద్ద స్థిరపడింది. వచ్చే వారంలో డిసెంబరు త్రైమాసిక ఆర్థిక ఫలితాల సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో మదుపరులు ముందుజాగ్రత్తగా ఐటీ, బ్యాంకింగ్ షేర్లలో అమ్మకాలకు పాల్పడటం ఇందుకు కారణమైంది. డాలర్ బలోపేతం, రూపాయి క్షీణత, అధిక వాల్యుయేషన్లు వంటి అంశాలు మార్కెట్ సెంటిమెంట్‌ను మరింత కుంగదీశాయి. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 18 నష్టపోయాయి.

- భారత కరెన్సీ సరికొత్త జీవితకాల కనిష్ఠానికి క్షీణించింది. డాలర్‌తో రూపాయి మారకం విలువ మరో 4 పైసలు తగ్గి రూ.85.79 వద్ద ముగిసింది. దిగుమతిదారుల నుంచి డాలర్‌కు డిమాండ్ పెరగడంతో పాటు ఈక్విటీ మార్కెట్లో నష్టాలు ఇందుకు ప్రధాన కారణమయ్యాయి.
- గత నెల 27తో ముగిసిన వారంలో భారత్ వద్ద విదేశీ మారక (ఫారెక్స్) నిల్వలు 411 కోట్ల డాలర్ల మేర తగ్గి 64,027 కోట్ల డాలర్లకు పరిమితమైనట్లు ఆర్‌బీఐ వెల్లడించింది. గత వారంలోనూ నిల్వలు 847 కోట్ల డాలర్ల మేర తగ్గాయి. గత కొన్ని వారాలుగా నిల్వలు క్షీణిస్తూ వస్తున్నాయి.

ఐపీఓ సమాచారం: గుజరాత్‌కు చెందిన రాజ్‌పుతానా స్టెయిన్‌లెస్ లిమిటెడ్ తొలి పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ)ను ప్రారంభించేందుకు అనుమతి కోరుతూ సెబీకి ప్రాథమిక ముసాయిదా పత్రాలు సమర్పించింది. ఐపీఓలో భాగంగా కంపెనీ 1.9 కోట్ల తాజా ఈక్విటీ షేర్ల జారీతో పాటు ప్రస్తుత ప్రమోటర్‌కు చెందిన 35 లక్షల ఈక్విటీ షేర్లను సైతం జారీ చేయనుంది.

- క్వాడ్రంట్ ఫ్యూచర్ రూ.290 కోట్ల ఐపీఓ ఈ నెల 7న ప్రారంభమై 9న ముగియనుంది. ఐపీఓ ధరల శ్రేణిని కంపెనీ రూ.275-290గా నిర్ణయించింది.

కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలు చేయాలి

- బీసీలకు 42% రిజర్వేషన్లు ఇచ్చాకే స్థానిక ఎన్నికలు పెట్టాలి
- బీఆర్ఎస్ పాలనలోనే బీసీల అభివృద్ధి: ఎమ్మెల్సీ కవిత


సావిత్రిబాయి పూలే విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్సీ కవిత

కవాడిగూడ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): "అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ కామారెడ్డిలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలి. బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిచాలి. లేనిపక్షంలో తెలంగాణ జాగృతి, బీసీ కులాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటం చేస్తాం" అని తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకొని బీసీల డిమాండ్ల సాధన కోసం తెలంగాణ జాగృతి, వివిధ బీసీ సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద బీసీ మహాసభ నిర్వహించారు. ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీలు అడుగడుగునా బీసీలను మోసం చేశాయని ఆరోపించారు. ప్రాంతీయ పార్టీలతోనే బీసీలకు న్యాయం జరిగిందని పేర్కొన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో బీసీల సంక్షేమం, అభివృద్ధిపై ఎక్కడైనా చర్చకు సిద్ధమని ఆమె చెప్పారు.

ప్రజా వాణి.. ఉత్త ప్రహసనం!

- ప్రజాసమస్యలకు పరిష్కారమేది?: హరీశ్‌రావు



హైదరాబాద్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): సీఎం క్యాంపు ఆఫీసులో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమం ఉత్త ప్రహసనంగా మారిందని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. కాంగ్రెస్ సర్కారు చెబుతున్న ప్రజాపాలన ప్రజాపీడనగా మారిందని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్‌టీఐ కింద అధికారులు ఇచ్చిన సమాచారం ప్రకారం.. 2024 డిసెంబరు 9నాటికి ప్రజలనుంచి ప్రజావాణికి 82,955 పిటిషన్లు వచ్చాయని, అందులో కేవలం 43,272 పిటిషన్లు మాత్రమే గ్రీవెన్సెస్ కిందకు వస్తాయని మిగతావి దాని పరిధిలోకి రావని చెబుతున్నారన్నారు. అంటే... సగం దరఖాస్తులను అధికారులు తిరస్కరించినట్లు కనబడుతోందన్నారు. గ్రీవెన్స్ పరిధిలోకి వచ్చే.. 43,272ఫిర్యాదుల్లోనూ 27,215 మాత్రమే పరిష్కారానికి నోచుకున్నాయని అధికారులు చెబుతున్నా.. అందులోనూ వాస్తవంలేదన్నారు.

కాంట్రాక్ట్ గురుకుల టీచర్ల సమ్మె విరమణ

- మంత్రి సీతక్కతో చర్చలు సఫలం

హైదరాబాద్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు గురుకుల ఉపాధ్యాయుల(సీఆర్‌టీ)తో మంత్రి సీతక్క చర్చలు సఫలం కావడంతో 16 రోజులుగా సమ్మె చేస్తున్న వారు సమ్మె విరమించినట్టు ప్రకటించారు. శనివారం నుంచి విధుల్లో చేరుతున్నట్లుగా పేర్కొన్నారు. ఉద్యోగ క్రమబద్ధీకరణ, మినిమం టైం స్కేల్ మినహా ఇతర అన్ని డిమాండ్లకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించడంతో సమ్మె విరమించేందుకు సీఆర్‌టీలు అంగీకరించారు. ప్రతి నెలా 5వ తేదీలోపు వేతనాలు, మహిళా టీచర్లకు 180 రోజుల ప్రసూతి సెలవులు, మరణ ప్రయోజనాలు మంజూరు చేస్తామని మంత్రి సీతక్క హామీ ఇచ్చినట్టు కాంట్రాక్టు గురుకుల ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు మాలోతు సోమేశ్వర్ తెలిపారు. ఉద్యోగ క్రమబద్ధీకరణ, మినిమం టైం స్కేల్ డిమాండ్లపై సీఎంతో చర్చించేందుకు మరోసారి సమావేశానికి మంత్రి సీతక్క హామీ ఇచ్చినట్టు వివరించారు.

విశ్రాంత ఆర్టీసీ కార్మికులకు 'ఆసరా' అందించండి

- మంత్రి ఉత్తమ్‌కు ఆర్టీసీ ఉద్యోగుల సంఘం విజ్ఞప్తి

హైదరాబాద్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): విశ్రాంత ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులకు ఆసరా పెన్షన్ పథకం వర్తింపజేయాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి తెలంగాణ ఆర్టీసీ ఉద్యోగుల సంఘం విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు శుక్రవారం సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రాజిరెడ్డి నేతృత్వంలో పలువురు నాయకులు మంత్రిని కలిసి వినతిపత్రం సమర్పించారు. విశ్రాంత ఉద్యోగులు, కార్మికులకు తెల్ల రేషన్ కార్డు ఇప్పించి రాజీవ్ ఆరోగ్య శ్రీ భీమా పథకం అమలయ్యేలా చూడాలని, ఇందిరమ్మ ఇళ్ల పథకం వర్తింపజేయాలని ఈ సందర్భంగా వారు మంత్రిని కోరారు.

5 ఎకరాల్లోపు వారికే 'రైతు భరోసా' ఇవ్వాలి

- కౌలు రైతులకు న్యాయం చేయాలి.. ఎఫ్‌జీజీ విజ్ఞప్తి

హైదరాబాద్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఐదెకరాల లోపు రైతులకే 'రైతు భరోసా' పథకాన్ని వర్తింపజేయాలని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్(ఎఫ్‌జీజీ) డిమాండ్ చేసింది. ఈమేరకు ఎఫ్‌జీజీ అధ్యక్షుడు ఎం.పద్మనాభరెడ్డి శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. పడావు భూములకు, వందల ఎకరాలున్న పెద్ద రైతులకు రైతు భరోసాను అమలు చేస్తే ఖజానాపై పెను భారం పడుతుందని పేర్కొన్నది. అందుకే బడా భూస్వాములు, ఆదాయ పన్ను చెల్లించే శ్రీమంతులను ఈ పథకం నుంచి దూరం చేయాలని కోరింది. ఐదెకరాల పరిమితి విధించి, రైతు భరోసా పథకాన్ని అమలు చేయాలని, కౌలు రైతులకు పథకం ద్వారా న్యాయం చేయాలని ఎఫ్‌జీజీ విన్నవించింది.

శంషాబాద్ ఎయిర్‌పోర్టులో సీబీఐ సోదాలు

- ఇద్దరు కస్టమ్స్ ఇన్‌స్పెక్టర్లు, బ్యాంకు ఉద్యోగి అరెస్టు
- 'క్లియరెన్స్' కోసం లంచం తీసుకుంటుండగా పట్టివేత

హైదరాబాద్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): శంషాబాద్ ఎయిర్‌పోర్టులో సీబీఐ అధికారులు శుక్రవారం సోదాలు నిర్వహించారు. కస్టమ్స్ క్లియరెన్స్ కోసం విదేశీ ప్రయాణికుల నుంచి లంచం డిమాండ్ చేస్తున్నారన్న ఫిర్యాదుల నేపథ్యంలో సీబీఐ రంగంలోకి దిగింది. జెడ్డా నుంచి వచ్చిన ఒక కుటుంబానికి కస్టమ్స్ క్లియరెన్స్ ఇవ్వడం కోసం కస్టమ్స్, సెంట్రల్ ఎక్సైజ్ విభాగంలో పనిచేస్తున్న ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు రూ.50వేలు డిమాండ్ చేశారు. ఆ డబ్బును అక్కడే ఉన్న కెనరా బ్యాంకు ఉద్యోగి ద్వారా ఇద్దరు అధికారులు తీసుకుంటుండగా సీబీఐ పట్టుకుంది. మొత్తం ముగ్గురిని అరెస్టు చేశారు. అనంతరం పట్టుబడిన అధికారుల ఇళ్లల్లోనూ సోదాలు నిర్వహించి రూ.4.76లక్షలు స్వాధీనం చేసుకున్నామని సీబీఐ హైదరాబాద్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు.

రూ.3000 కోట్ల అప్పు తీసుకోనున్న రాష్ట్రం

హైదరాబాద్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): బహిరంగ మార్కెట్ నుంచి రాష్ట్ర ప్రభుత్వం రూ.3000 కోట్ల అప్పు తీసుకోనుంది. ఈమేరకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు శుక్రవారం ఇండెంటు పెట్టింది. 24ఏళ్ల కాల పరిమితితో రూ.1000కోట్లు, 29ఏళ్ల కాల పరిమితితో రూ.1000కోట్లు, 30 ఏళ్ల కాల పరిమితితో రూ.1000కోట్ల చొప్పున ఈ అప్పు తీసుకోనుంది. రాష్ట్రంతో కలిపి దేశంలోని 10 రాష్ట్రాలు మొత్తం రూ.21,500 కోట్ల అప్పుల కోసం ఇండెంట్లు పెట్టాయి. ఈ నెల 7న ఆర్‌బీఐ నిర్వహించే ఈ-వేలం ద్వారా ఈ అప్పులు తీసుకోనున్నాయి.

సంచారజాతుల స్థితిగతులపై పరిశీలన

- ఈ నెలలో పర్యటనకు బీసీ కమిషన్ నిర్ణయం

హైదరాబాద్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): సంచార జాతుల స్థితిగతులు, వారి సామాజిక పరిస్థితుల అధ్యయనానికి ఈ నెల మూడో వారంలో వారు నివసించే ప్రాంతాలను పరిశీలించాలని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ అధ్యక్షతన శుక్రవారం జరిగిన సమావేశంలో నిర్ణయించారు. ప్రభుత్వ నియామకాలు, పదోన్నతుల విషయంలో బీసీ రిజర్వేషన్లు పాటిస్తున్నదీలేనిదీ పరిశీలించాలని కమిషన్ నిర్ణయించింది. కుమ్మర, రజక, మేర కులాల ప్రస్తుత పేర్లకు బదులు అదనంగా ప్రాచుర్యంలో ఉన్న కొన్ని పేర్లను పర్యాయపదాలుగా చేర్చాలనే విషయాన్నీ సమావేశంలో చర్చించారు. ఈ విషయంపై అభ్యంతరాలుంటే కమిషన్ కార్యాలయంలో తెలియజేసేందుకు జనవరి 4 నుంచి 18 వరకు గడువు ఇస్తూ ఓ ప్రకటన విడుదల చేశారు.

హైదరాబాద్‌లో ఫూలే దంపతుల విగ్రహాల ఏర్పాటుకు కృషి

- ఏదైనా వర్సిటీకి సావిత్రిబాయి పేరు పెట్టాలని సీఎంను కోరుతా: మంత్రి సీతక్క
- క్యాబినెట్‌లో మరో ఇద్దరు బీసీలకు అవకాశం!: టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్

రవీంద్రభారతి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): సావిత్రిబాయి ఫూలే చరిత్ర భావితరాలకు స్ఫూర్తిదాయకమని మంత్రి సీతక్క కొనియాడారు. శుక్రవారం రవీంద్రభారతిలో సావిత్రి బాయి ఫూలే జయంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఫూలే దంపతులు ప్రజల పక్షాన పోరాటం చేశారని, హైదరాబాద్‌లో వారి విగ్రహాల ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. సావిత్రిబాయిఫూలే పేరును ఏదైనా వర్సిటీకి పెట్టే విషయమై సీఎంతో మాట్లాడతానని హామీ ఇచ్చారు. అణగారిన వర్గాలకు విద్యనందించిన మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి ఫూలే అని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ కొనియాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీల పక్షపాతి అని, క్యాబినెట్‌లో మరో ఇద్దరు బీసీలకు అవకాశం కల్పించాలని ఏఐసీసీ పెద్దలను సీఎం రేవంత్‌రెడ్డి కోరినట్లు తెలిపారు. సావిత్రిబాయిఫూలే జయంతిని మహిళా దినోత్సంగా ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామని ఎంపీ కె.లక్ష్మణ్ అన్నారు. ఫూలే ఆశయసాధనకు బీసీలంతా ఐక్యమత్యంతో ముందుకు సాగాలని సూచించారు. ఫూలే దంపతులకు భారతరత్న ఇవ్వాలని వి.హనుమంతరావు డిమాండ్ చేశారు. సావిత్రిబాయి జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్ణయించడం అభినందనీయమని బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. హైదరాబాద్‌లో ఫూలే దంపతుల విగ్రహాల ఏర్పాటు చేయడంతో పాటు నాలెడ్జ్ సెంటర్ ఏర్పాటు చేయాలని కోరారు.


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క.. చిత్రంలో వీహెచ్, జాజుల

'గులాబీ'కి గుబులు!

బీఆర్ఎస్‌కు సవాల్‌గా ఎమ్మెల్సీ ఎన్నికలు.. పోటీ చేయాలా? వద్దా? అని తర్జనభర్జన

- కారు పార్టీని వెంటాడుతున్న ఓటమి భయం
- 'స్థానికం'పై ప్రభావం పడుతుందని ఆందోళన
- అభ్యర్థుల ఎంపికపై కాంగ్రెస్, బీజేపీ కసరత్తు
- ఒక గ్రాడ్యుయేట్, రెండు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికలకు త్వరలోనే నోటిఫికేషన్



వరంగల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గులాబీ పార్టీకి ఎమ్మెల్సీ ఎన్నికలు పెద్ద సవాల్‌గా మారాయి. ఉత్తర తెలంగాణలో మూడు ఎమ్మెల్సీ స్థానాలకు మార్చిలో ఎన్నికలు జరిగే అవకాశం ఉండగా... పోటీ చేయాలా? వద్దా? అనే అంశంపై బీఆర్ఎస్ తర్జనభర్జన పడుతోంది. ఉత్తర తెలంగాణలో గట్టి పట్టున్నా... అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలతోపాటు పట్టభద్రుల ఉప ఎన్నికల్లో ఓటమి ఆ పార్టీ శ్రేణుల్లో నైరాశ్యం నింపింది. ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ ఓడితే పరిస్థితి ఏంటన్న ప్రశ్నలు తలెత్తుతుండగా.. పోటీ చేయకపోతే ఉనికికే ప్రమాదమన్న చర్చ గులాబీ వర్గాల్లో జోరుగా సాగుతోంది. ఉమ్మడి వరంగల్-నల్లగొండ-ఖమ్మం జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, కరీంనగర్-నిజామాబాద్-ఆదిలాబాద్-మెదక్ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి, కరీంనగర్-నిజామాబాద్-ఆదిలాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పదవీ కాలం మార్చి చివరి నాటికి పూర్తి కానుంది. దీంతో ఎన్నికల సంఘం మూడు నెలల క్రితమే ఓటరు నమోదు చేపట్టింది. 'నల్లగొండ' టీచర్ నియోజకవర్గంలో 24,905 మంది, 'కరీంనగర్' టీచర్ నియోజకవర్గంలో 25,921మంది, 'కరీంనగర్' పట్టభద్రుల నియోజకవర్గంలో 3,41,313మంది ఓటర్లుగా నమోదయ్యారు. ఓటర్ల తుది జాబితాను ప్రకటించిన ఎన్నికల సంఘం.. ఈ నెలాఖరు లేదా వచ్చే నెలలో మూడు ఎమ్మెల్సీ స్థానాలకు నోటిఫికేషన్ ఇచ్చే అవకాశం ఉంది. దీంతో ఇప్పటి నుంచే పోటీ చేసే అభ్యర్థులు టికెట్ కోసం ఆయా పార్టీల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఉపాధ్యాయ సంఘాలు ఆయా పార్టీల మద్దతు కోరుతున్నారు. తమ మద్దతుతో ఉపాధ్యాయ ఎమ్మెల్సీలను గెలిపించుకోవడమే కాకుండా.. తిరిగి కరీంనగర్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాన్ని నిలబెట్టుకోవాలనే లక్ష్యంతో కాంగ్రెస్ ఉంది. గత లోక్‌సభ ఎన్నికల్లో వచ్చిన సానుకూల ఫలితాల నేపథ్యంలో మూడు ఎమ్మెల్సీ స్థానాల్లో పాగా వేయాలని బీజేపీ తహతహలాడుతోంది. కానీ.. బీఆర్ఎస్ పరిస్థితే అగమ్యగోచరంగా ఉంది. 2019లో జరిగిన రెండు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆ పార్టీ మద్దతు ఇచ్చిన పూల రవీందర్, పాతూరి సుధాకర్‌రెడ్డి ఓడిపోయారు. కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంలో బీఆర్ఎస్‌పై కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి విజయం సాధించారు. ఉత్తర తెలంగాణలో ఉపాధ్యాయులు, పట్టభద్రులు 2019లోనే బీఆర్ఎస్‌ను ఆదరించలేదనే చర్చ జరిగింది. ప్రస్తుతం అధికారంలో లేని ఈ పరిస్థితుల్లో పోటీ చేస్తే ఎలాంటి పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందోననే చర్చ గులాబీ కేడర్‌లో జరుగుతోంది. అదే సమయంలో.. ఎన్నికల్లో పోటీ చేయకపోతే కేడర్‌లోకి తప్పుడు సంకేతాలు వెళ్తాయన్న చర్చ నడుస్తోంది.

స్థానిక ఎన్నికల నేపథ్యంలో..

కరీంనగర్ పట్టభద్రుల స్థానానికి కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రస్తుత ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డినే అధిష్ఠానం ప్రకటించింది. ఇక బీజేపీ నుంచి పోటీ చేసేందుకు డజన్ మందికిపైగా నేతలు పోటీ పడుతున్నారు. బీఆర్ఎస్ నుంచి మాజీ మేయర్ రవీందర్‌సింగ్‌తో పాటు మరో ఇద్దరు ముగ్గురు రెడీగా ఉన్నా పోటీపై అధిష్ఠానం ఎటూ తేల్చడం లేదు. మూడు ఎమ్మెల్సీ స్థానాల్లో జరిగే ఎన్నికల్లో పోటీ చేయకపోతే కేడర్‌లో మరింత నైరాశ్యం ఏర్పడుతుందనే చర్చ జరుగుతోంది. అయితే, ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను అనుకూలంగా మలుచుకుని స్థానిక ఎన్నికల్లో పట్టు సాధించాలని బీఆర్ఎస్ వ్యూహాలు రచిస్తోంది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి పాలైతే ఆ ప్రభావం స్థానికంపై పడుతుందనే ఆందోళన గులాబీ నేతల్లో వ్యక్తమవుతోంది. ఈ ప్రాంతంలో బీజేపీకి కూడా కొంత ఆదరణ ఉండటంతో ఆ పార్టీ కంటే తక్కువ ఓట్లు వస్తే, స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ వర్సెస్ బీజేపీగా అన్నట్టుగా పరిస్థితి మారిపోతుందని భావిస్తున్నారు. దీంతో ఎన్నికల్లో పోటీ చేయాలా? వద్దా? అనేది తేల్చుకోలేక గులాబీ అగ్ర నేతలు టెన్షన్ పడుతున్నట్లు తెలిసింది.

బీఆర్ఎస్‌లో బీసీలకు గొంతెత్తే ధైర్యం ఉందా?

- మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): "కాంగ్రెస్ పార్టీలో బీసీల సమస్యలపై గొంతెత్తే స్వేచ్ఛ పార్టీలోని బీసీ నేతలందరికీ ఉంది. బీఆర్ఎస్ లోని బీసీ నేతలకు బీసీల గురించి గొంతెత్తే ధైర్యం ఉందా?" అని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రశ్నించారు. బతుకమ్మ, జాగృతి.. ఇప్పుడు బీసీలు అంటూ ఏదో ఒక అజెండా పట్టుకుని మార్కెట్లో ఉండడం తప్ప పదేళ్లలో ఏనాడైనా బీసీల గురించి కవిత మాట్లాడారా అని ఆయన నిలదీశారు. గాంధీభవన్‌లో శుక్రవారం మీడియా సమావేశంలో ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, మత్స్య కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్‌లతో కలిసి పొన్నం మాట్లాడారు. బీసీలకు పార్టీలోనూ సంస్థాగతంగా న్యాయం చేయని బీఆర్ఎస్ నేతలు ఇప్పుడు బీసీల గురించి మాట్లాడటం దయ్యాలు వేదాలు వల్లించినట్టుగా ఉందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్లను బీఆర్ఎస్ ప్రభుత్వం తగ్గించినప్పుడు ఎమ్మెల్సీ కవిత గొంతు ఎక్కడికి పోయిందని నిలదీశారు. కులగణన సర్వే పూర్తయ్యాక దాన్ని ప్రజల అందుబాటులో పెడతామని, నిపుణులతోనూ చర్చిస్తామని చెప్పారు. కాగా పదేళ్ల పాలనలో బీసీలను విస్మరించిన ఘనత బీఆర్ఎస్‌దని, అలాంటిది బీసీల కోసం ఆ పార్టీ ఎమ్మెల్సీ కవిత ధర్నా చేయడం విడ్డూరంగా ఉందని కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్‌కు చిత్తశుద్ధి ఉంటే ఆ పార్టీ అధ్యక్షుడిగా బీసీని ప్రకటించాలని శుక్రవారం ఓ ప్రకటనలో సవాల్ చేశారు.

రైతుల్ని రెచ్చగొడుతున్న కేటీఆర్: అడ్లూరి లక్ష్మణ్

హైదరాబాద్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): పదేళ్ల అధికారంలో ఉండి రైతుల్ని ఏనాడూ పట్టించుకోని కేటీఆర్.. ఇప్పుడు వారిని రెచ్చగొడుతున్నాడని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ధ్వజమెత్తారు. సీఎల్పీ మీడియా హాల్లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ రూ.2 లక్షలలోపు రైతు రుణమాఫీ చేసిన సీఎం రేవంత్‌రెడ్డి.. సంక్రాంతి తర్వాత రైతు భరోసానూ ఇస్తారని ధీమా వ్యక్తం చేశారు. రైతు భరోసా గురించి మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ముందు కేంద్రం నుంచి రాష్ట్రానికి నిధులు తీసుకురావాలని సూచించారు.

ఉద్యమ సమయంలో మీ ఆస్తులు ఎలా పెరిగాయ్?

- కేటీఆర్‌కు షబ్బీర్ అలీ ప్రశ్న

హైదరాబాద్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): "ఉద్యమ సమయంలో ఆస్తులు అమ్ముకుంటే.. 2009 నుంచి 2014 మధ్య మీ ఆస్తులు ఎలా పెరిగాయి" అంటూ ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ.. కేటీఆర్‌ను ప్రశ్నించారు. గాంధీభవన్‌లో శుక్రవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2009 నుంచి 2023 వరకు ఎన్నికల అఫిడవిట్లు పరిశీలిస్తే కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుల ఆస్తులు ప్రతి ఎన్నికకూ పెరుగుతూ పోయాయని, అన్ని కోట్ల ఆస్తులు ఎలా సమకూరాయో ప్రకటించాలన్నారు.

ప్రజా ప్రభుత్వం కాదు.. ప్రజలను మోసం చేసే ప్రభుత్వం

- మార్పు కోసం కాంగ్రెస్ అన్నారు.. ఏడాదిలో ఎలాంటి మార్పూ లేదు
- గతంలో కేసీఆర్ కుటుంబం దోచేస్తే.. ఇప్పుడు మంత్రులు దోచుకుంటున్నారు
- రైతు భరోసాకు దరఖాస్తులు ఎందుకు: కిషన్ రెడ్డి



హైదరాబాద్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో కాంగ్రెస్‌ది ప్రజా ప్రభుత్వం కాదని.. ప్రజలను మోసం చేసే ప్రభుత్వం అని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి అన్నారు. శుక్రవారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. మార్పు కోసం కాంగ్రెస్ రావాలని ఎన్నికల ముందు నాయకులు ప్రచారం చేశారని, కానీ అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా రాష్ట్రంలో ఎలాంటి మార్పు కనిపించడం లేదని విమర్శించారు. గతంలో కేసీఆర్ కుటుంబం మాత్రమే దోచుకుంటే.. ఇప్పుడు కాంగ్రెస్ మంత్రులు రాష్ట్రాన్ని దోచుకుంటున్నారని ఆరోపించారు. ఇది చేతకాని దద్దమ్మ ప్రభుత్వం అని అన్నారు. మాటలు, కోతల ప్రభుత్వం అని ప్రజలు భావిస్తున్నారన్నారు. రాష్ట్రంలో రైతుల పరిస్థితి దయనీయంగా ఉందని, రుణమాఫీ అరకొరగా చేశారని కిషన్‌రెడ్డి విమర్శించారు. ప్రభుత్వం దగ్గర అన్ని వివరాలు ఉన్నా, రైతు భరోసా కోసం దరఖాస్తులు పెట్టుకోవాలని చెబుతున్నారంటే ప్రజలను మభ్యపెట్టేందుకేనని అన్నారు. రుణమాఫీ లాగే రైతుభరోసాకు కోతలు పెడతారన్నారు. రాష్ట్రంలో ఫసల్‌బీమా అడ్రస్ లేదని, గతంలో కేసీఆర్ పదేళ్లపాటు ఇలాగే ఫసల్ బీమా లేకుండా రైతులను అప్పుల ఊబిలోకి నెట్టారని, ఇప్పుడు రేవంత్ రెడ్డి ప్రభుత్వం కూడా ఇదే తరహాలో వ్యవహరిస్తోందని ఆయన మండిపడ్డారు. వరంగల్ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలను ఎందుకు నెరవేర్చడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఇప్పటి వరకు మూడు పంటలు పూర్తయినా రైతు భరోసా ఎందుకు ఇవ్వలేదని నిలదీశారు. ఎన్నికల సమయంలో పది రకాల పంటలకు బోనస్ ఇస్తామని చెప్పి కేవలం వరి పంటకే బోనస్ ఇచ్చారన్నారు. అది కూడా అరకొరగా సన్నబియ్యానికే అని సన్నాయి నొక్కులు నొక్కారని కిషన్‌రెడ్డి విమర్శించారు. అధికారంలోకి రాక ముందు ఓడమల్లన్న.. అధికారంలోకి వచ్చాక బోడి మల్లన్న అన్న చందంగా కాంగ్రెస్ నాయకుల తీరు ఉందన్నారు. రాష్ట్రంలో పండించే ధాన్యం అంతా కేంద్రం మద్దతు ధరకు కొనుగోలు చేయడానికి సిద్ధంగా ఉన్నా రాష్ట్ర ప్రభుత్వం సహకరించడం లేదని ఆరోపించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ జనవరి రెండో వారంలో రాష్ట్రవ్యాప్తంగా నిరసన తెలిపి కలెక్టర్లకు వినతి పత్రాలు అందిస్తామని కిషన్‌రెడ్డి వెల్లడించారు.

విచారణకు వేళాయె!

(మొదటిపేజీ తరువాయి)



వివరాలను దానకిషోర్ నుంచి ఏసీబీ అధికారులు తెలుసుకున్నారు. పురపాలక శాఖ నుంచి అనేక పత్రాలను సేకరించారు. సీఎస్ శాంతి కుమారికి గతంలో అర్వింద్ కుమార్ ఇచ్చిన వివరణ ప్రతిని తెప్పించుకున్నారు. ఈ కేసులో విచారణ ప్రారంభించాలని భావించారు. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం తనపై తప్పుడు ఆరోపణలు చేస్తోందని, ఫార్ములా ఈ కారు రేసు బాధ్యత అంతా తనదేనని తొలుత మీడియాతో అన్న కేటీఆర్.. ఆ తర్వాత ఏసీబీ తనపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను క్వాష్ చేయాలంటూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దానిపై ఇప్పటికే వాదనలు ముగియడంతో తీర్పును రిజర్వ్ చేశారు. తీర్పు ప్రకటించే వరకూ కేటీఆర్‌ను అరెస్టు చేయవద్దని, విచారణను మాత్రం కొనసాగించవచ్చని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలోనే, ఏసీబీ అధికారులు కేటీఆర్‌ను విచారణకు రావాలంటూ నోటీసు ఇచ్చారు.

పత్రాల ఆధారంగానే విచారణ

కేటీఆర్‌ను విచారించడానికి ముందు ఏసీబీ సుదీర్ఘ కసరత్తు చేసింది. ఇందులో భాగంగా.. ఇప్పటి వరకు జరిగిన ఒప్పందాలు ఏమిటి? వాటిలో ఎవరెవరి పాత్ర ఎంత ఉంది? ఎవరెవరు ఏమేమి మాట్లాడుకున్నారు? వీరి మధ్య జరిగిన ఫోన్ చాటింగ్ వివరాలేమిటి? ఈ-మెయిల్ సందేశాలేమిటి? తదితర విషయాలను చాలా వరకు ఏసీబీ అధికారులు సేకరించారు. వీటన్నింటి ఆధారంగా కేటీఆర్‌ను ప్రశ్నించే అవకాశముంది. ఇక, ఫార్ములా ఈ కారు రేసు కేసులో ఏం జరిగిందన్న వివరాలను ఈ కేసులో ఏ2గా ఉన్న అర్వింద్ కుమార్ ఇప్పటికే చీఫ్ సెక్రటరీ శాంతికుమారికి రాతపూర్వకంగా అందజేశారు. సీఎస్ ఇచ్చిన షోకాజ్ నోటీసుకు అందులో ఆయన బదులిచ్చారు. అందులో కీలక అంశాలున్నట్లు తెలుస్తోంది. మరోవైపు.. జరిగిందంతా పూసగుచ్చినట్లు చెబుతానని, అరెస్టు నుంచి తనను బయటపడేయాలని అర్వింద్ కుమార్ లాబీయింగ్ చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అలాగే, అర్వింద్ కుమార్, కేటీఆర్ చెప్పినట్లే తాను చేశానని, అంతకుమించి తనకేమీ తెలియదని హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజనీర్ బీఎల్ఎన్ రెడ్డి తన సన్నిహితుల వద్ద వ్యాఖ్యానించినట్లు తెలుస్తోంది.

ఈడీ విచారణ కూడా..

ఫార్ములా ఈ కారు రేసు కేసులో ఫెమా నిబంధనల ఉల్లంఘనపై దృష్టిసారించిన ఈడీ అధికారులు.. కేటీఆర్‌ను ఈనెల ఏడో తేదీన విచారణకు రావాలంటూ ఇప్పటికే సమన్లు జారీ చేసిన విషయం తెలిసిందే. బీఎల్ఎన్ రెడ్డి, అర్వింద్ కుమార్ ఈనెల 2, 3 తేదీల్లో ఈడీ విచారణకు హాజరుకావాల్సి ఉన్నప్పటికీ.. వారు కొంత సమయం అడిగారు. దాంతో, వీరిద్దరినీ ఈనెల 8, 9 తేదీల్లో విచారణకు రావాలని ఈడీ అధికారులు స్పష్టం చేశారు. అంటే.. ఏడో తేదీ నుంచి తొమ్మిదో తేదీ వరకూ ఈ కేసులో ఈడీ విచారణ జరగబోతోంది.

హైకోర్టు తీర్పుపై సర్వత్రా ఉత్కంఠ

హైకోర్టులో కేటీఆర్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై ఇప్పటికే విచారణ ముగిసింది. తీర్పును రిజర్వ్ చేశారు. ఈ తీర్పు ఏవిధంగా రావచ్చనే అంశంపై బీఆర్ఎస్ శిబిరంలో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. క్వాష్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేస్తుందా? లేదా అన్న అంశం సస్పెన్స్‌గా మారింది. ఆరో తేదీన ఏసీబీ.. ఏడో తేదీన ఈడీ ఇలా ఒకదాని తర్వాత మరో విచారణకు హాజరు కావాల్సిన పరిస్థితి ఏర్పడటంతో కేటీఆర్ బృందం న్యాయవాదులతో సుదీర్ఘ చర్చలు జరుపుతోంది. విచారణలకు కేటీఆర్ హాజరవుతారా లేక సమయం కావాలని కోరతారా అనే అంశం న్యాయవాదుల బృందం నిర్ణయం ప్రకారం ఉంటుందని బీఆర్ఎస్ వర్గాలు చెబుతున్నాయి. క్వాష్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేస్తే కేటీఆర్ సుప్రీంకోర్టును ఆశ్రయించవచ్చని, ఆలోపే చట్టపరమైన చర్యల్లో భాగంగా ఏసీబీ అరెస్ట్ చేస్తే మాత్రం ఇబ్బందనే విషయంపైనా పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. కేటీఆర్‌పై నమోదు చేసిన కేసులో సెక్షన్ 409 ప్రకారం నోటీసు లేకుండానే అరెస్టు చేయవచ్చని మాజీ పోలీసు అధికారులు అంటున్నారు.

రైతులపై కేసులు పెట్టేందుకే ప్రమాణపత్రాలు

- భరోసా కోసం రైతులు అడుక్కోవాలా?
- రైతులకు 26,500 కోట్లు ఎగ్గొట్టారు
- దీనిపై ఊరూరా మేం పోస్టర్లు వేస్తాం
- ఎంతమందికి రుణమాఫీ చేశారో ప్రభుత్వమే ప్రమాణపత్రాలివ్వాలి: కేటీఆర్

హైదరాబాద్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రైతాంగాన్ని ఇబ్బంది పెట్టేందుకే రైతుభరోసా చెల్లిస్తాం.. ప్రమాణ పత్రాలు ఇవ్వండంటూ కాంగ్రెస్ సర్కారు కుట్రచేస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. అన్నదాతలను దొంగలుగా చిత్రీకరించేందుకు, కేసులు పెట్టేందుకు కుట్ర చేస్తున్నారని, రైతు భరోసా కోసం రైతులు అడుక్కోవాలా? అని ప్రశ్నించారు. రైతులను కేసీఆర్ శాసించే స్థితికి తీసుకువస్తే... రేవంత్‌రెడ్డి 13నెలల పాలనలో రైతాంగాన్ని యాచించే స్థితికి దిగజార్చుతున్నారని విమర్శించారు. తమ ప్రభుత్వం 11సార్లు రైతుబంధు డబ్బులిస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా రైతులకు ఇవ్వలేదన్నారు. రైతులు యాచించాలని ప్రభుత్వం కోరుకొంటోందని, వానాకాలంలో ఎగ్గొట్టిన రైతుబంధు కూడా ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశారు. "ప్రమాణ పత్రం ఇవ్వాల్సింది రైతులు కాదు.. ఎంతమందికి రుణమాఫీ చేశారనే దానిపై ఊరురా కాంగ్రెస్ ప్రభుత్వమే ప్రమాణపత్రాలు ఇవ్వాలి" అని వ్యాఖ్యానించారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు.ప్రజాపాలన పేరిట రూ.1.6కోట్ల మందితో దరఖాస్తులు తీసుకున్నారని, అందులో రైతుభరోసా లబ్ధికి సంబంధించిన సమాచారం కూడా ఉందని, అలాంటప్పుడు రైతులు మళ్లీ దరఖాస్తు చేసుకోవడం ఎందుకని ప్రశ్నించారు. మొన్నటివరకు కులగణన సర్వే పేరుతో డ్రామాలు చేసిన కాంగ్రెస్.. ఇప్పుడు ప్రమాణపత్రాలంటూ రైతులను భయాందోళనకు గురిచేస్తోందని ఆరోపించారు. హామీలు అమలుచేసే సత్తా లేకుంటే చేతగానివాళ్లమంటూ రైతన్నలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఒక్కొక్క రైతుకు ఎకరాకు రూ.17,500 చొప్పున ప్రభుత్వం బాకీపడిందని, దీనిపై ఊరూరా పోస్టర్లు వేసి మరీ రైతులకు తెలియజేస్తామన్నారు. రైతుబంధును లేకుండాచేయాలని రేవంత్‌రెడ్డి చిల్లర ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. రైతులు అడుక్కుంటారా?అని వ్యవసాయశాఖ మంత్రి మాట్లాడుతున్నారని, ఈ ప్రభుత్వం ధోరణి దారుణంగా ఉందన్నారు. గత ప్రభుత్వం హయాంలో రైతుబంధు పంపిణీలో రూ.22వేలకోట్ల అవినీతి జరిగిందని ఆరోపిస్తున్న కాంగ్రెస్.. ఆ డబ్బు ఎక్కడికి వెళ్లిందో చెప్పాలన్నారు. పత్తి, కంది, చెరుకు వంటి వాటికి రెండోపంట ఉండదని.. అయినా రైతుబంధు ఇచ్చామన్నారు.రాష్ట్ర రైతాంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం రూ.26,500కోట్లు ఎగ్గొట్టిందని విమర్శించారు.

వారధులైనా.. సారథులైనా మీరే

ఆర్థిక పరిస్థితి కుదట పడిన వెంటనే ఉద్యోగుల సమస్యలన్నీ పరిష్కరిస్తాం

- ప్రతిపక్ష నేతల ఉచ్చులో చిక్కుకోవద్దు
- ఒక సారి మాటిస్తే రేవంతన్న తప్పడు
- టీజీవో డైరీ ఆవిష్కరణలో సీఎం రేవంత్



టీజీవో డైరీ ఆవిష్కరణలో సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి తదితరులు

హైదరాబాద్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): "మీరు ఒక సారి పరీక్ష రాస్తే.. 35 ఏళ్లు ప్రభుత్వ ఉద్యోగంలో ఉంటారు.. మేం మాత్రం ప్రతి ఐదేళ్లకు ఒకసారి పరీక్ష రాయాలి. రాష్ట్రానికి వారధులైనా.. సారథులైనా మీరే" అని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. ధర్నాలు, రాస్తారోకోలతో ఉపయోగం లేదని, చర్చల ద్వారానే ఏ సమస్యకైనా పరిష్కారం దొరుకుతుందని అన్నారు. ప్రతిపక్షాల ఉచ్చులో ఉద్యోగులు పడొద్దని సూచించారు. తెలంగాణ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం(టీజీవో) డైరీ, క్యాలెండర్‌ను సచివాలయంలో శుక్రవారం సీఎం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉద్యోగులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై ఎలాంటి అనుమానాలు అవసరం లేదని, ఒకసారి మాట ఇస్తే దాన్ని అమలు చేయడానికి రేవంత్ అన్న సిద్ధంగా ఉంటాడని, ఆర్థిక పరిస్థితి కుదుట పడిన వెంటనే సమస్యలన్నీ పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. టీజీవో అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాస్‌రావు, ప్రధాన కార్యదర్శి ఎ.సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు శ్యామ్ ఉద్యోగుల డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని సీఎంకు అందించారు. అలాగే, స్టేట్ టీచర్స్ యూనియన్ (ఎస్టీయూ) ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర డైరీని కూడా ముఖ్యమంత్రి శుక్రవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పర్వత్ రెడ్డి, సదానందం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ రోడ్లకు వెయ్యి కోట్లు

- జూన్ నెలాఖరు వరకూ ప్రతి నెలా విడుదల
- అధికారులకు సీఎం రేవంత్ ఆదేశాలు

హైదరాబాద్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గ్రామీణ రహదారులకు మహర్దశ పట్టనుంది. వీటి నిర్మాణానికి రూ.1000 కోట్లను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేటాయించారు. జనవరి నుంచి జూన్ నెలాఖరు వరకూ నెలకు దాదాపు రూ.150 కోట్ల చొప్పున వెయ్యి కోట్లు విడుదల చేయాలని ఆర్థిక శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సచివాలయంలో శుక్రవారం జరిగిన ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖలపై సమీక్షలో గ్రామీణ రహదారులకు సంబంధించి సీఎం కీలక వ్యాఖ్యలు చేశారు. "గతంలో ఎడ్ల బండ్లు, సైకిళ్లు, మోటార్ సైకిళ్ల రాకపోకలకు అనుగుణంగా రోడ్ల వెడల్పు (సింగిల్, డబుల్ లైన్)ను నిర్ణయించారు. ఇప్పుడు మారుమూల పల్లెల్లోనూ కార్లు, ట్రాక్టర్లు, ఇతర నాలుగు చక్రాల వాహనాలు తిరుగుతున్నాయి. వాటి రాకపోకలకు వీలుగా ఇప్పుడు ఆయా రహదారుల కొలతలను పునర్నిర్వచించాల్సి ఉంది. ఆయా వాహనాలు ఆటంకాలు లేకుండా వెళ్లేలా వీటిని నిర్మించాలి" అని నిర్దేశించారు. తండాలు, గూడేలను పంచాయతీలు చేసినా.. వాటికి రహదారులు, పంచాయతీ, పాఠశాల భవనాల నిర్మాణాలను విస్మరించారని, రాష్ట్రంలో ప్రతి పంచాయతీకి బీటీ రోడ్డు ఉండాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో గుంతలు పడిన రహదారులకు వెంటనే మరమ్మతులు ప్రారంభించాలని స్పష్టం చేశారు. పంచాయతీరాజ్, ఆర్ అండ్ బీ రహదారుల నిర్మాణ ప్రమాణాల్లో తేడాలు ఉన్నాయని, ఇక ముందు అలా ఉండడానికి వీల్లేదని, రెండు శాఖల పరిధిలో ఒకే రకమైన నాణ్యతా ప్రమాణాలతో నిర్మించాలని సూచించారు. వాహనదారులు తాము ప్రయాణించేది పీఆర్ రోడ్డా.. ఆర్ అండ్ బీ రోడ్డా అనే విషయాన్ని పట్టించుకోరని, కేవలం ప్రయాణం ఎలా సాగుతోందనేది ప్రధానమని చెప్పారు. అటవీ ప్రాంతాల్లోని గ్రామాలకు సైతం రహదారులు నిర్మించాలని చెప్పారు.

త్వరలో వైద్య ఆరోగ్యశాఖపై సీఎం రేవంత్ సమీక్ష

హైదరాబాద్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్యశాఖపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి త్వరలో సమీక్ష చేయనున్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రధానంగా ఐదారు అంశాలపై సమీక్ష చేయనున్నట్టు ఆ శాఖ ఉన్నతాధికారులు తెలిపారు. విభాగాధిపతుల (హెచ్‌వోడీ) పోస్టులు, నియామకాలు, డైట్, ఔషధాలు, పరికరాలు, మౌలిక సదుపాయాల కల్పననే ప్రధాన ఎజెండాగా సీఎం సమీక్ష ఉండనున్నట్లు చెబుతున్నారు.

అప్పుడు అహంకారం.. ఇప్పుడు మమకారమా?

- పదేళ్లలో కవితకు బీసీలెందుకు గుర్తుకురాలేదు: సీతక్క

హైదరాబాద్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): పదేళ్లు తెలంగాణను పరిపాలించి, బీసీ వర్గాలకు ఏమైనా చేశారా..? అని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను మంత్రి సీతక్క ప్రశ్నించారు. అధికారం కోల్పోగానే బీసీరాగం ఎత్తుకున్నారని, బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కవితకు బీసీలు ఎందుకు గుర్తుకు రాలేదని మంత్రి నిలదీశారు. అధికారంలో ఉన్నప్పుడు బీసీల పట్ల అహంకారంతో వ్యవహరించి.. ఇప్పుడు మమకారం కురిపిస్తే బీసీలు నమ్మేస్థితిలో లేరన్నారు. బీసీ ముసుగుతో కవిత మరో రాజకీయ డ్రామా మొదలుపెట్టారని, అధికారంలో ఉన్నప్పుడు కేసీఆర్.. బీసీ మంత్రులకు కనీసం అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వలేదని ఆరోపించారు.

మూతపడిన అంగన్వాడీల పునరుద్ధరణ

సాంకేతిక కారణాలు, న్యాయపరమైన చిక్కులతో మూతపడిన అంగన్వాడీ కేంద్రాలను తక్షణం పునఃప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి సీతక్క ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాలు కార్పొరేట్ ప్లేస్కూళ్లను మించిపోయేలా పని చేయాలని సూచించారు.

సంక్రాంతి లోపు వ్యవసాయశాఖలో పదోన్నతులు!

- ముఖ్యమంత్రితో చర్చించి సమస్యల పరిష్కారానికి కృషి
- రాష్ట్ర అగ్రి డాక్టర్ల సంఘం సమావేశంలో మంత్రి తుమ్మల



అగ్రి డాక్టర్ల సంఘం డైరీని ఆవిష్కరిస్తున్న మంత్రి తుమ్మల

వ్యవసాయశాఖలో ఏళ్ల తరబడి వాయిదా పడుతూ వస్తున్న పదోన్నతుల ప్రక్రియను సంక్రాంతిలోపు పూర్తిచేస్తామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించారు. ఇందుకు సంబంధించిన ప్రక్రియను వెంటనే మొదలు పెట్టాలని, వీలైతే వారం రోజుల్లోనే అర్హులైన అధికారులందరికీ పదోన్నతులు ఇవ్వాలని వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావును ఆదేశించారు. తెలంగాణ అగ్రి డాక్టర్ల సంఘం(టాడా) ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో శుక్రవారం నిర్వహించిన 2025 నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ, సావిత్రిబాయి పూలే జయంతి కార్యక్రమాల్లో మంత్రి తుమ్మల ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వ్యవసాయశాఖలో క్షేత్ర స్థాయి అధికారులు ఎదుర్కొంటున్న సమస్యలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చించి పరిష్కారానికి కృషిచేస్తామని హామీ ఇచ్చారు.

ఎస్‌హెచ్‌జీ మహిళల ఆధ్వర్యంలో మొదటి పెట్రోల్ బంకు

- సంగారెడ్డిలో మంత్రి దామోదర శంకుస్థాపన



సంగారెడ్డి రూరల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో స్వయం సహాయక సంఘాల(ఎస్‌హెచ్‌జీ) ఆధ్వర్యంలో మొట్టమొదటి మహిళా పెట్రోల్ బంకును సంగారెడ్డిలో ఏర్పాటు చేస్తుండటం ఆనందంగా ఉందని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో మహిళా పెట్రోల్ బంకు నిర్మాణం, ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో మోడల్ ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ఆయన శుక్రవారం శంకుస్థాపన చేశారు. మహిళా సమాఖ్య షాపింగ్ కాంప్లెక్స్‌తో పాటు పలు అభివృద్ధి పనులనూ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మహిళలు పెట్టుబడులు పెట్టే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. సంగారెడ్డి పట్టణ ప్రజలకు తాగునీటి సరఫరా కోసం రూ.44 కోట్లతో అమృత్ జల్ పథకాన్ని, మహిళ సంక్షేమం, ఆర్థికాభివృద్ధి కోసం మహిళా శక్తి పథకాన్ని చేపట్టినట్లు చెప్పారు. మహిళల ఆర్థికాభివృద్ధి కోసం భవిష్యత్తులో ప్రభుత్వ కాంట్రాక్టులను మహిళా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తామని మంత్రి తెలిపారు. మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు పెట్రోల్ బంకు, మహిళ షాపింగ్ కాంప్లెక్స్ మంజూరు చేసేందుకు సహకరించిన అధికారులను మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అభినందించారు. జిల్లాలో మహిళల ఆర్థిక అభివృద్ధి కోసమే ప్రభుత్వం మహిళాశక్తి పథకాన్ని తీసుకువచ్చిందని టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి అన్నారు.

టెండరు ధాన్యం అప్పగింతకు గడువు పెంపు?

హైదరాబాద్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం వేలంపాటలో విక్రయించిన 2022-23 యాసంగి ధాన్యం అప్పగింతకు సంబంధించిన గడువు డిసెంబరు 31 నాటికి ముగిసింది. నిరుడు అక్టోబరులో నిర్వహించిన మంత్రివర్గ సమావేశంలో డిసెంబరు 31 వరకు తుది గడువు ఇచ్చారు. అయితే మొత్తం 38 లక్షల టన్నులకు గాను.. ఇప్పటివరకు 16.86 లక్షల టన్నుల ధాన్యాన్ని మాత్రమే ఏజెన్సీలు తీసుకెళ్లాయి. ఇంకా సగం ధాన్యం మిల్లుల్లో ఉంది. అయితే టెండరు రేటు ప్రకారం ప్రభుత్వానికి డబ్బులు చెల్లించి, ఆర్వోలు తీసుకొని, ధాన్యాన్ని తీసుకెళ్లటానికి మరికొంత సమయం కావాలని ఏజెన్సీలు ప్రభుత్వానికి ప్రతిపాదన పెట్టాయి. ఈమేరకు శనివారం నిర్వహించబోయే రాష్ట్ర కేబినేట్ సమావేశంలో ఈ అంశాన్ని కూడా ఎజెండాగా చేర్చినట్లు సమాచారం. మంత్రివర్గం మరోసారి పొడిగింపు ఇస్తుందా? ఇంతటితో సరిపెడుతుందా? అనేది నేడు తేలే అవకాశాలున్నాయి.

విజిలెన్స్ డైరెక్టర్‌గా ఏఆర్ శ్రీనివాస్

విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్‌గా విశ్రాంత ఐపీఎస్ ఏఆర్ శ్రీనివాస్‌ను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. విజిలెన్స్ డైరెక్టర్ హోదాలో శ్రీనివాస్ రెండేళ్లు కొనసాగుతారు. ఈయన రాష్ట్ర ఏసీబీ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తూ ఆర్నెళ్ల క్రితం పదవీ విరమణ చేశారు.

కేసీఆర్‌ను కలిసిన పట్నం నరేందర్ రెడ్డి

లగచర్ల అల్లర్ల కేసులో అరెస్టయి, బెయిల్‌పై విడుదలైన కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఎర్రవెల్లి నివాసంలో శుక్రవారం కలిశారు. పట్నం వెంట బీఆర్ఎస్ పార్టీ రంగారెడ్డి జిల్లా నాయకులు పటోళ్ల కార్తీక్ రెడ్డి తదితరులు ఉన్నారు.

పరిహారం.. ఉదారం!

(మొదటిపేజీ తరువాయి)

నిర్దేశించారు. హైదరాబాద్‌ను కలిపే 11 రహదారులకు ఆటంకం లేకుండా రేడియల్ రోడ్ల నిర్మాణం చేపట్టాలని, వాటికి ఔటర్ రింగు రోడ్డు, ఆర్ఆర్ఆర్ అనుసంధానంలో ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు.

అటవీ శాఖ కొర్రీలేంటి? సమస్యల పరిష్కారానికి ప్రత్యేక అధికారులు



రహదారుల నిర్మాణంలో అటవీ, పర్యావరణ సమస్యల పరిష్కారానికి ఆర్‌అండ్‌బీ, అటవీ శాఖ నుంచి ఒక్కో అధికారిని ప్రత్యేకంగా కేటాయించాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. రాష్ట్రంలోని మంచిర్యాల, పెద్దపల్లి, భూపాలపల్లి, వరంగల్, హన్మకొండ, మహబూబాబాద్, ఖమ్మం మీదుగా సాగే నాగ్‌పూర్- విజయవాడ (ఎన్‌హెచ్- 163జీ) రహదారి, ఆర్మూర్-జగిత్యాల-మంచిర్యాల రహదారి (ఎన్‌హెచ్- 63), జగిత్యాల-కరీంనగర్ (ఎన్‌హెచ్ - 563) రహదారుల నిర్మాణంతోపాటు వామపక్ష తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లో (ఎల్‌డబ్ల్యూఎఫ్) రోడ్ల నిర్మాణానికి సంబంధించి భూ సేకరణ, అటవీ అనుమతుల్లో అడ్డంకుల తొలగింపునకు ఆయన ఈ మేరకు సూచనలు చేశారు. ప్రజలకు ఉపయోగపడే రహదారుల నిర్మాణంలో అటవీ శాఖ ఎందుకు కొర్రీలు పెడుతోందని ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు (పీసీసీఎఫ్) డోబ్రియల్‌ను సీఎం ప్రశ్నించారు. గతంలో కొన్ని నిబంధనలను పాటించకపోవడంతో సమస్యలు ఉన్నాయని ఆయన బదులిచ్చారు. దాంతో, రాష్ట్ర స్థాయిలో పరిష్కారమయ్యే సమస్యలను ఇక్కడే పరిష్కరిస్తామని, కేంద్ర అటవీ, పర్యావరణ శాఖకు సంబంధించి ఏవైనా సమస్యలుంటే వెంటనే నివేదిక రూపంలో సమర్పించాలని సీఎం ఆదేశించారు. ఈ సమస్యల పరిష్కారానికి ఆర్ అండ్ బీ, అటవీ శాఖ నుంచి ఒక్కో అధికారిని కేటాయించాలని, వారితో పది రోజులకోసారి సీఎస్ సమీక్షించి త్వరగా అనుమతులు వచ్చేలా చూడాలని నిర్దేశించారు. ఇక్కడ కాకపోతే ఆర్ అండ్ బీ, అటవీ శాఖల మంత్రులు ఢిల్లీ వెళ్లి కేంద్ర మంత్రి, అధికారులతో సమావేశమై అనుమతులు సాధించాలని సూచించారు. జాతీయ రహదారుల నిర్మాణంలో అండర్ పాస్‌లను విస్మరిస్తుండడంతో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. దాంతో, రైతులు కిలోమీటర్ల కొద్దీ దూరం వెళ్లి తిరిగి వచ్చే పరిస్థితి లేకుండా చూడాలని, ఈ మేరకు నిర్మాణ సమయంలోనే తగు జాగ్రత్తలు తీసుకోవాలని సీఎం సూచించారు.

హ్యామ్ విధానంలో..

రాష్ట్రంలో హ్యామ్ విధానంలో ఆర్ అండ్ బీ పరిధిలో 12 వేల కిలోమీటర్లు, పంచాయతీరాజ్ శాఖ పరిధిలో 17,700 కిలోమీటర్లు రహదారులు నిర్మించాలని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఇందుకు పాత జిల్లాలను యూనిట్‌గా తీసుకోవాలని సూచించారు. ఆర్ అండ్ బీ, పంచాయతీ రాజ్ శాఖ అనే తేడా లేకుండా ఒకే రకమైన నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. కన్సల్టెన్సీల నియామకం, డీపీఆర్‌ల తయారీ, రహదారుల నిర్మాణంలో క్రియాశీలంగా వ్యవహరించాలని నిర్దేశించారు. ఈ రహదారుల నిర్మాణం మూడేళ్లలో పూర్తికావాలని స్పష్టం చేశారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో దెబ్బతిన్న రహదారుల మరమ్మతులు చేపట్టాలని, కూలిన వంతెనలను వెంటనే నిర్మించాలని ఆదేశించారు. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వ వాటా నిధులను వెంటనే విడుదల చేసి, కేంద్రం నుంచి రావాల్సిన మ్యాచింగ్ గ్రాంట్‌ను పొందాలని ఆర్థిక శాఖ అధికారులకు సూచించారు. సమీక్షలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, సీతక్క, కొండా సురేఖ, రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, సీఎస్ శాంతి కుమారి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణకు 'లీడ్స్ 2024 అచీవర్' అవార్డు

హైదరాబాద్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామికాభివృద్ధిలో కీలకమైన మౌలిక వసతుల కల్పనలో మెరుగైన ఫలితాలు సాధించిన రాష్ట్రాలకు డిపార్ట్‌మెంట్ ఫర్ ఇండస్ట్రీస్ అండ్ ఇంటర్నల్ ట్రేడ్ (డీపీఐఐటీ) ఇచ్చే లీడ్స్ (లాజిస్టిక్స్ ఈజ్ ఎక్రాస్ డిఫరెంట్ స్టేట్స్ లీడ్స్) 2024 అచీవర్స్ అవార్డు తెలంగాణకు దక్కింది. కేంద్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ చేతుల మీదుగా రాష్ట్ర పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి, డైరెక్టర్ లాజిస్టిక్స్ డా.విష్ణు రెడ్డి ఈ అవార్డును అందుకున్నారు. దీంతో పరిశ్రమలకు అవసరమైన లాజిస్టిక్స్ కల్పనలో తెలంగాణ 2024లో దేశంలోనే అగ్రగామిగా నిలిచింది.

నేడు రాష్ట్ర క్యాబినెట్ భేటీ

రైతు భరోసా పథకం అమలుపైనే ప్రధానంగా చర్చ!

హైదరాబాద్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రివర్గ సమావేశం శనివారం సాయంత్రం 4గంటలకు సచివాలయంలోని క్యాబినెట్ హాలులో జరగనుంది. ఈ సందర్భంగా ప్రధానంగా రైతు భరోసా అమలుపై చర్చ జరిగే అవకాశాలున్నాయి. సంక్రాంతి నుంచి రైతు భరోసాను అమలు చేయాలన్న ఆలోచనలో ప్రభుత్వం ఉంది. ఇప్పటికే మంత్రివర్గ ఉప సంఘం దీనికి సంబంధించిన విధివిధానాలపై కసరత్తు చేసింది. పంట వేసిన ప్రతి రైతుకూ రైతు భరోసా పథకాన్ని అమలు చేయాలని గురువారం జరిగిన మంత్రివర్గ ఉపసంఘం సమావేశంలో సూత్రప్రాయంగా నిర్ణయించారు. ఇందుకోసం రైతుల నుంచి మళ్లీ దరఖాస్తులు స్వీకరించాలని మంత్రివర్గ ఉపసంఘం అభిప్రాయపడింది. ఈ అంశాలన్నింటిపై శనివారం జరిగే క్యాబినెట్ భేటీలో చర్చించనున్నారు. మరో ప్రధాన అంశమైన రేషన్ కార్డుల జారీపైనా క్యాబినెట్ చర్చించనుంది. ఇప్పటికే రేషన్ కార్డుల కోసం ప్రభుత్వం దరఖాస్తులను ఆహ్వానించింది. వీటిని ఎప్పటి నుంచి జారీ చేయాలనే అంశంపై సమావేశంలో నిర్ణయం తీసుకోవచ్చని తెలుస్తోంది. రైతు కూలీలకు రూ.12 వేల ఆర్థిక సాయం అందిస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చింది. ఆరు గ్యారెంటీలలో ఇది కూడా ప్రధానమైన అంశం. దీనిని అమలు చేయాలన్న యోచనలో ఉన్న ప్రభుత్వం.. క్యాబినెట్ సమావేశంలో కీలక నిర్ణయం తీసుకోవచ్చని తెలుస్తోంది. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లపై ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిషన్ నివేదిక, ఎస్సీ ఉప కులాల వర్గీకరణ, కార్పొరేషన్లు, మున్సిపాలిటీల విలీనం తదితర అంశాలపై కూడా చర్చ జరగనుంది. తిరుమల తిరుపతి దేవస్థానం మాదిరిగానే యాదగిరి గుట్టకు కూడా ఒక బోర్డును ఏర్పాటు చేయాలన్న ఆలోచనలో ప్రభుత్వం ఉంది. దీనిపై క్యాబినెట్ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకునే అవకాశాలున్నాయి.

హరిత హైడ్రోజన్ హబ్‌గా తెలంగాణ

- పునరుత్పాదక ఇంధన వనరులపై దృష్టి
- ఆవిష్కరణల కేంద్ర బిందువుగా ఐఐటీహెచ్
- వర్క్‌షాప్‌లో డిప్యూటీ సీఎం భట్టి
- ఐదేళ్లలో లిథియం ప్రాసెసింగ్ ప్లాంట్: సింగరేణి సీఎండీ

కంది/కొత్తగూడెం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): రానున్న రోజుల్లో హరిత హైడ్రోజన్ హబ్‌గా తెలంగాణను మారుస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. తెలంగాణ క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. నీటిపై తేలియాడే సౌర విద్యుత్ ప్లాంట్లకు పెట్టుబడులను ఆహ్వానిస్తున్నామని, 2030 నాటికి 2వేల మెగావాట్ల గ్రీన్ ఎనర్జీ పెట్టుబడులను లక్ష్యంగా పెట్టుకున్నామని వివరించారు. సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీహెచ్‌లో శుక్రవారం ఏఐసీఎంఆర్‌హెచ్ (ఆస్ట్రేలియా-ఇండియా క్రిటికల్ మినరల్స్ రీసెర్చ్ హబ్) వర్క్‌షాప్‌ను శుక్రవారం ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఖనిజ ఉత్పత్తులు, పరిశోధనల కోసం ఐఐటీహెచ్‌తో సింగరేణి ఒప్పందం కుదుర్చుకుంది. భట్టి సమక్షంలో ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి, సింగరేణి సీఎండీ బలరాం ఈ ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. రెండు రోజుల పాటు నిర్వహించనున్న సదస్సులో ప్రపంచ వ్యాప్తంగా ఖనిజాల అంచనా, క్లిష్టమైన ఖనిజాల వెలికితీతకు వ్యూహాలు, ఖనిజాల రీసైక్లింగ్ తదితర అంశాలపై శాస్త్రవేత్తలు చర్చించనున్నారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ ఐఐటీ హైదరాబాద్.. కలల కర్మాగారమని, ఆవిష్కరణల కేంద్ర బిందువని కొనియాడారు. ఆర్థిక వృద్ధికి, ఉపాధి కల్పనకు ఇంజిన్ వంటిదని ప్రశంసించారు. క్లిష్టమైన ఖనిజాలు, పునరుత్పాదక ఇంధనం అనేవి.. ఆర్థిక వ్యవస్థకు నిర్మాణ వస్తువులని పేర్కొన్నారు. పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగంపై దృష్టి , శాస్త్రీయ ఆవిష్కరణలకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని వెల్లడించారు. సదస్సులో సింగరేణి సీఎండీ బలరాం మాట్లాడుతూ సింగరేణి పరిధిలో ప్రస్తుతం 245.5 మెగావాట్ల సౌర విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేయగా, మరో 259 మెగావాట్ల ప్లాంట్లు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. వచ్చే ఏడాది నాటికి వీటిని పూర్తి చేయడం ద్వారా నెట్ జీరో ఎనర్జీ కంపెనీగా సింగరేణి గుర్తింపు సాధించనుందన్నారు. రాజస్థాన్‌లో 1500 మెగావాట్ల సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటు చేయనున్నామని చెప్పారు. బొగ్గు నుంచి అమ్మోనియం నైట్రేట్ తయారీ, బొగ్గు నుంచి మిథనాల్ తయారీ, పంప్డ్ స్టోరేజీ గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టులను ప్రారంభించనున్నట్లు తెలిపారు. విదేశాల్లో లిథియం మైనింగ్‌కు గల సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేస్తున్నామని, వచ్చే ఐదేళ్లలో తెలంగాణలోనే ప్రయోగాత్మకంగా లిథియం ప్రాసెసింగ్ ప్లాంట్ స్థాపించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ నుంచి వెలువడుతున్న బూడిదలో 500పీపీఎంల పరిమాణంలో అరుదైన ఖనిజాలు ఉన్నట్లు తేలిందని, వీటిని వినియోగించుకునే అవకాశాలపై అధ్యయనం చేయిస్తామన్నారు.

హైదరాబాద్‌కు మల్లన్న సాగరే

20 టీఎంసీల తరలింపునకు జల మండలి ఆమోదం.. గ్రేటర్ హైదరాబాద్‌లో గోదావరి ఫేజ్-2 ప్రాజెక్టుకు ఓకే

- రాబోయే 25 ఏళ్లకు తాగునీటి ప్రణాళికలు రూపొందించాలి
- మంజీరా పాత లైను స్థానంలో కొత్త పైప్‌లైన్ నిర్మించండి
- నల్లా బిల్లు బకాయిలు క్రమం తప్పకుండా వసూలు చేయాలి: సీఎం రేవంత్



జలమండలి బోర్డు సమావేశంలో మాట్లాడుతున్న సీఎం

హైదరాబాద్ సిటీ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ మహా నగరానికి తాగునీటి అవసరాలకు నిర్దేశించిన గోదావరి ఫేజ్-2 ప్రాజెక్టుకు గోదావరి జలాలను మల్లన్న సాగర్ నుంచి తీసుకోవాలా? కొండపోచమ్మ సాగర్ నుంచి తీసుకోవాలా? అనే సందిగ్ధానికి తెరపడింది. నీటి లభ్యత, ఎత్తిపోత వ్యయాలను దృష్టిలో పెట్టుకొని మల్లన్న సాగర్ నుంచే తాగునీటి సరఫరా ప్రాజెక్టును చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో నిర్వహించిన జలమండలి బోర్డు సమావేశంలో నిర్ణయించారు. సమగ్ర కమాండ్ కంట్రోల్ సెంటర్లో శుక్రవారం బోర్డు సమావేశం జరిగింది. రాష్ట్ర ఏర్పాటు తర్వాత జల మండలి బోర్డు తొలి సమావేశం ఇదే! 11 ఏళ్ల తర్వాత జరిగిన సమావేశంలో బోర్డు చైర్మన్ హోదాలో సీఎం రేవంత్ రెడ్డి దీనికి అధ్యక్షత వహించారు. ప్రస్తుతం హైదరాబాద్ నగరంలో ఉన్న జనాభాకు సరిపడా తాగునీటిని సరఫరా చేస్తున్నామని, మొత్తం 9,800 కిలో మీటర్ల తాగునీటి పైపు లైన్ వ్యవస్థ ద్వారా 13.79 లక్షల కనెక్షన్లకు నీటిని సరఫరా చేస్తున్నామని సీఎంకు అధికారులు నివేదించారు. మంజీరా, సింగూరు, గోదావరి, కృష్ణా నదుల నుంచి ఈ నీటిని తీసుకుంటున్నామని తెలిపారు. గోదావరి ఫేజ్-2 ద్వారా మరింత నీటిని తెచ్చుకొని ఉస్మాన్ సాగర్, హిమాయత్‌సాగర్ వరకు సరఫరాకు సంబంధించి డిజైన్ చేసిన ప్రాజెక్టుపై సమావేశంలో చర్చించారు. గతంలో ప్రతిపాదించినట్లు మల్లన్న సాగర్ నుంచి 15 టీఎంసీలకు బదులు నగర అవసరాల దృష్ట్యా 20 టీఎంసీల నీటిని తెచ్చుకోవడానికి ఆమోదం తెలిపారు.

రాబోయే 25 ఏళ్లకు తాగునీటి ప్రణాళికలు

రాబోయే 25 ఏళ్ల భవిష్యత్తు అవసరాలను అంచనా వేసుకొని గ్రేటర్ హైదరాబాద్‌లో మంచి నీటి సరఫరాకు ప్రణాళికను తయారు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి జలమండలి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. గ్రేటర్ హైదరాబాద్ విస్తరణను దృష్టిలో పెట్టుకొని 2050 సంవత్సరం నాటికి పెరిగే జనాభా అవసరాలకు సరిపడేలా ఈ ప్రణాళిక ఉండాలని నిర్దేశించారు. ఇంటింటికీ తాగునీటితో పాటు సీవరేజీ ప్లాన్‌ను రూపొందించాలని, అవసరమైతే ఏజెన్సీలు, కన్సల్టెన్సీలతో అధ్యయనం చేయించాలని అన్నారు. ఆరు దశాబ్దాలుగా మంజీరా నుంచి నగరంలోని పలు ప్రాంతాలకు నీటిని సరఫరా చేస్తున్న పైపు లైన్లకు కాలం చెల్లిందని, వీటికి మరమ్మతులు వస్తే దాదాపు పది నుంచి 15 రోజులు నీటి సరఫరా నిలిచిపోతోందని అధికారులు సీఎంకు వివరించారు. దాంతో, పాత లైను వెంబడి ప్రత్యామ్నాయంగా మరో అధునాతన లైన్ నిర్మించేలా కొత్త ప్రాజెక్టు చేపట్టాలని ముఖ్యమంత్రి సూచించారు. ఇందుకు అవసరమైతే కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జల జీవన్ మిషన్ ద్వారా నిధులు తెచ్చుకునేందుకు వీలుగా ప్రాజెక్టు రిపోర్టు తయారు చేయాలని నిర్దేశించారు.

తక్కువ వడ్డీతో రుణాలకు ప్లాన్ చేయాలి: సీఎం

జలమండలి ఆదాయ వ్యయాల నివేదికను ఎండీ అశోక్ రెడ్డి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డికి వివరించారు. జల మండలికి వచ్చే ఆదాయం ఉద్యోగుల జీతభత్యాలు, తాగునీటి సరఫరా నిర్వహణ ఖర్చులకు సరిపోతోందని వివరించారు. వివిధ ప్రభుత్వ విభాగాలు, కార్యాలయాల నుంచి దాదాపు రూ.4,300 కోట్ల బకాయిలు రావాలని, విద్యుత్తు బిల్లులకు జలమండలి దాదాపు రూ.5,500 కోట్లు బాకీ పడిందని, రూ.1,847 కోట్లు గతంలో తీసుకున్న అప్పులున్నాయని, మొత్తంగా దాదాపు రూ.8,800 కోట్ల రెవెన్యూ లోటు ఉందని వివరించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ఆదాయ వ్యయాలు ఆశాజనకంగా లేవని, ఈ పరిస్థితిని అధిగమించేందుకు ఆర్థిక శాఖతో సమన్వయం చేసుకుని వెంటనే కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకోవాలని నిర్దేశించారు. సొంత ఆదాయాన్ని పెంచుకునే మార్గాలను జలమండలి అన్వేషించాలని, అందుకు అనుసరించాల్సిన విధానాలను అధ్యయనం చేయాలని సూచించారు. ఇప్పటికే ఇంటింటికీ 20 వేల లీటర్ల నీటిని నగరంలో ఉచితంగా సరఫరా చేస్తున్నందున, ఇతర కనెక్షన్ల నుంచి రావాల్సిన నల్లా బిల్లు బకాయిలు క్రమం తప్పకుండా వసూలయ్యేలా చూడాలని అన్నారు. కొత్తగా చేపట్టే ప్రాజెక్టులకు అవసరమయ్యే నిధులను సమకూర్చుకోవాలని, తక్కువ వడ్డీతో రుణాలు తెచ్చుకునే ప్రత్యామ్నాయాలను ఎంచుకోవాలని సూచించారు. అందుకు వీలుగా ప్రాజెక్టు డీపీఆర్‌లను తయారు చేయించాలని చెప్పారు.

జూలై 15 నాటికి మున్నేరు రిటైనింగ్ వాల్స్ పూర్తి



అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి పొంగులేటి

- 17కి.మీ. ఆర్‌సీసీ రిటైనింగ్ వాల్
- మున్నేరు వరద ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం: మంత్రి పొంగులేటి

ఖమ్మం, జనవరి3(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): దశాబ్దాలుగా ఖమ్మం, పాలేరు నియోజకవర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న మున్నేరు వాగు వరద ముంపు సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు జూలై 15 నాటికి రిటైనింగ్ వాల్స్ పనులు పూర్తిచేయాలని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లో ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డితో కలిసి జిల్లా అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ముంపు నివారణకు మున్నేరు ఒడ్డున శాశ్వత పరిష్కారం కోసం రూ.690కోట్లతో 17కి.మీ. ఆర్‌సీసీ రిటైనింగ్ వాల్ నిర్మిస్తున్నామని, ఈపనులను యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలని ఆదేశించారు. రిటైనింగ్ వాల్స్ నిర్మాణానికి భూమి కోసం భూ యజమానులతో మాట్లాడాలని సూచించారు. మరోవైపు సంక్రాంతి పండుగలోపు డబుల్ బెడ్‌రూం ఇళ్ల పంపిణీకి చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు.

సంగారెడ్డిలో రోడ్డు ప్రమాదం.. నలుగురి మృతి

» ఆటోను ఢీకొన్న కారు ..బోల్తాపడ్డ ఆటోకు మరో ఆటో ఢీ

నర్సాపూర్/గుమ్మడిదల, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం నల్లవల్లి అటవీ ప్రాంతంలో శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు చనిపోయారు. ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. హైదరాబాద్-మెదక్ 765డీ జాతీయ రహదారిపై ఓ మలుపు దగ్గర మెదక్ వైపు నుంచి వేగంగా వస్తున్న కారు.. హైదరాబాద్ వైపు నుంచి వస్తున్న ప్రయాణికుల ఆటోను ఢీకొట్టింది. ఆటో బోల్తాపడింది. అదే సమయంలో వెనుక నుంచి వస్తున్న మరో కూరగాయల ఆటో.. ముందు ఆటోను ఢీకొంది. ప్రమాదంలో.. మొదటి ఆటోలో ఉన్న మనీషా(25), ఐశ్వర్య(22), ప్రవీణ్(30) అక్కడికక్కడే చనిపోయారు. గాయపడ్డ అనసూయ(62)ను ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ ఆ వృద్ధురాలు చనిపోయింది. వెనుక ఆటోలో ఉన్న నర్సాపూర్‌కు చెందిన ప్రవీణ్, రాజు, సంతోష్‌లకు గాయాలయ్యాయి. మనీషా 2 నెలల క్రితమే నర్సాపూర్ సబ్ డివిజన్ పీఆర్ ఇంజనీరింగ్ కార్యాలయంలో ఏఈగా ఉద్యోగం సాధించింది. విధులకు వెళ్తూ ప్రమాదంలో మృతిచెందింది.

కేరళలో అయ్యప్ప స్వాముల బస్సు బోల్తా

» డ్రైవర్ మృతి.. ఆరుగురికి తీవ్ర గాయాలు

సైదాబాద్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మాదన్నపేట ఉప్పరిగూడకు చెందిన అయ్యప్ప స్వాములు ప్రయాణిస్తున్న బస్సు కేరళలోని శబరిమల సమీపంలో ఘాట్ రోడ్డులో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్ మృతి చెందగా, ఆరుగురికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. డిసెంబరు 26న మాదన్నపేట ఉప్పరిగూడ నుంచి 26 మంది అయ్యప్పస్వాములు ట్రావెల్స్ బస్సు అద్దెకు తీసుకుని పయనమయ్యారు. ఈ నెల ఒకటో తేదీ తెల్లవారు జామున ఎరుమేలిలో దర్శనం చేసుకుని శబరిమలకు పయనమయ్యారు. మార్గం మధ్యలో ఘాట్ రోడ్డు మలుపులో బస్సు అదుపుతప్పి బారికేడ్లను ఢీకొట్టి లోయలోకి దూసుకువెళ్లింది. బస్సు మూడు భారీ వృక్షాలపై ఒరగడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో డ్రైవర్ సీటు వెనుక వైపు పడుకున్న మరో డ్రైవర్ రాజు(52) బస్సు ముందు గ్లాస్‌గుండా ఎగిరి లోయలో పడి మృతి చెందాడు. సమాచారమందుకున్న పోలీసులు ప్రమాదస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన క్షతగ్రాతులను కొట్టాయం వైద్య కళాశాలకు తరలించి చికిత్స చేయించారు. ప్రమాదానికి డ్రైవర్ శివ నిర్లక్ష్యమే కారణమని బాధిత అయ్యప్పస్వాములు తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే బాధితులు ఫోన్‌లో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే ఆయన స్పందించి కొట్టాయం జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందించాలని ఆదేశించారు. అనంతరం స్వాములందరికి శబరిమలలో ప్రత్యేక దర్శనం చేయించారు. అంతేకాకుండా బస్‌డ్రైవర్ రాజు మృతదేహం పోస్టుమార్టం అనంతరం అంబులెన్స్‌లో అతడి స్వగ్రామానికి తరలించేలా చర్యలు తీసుకున్నారు.

స్వేచ్ఛశాట్ నుంచి అందిన సిగ్నల్స్

» తొలి సమాచారం అందుకున్న ఏపీ స్టార్టప్ ఎన్ స్పేస్ టెక్

న్యూఢిల్లీ, జనవరి 3: స్పేడెక్స్ మిషన్‌లో భాగంగా గత నెలాఖరులో ఇస్రో ప్రయోగించిన పీఎస్ఎల్వీ-సీ60 విజయవంతంగా జంట ఉపగ్రహాలను కక్ష్యలో ప్రవేశపెట్టింది. వాటితోపాటు.. పీఎస్ఎల్వీ ఆర్బిటల్ ఎక్స్‌పెరిమెంటల్ మాడ్యూల్ (పోయెమ్-4) ద్వారా మరో 24 పేలోడ్లను కూడా రోదసిలోకి పంపింది. వాటిలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన స్టార్టప్ కంపెనీ ఎన్ స్పేస్ టెక్ దేశీయంగా అభివృద్ధి చేసిన అల్ట్రా హై ఫ్రీక్వెన్సీ (యూహెచ్ఎఫ్) కమ్యూనికేషన్ వ్యవస్థ కలిగిన పేలోడ్ స్వేచ్ఛశాట్-వీ0 కూడా ఉంది. ప్రస్తుతం నిర్దేశిత కక్ష్యలో తిరుగుతున్న స్వేచ్ఛశాట్ నుంచి సిగ్నల్స్ అందాయని ఎన్ స్పేస్ టెక్ శుక్రవారం పేర్కొంది. బెంగళూరులోని ఇస్రో టెలిమెట్రీ, ట్రాకింగ్ అండ్ కమాండ్ నెట్‌వర్క్ (ఇస్ట్రాక్) గ్రౌండ్ స్టేషన్‌లో జనవరి 1వ తేదీ రాత్రి 9:20 గంటలకు స్వేచ్ఛశాట్-వీ0 తొలి విడతలో పంపిన సమాచారాన్ని అందుకున్నట్టు ఆ సంస్థ తెలిపింది. 'స్వేచ్ఛశాట్ అల్ట్రా హై ఫ్రీక్వెన్సీ కమ్యూనికేషన్ వ్యవస్థ కచ్చితమైన, విశ్వసనీయతతో కూడిన డేటాను అందిస్తుంది. శాటిలైట్ కమ్యూనికేషన్ టెక్నాలజీని అభివృద్ధి చేసే మా ప్రయత్నంలో ఇదొక ముఖ్యమైన దశను సూచిస్తుంది' అని ఎన్ స్పేస్ టెక్ సహ వ్యవస్థాపకురాలు దివ్య కొత్తమాసు తెలిపారు.

విద్యాసంస్థల్లో కులవివక్షపై తీసుకున్న చర్యలేమిటి?

» యూజీసీకి సుప్రీంకోర్టు ఆదేశాలు

» రోహిత్ వేముల తల్లి రాధిక పిటిషన్‌పై విచారణ

న్యూఢిల్లీ, జనవరి 3(ఆంధ్రజ్యోతి): విద్యాసంస్థల్లో కులవివక్షపై వచ్చిన ఫిర్యాదులకు సంబంధించి తీసుకున్న చర్యల వివరాలను తెలపాలని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ)ను సుప్రీంకోర్టు ఆదేశించింది. ఉన్నత విద్యాసంస్థల్లో సమాన అవకాశాల కేంద్రాల ఏర్పాటుపై కూడా వివరాలను సమర్పించాలని సూచించింది. విద్యాసంస్థలలో కులవివక్షను నిర్మూలించేలా తగిన చర్యలను కోరుతూ రోహిత్ వేముల తల్లి రాధిక వేముల, ఆదివాసీ విద్యార్థిని పాయల్ తాడ్వి తల్లి అబేద సలీం తాడ్వి దాఖలు చేసిన 'పిల్'పై శుక్రవారం జస్టిస్ సూర్యకాంత్, ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. పిటిషనర్ల తరపున వాదనలు వినిపించిన సీనియర్ న్యాయవాది ఇందిరా జైసింగ్, దిశా వాడేకర్‌లు... విద్యాసంస్థలలో కుల వివక్షను నిర్మూలించేలా నిబంధనలను అమలు చేయడంలో యూజీసీ విఫలమైందని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. 2004-2024 మధ్యకాలంలో ఐఐటీల్లోనే 115 ఆత్మహత్యలు జరిగాయని తెలిపారు. ఈ వాదనలపై నాలుగు వారాలలోగా కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని కేంద్ర ప్రభుత్వం, యూజీసీకి, నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడేషన్ కౌన్సిల్‌లకు ఆదేశాలు జారీ చేసింది.

తెలుగులోనూ ప్రభుత్వ ఉత్తర్వులు

» ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం

» ఇంగ్లి‌ష్‌తో పాటు తెలుగులో జీవోల జారీకి ఆదేశం

అమరావతి, జనవరి 3(ఆంధ్రజ్యోతి):ఏపీలో కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకనుంచి ప్రభుత్వం విడుదల చేసే అన్ని ఉత్తర్వులను తెలుగులోనూ జారీ చేయాలని నిర్ణయించింది. ప్రభుత్వ విధానాలు, నిర్ణయాలు, నిబంధనలు, సూచనలు ప్రజలకు తేలికగా అర్థమయ్యేందుకు ఇంగ్లి‌ష్‌తో పాటు తెలుగు లోనూ ఉత్తర్వులు జారీ చేయాలని అన్ని శాఖలను ఆదేశించింది. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్. సురేష్‌కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. జీవోలను తెలుగులోకి అనువదించే బాధ్యతలను డైరెక్టర్ ఆఫ్ ట్రాన్స్‌లేషన్స్‌కు అప్పగించింది. ఆయా శాఖలు విడుదల చేసిన జీవోలను ట్రాన్స్‌లేషన్ విభాగం రెండు రోజుల్లో అనువదించి సంబంధిత శాఖలకు పంపించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

'మా శవయాత్రకు రండి' వ్యాఖ్యపై కేసు కొట్టివేయండి: కౌశిక్‌రెడ్డి

» హైకోర్టులో పిటిషన్ దాఖలు

హైదరాబాద్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో తాను చేసిన వ్యాఖ్యలపై నమోదైన కేసును కొట్టివేయాలని కోరుతూ హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. 'మీరు ఓటు వేయకపోతే మా ముగ్గురి శవాలను చూస్తారని ఈ సందర్భంగా తెలియజేస్తున్నా.. మీరు ఓటు వేసి లీడ్ ఇస్తే విజయయాత్రకు వస్తాను.. లేదంటే మా శవయాత్రకు మీరు రండి' అంటూ ఓటర్లను విజ్ఞప్తి చేశారు. ఇది ఓటర్లను బ్లాక్‌మెయిల్ చేస్తున్నట్లుగా ఉందంటూ గత ఏడాది నవంబర్‌లో హనుమకొండ జిల్లా కమలాపూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసును కొట్టేయాలని కోరుతూ హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. 'నేను అమాయకుడిని. ఎలాంటి నేరం చేయలేదు. కేవలం రాజకీయ కక్షసాధింపుల్లో భాగంగానే ఈ కేసులో ఇరికించారు. కమలాపూర్ బస్టాండ్ ఏరియాలో నేను వ్యాఖ్యలు చేశానని ఆరోపించిన పోలీసులు 24 గంటలు ఆలస్యంగా కేసు నమోదు చేశారు. ఈ కేసులో సాక్షులు అందరూ ప్రభుత్వ ఉద్యోగులే ఉన్నారు. ఒక్క స్వతంత్ర సాక్షి కూడా లేరు. ఈ నేపథ్యంలో కేసు కొట్టేయండి' అని పేర్కొన్నారు. ఈ పిటిషన్ జస్టిస్ కే లక్ష్మణ్ ధర్మాసనం ఎదుట విచారణకు రానుంది.

ఇతర రాష్ట్రాల్లో తెలంగాణ విద్యుత్ ప్లాంట్లు

(మొదటిపేజీ తరువాయి)

సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, ఎన్‌టీపీసీ తదితర వరాల నుంచి అభిప్రాయాలు తీసుకున్నామన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో నూతన ఇంధన విధానం ముసాయిదాపై ప్రభావవర్గాలతో సదస్సు జరిగింది. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. ప్రస్తుతం రాష్ట్రంలో గరిష్ఠ విద్యుత్ డిమాండ్ 15,623 మెగావాట్లు ఉండగా.. 2029-30 నాటికి 24వేల మెగావాట్లకు, 2035నాటికి 31,809 మెగావాట్లకు చేరనుందని, ఈ డిమాండ్‌ను తీర్చేందుకు వీలుగా స్వచ్ఛమైన, స్థిరమైన, సరసమైన ఇంధనానికి ప్రాధాన్యం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. 2030 నాటికి 20 వేల మెగావాట్ల సామర్థ్యం కలిగిన గ్రీన్ ఎనర్జీని అదనంగా అందుబాటులోకి తేవాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. రిజర్వాయర్లలో ఫ్లోటింగ్ సోలార్, గ్రీన్ హైడ్రోజన్, పంప్డ్ స్టోరేజీ, పవన విద్యుత్‌కు ప్రాధాన్యం ఇవ్వనున్నామన్నారు. ఇప్పటికే స్వయం సహాయక సంఘాలతో 1,000 మెగావాట్ల సోలార్ ప్లాంట్లు పెట్టించాలని నిర్ణయించామని చెప్పారు. శ్రీశైలం, నాగార్జునసాగర్‌లో రివర్సబుల్ పంపింగ్ విధానం ఉందని తెలిపారు. ఫ్యూచర్ సిటీ, ఏఐ సిటీ, ఫార్మాసిటీ, రీజినల్ రింగ్ రోడ్డు, మెట్రో రైలు విస్తరణ, విమానాశ్రయం పారిశ్రామిక కారిడార్‌తో రాష్ట్రాన్ని లాజిస్టిక్స్ పవర్ హౌస్‌గా మారుస్తున్నామని తెలిపారు. తెలంగాణను మిగులు విద్యుత్ రాష్ట్రంగా మార్చి... ఇతర రాష్ట్రాలకు విద్యుత్‌ను అమ్ముతామని చెప్పారు. గ్రీన్ ఎనర్జీ రంగంలో స్టార్టప్‌లకూ ప్రోత్సాహం ఇస్తామన్నారు. రాష్ట్రంలో విద్యుత్ చార్జీలను పెంచబోమన్నారు. ఈ కార్యక్రమంలో ఇంధన శాఖ ముఖ్యకార్యదర్శి, జెన్‌కో సీఎండీ సందీప్ కుమార్ సుల్తానియా, ట్రాన్స్‌కో సీఎండీ డి.కృష్ణ భాస్కర్, సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్, దక్షిణ డిస్కమ్ సీఎండీ ముషారఫ్ అలీ ఫారూఖీ, ఉత్తర డిస్కమ్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి, తెలంగాణ రెడ్కో వీసీ, ఎండీ వినీలా పాల్గొన్నారు.

సరోగసీ బోర్డులో ఎంపీ కడియం కావ్యకు చోటు

న్యూఢిల్లీ, జనవరి 3: కృత్రిమ గర్భధారణకు సంబంధించిన నేషనల్ అసిస్టెడ్ రీ ప్రొడక్టివ్ టెక్నాలజీ అండ్ సరోగసీ బోర్డులో పార్లమెంటు సభ్యురాలు డాక్టర్ కడియం కావ్యకు స్థానం లభించింది. లోక్‌సభకు చెందిన ఇద్దరు మహిళా ఎంపీలను ఈ బోర్డుకు నామినేట్ చేయగా అందులో డాక్టర్ కావ్య ఒకరు కావడం గమనార్హం. మరొక సభ్యురాలిగా డాక్టర్ పార్థీ ఉంటారు. కేంద్ర ఆరోగ్య మంత్రి ఈ బోర్డుకు చైర్మన్‌గా వ్యవహరిస్తారు. కృత్రిమ గర్భధారణ పర్యవేక్షణ నిమిత్తం కేంద్ర ప్రభుత్వం సరోగసి నియంత్రణ చట్టం, అసిస్టెడ్ రీప్రొడక్టివ్ టెక్నాలజీ నియంత్రణ చట్టాలను తీసుకొచ్చింది. ఈ రెండు చట్టాల అమలు తీరును పర్యవేక్షించేందుకు ఉమ్మడిగా ఈ బోర్డు ఏర్పాటయింది. ఈ బోర్డుకు లోక్‌సభ, రాజ్యసభల నుంచి ఇద్దరేసి మహిళా ఎంపీలను నావినేట్ చేయాల్సి ఉంటుంది.

పైసా ఖర్చు పెట్టకుండా హెచ్ఐసీసీ నిర్మాణం!

ఆలోచనలే పెట్టుబడిగా సంపద సృష్టించాలి.. దేశంలోనే అత్యధిక తలసరి ఆదాయం తెలంగాణలోనే

» ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

» ప్రపంచ తెలుగు సమాఖ్య సభలు ప్రారంభం

హైదరాబాద్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): వినూత్న ఆలోచనలే పెట్టుబడిగా సంపదను సృష్టించవచ్చని ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబునాయుడు చెప్పారు. సంపద సృష్టించాలంటే డబ్బే ప్రధానం కాదన్నారు. హైదరాబాద్ అభివృద్ధిలో తెలుగుదేశం పాత్ర కీలకమని.. ఒక్క ఆలోచనతో రూపాయి ఖర్చు పెట్టకుండా హెచ్ఐసీసీ నిర్మాణం జరిగిందని తెలిపారు. ఆంధ్ర, తెలంగాణలో ఉండే తెలుగువారి కంటే విదేశాల్లో ఉంటున్నవారే తెలుగు భాషను, సంప్రదాయాలను కాపాడుతున్నారని వ్యాఖ్యానించారు. శుక్రవారం మిక్కడ ప్రారంభమైన ప్రపంచ తెలుగు సమాఖ్య 12వ ద్వైవార్షిక మహాసభలో చంద్రబాబు కీలకోపన్యాసం చేశారు. మహాసభల సావనీర్‌ను, తెలుగు ఏంజిల్స్ లోగోను ఆవిష్కరించారు. డబ్బుకన్నా ఆలోచనలే పెట్టుబడిగా పెట్టి సంపద సృష్టించవచ్చన్నారు. "1996లో నేను సీఎం అయ్యేనాటికి ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు ఇచ్చే పరిస్థితి కూడా లేదు. ఆ సమయంలో భారీ కన్వెన్షన్ సెంటర్ ఏర్పాటు చేయాలన్న ఆలోచన వచ్చింది. దీనిపై దుబాయ్ ప్రభుత్వంతో సంప్రదించా. హైటెక్స్ ప్రాంతాన్ని అభివృద్ధి చేసిస్తే ఎమ్మార్ ప్రాపర్టీస్‌లో విల్లాలకు స్థలం ఇస్తామని ప్రతిపాదించా. అంతే, ఒక్క పైసా ఖర్చు పెట్టకుండా హెచ్ఐసీసీ ఆవిర్భవించింది. నాడు విజన్ 2020ను ప్రతిపాదిస్తే కొందరు ఎగతాళి చేశారు. 20 ఏళ్ల కిందట ఈ ప్రాంత అభివృద్ధికి వేసిన పునాదుల ఫలితంగానే ఇప్పుడు తెలంగాణ దేశంలోనే అత్యధిక తలసరి ఆదాయమున్న రాష్ట్రంగా ఎదిగింది. దేశంలో ఆర్థిక సంస్కరణలకు శ్రీకారం చుట్టిన పీవీ నరసింహారావు తెలుగు బిడ్డ కావడం మనకు గర్వకారణం. ఆయన చేపట్టిన సంస్కరణలను నేను అందిపుచ్చుకుని ఐటీ రంగానికి ప్రాధాన్యమిచ్చా. ఇప్పుడు అమెరికాలో అత్యధిక తలసరి ఆదాయం ఉన్నది తెలుగు వారికే. 2023-24లో మనదేశం నుంచి 3.30 లక్షల మంది విద్యార్థులు అమెరికా వెళితే అందులో 50% తెలుగువారే. నాలెడ్జ్ ఎకానమీ తెలుగువారి సొంతం" అని చంద్రబాబు చెప్పారు. ఉద్యోగాలు, వ్యాపారాల కోసం ఏ దేశానికి వెళ్లినా జన్మభూమిని మరచిపోవద్దని, సొంత ప్రాంతానికి సేవ చేయాలని పిలుపునిచ్చారు. ప్రధాని మోదీ విజన్-2047 ప్రతిపాదిస్తే తాను 2047 నాటికి స్వర్ణాంధ్రప్రదేశ్‌ను ప్రతిపాదించినట్లు చెప్పారు. ఏపీ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పారిశ్రామిక వేత్తలకు పిలుపునిచ్చారు. తెలుగుజాతికి ప్రపంచవ్యాప్తంగా ఖ్యాతి తెచ్చిన ఘనత ఎన్టీఆర్‌దని, పొట్టి శ్రీరాములు దీక్ష వల్లే ఆంధ్రప్రదేశ్ ఆవిర్భవించిందని, అలాంటి మహనీయులను గుర్తుపెట్టుకోవాలని చెప్పారు. తెలుగు సినీ పరిశ్రమ ప్రపంచ మార్కెట్‌లో భాగస్వామిగా ఎదిగే స్థాయికి చేరడం ప్రశంసనీయమని ఆయన అన్నారు.



ప్రపంచ తెలుగు సమాఖ్య మహా సభల్లో పాల్గొన్న ఏపీ సీఎం చంద్రబాబు తదితరులు

దక్షిణాదిన జనాభా తగ్గుతోంది

దక్షిణాదిన జనాభా తగ్గుతోందని చంద్రబాబు అన్నారు. 2047 తర్వాత మనదేశంలో వృద్ధులే ఎక్కువగా ఉంటారని పేర్కొన్నారు. జపాన్, జర్మనీ వంటి దేశాలు మన దేశం నుంచి మనుషులను పంపించమని కోరుతున్నాయని.. అలాంటి దుస్థితి మనకు రాకూడదని అన్నారు. ప్రస్తుతం భార్యాభర్తలిద్దరూ ఐటీ ఉద్యోగాలు చేస్తున్నారని.. 'నో కిడ్స్.. బెటర్ ఎంజాయ్' అనే పాలసీతో వెళుతున్నారని చంద్రబాబు వ్యాఖ్యానించారు.

తెలుగురాష్ట్రాల అభివృద్ధిలో యువత కీలకం: ఇందిరా దత్

తెలుగు రాష్ట్రాల అభివృద్ధిలో యువత భాగస్వామ్యం కీలకమని ప్రపంచ తెలుగు సమాఖ్య అధ్యక్షురాలు వి.ఎల్.ఇందిరాదత్ అన్నారు. ఇందుకోసం రెండు ప్రభుత్వాలు సహకరించుకోవాలన్నారు. ప్రపంచవ్యాప్తంగా తెలుగు ప్రజలను సంఘటితం చేయడమే సమాఖ్య లక్ష్యమని చెప్పారు.

మార్గదర్శి కేసులో కౌంటర్లు సమర్పించని ఏపీ, తెలంగాణ

» ఆగ్రహం వ్యక్తం చేసిన తెలంగాణ హైకోర్టు

హైదరాబాద్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా మార్గదర్శి ఫైనాన్సియర్స్ ప్రజల నుంచి డిపాజిట్లు సేకరించిందన్న కేసులో కౌంటర్ అఫిడవిట్‌లు దాఖలు చేయనందుకు ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలపై శుక్రవారం తెలంగాణ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు విచారణ రుగుతున్న ఈ పిటిషన్‌పై ఇంత నిర్లక్ష్యం తగదని వ్యాఖ్యానించింది. మరోసారి మూడువారాల సమయం ఇస్తున్నామని, ఈసారి కౌంటర్‌లు దాఖలు చేయకపోతే ఇరు రాష్ట్రాల హోంశాఖ ముఖ్య కార్యదర్శులు వీడియోకాన్ఫరెన్స్ ద్వారా తమ ఎదుట హాజరై వివరణ ఇవ్వాల్సి ఉంటుందని హెచ్చరించింది. రిజర్వు బ్యాంకు చట్టానికి విరుద్ధంగా హిందూ అవిభాజ్య కుటుంబం (హెచ్‌యూఎఫ్)గా ఉన్న మార్గదర్శి ప్రజల నుంచి డిపాజిట్లు సేకరించిందని పేర్కొంటూ 2008లో అప్పటి ఉమ్మడి ఏపీ ప్రభుత్వం కేసు నమోదు చేసింది. ఆ కేసును కొట్టేయాలని మార్గదర్శి 2011లో అప్పటి ఉమ్మడి హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌ను 2018 డిసెంబరు 31(ఉమ్మడి హైకోర్టు విభజనకు చివరి తేదీ)న అనుమతించి ప్రభుత్వం నమోదు చేసిన కేసును కొట్టేసింది. ఈ ఆదేశాలపై పిటిషనర్ ఉండవల్లి అరుణ్‌కుమార్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆర్బీఐ, ఉండవల్లి, రెండు రాష్ట్ర ప్రభుత్వాలు సహా అందరి వాదనలు వినాలని సుప్రీంకోర్టు ఈ కేసును తిరిగి హైకోర్టుకే పంపింది. అప్పటి నుంచి హైకోర్టు ఈ పిటిషన్‌పై విచారణ జరుపుతోంది. తాజాగా ఈ పిటిషన్ జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ రాధారాణి ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. ఈ కేసులో పిటిషనర్‌గా ఉన్న మార్గదర్శి 200 పేజీల అఫిడవిట్ దాఖలు చేసింది. దీనిపై సమాధానం ఇవ్వడానికి మూడువారాల సమయం కావాలని ఆర్బీఐ తరఫు న్యాయవాది కోరారు. డిసెంబరు 20లోపు ఉత్తరప్రత్యుత్తరాలు పూర్తిచేయాలని ఆ తర్వాత సమర్పించే ఏ పత్రాలనూ తీసుకోమని స్పష్టంగా తేదీ నిర్దేశించినప్పటికీ ఏపీ, తెలంగాణ రాష్ట్రాలు కౌంటర్‌లు వేయకపోవడంపై హైకోర్టు విస్మయం వ్యక్తంచేసింది. తదుపరి విచారణను జనవరి 31కి వాయిదా వేసింది.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు 'ఆప్తా' హస్తం!

» తెలుగువారిని ప్రోత్సహించడమేలక్ష్యంగా క్యాటలిస్ట్ గ్లోబల్ బిజినెస్ కాన్ఫరెన్స్

» అమెరికన్ ప్రోగ్రెసివ్ తెలుగు అసోసియేషన్ ప్రతినిధుల వెల్లడి

» హైటెక్స్‌లో వేడుకగా 3 రోజుల సదస్సు

హైదరాబాద్ సిటీ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : తెలుగు రాష్ట్రాలలో వ్యవస్థాపక వాతావరణం పెంపొందించడంతో పాటుగా ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు, స్టార్టప్‌లకు మెరుగైన అవకాశాలు కల్పించడమే ధ్యేయంగా తాము తొలిసారిగా అంతర్జాతీయ వ్యాపార సదస్సును నిర్వహిస్తున్నామని అమెరికన్ ప్రోగ్రెసివ్ తెలుగు అసోసియేషన్ (ఆప్తా) అధ్యక్షుడు మధు ఉల్లి తెలిపారు. మాదాపూర్‌లోని హైటెక్స్ ప్రాంగణంలో మూడు రోజుల పాటు జరగనున్న ఆప్తా క్యాటలిస్ట్- గ్లోబల్ బిజినెస్ కాన్ఫరెన్స్ 2025' శుక్రవారం లాంఛనంగా ప్రారంభమైంది. ఏపీ మండలి సభ్యుడు బొత్స సత్యనారాయణ, శాసనసభ సభ్యులు మండలి బుద్ధప్రసాద్ సహా పలువురు రాజకీయ, సినీ, వ్యాపార వర్గాల ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మధు మాట్లాడారు. కనెక్ట్, కొలాబరేట్, క్రియేట్ నేపథ్యంతో మొట్టమొదటిసారిగా ఆప్తా ఈ అంతర్జాతీయ వ్యాపార సదస్సును నిర్వహిస్తుందన్నారు. దాదాపు 42కు పైగా సెషన్లు ఈ సదస్సులో జరుగనున్నాయన్నారు. వీటిలో 100కు పైగా స్పీకర్లు, ప్యానలిస్టులు పాల్గొంటారని, ఆయా రంగాల్లోని వ్యాపారవేత్తలకు తగిన మార్గనిర్దేశనం చేయడంతో పాటుగా వారికి అవసరమైన నిధులను కూడా అందించడానికి వెంచర్ క్యాపిటలిస్టులు కూడా వచ్చారన్నారు. ఈ సదస్సులో భాగంగా స్టార్టప్‌ల కోసమే క్యాటలిస్ట్ బిజినెస్ పిచ్ కాంపిటీషన్ (కెబీపీ) సైతం నిర్వహిస్తున్నామన్నారు. దీనికోసం 100కు పైగా దరఖాస్తులు వచ్చాయని, వారిలో నుంచి ఎంపిక చేయబడ్డ 16 స్టార్టప్‌లు తమ ఆలోచనలను వెంచర్ క్యాపటలిస్టల ముందు ప్రదర్శించనున్నారన్నారు.

విదేశీ పర్యటనకు అనుమతి ఇవ్వండి

» సీబీఐ కోర్టులో జగన్ పిటిషన్

హైదరాబాద్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): విదేశీ పర్యటనకు అనుమతి ఇవ్వాలని ఏపీ మాజీ సీఎం జగన్ నాంపల్లి సీబీఐ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అక్రమాస్తుల కేసులో నిందితుడిగా ఉన్న జగన్ విదేశీ ప్రయాణాలు చేయాలంటే కోర్టు అనుమతి పొందాల్సి ఉంటుంది. ఈనెల 11 నుంచి 25 వరకు యూకే పర్యటనకు వెళ్లేందుకు అనుమతి ఇవ్వాలని ఆయన కోరారు. దీనిని వ్యతిరేకిస్తూ సీబీఐ కౌంటర్ దాఖలు చేసింది. తదుపరి విచారణ ఈనెల 8కి వాయిదా పడింది.

ఓట్లు ఘనం.. సీట్లు సగం

లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 88.24 లక్షల ఓట్లు.. బీజేపీకన్నా 10.81 లక్షల ఓట్లు అధికం

» అయినా 8 సీట్లలోనే హస్తం పార్టీ గెలుపు

» బీఆర్ఎస్‌కు ఒక్క సీటూ దక్కని వైనం

» పూర్తి గణాంకాలు వెల్లడించిన ఈసీఐ

హైదరాబాద్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): శాసనసభ ఎన్నికల్లో విజయాన్ని సొంతం చేసుకున్న కాంగ్రెస్ పార్టీ.. గత ఏడాది ఏప్రిల్‌లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలోని 17 లోక్‌సభ స్థానాల్లో ఘనంగా ఓట్లను పొందినా సగం సీట్లనే కైవసం చేసుకోగలిగింది. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలు చెరో 8 స్థానాలు గెలుచుకున్నాయి. అయితే ఓట్లపరంగా కాంగ్రెస్ పూర్తి ఆధిపత్యం వహించింది. బీజేపీతో పోల్చితే కాంగ్రెస్‌కు అదనంగా 10,81,014 ఓట్లు వచ్చాయి. పదేళ్ల పాలించిన బీఆర్ఎస్ ఒక్క లోక్‌సభ స్థానాన్ని గెలువలేకపోయింది. 2024 లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి పూర్తి గణాంకాలను ఇటీవల భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) తన వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసింది. వాటిని పరిశీలిస్తే..



6 నెలల్లోనే దిగజారిన బీఆర్ఎస్ పరిస్థితి..

రాష్ట్రంలో 3,32,32,318 మంది ఓటర్లుండగా.. శాసనసభ ఎన్నికల్లో రాష్ట్రంలో మొత్తం 2,34,39,945 ఓట్లు పోలయ్యాయి. లోక్‌సభ ఎన్నికల్లో పోలైన ఓట్లు 2,19,04,129కు తగ్గాయి. శాసనసభ ఎన్నికలతో పోల్చితే లోక్‌సభ ఎన్నికల్లో 15,35,816 ఓట్లు తక్కువ పోలయ్యాయి. పదేళ్ల రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపాలైంది. 119 శాసనసభ స్థానాలకుగాను 39 స్థానాలు గెలుచుకుంది. 87,53,956 ఓట్లు సాధించింది. పోలైన ఓట్లలో 37.35% సాధించింది. లోక్‌సభ ఎన్నికల్లో మాత్రం ఆ పార్టీ పోటీ చేసిన 17 స్థానాల్లోనూ ఓటమి పాలైంది. ఈ ఎన్నికల్లో 36,57,237 ఓట్లనే దక్కించుకుంది. ఇవి మొత్తం ఓట్లలో 11.01 శాతమే. 6 నెలల వ్యవధిలో జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ ఏకంగా 50,96,719 ఓట్లు కోల్పోయింది. శాసనసభ ఎన్నికల్లో 111 స్థానాల్లో పోటీ చేసి 8 సీట్లు గెలుచుకున్న బీజేపీ 32,57,528 ఓట్లను సాధించింది. కానీ లోక్‌సభ ఎన్నికల్లో 17 స్థానాల్లో పోటీ చేసిన ఆ పార్టీ ఏకంగా 77,43,947 ఓట్లు (35.35%) సాధించి 8 సీట్లు గెలుచుకుంది. శాసనసభ ఎన్నికలతో పోల్చితే బీజేపీ 44,86,419 ఓట్లు అధికంగా పొందింది.

కాంగ్రెస్‌కు పెరిగిన ఓట్ల శాతం...

శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ 92,35,833 ఓట్లు (39.69%) సాధించింది. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 88,24,961 ఓట్లు (40.29%) పోలయ్యాయి. అసెంబ్లీ ఎన్నికలతో పోల్చితే లోక్‌సభ ఎన్నికల్లో 4,10,872 ఓట్లు తగ్గాయి. అయితే అసెంబ్లీ ఎన్నికలతో పోల్చితే మొత్తంగా లోక్‌సభ ఎన్నికల్లో 15,35,816 ఓట్లు తక్కువగా పోల్ కావడంతో ఆ ప్రభావం కాం గ్రెస్ ఓట్లలో స్వల్ప తగ్గుదలకు కారణమైనట్లు స్పష్టమవుతోంది. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌పై 2శాతం అధిక ఓట్లతో అధికారం దక్కించుకున్న కాంగ్రెస్.. లోక్‌సభ ఎన్నికల్లో ఏకంగా 29.28% అధికంగా ఓట్లు సాధించింది. లోక్‌సభ ఎన్నికల్లో ప్రధాన ప్రత్యర్థిగా నిలిచిన బీజేపీకన్నా 4.94% ఓట్లు అధికంగా కాంగ్రెస్ సాధించింది. ఎంఐఎం.. లోక్‌సభ ఎన్నికల్లో ఒక్క స్థానంలో పోటీ చేసి దాన్ని గెలుచుకుంది. ఇక శాసనసభ ఎన్నికల్లో 119 స్థానాల్లో పోటీ చేసిన బీఆర్ఎస్ 6 స్థానాల్లో డిపాజిట్లు కోల్పోగా.. నాడు 118 స్థానాల్లో పోటీ చేసిన కాంగ్రెస్ 13 స్థానాల్లో.. 111 స్థానాల్లో పోటీ చేసిన బీజేపీ 66 స్థానాల్లో డిపాజిట్లు కోల్పోయింది. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ పోటీ చేసిన 17 స్థానాలకు 8 స్థానాల్లో.. కాంగ్రెస్ హైదరాబాద్ స్థానంలో డిపాజిట్ కోల్పోగా.. బీజేపీ ఖమ్మం, మహబూబాబాద్ సీట్లలో డిపాజిట్లు కోల్పోయింది.

2024లో 7.5 లక్షల మందికి పాస్‌పోర్ట్‌లు!

» రాష్ట్రవ్యాప్తంగా 9 లక్షల దరఖాస్తులు

» త్వరలో మరిన్ని పాస్‌పోర్టు సేవా కేంద్రాలు

» ప్రాంతీయ పాస్‌పోర్ట్ అధికారి స్నేహజ

హైదరాబాద్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పాస్‌పోర్టుల కోసం దరఖాస్తు చేసుకుంటున్నవారి సంఖ్య పెరుగుతోందని హైదరాబాద్‌లోని ప్రాంతీయ పాస్‌పోర్ట్ అధికారిణి స్నేహజ జొన్నలగడ్డ చెప్పారు. పెరుగుతున్న దరఖాస్తులకు అనుగుణంగా స్లాట్‌లు పెంచుతున్నామని, అతి తక్కువ వ్యవధిలోనే పాస్‌పోర్టులు జారీచేస్తున్నామని తెలిపారు. గతంతో పోలిస్తే ఇప్పుడు సాధారణ పాస్‌పోర్టులు 5-7 రోజుల్లో, తత్కాల్ 1-3 రోజుల్లోనే జారీ చేస్తున్నట్లు వెల్లడించారు. శుక్రవారం ఆమె తన కార్యాలయంలో మీడియా సమావేశంలో 2024లో ప్రాంతీయ పాస్‌పోర్ట్ కార్యాలయం అందించిన సేవలను వివరించారు. గత ఏడాది రాష్ట్రవ్యాప్తంగా 9 లక్షల మంది పాస్‌పోర్టుల కోసం దరఖాస్తు చేసుకోగా.. దాదాపు 7.5 లక్షల మందికి జారీ చేసినట్లు తెలిపారు. విదేశాల్లో ఉన్నత విద్య, ఉపాధి, విదేశీ పర్యాటకంపై ఆసక్తి పెరిగినందున.. రాష్ట్రంలో పాస్‌పోర్టు దరఖాస్తులు పెద్దఎత్తున వస్తున్నాయని చెప్పారు. పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా ఆన్‌లైన్ అపాయింట్‌మెంట్ స్లాట్లు పెంచుతున్నామని తెలిపారు. హైదరాబాద్‌లోని కేంద్రాల్లో వారంలో, ఇతర జిల్లాల్లో రెండు మూడు రోజుల్లోనే జనరల్ అపాయింట్‌మెంట్ స్లాట్లు అందుబాటులో ఉన్నాయని వివరించారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు సేవలు మరింత చేరువ కావాలన్న ఉద్దేశంతో కొత్త జిల్లాల్లో మరిన్ని పోస్టాఫీస్ పాస్‌పోర్ట్ సేవా కేంద్రాలను ప్రారంభించనున్నామన్నారు. మారుమూల ప్రాం తాల ప్రజల కోసం మొబైల్ పాస్‌పోర్ట్ వ్యాన్ సేవలు అందుబాటులోకి తెచ్చామని.. ఈ వ్యాన్ ప్రస్తుతం కామారెడ్డిలో ఉందని ఆమె చెప్పారు. పాస్‌పోర్ట్ ఇంటర్వ్యూలో సమస్యలు ఎదురైతే వెంటనే పరిష్కరించేందుకు ప్రతి గురువారం సికింద్రాబాద్‌లోని ప్రాంతీయ పాస్‌పోర్టు కా ర్యాలయంలో గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రపంచంలో ఏ దేశ వీసా పొందాలన్నా పాస్‌పోర్టు పునరుద్ధరణ గడువు కనీసం 6 నెలలుండాలని చెప్పారు. అందువల్ల గడువుకు 6 నెలల ముందే రెన్యువల్ కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పాస్‌పోర్టు పోగొట్టుకుంటే కొత్తదాని కోసం పోలీసు ఎఫ్ఐఆర్ అవసరం లేదని, మీసేవలో 'లాస్ సర్టిఫికెట్' కోసం దరఖాస్తు చేయాలని చెప్పారు. గడిచిన ఐదేళ్లలో ఎవరికైనా రెండేళ్ల జైలుశిక్ష పడితే.. అలాంటి వారికి పాస్‌పోర్టులు జారీచేయడం లేదన్నారు. విడాకుల కేసులు కోర్టుల్లో ఉన్న దంపతుల పిల్లలకు పాస్‌పోర్టు కావాలంటే ఆ జంట అనుమతులు కావాల్సి ఉంటుందని చెప్పారు. ఉన్నత విద్య కోసం, డిపెండెంట్ వీసాపై విదేశాలకు వెళ్లేవారు తమ విద్యార్హతల ధ్రువీకరణ పత్రాలు అటెస్టెడ్ చేయించుకునే వెసులుబాటు ఆర్పీవో కార్యాలయంలో ఉందని తెలిపారు. రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 ఏళ్లవుతున్న సందర్భంగా విదేశీ మంత్రిత్వ శాఖ రూపొందించిన ప్రత్యేక కవర్‌ను ఆమె విడుదల చేశారు.



విదేశాంగ శాఖ రూపొందించిన కవర్‌ను విడుదల చేస్తున్న స్నేహజ జొన్నలగడ్డ

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.